

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



శుక్రవారం | 2-3-2018 | పేజీలు: 16 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 231 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 6.21 తదుపరి బ. పాడ్యమి తె. 4.06; నక్షత్రం: పుబ్బ రా. 10.08 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ. 7.14-8.43, సా. 4.58-6.29; దుర్ముహూర్తం: ఉ. 8.58-9.44, మ 12.51-1.38; అమృతఘడియలు: సా. 4.11-5.40; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.19 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai



ఆదిభట్ల సెజ్‌లో అపాచీ హెలికాప్టర్ల తయారీ విభాగాన్ని ప్రారంభిస్తున్న నిర్మలా సీతారామన్, కేటీఆర్, టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటా

అపాచీ రెడీ

ఆదిభట్లలో టాటా-బోయింగ్ ఏరోస్పేస్ ప్రారంభం

అపాచీ హెలికాప్టర్ల విడిభాగాల తయారీ ఇక్కడే

ప్రారంభించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

ఆయుధ ఎగుమతుల్లోనూ మనం సత్తా చాటాలి

రక్షణ పరిశ్రమలను మరింత ప్రోత్సహిస్తాం: నిర్మల

సిబ్బంది, సంస్థ ప్రతినిధులకు అభినందనలు

ప్రపంచ అవసరాలకు ఇక్కడే తయారీ: కారెట్

రక్షణ పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేయండి

కేంద్ర మంత్రి నిర్మలకు మంత్రి కేటీఆర్ వినతి

విమానాల తయారీపైనా ఆశాభావం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి-బిజినెస్): తెలంగాణలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థ ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల సెజ్‌లో అపాచీ సైనిక హెలికాప్టర్ల విడిభాగాల తయారీకి శ్రీకారం చుట్టుకుంది. బోయింగ్ కంపెనీతో కలిసి టాటా గ్రూపు నెలకొల్పిన టాటా బోయింగ్ ఏరో స్పేస్ యూనిట్‌ను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రి కేటీఆర్, టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటా, అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్ తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. నిర్మలా సీతారామన్ కొద్దిసేపు తెలుగులో మాట్లాడి

మిగతా 6వ పేజీలో...

కేన్సర్‌పై యుద్ధం

క్లిష్టమైన కేసులు ఎంఎన్‌జే, నిమ్స్‌కు

జిల్లాల్లోని 4 వైద్య కాలేజీల్లో సేవలు

కరీంనగర్, ఖమ్మం, నల్గొండల్లో

కీమోథెరపీ అందుబాటులోకి 2

ప్రభుత్వంతో టాటా ట్రస్ట్స్ ఒప్పందం

చికిత్సకు హైదరాబాద్ రానక్కర్లేదు

స్థానికంగా చికిత్సే లక్ష్యం: టాటా

ప్రధానిపై కేసీఆర్ వాడిన

పదజాలం నచ్చలేదు

కేసీఆర్ నోరు జారారని కేటీఆర్ చెప్పారు

ఏకవచన ప్రయోగం నొప్పించింది

దేశానికే బాధ కలిగించే వ్యాఖ్యలవి: నిర్మల

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపయోగించిన పదజాలం తనకు నచ్చలేదని కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నవారు అలా మాట్లాడటం సరికాదని చెప్పారు. గురువారం ఇక్కడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బంగారు లక్ష్మణ్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నిర్మల విలేకరులతో మాట్లాడారు. "ప్రధాని మోదీని ఉద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు... ఆదిభట్లలో కార్యక్రమానికి హాజరయ్యేందుకు బయల్దేరే ముందు నా దృష్టికి వచ్చాయి. వెంటనే మంత్రి కేటీఆర్‌కి ఫోన్ చేశాను. ఆ సమయంలో కేటీఆర్ నల్లగొండలో ఉన్నారు. మన దేశ ప్రధాని గురించి కేసీఆర్ అనుచితంగా మాట్లాడిన తర్వాత నేను ఈ కార్యక్రమంలో పాల్గొంటే బాగుండదని కేటీఆర్‌కు చెప్పాను. అసలు ఆదిభట్ల కార్యక్రమానికి నేను రావాలా? వద్దా? అని ప్రశ్నించాను. ఆయన నాతో వివరంగా మాట్లాడారు. 'మా నాన్న పొరపాటున నోరు జారారు. ఆయన అలా మాట్లాడి ఉంటారని నేను అనుకోను' అని కేటీఆర్ వివరణ ఇచ్చారు" అని నిర్మల వివరించారు. సీఎం కేసీఆర్ వ్యాఖ్యల అంశాన్ని ఆదిభట్లలో సభా వేదికపై ఉన్నప్పుడు కేటీఆర్‌తో ప్రస్తావించానని తెలిపారు. ప్రధానిపై ఏకవచనంతో సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలతో తాము ఎంతో బాధపడ్డామని చెప్పారు. కేసీఆర్ వ్యాఖ్యలు దేశానికే బాధ కలిగించే విషయమని, దీనిపై మరింత వివరణ ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు.



హైదరాబాద్‌లోని ఓ థియేటర్ వద్ద బంద్ గురించి తెలియజేస్తూ బోర్డు

నేటి నుంచి థియేటర్లు బంద్

వీపీఎఫ్ తగ్గించాలని డిమాండ్

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లపై నిర్మాతల మండలి జేఏసీ పోరు

మల్టీప్లెక్స్‌ల మూసివేతపై సందిగ్ధత.. వీకెండ్‌లో దూరం కానున్న వినోదం

అడ్వాన్స్ బుకింగ్ డబ్బులు వాపస్.. వ్యాపారులు, కార్మికులపై ప్రభావం

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు శుక్రవారం నుంచి బంద్ కానున్నాయి. సినీ అభిమానులకు వెండితెర వినోదం కొన్నాళ్లు దూరమవనుంది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు... భారంగా మారిన వర్చువల్ ప్రింట్ ఫీజు (వీపీఎఫ్) తగ్గించకపోవడాన్ని నిరసిస్తూ మార్చి 2 నుంచి థియేటర్లను మూసివేయాలని దక్షిణాది రాష్ట్రాల సినిమా నిర్మాతల మండలి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నిర్ణయించింది. సినిమా ప్రారంభంలో, మధ్యలో వేస్తున్న యాడ్స్‌ను ఎనిమిది నిమిషాలకు పరిమితం చేయాలని, ప్రతి సినిమాతో రెండు కొత్త సినిమా ట్రైలర్స్ ఉచితంగా ప్రదర్శించాలని కూడా జేఏసీ డిమాండ్ చేస్తోంది. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు సంయుక్తంగా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిస్తున్నారు. థియేటర్లు బంద్ అవుతాయన్న సమాచారంతో ప్రేక్షకులు నిరాశ చెందుతున్నారు. హైదరాబాద్‌లో మెజారిటీ థియేటర్లు

మిగతా 6వ పేజీలో...

బాబోయ్ బియ్యం!

రిటైల్ వ్యాపారుల ఘరానా దోపిడీ



ఖరీఫ్‌లో భారీగా ఉత్పత్తి.. జీఎస్టీ మినహాయింపు

ధర తగ్గించిన మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు

అయినా పట్టించుకోని రిటైల్ వ్యాపారులు

కేజీకి రూ.10-15 లాభాలతో అమ్మకాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బియ్యం రిటైల్ వర్తకుల నుంచి ప్రభుత్వానికి పైసా ఆదాయం రావడం లేదు. వ్యవసాయ ఉత్పత్తులను జీఎస్టీ నుంచి మినహాయించడమే ఇందుకు కారణం. మరి.. ఆ ప్రయోజనం వినియోగదారులకు దక్కుతోందా!? బియ్యం ధరలు తగ్గాయా!? ఎవరికైనా తక్కువ ధరకు అందుబాటులో ఉన్నాయా!? అంటే లేదన్నదే జవాబు! మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు ధరలను తగ్గించినా రిటైల్ వ్యాపారులు పట్టించుకోవట్లేదు. ధరలను తగ్గించడానికి బదులు మరింత పెంచి అమ్ముతున్నారు. నిజానికి, ఈ ఏడాది ఖరీఫ్‌లోనూ వరి దిగుబడి పెద్ద ఎత్తున వచ్చింది. దాంతో, హోల్‌సేల్ మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గుముఖం పట్టాయి. మిల్లర్లు కూడా గత ఏడాది కంటే ఈసారి ధరలు బాగా తగ్గించారు. హోల్‌సేల్ వ్యాపారులు కూడా ఆ ప్రయోజనాన్ని రిటైల్ వ్యాపారులకు అందించారు. ఫలితంగా, మిల్లర్లు, హోల్‌సేల్ వర్తకుల లాభాలు తగ్గాయి. కానీ, రిటైల్ వ్యాపారులు మాత్రం లాభాల పంట పండించుకుంటున్నారు. హోల్‌సేల్ ధరలకూ రిటైల్ వ్యాపారుల ధరలకూ మధ్య కేజీకి 10 నుంచి 15 రూపాయల వరకు తేడా

మిగతా 2వ పేజీలో...



2

పిల్లలు కీర్తన, శ్రీశాంత్‌తో తిరుపతి- భూదేవి(ఫైల్)

అప్పులు కట్టలేక.. లంచం ఇవ్వలేక

కుటుంబ సభ్యులకు విషమిచ్చి రైతు ఆత్మహత్య

దంపతుల మృతి, కుమార్తె పరిస్థితి విషమం

ఎస్‌బీఐ రుణాలు మరింత ప్రియం 11

వడ్డీ రేట్లు 0.2 శాతం పెంపు

కార్తికి 5 రోజుల

సీబీఐ కస్టడీ

దిగ్భ్రాంత పర్చే సాక్ష్యాలున్నాయి: సీబీఐ

సమన్లు లేకుండా కస్టడీయా: కార్తి

కార్తి అరెస్ట్ టైమింగే కీలకం

పార్లమెంట్‌లో కాంగ్రెస్ దాడిని ఎదుర్కోడానికే ఈ ఎత్తుగడ

యూపీఏ నాటి స్కాంలపై చర్యలేవీ?



అరెస్టయిన తనయుడి కోసం కోర్టుకు వచ్చిన చిదంబరం 16

పారిపోతే ఆస్తి జప్తు

బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

చోక్సీ ఆస్తుల జప్తు



ఒక చేత ఖురాన్, మరో చేత కంప్యూటర్

ముస్లిం యువతకు ప్రధాని మోదీ పిలుపు 16

ఉగ్రవాదంపై పోరు ఏ మతానికీ వ్యతిరేకం కాదు

అప్పుడే అభివృద్ధి సాధ్యం

ఇస్లామిక్ సదస్సులో వ్యాఖ్య

రిలయన్స్ 'బిగ్' ఆఫర్! 5

ఏడాదంతా టీవీ ప్రసారాలు ఫ్రీ

రిజిస్ట్రేషన్ల



రాబడి అదుర్స్!

ఇప్పటికే రూ.3,450 కోట్లు.. లక్ష్యం కంటే 11.29% అదనం

నెలాఖరుకు మరింత పెరిగే చాన్స్.. 'ట్రాన్స్‌ఫర్ డ్యూటీ' మరో 850 కోట్లు

హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల రాబడి లక్ష్యాన్ని మించిపోయింది! ఇప్పటికే నిర్దేశిత లక్ష్యం కంటే 11.29 శాతం అదనపు ఆదాయం సమకూరింది! ఫిబ్రవరి నెలాఖరుకే ఇలా భారీ ఆదాయం రావడం పట్ల రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను(జీఎస్టీ) వంటి ప్రతికూల అంశాలను తట్టుకొని రిజిస్ట్రేషన్ల రాబడి పెరగడం విశేషం. ఈ నెలాఖరు వరకు ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. డిసెంబరు, జనవరి నుంచే రిజిస్ట్రేషన్ల ఆదాయం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. గతంలో రోజుకు రూ.14-15 కోట్లు రాగా.. ఇప్పుడు రూ.17-20 కోట్లకు పైగా వస్తోంది. వాస్తవానికి 2017-18లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.3,100 కోట్ల ఆదాయం వస్తుందని సర్కారు అంచనా వేసింది. కానీ, ఫిబ్రవరి 28 నాటికే నిర్దేశిత లక్ష్యాన్ని దాటేసింది. మొత్తం రూ.3,450 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ నెలాఖరుకు మరో రూ.400-450 కోట్ల ఆదాయం సమకూరుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రిజిస్ట్రేషన్ల రాబడి రూ.3,850-3,900 కోట్ల మేర ఉంటుందని భావిస్తున్నారు. డిసెంబరు నుంచి రాష్ట్రంలో స్థిరాస్తి రంగం పుంజుకోవడంతో రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగింది. ఫిబ్రవరి

మిగతా 6వ పేజీలో...

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ!

ఆర్డినెన్స్‌కు న్యాయశాఖ సిఫారసు

బిల్లుకే రెవెన్యూశాఖ మొగ్గు 5

2017 డిసెంబరు 31వ తేదీ కటాఫ్



సర్వసాధన పరిణతి.. శరణాగతి



"నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః"

..'యోగమాయ చేత ఆవరింపబడియున్నందున నేను అందరికీ గోచరింపను' అని గీతలో భగవద్వాక్యం. భగవంతుడిని తెలుసుకోవాలనుకున్నప్పటికీ.. అభక్తుడు, మూఢుని ఎదుట రెండు తెరలుంటాయి. ఒకటి వారి మూఢత్వం. రెండవది భగవంతుని యోగమాయ. పరమాత్మ శక్తిసామర్థ్యాలు ప్రత్యక్షంగా చూచినా మూఢుడు గ్రహించలేడు. ద్రౌపదిని వివస్త్రను చెయ్యడానికి దుశ్శాసనుడు ఎంత బలాన్ని ఒడ్డినా చేతకాక చతికిలపడ్డాడు. 'కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన, ప్రపన్నాం పాహి గోవింద' అని రోదిస్తూ పాంచాలి త్రికరణాలతో శ్రీకృష్ణునికి శరణాగతి చేసింది. పరమాత్మ అక్షయ వస్త్రాలిచ్చి ద్రౌపది మాన సంరక్షణ చేశాడు. వస్త్రంలో పోగులవలె విశ్వమంతా నిండి ఉన్న వాసుదేవుని వినూత్న, విలక్షణ వస్త్రావతారమిది. 'న తత్ర తంతుః న చ తంతువాయః' - ఈ వస్త్రానికి నూలూ తానే, నేతగాడూ తానే, మగ్గమూ తానే. రాయబార సందర్భంలో కురుసభలో విశ్వరూపం ప్రదర్శించి తన అనంత, అవ్యాహత ఐశ్వర్యాన్ని ప్రకటించాడు. అయినా, తమ అజ్ఞానం వలన దుర్యోధన, దుశ్శాసన, కర్ణాదులు భగవంతుని శక్తిని, ప్రార్థనా ప్రభావాన్ని, శరణాగతి విలక్షణత్వాన్ని గ్రహించి, భజించ లేక పోయారు. ఒక ఆడదాని వలువలు తీయ లేని వారు ఇంక చెయ్యగలిగిందేముంటుంది? అని వారికి తోచదు. వారి దృష్టి అటుగా మళ్లదు. జీవుడు తన అజ్ఞానం తొలగించుకోగల్గినా యోగమాయను మాత్రం తన కుతానుగా దాటలేడు. శరణాగతి వలన అజ్ఞానం నశించడంతో పాటు భగవదనుభవం (సాక్షాత్ దర్శనం) కూడా కల్గుతుంది. 'మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరన్తితే' భగవంతుని నిరంతర ధ్యానం, భగవద్ విధానంలో సంతృప్తి, భగవదాజ్ఞా పాలనం, నిష్కామ భావం.. ఈ అనుష్ఠానమే శరణాగతి. వేదసారం ఉపనిషత్తులు. ఉపనిషత్‌సారం గీత. గీతాసారం శరణాగతి. సర్వసాధనలకి చరమ పరిణతి. ఆరాధనకి అంతిమ సోపానం. శ్రీకృష్ణః శరణం మమ.

- తంగిరాల రాజేంద్ర ప్రసాద శర్మ

పరంజ్యోతి (Paramjyothi)

ప్రముఖ రచయిత, ప్రచురణకర్త నాయుని కృష్ణమూర్తి కన్నుమూత

- సులభ శైలిలో పురాణ పరిచయం
- విజయవాణి ద్వారా బాలపత్రికలు
- నేడు చిత్తూరులో అంత్యక్రియలు
- ఏపీ సీఎం చంద్రబాబు సంతాపం



చౌడేపల్లె, మార్చి 1 : ప్రసిద్ధ రచయిత, ప్రచురణకర్త నాయుని కృష్ణమూర్తి (67) కన్నుమూశారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ, గురువారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాయుని మృతికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతాపం తెలిపారు. స్వగ్రామం చిత్తూరు జిల్లా చౌడేపల్లెలోని విజయవాణి స్కూల్ ఆవరణలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. కథ, నవలా రచయితగా, పౌరాణిక గ్రంథకర్తగా నాయుని ప్రసిద్ధులు. 'యామినీ కుంతలాలు' నవల 1974లో వెలువడి, విమర్శకుల ప్రశంసలను అందుకొంది. 'నాయుని కృష్ణమూర్తి కథలు', 'ఏంలేదు' పేరుతో ఆయన కథలు సంపుటాలుగా వెలువడ్డాయి. 'మనసు గుర్రమురోరి మనిషీ', 'ప్రలోభం' అనే నవలలు ఆయన రచించారు. 'ఈ కోతి డ్రామాకు పనికొస్తుందా..?', 'వియోగ విభావరి', 'మాయామృగం' అనే నాటికలు ప్రేక్షక ఆదరణ పొందాయి. విద్యార్థులకు ఉపయోగపడేలా.. 'తెలుగు- ఇంగ్లిషు బొమ్మల నిఘంటువు', 'సచిత్ర నిఘంటువు', 'ఇంగ్లిషు విద్యార్థి నిఘంటువు'ను వెలువరించారు. సామాన్యులకు అర్థమయ్యేరీతిలో వాల్మీకీ రామాయణం, పోతన భాగవతాన్ని వ్యవహారిక బాషలో రచించారు. ఈ పుస్తకాలు బాపు బొమ్మలతో వెలువడ్డాయి. ఏడు, పదోతరగతి విద్యార్థుల్లో విశేష ఆదరణ పొందిన 'మాబడి', 'పాఠశాల' బాలల పత్రికలను ఈ సంస్థే వెలువరించింది. 1990లలో సాక్షరతా కార్యక్రమంపై అధ్యయనానికి ఇంగ్లండ్ ప్రభుత్వం వేసిన కమిటీలో ఆయన కూడా ఉన్నారు. 'మహర్షి' సినిమాలో ఆయన రాసిన 'సుమం ప్రతి..' అనే పాట అప్పట్లో సినీ ప్రియులను ఊపేసింది. చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య గతేడాది నాయునికి జీవనసాఫల్య పురస్కారాన్ని అందజేసింది. తెలుగు యూనివర్శిటీ 2012లో కీర్తి పురస్కారంతో సత్కరించింది. భరత ముని ఆర్ట్స్ అకాడమీ 2015లో 'కళారత్న' పురస్కారం అందజేసింది.

అప్పులు కట్టలేక.. లంచం ఇవ్వలేక

కుటుంబ సభ్యులకు విషమిచ్చి రైతు ఆత్మహత్య.. దంపతుల మృతి, కుమార్తె పరిస్థితి విషమం

మంచిర్యాల/కాసిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఒక పూట తిని మరో పూట పస్తులుండే ఆ రైతు కుటుంబంలో.. పిల్లలు అనారోగ్యం పాలైనా చూపించలేని దుస్థితి. వ్యవసాయంలో నాలుగేళ్లుగా నష్టాలు రావడం, పంట పెట్టుబడులు కోసం చేసిన అప్పులు పెరిగిపోవడం.. వీటిని తీర్చాలని రుణదాతల నుంచి ఒత్తిళ్లు రావడం.. ఎస్సీ సబ్ ప్లాన్ కింద ప్రభుత్వం రుణం మంజూరు చేసినా అధికారి లంచం డిమాండ్ చేయడం.. ఆ మొత్తం ఇద్దామన్నా.. అప్పు పుట్టకపోవడం.. ఆ రైతును చావుకు ప్రేరేపించాయి. ఈ క్రమంలో భార్య, ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తానూ ఉరేసుకున్నాడు. ఈ ఘటనలో దంపతులిద్దరూ చనిపోగా, పిల్లలిద్దరూ చికిత్స పొందుతున్నారు. వివరాలివి.. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం చొప్పరిపల్లెకు చెందిన కొండగొర్ల తిరుపతి (38), కొండగొర్ల భూదేవి (34) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కీర్తన (15), శ్రీకాంత్ (12). తిరుపతి తనకున్న రెండెకరాలతో పాటు మరో ఐదెకరాలను కౌలుకు తీసుకుని ఆరేళ్లుగా కూరగాయలు, పత్తి సాగుచేస్తున్నారు. నాలుగేళ్లుగా నష్టాలు రావడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు రూ. 6.5 లక్షలయ్యాయి. దీంతో బ్యాంక్ రుణం కోసం అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాడు. ఈక్రమంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద టెంట్‌హౌజ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 5 లక్షల రుణం మంజూరుచేసింది. కానీ ఫైల్ ముందుకు కదలాలంటే.. బెల్లంపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే ప్రణయ్.. రూ. 20 వేల లంచం డిమాండ్ చేశాడు. చేతిలో నయా పైసా లేకపోవడం, అప్పు పుట్టకపోవడంతో తిరుపతి సతమతమయ్యాడు. దీనికితోడు రెండు రోజుల క్రితం పిల్లలిద్దరూ అనారోగ్యానికి గురయ్యారు. వారిని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు కూడా డబ్బులేక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో బుధవారం రాత్రి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు






చికిత్స పొందుతున్న కీర్తన, శ్రీకాంత్

కలిపి భార్య, పిల్లలకు తాగించి, తానూ ఉరేసుకున్నాడు. గురువారం తెల్లవారినప్పటికీ తిరుపతి కుటుంబసభ్యులెవరూబయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఇరుగుపొరుగు వారు తలుపులు తెరిచి చూడగా భార్యాభర్తలు విగతజీవులై కనిపించారు. అపస్మారక స్థితిలో ఉన్న పిల్లలిద్దరినీ మంచిర్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. శ్రీకాంత్ పరిస్థితి బాగానే ఉన్నా, కీర్తన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కొండగొర్ల తిరుపతి దంపతుల ఆత్మహత్యకు అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలంటూ దళిత సంఘాల నాయకులు బెల్లంపల్లి - మంచిర్యాల రాష్ట్రీయ రహదారిపై సోమగూడెం వద్ద ఆందోళనకు దిగారు.

తిరుపతి రాసిన సూసైడ్ నోట్ సారాంశమిది..

'ఆరేళ్లుగా వ్యవసాయం చేస్తున్నా.. నాకున్న రెండెకరాల సొంత భూమితో పాటు 5 ఎకరాలు కౌలుకు తీసుకొని కూరగాయలు పండించడం ప్రారంభించా. కూరగాయల సాగుతో తీవ్ర నష్టం రావడంతో జిల్లా కలెక్టర్ కర్ణన్‌గారికి నా పరిస్థితి చెప్పా. ఆయన స్పందించి ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి చెప్పి, రూ. 5 లక్షల లోన్ ఇచ్చేటట్లు చూడాలని ఆదేశించారు. దుర్గం గోపాల్ చొరవతో ఎంపీపీ, ఎంపీడీవో లోన్ వచ్చేటట్లు చేశారు. కానీ అదే కార్యాలయంలో పనిచేస్తున్న ప్రణయ్‌సార్ రూ. 20 వేల లంచం ఇస్తేనే లోన్ వస్తుంది. లేకపోతే మాకు సంబంధం లేదనడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. అప్పు తీర్చాలని పట్టుపట్టడంతో తీవ్ర ఒత్తిడికి గురయ్యా. కుటుంబసమేతంగా ఆత్మహత్య చేసుకోవడం తప్ప నాకు వేరే మార్గం లేదు. నాకు సుమారు రూ. 6 లక్షల 50 వేల అప్పు ఉంది.'



కేన్సర్‌పై మూడంచెల పోరు

- క్లిష్టమైన కేసులు ఎంఎన్‌జే, నిమ్స్‌కు
- జిల్లాల్లోని 4 వైద్య కళాశాలల్లో సేవలు
- కరీంనగర్, ఖమ్మం, నల్గొండల్లో కీమోథెరపీ
- ప్రభుత్వంతో టాటా ట్రస్ట్స్ ఒప్పందం
- హైదరాబాద్ రానక్కర్లేదు: రతన్‌టాటా



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రభుత్వ, టాటా ట్రస్ట్స్ అధికారులు. చిత్రంలో ట్రస్ట్స్ చైర్మన్ రతన్ టాటా, మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కేన్సర్ మహమ్మారిపై తెలంగాణ సర్కారుతో కలిసి టాటా ట్రస్ట్స్ యుద్ధం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న కేన్సర్ చికిత్స కోసం ఇకపై జిల్లాల ప్రజలు హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా చేయనుంది. రోగులకు స్థానికంగానే నాణ్యమైన చికిత్సను అందుబాటులోకి తెచ్చేందుకు సహకరించనుంది. ఇందుకోసం మూడంచెల చికిత్స విధానాన్ని అమలు చేసేందుకు ముందుకొచ్చింది. గురువారమిక్కడ జరిగిన కార్యక్రమంలో టాటా ట్రస్ట్స్ చైర్మన్ రతన్ టాటా, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, లక్ష్మారెడ్డిల సమక్షంలో టాటా ట్రస్ట్స్, రాష్ట్ర ప్రభుత్వం మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు కేన్సర్ చికిత్స కోసం హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం ఉండకూడదన్నదే తమ లక్ష్యమని రతన్ టాటా చెప్పారు. స్థానికంగానే చికిత్స పొందేందుకు నూతన విధానం దోహదపడుతుందన్నారు. ఆరోగ్య రంగంలో తెలంగాణ విశేష కృషిచేస్తోందని, ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. కేన్సర్ లాంటి వ్యాధులకు ధనిక, పేద తేడా లేదని.. ఎవరికైనా వస్తాయన్నారు. ముందే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే నయం చేయవచ్చని చెప్పారు.

'టాటా'తో ప్రత్యేక అనుబంధం: కేటీఆర్

టాటా గ్రూప్‌తో రాష్ట్రానికి ప్రత్యేక అనుబంధం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. రాష్ట్రంలో టాటా గ్రూపులు ఇప్పటికే వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్నాయన్నారు. రతన్‌టాటా 2015లో టి-హబ్‌ను ప్రారంభించారని గుర్తుచేశారు. యుద్ధ విమానాల కర్మాగారం టాటా ఎయిర్ బోయింగ్ కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. హెలికాప్టర్ విడిభాగాలు ఇక్కడ తయారుకావడం రాష్ట్రం గర్వించదగ్గ విషయమన్నారు. జంషెడ్‌పూర్ తర్వాత టాటా ప్రధాన కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయన్నారు. వైద్యసేవల్లో రాష్ట్రం ఇప్పటికే అగ్రగామిగా ఉందని, టాటా ట్రస్ట్స్‌తో ఒప్పందం కేన్సర్ చికిత్సలో కీలక పరిణామమని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖను తమ ప్రభుత్వం బలోపేతం చేస్తోందని, ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తయారు చేస్తున్నామని వెల్లడించారు. త్వరలోనే రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇదీ మూడంచెల విధానం..

- హైదరాబాద్‌లోని నిమ్స్, మెహదీ నవాజ్ జంగ్ (ఎంఎన్‌జే) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో క్లిష్టతరమైన కేన్సర్ కేసులకూ చికిత్స అందించేలా ఆధునీకరిస్తారు.
- కేన్సర్ కేసులను గుర్తించి చికిత్స అందించేలా ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్ వైద్య కళాశాలలను పటిష్ఠపరుస్తారు.
- కేన్సర్ నిర్ధారణ, కీమోథెరపీ చికిత్స అందించేలా కరీంనగర్, ఖమ్మం, నల్గొండ జిల్లా ఆస్పత్రులను అభివృద్ధి చేస్తారు.
- రాష్ట్రవ్యాప్తంగా కేన్సర్ సేవలను విస్తృతం చేసి, క్లిష్టమైన కేసులు మినహా హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్యం అందించడం మూడంచెల విధానం లక్ష్యం.

గణనీయ మార్పులు: లక్ష్మారెడ్డి

కొత్త రాష్ట్రంలో వైద్యరంగంలో గణనీయమైన మార్పులు వచ్చాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 40 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, కేసీఆర్ కిట్లతో ప్రభుత్వ ఆస్పత్రులకు ఆదరణ పెరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే కేన్సర్ స్క్రీనింగ్ చేపట్టామని, గ్రామీణ ప్రాంత మహిళల్లో రొమ్ము కేన్సర్‌ని గుర్తించి నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టాటా ట్రస్ట్స్‌తో ఒప్పందం వల్ల నాలుగు వైద్య కళాశాలలు, మూడు జిల్లా ఆస్పత్రుల్లో కేన్సర్ వ్యాధి నిర్ధారణ, చికిత్స, డిజిటలైజేషన్, శస్త్రచికిత్సలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ వాకాటి కరుణ, టాటా ట్రస్ట్ ప్రతినిధులు వెంకట్, శ్రీనివాస్, శర్మ, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎండలు ముదురుతున్నాయ్.!

- భద్రాచలంలో అత్యధికంగా 38.2 డిగ్రీలు
- రాత్రిపూట సాధారణం కన్నా తక్కువ నమోదు
- దేశ వ్యాప్తంగా ఈ ఏడాది ఎండ ప్రచండమే
- భారత వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతున్నాయి. సాధారణం కంటే అధికంగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణశాఖ గురువారం నాటి నివేదిక ప్రకారం నల్లగొండ మినహా.. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల మేరకు అధికంగా నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా భద్రాచలంలో 38.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రామగుండంలో 38.1 డిగ్రీలు, నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లలో 37.9 డిగ్రీల చొప్పున, మెదక్‌లో 37.6 డిగ్రీలు, ఖమ్మంలో 37.2, ఆదిలాబాద్‌లో 37, హన్మకొండలో 36.5, హైదరాబాద్‌లో 35.8 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే సమయంలో రాత్రి ఉష్ణోగ్రతలు (కనిష్ఠ ఉష్ణోగ్రతలు) పలు చోట్ల సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. రామగుండం, మెదక్‌లలో 3 డిగ్రీలు, హన్మకొండలో 2 డిగ్రీలు, హైదరాబాద్‌లో ఒక డిగ్రీ మేరకు సాధారణం కంటే తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా ఈసారి దేశ వ్యాప్తంగా కూడా సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఢిల్లీ సహా.. పరిసర రాష్ట్రాలైన రాజస్థాన్, హరియాణా, పంజాబ్‌లలో 1.5 డిగ్రీలు, దక్షిణాదిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు, గుజరాత్, పశ్చిమ మధ్యప్రదేశ్, ఒడిసాలలో ఒక డిగ్రీ, కేరళ, తమిళనాడు, ఏపీలోని రాయలసీమ, మహారాష్ట్రలోని విదర్భలలో అర డిగ్రీ చొప్పున సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నట్లు వెల్లడించింది. ఈసారి లానినో మేఘాల కారణంగా.. క్రమం తప్పని రుతుపవనాలతో వర్షాలు పుష్కలంగా కురుస్తాయని అంచనా వేసింది.

హైదరాబాద్‌లో 5 రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు..

వారం	గరిష్ఠం	కనిష్ఠం
గురువారం	35.6	18.3
బుధవారం	35.8	19.3
మంగళవారం	35.1	17.6
సోమవారం	34.5	16.2
ఆదివారం	32.7	16.9

హైదరాబాద్‌లో 4 రోజుల్లో 4 డిగ్రీలు పెరుగుదల..

హైదరాబాద్‌లో నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీలు పెరిగాయి. మరో వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు 37 నుంచి 38 డిగ్రీల దాకా పెరిగే అవకాశముందని బేగంపేట వాతావరణ శాఖ అధికారి నాగరత్నం తెలిపారు. గత ఏడాది మార్చిలో అత్యధికంగా 40.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో చలిప్రభావం ఉంటోందని చెప్పారు.



శత పద్యాల 'శ్రేష్ఠ'

- ఆరేళ్ల ప్రాయంలోనే అరుదైన ఘనత
- 16 నిమిషాల్లో వంద పద్యాలు పాడిన చిన్నారి
- 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు

చేర్యాల, మార్చి 1: ఆరేళ్ల చిన్నారి.. చదువుతున్నది రెండో తరగతే. కానీ, వేమన శతకంలోని 100 పద్యాలను పొల్లు పోకుండా కంఠతా పాడి.. 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. సిద్దిపేట జిల్లా చేర్యాలలోని గాయత్రి హైస్కూల్‌లో చదువుతున్న శ్రేష్ఠ ప్రవస్తి బుధవారం రాత్రి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 16 నిమిషాల వ్యవధిలో వంద పద్యాలను అలవోకగా పాడి ఈ ఘనతను సొంతం చేసుకుంది. శ్రేష్ఠ ఏ విషయాన్నైనా ఇట్టే ఆకళింపు చేసుకొని మననం చేసుకుంటున్న తీరును గుర్తించిన తల్లిదండ్రులు, ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులైన శివగారి కిరణ్-రజినీ.. ఆమెకు వేమన పద్యాలు నేర్పించారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బాలకవి సమ్మేళనంలో శ్రేష్ఠ పాల్గొని.. 8నిమిషాల్లో 52 పద్యాలు పాడి అందరి ప్రశంసలు అందుకుంది.

బాబోయ్ బియ్యం!

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. హోల్‌సేల్ మార్కెట్‌లో ఈసారి బియ్యం ధరలు తక్కువగా ఉన్నాయి. నాణ్యతను బట్టి కిలో బియ్యం 32 నుంచి 36 రూపాయలకు లభిస్తోంది. కానీ, రిటైల్ వ్యాపారులు మాత్రం కిలో 42 నుంచి 50 రూపాయల వరకు అమ్ముతున్నారు. జీఎస్టీ అమలు తర్వాత ధరలు తగ్గుతాయని ప్రభుత్వం ప్రకటించినా.. బియ్యం ధరలు ఏమాత్రం తగ్గలేదు. కొరత సమయంలోని ధరలనే వ్యాపారులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. జీఎస్టీకి ముందు మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల నుంచి ప్రభుత్వం 5 శాతం వ్యాట్‌ను వసూలు చేసేది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వ్యవసాయ ఉత్పత్తులను పన్ను పరిధిలోంచి పూర్తిగా తొలగించారు. దీంతో బియ్యం వ్యాపారం ఫ్రీ మార్కెట్ అయింది. చాలామంది హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు సైతం బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో కమిటీ వేసింది. ఇది తరచూ సమావేశమై నిత్యావసర వస్తువుల ధరలను సమీక్షిస్తుంది. కానీ, సామాన్యుడికి అందుబాటులో లేకుండా బియ్యం ధరలు భారీగా పెంచి అమ్ముతున్న రిటైల్ వ్యాపారులను మాత్రం నియంత్రించడం లేదు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు 20 నుంచి 25 వేల క్వింటాళ్ల బియ్యం వినియోగమవుతోంది. రోజుకు 150 నుంచి 200 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో వ్యాపారుల లాభం 15 నుంచి 20 కోట్ల మేరకు ఉంటుంది.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.7	37.5
రామగుండం	16.4	38.0
హైదరాబాద్	18.3	35.5
సంగారెడ్డి	19.0	35.0
ఖమ్మం	19.0	38.0

శ్రీవారి సర్వదర్శనానికి 10గంటలు

తిరుమలలో గురువారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 10గంటలు, దివ్యదర్శనానికి 2గంటల సమయం పడుతోంది. శనివారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శుక్రవారం లాటరీ ద్వారా జారీచేసే సుప్రభాతం:50, కల్యాణోత్సవం: 80, డోలోత్సవం: 25 అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.comలో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



శ్రీదేవి నాకు సోదరితో సమానం

దివంగత నటి శ్రీదేవి నాకు చెల్లెలు లాంటిది. నేను కూడా శ్రీదేవితో కలిసి ఆమె తల్లి చేతి ముద్దలు తిన్నా. నాకు శ్రీదేవి తోబుట్టువుతో సమానం.. దయచేసి వదంతులను సృష్టించవద్దు.

-కమల్‌హాసన్, విశ్వనటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత



ఎందుకీ కంటితుడుపు పిలుపు?

లోక్‌పాల్ ఎంపిక కమిటీలో నన్ను ప్రతిపక్షం తరఫున రావాలని కాకుండా... ప్రత్యేక ఆహ్వానితుడిగా పిలవడమేంటి? ఇది కమిటీలో భాగస్వామ్యం లేకుండా ప్రేక్షక పాత్రకు పరిమితం చేయడమే. కంటితుడుపు చర్యే. హ్రస్వ దృష్టితో చేపట్టే చర్యలు జాతి నిర్మాణానికి సహకరించవు.

- లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే (ప్రధాని మోదీకి రాసిన లేఖలో)

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.75.79	పాత ధర 67.63
కొత్త ధర రూ.75.98	కొత్త ధర 67.88
పెరిగింది : 21 పైసలు	పెరిగింది : 15 పైసలు



బాదం, వాల్‌నట్స్‌తో పెద్దపేగు కేన్సర్‌కు చెక్

వాషింగ్టన్, మార్చి 1: బాదంపప్పు, వాల్‌నట్స్, జీడిపప్పు తరచూ తింటూ ఉంటారా? అయితే మీకు పెద్దపేగు కేన్సర్ వచ్చే చాన్స్ తక్కువంటున్నారు యేల్ యూనివర్సిటీ కేన్సర్ సెంటర్(అమెరికా) ప్రతినిధులు. ఆరున్నరేళ్లగా 826 మందిపై పరిశోధన చేసి ఈ వివరాలు చెబుతున్నట్లు ఆ సెంటర్ డైరెక్టర్ చార్లెస్ తెలిపారు. పైన పేర్కొన్న పప్పులను కనీసం వారానికి రెండుసార్లయినా తింటున్న వారిలో 42 శాతం రోగనిరోధక శక్తి పెరిగిందట. ఈ పప్పులు మధుమేహ వ్యాధి గ్రస్తులకు కూడా మేలు చేస్తాయంటున్నారు.

వంకర సిరల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం

బీజింగ్, మార్చి 1: శరీరంలోని సిరలు సక్రమంగా లేకపోతే రక్తం గడ్డకట్టే ప్రమాదం ఎక్కువని, దీనివల్ల పలు అనారోగ్య సమస్యలు వస్తాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి కాళ్లు, పాదాల దగ్గర సిరలు మెలికలు తిరిగి వంకరగా ఉంటాయి. ఇలాంటి ప్రదేశాల్లో రక్త ప్రసరణ సరిగ్గా జరగక రక్తం గడ్డకడుతుంది. ఫలితంగా నరాలు ఉబ్బి 'వీనస్ థ్రంబోసిస్' అనే వ్యాధికి కారణం అవుతోందని చైనా మెడికల్ యూనివర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు.



ధర్మపురిలో వైభవంగా తెప్పోత్సవం

జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (యోగ) తెప్పోత్సవం, డోలోత్సవం గురువారం వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులను సేవలపై ఆసీనులను చేసి ఆలయం నుంచి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వరకు తీసుకు వచ్చారు. అనంతరం స్వామి వారల సేవలను హంస వాహనం (పడవ) పైన ఉంచి బ్రహ్మ పుష్కరిణి నీటిలో భోయలు ఐదు సార్లు ప్రదక్షిణలు చేయించగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆసీనులను చేశారు. డోలోత్సవం జరిపారు. - ధర్మపురి

భద్రాద్రిలో వసంతోత్సవానికి అంకురార్పణ



భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం డోలోత్సవం, వసంతోత్సవానికి అంకురార్పణ చేశారు. ముందుగా పవిత్ర గోదావరి నుంచి తీర్థ బిందెను రామాలయానికి తీసుకొచ్చారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి డోలోత్సవం, వసంతోత్సవానికి అంకురార్పణ జరిపారు. శుక్రవారం రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించనున్నారు. డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించిన రోజే భద్రాద్రి రామయ్య పెళ్లి కొడుకైనట్లుగా భక్తులు భావిస్తారు. రామయ్య కల్యాణానికి వంద క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేసే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుడతారు. - భద్రాచలం

తల్లిదండ్రులు మందలించారని యువతి ఆత్మహత్య

▸ చదువుకోవడం ఇష్టం లేకనే..

మంగపేట, మార్చి 1 : చదువుకోవడానికి నిరాకరించిన కూతురును తల్లిదండ్రులు మందలించడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది. జయశంకర్ జిల్లా మంగపేట మండలంలోని గంపోనిగూడెం కాలనీకి చెందిన మేకల మాణిక్యం రెండో కుమార్తె రాజేశ్వరి (17) తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. బుధవారం పరీక్ష రాసివచ్చి, తనకు చదవడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు మందలించారు. అదేరోజు రాత్రి పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ రాజేశ్వరి గురువారం మృతి చెందింది.

లాభసాటి వ్యవసాయమే ప్రభుత్వ లక్ష్యం

▸ సర్కారు పథకాలను కర్షకులు అందిపుచ్చుకోవాలి

▸ రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఉడతలగూడెంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తున్న తుమ్మల

కూసుమంచి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ లక్ష్యమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గైగొళ్లపల్లి శివారు లాల్‌సింగ్‌తండాలో రహదారి విస్తరణ, ఉడతలగూడెం గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మంత్రి ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ప్రసంగించారు. ప్రాజెక్టుల ద్వారా సాగునీరు, నిరంతర విద్యుత్, పంటపెట్టుబడి పథకం ద్వారా ఎకరానికి రూ.8 వేలు రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. నిరంతర విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించుకోవాలని మంత్రి కర్షకులకు సూచించారు. వచ్చే ఉగాది నుంచి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించనున్నామని తుమ్మల వివరించారు. ఖమ్మం జిల్లాలో బోదకాలు బాధితులు ఎక్కువగా ఉన్నారని, వీరందరికీ వచ్చేనెల నుంచి రూ.1000 పింఛన్ అందజేస్తామన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ లోకేష్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా రైతు సమన్వయసమితి కోఆర్డినేటర్ నల్లమల వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, ఆత్మచైర్మన్ మద్ది మల్లారెడ్డి, ఆర్డీవో పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.

‘అడవి మాయం’ నిజమే

▸ ధ్రువీకరించిన డీఎఫ్‌వో

ఆసిఫాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలం కర్జీ అటవీ ప్రాంతంలో ఉన్న అటవీ భూములపై అక్రమార్కులు కన్నేసిన మాట నిజమేనని, ఫిబ్రవరి 23న ‘అడవి మాయం’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’ ప్రధాన సంచికలో వార్త వెలువరించిన తరువాత క్షేత్ర స్థాయి పరిశీలన జరిపినట్లు జిల్లా అటవీ శాఖాధికారి లక్ష్మణ్ రంజిత్ నాయక్ గురువారం తెలిపారు. గ్రామంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించామన్నారు. పత్రికలో వచ్చిన వార్త నిజమేనని, కొంత మంది అక్రమార్కులు అటవీ భూములు తమవిగా చెప్పుకుంటూ ఆక్రమించడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ ప్రాంతంలో తరచూ వస్తున్నట్టు తేలిందని చెప్పారు. ఇప్పటికే ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, అటవీ శాఖ వద్ద ఉన్న రికార్డులను రెవెన్యూతో కలిసి సరిపోల్చేందుకు నిర్ణయించినట్లు ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. ఇప్పటికే అన్యాక్రాంతమైపోయిన భూములకు సంబంధించి వివరణ కోరగా, ఆధారాలు లేకుండా దీనిపై స్పందించలేమన్నారు. సర్వే ఫలితాల్లో అది అటవీ భూమి అని తేలితే మాత్రం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం అటవీ ప్రాంతాన్ని గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



ప్రమాదానికి గురైన కారు

కర్మకాండకు వెళ్లి వస్తూ దంపతుల మృతి

▸ మరో నలుగురికి తీవ్రగాయాలు

అశ్వాపురం/మణుగూరు టౌన్, మార్చి 1 : హోలీ పండుగ నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మణుగూరు కు చెందిన కుడిపూడి నాగేశ్వరరావు (55), మంగలక్ష్మి (50) దంపతులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సివిల్ -2 కార్యాలయంలో ప్లంబర్‌గా పని చేస్తున్న నాగేశ్వరరావు, ఆయన భార్య మంగలక్ష్మి, ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురానికి చెందిన నాగేశ్వరరావు సోదరుడు వెంకటేశ్వరరావు, ఆయన భార్య... అంతా కలిసి కొత్తగూడెం బాబు క్యాంపులో మరణించిన తమ బంధువు కర్మకాండకు గురువారం ఉదయం వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం మణుగూరు చేరుకునేందుకు... అటువైపు వెళ్తున్న ఓ కారులో ఎక్కారు. మిట్టగూడెం వద్ద రోడ్డు పక్కన ఆపి ఉంచిన లారీని ఆ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగేశ్వరరావు, మంగలక్ష్మి మృతిచెందగా.. కారులో ఉన్న వెంకటేశ్వరరావు, ఆయన భార్య లక్ష్మి, కొత్తగూడెం ప్రాంతంలో ఫొటోగ్రాఫర్‌గా పని చేసే పండు, కారు డ్రైవర్ చైతన్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భర్తను హత్య చేయించిన భార్య

▸ ప్రియుడు, మరో వ్యక్తి సహాయంతో దారుణం



కొండలరావు (ఫైల్)

భద్రాచలం, మార్చి 1: వివాహేతర సంబంధం మోజులో ఓ భార్య తన భర్తనే హత్య చేయించింది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం సుందరయ్య కాలనీలో నివాసముంటున్న ఐతంరాజు కొండలరావు (40) భార్యకు ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. తమకు అడ్డుగా ఉన్న కొండలరావును అడ్డు తొలగించుకోవాలని ముక్తేశ్వరి, ఆమె ప్రియుడు నిర్ణయించుకున్నారు. బుధవారం అర్ధరాత్రి భర్త కొండలరావు నిద్రిస్తుండగా ప్రియుడు, మరొకరితో కలిసి గొంతు నులిమి హత్య హత్యచేసి మృతదేహాన్ని ఆటోలో అర్ధరాత్రి బూర్గంపాడు మండలంలోని గొమ్మూరు ఇసుక ర్యాంపులోని పొదల వద్ద పూడ్చిపెట్టారు. కొండలరావు సీపీఎం నాయకుడిగా కొనసాగుతున్నారు. గురువారం ఉదయం అతడి గురించి ముక్తేశ్వరిని అడగ్గా పొంతన లేని సమాధానాలు చెప్పింది. దీంతో అనుమానం వచ్చిన ఆ పార్టీ నాయకులు, ముక్తేశ్వరి అక్క కుమారుడైన గోపి ద్వారా అసలు విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. కొండలరావు మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే భద్రాచలం ఎమ్మెల్యే సున్నం రాజయ్య, ఆ పార్టీ జిల్లా, పట్టణ నాయకులు సంఘటన స్థలానికి తరలివచ్చారు. గొమ్మూరులో ఇసుకలో పూడ్చిపెట్టిన కొండలరావు మృతదేహాన్ని పోలీసులు వెలికి తీసి భద్రాచలం ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. నిందితులు ముక్తేశ్వరి, నాని, శివ పరారీలో ఉన్నారని సీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

తహసీల్దార్ ఫోర్జరీ సంతకంతో ఇసుక దందా

▸ ఇద్దరి అరెస్టు, ఐదు ట్రాక్టర్లు సీజ్



పోలీసుల అదుపులో నిందితులు

కోదాడ, మార్చి 1: తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ రమణారెడ్డి గురువారం ఈ మేరకు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 24న కోదాడ పరిధిలో వాహనాల తనిఖీలో భాగంగా పోలీసులు ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు నవీన్, ఎన్. శ్రీనివాసులు పెన్‌పహాడ్ మండల తహసీల్దార్ సంతకంతో ఉన్న రసీదులను పోలీసులకు చూపించారు. అనుమానం వచ్చిన పోలీసులు వాటిని పెన్‌పహాడ్ తహసీల్దార్‌కు పంపించగా వాటిపై ఉన్న సంతకం తనది కాదని నివేదిక ఇచ్చారు. సూర్యాపేట పట్టణంలోని స్వాతి ప్రింటింగ్ ప్రెస్‌లో రసీదు పుస్తకాలను, వెంకటరమణ స్టాంప్ షాపులో రబ్బరు స్టాంపులు తయారు చేసి, ఫోర్జరీ సంతకంతో నాలుగు నెలలుగా నవీన్ దాదాపు 200 ట్రిప్పులు, శ్రీను 500 ట్రిప్పుల ఇసుక రవాణా చేశారు. ఇసుక అక్రమ రవాణాతో వచ్చిన డబ్బుతో నవీన్ కొత్త ట్రాక్టర్‌ను కొన్నాడు. శ్రీనివాస్ రూ.5 లక్షల మేర సంపాదించాడు. వారి నుంచి ఐదు ఇసుక ట్రాక్టర్లను, ఐదు రబ్బర్ స్టాంపులను, నాలుగు బిల్లు బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు డ్రైవర్లను అరెస్టు చేసి, వీరికి సహకరించిన మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామని డీఎస్పీ రమణారెడ్డి తెలిపారు.

డ్వాక్రా గ్రూపులకు మినీ రైస్, దాల్ మిల్లులు

▸ ‘ఫుడ్ ప్రాసెసింగ్’లో భాగంగా మంజూరు

▸ ప్రయోగాత్మకంగా బాన్సువాడలో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఫుడ్ ప్రాసెసింగ్ ప్రణాళికలో భాగంగా మినీ రైస్ మిల్లు, దాల్ మిల్లుల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహించనుంది. ఇందులోభాగంగా స్వయం సహాయక గ్రూపులకు వీటిని మంజూరు చేయాలని యోచిస్తోంది. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంచడంతోపాటు నాణ్యమైన ఉత్పత్తులు అందించేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. నియోజకవర్గానికి ఒక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్‌గా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే ఉద్యానవన కార్పొరేషన్ ద్వారా కారం, పసుపు ఉత్పత్తులను కాకతీయ బ్రాండ్ పేరుతో విక్రయించాలని కసరత్తు చేస్తున్నారు. అలాగే, మినీ రైస్ మిల్లు, దాల్ మిల్లులను రూ.లక్ష వ్యయంతోనే ఏర్పాటు చేసుకునే వీలుందని ఆ శాఖ గుర్తించింది. గ్రామాల్లో స్వయం సహాయక గ్రూపుల ద్వారా మిల్లుల ఏర్పాటును ప్రోత్సహించాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ప్రయోగాత్మకంగా బాన్సువాడలో మినీ రైస్ మిల్లు, మినీ దాల్ మిల్లునూ ఏర్పాటు చేసింది. ఈ మిల్లుల ఏర్పాటుకయ్యే రూ.లక్ష వ్యయం.. 11 నెలల్లో తిరిగి వస్తుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రతి హెక్టారుకు భూసార పరీక్ష

▸ ప్రభుత్వానికి వ్యవసాయశాఖ ప్రతిపాదన

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కచ్చితమైన భూసార పరీక్ష ఫలితాల కోసం ప్రతి హెక్టారుకు(రెండున్నర ఎకరాలు) మట్టి నమూనా తీసుకుని భూసార పరీక్షలు నిర్వహించాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఆ ఫలితాల ఆధారంగా రైతుకు భూసార పరీక్ష కార్డులు (ఎస్‌హెచ్‌సీ) జారీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రక్రియకు రూ. వంద కోట్ల మేరకు నిధులు అవసరమవుతాయంటూ రాష్ట్ర ప్రభుత్వానికి తాజాగా ప్రతిపాదనలు పంపింది. వాస్తవానికి దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో భూసార పరీక్షలు నిర్వహిస్తూ రైతులకు ఎస్‌హెచ్‌సీలు జారీచేసే ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటికే తెలంగాణలో తొలిదశలో కొందరు రైతులకు కార్డులు జారీ అయ్యాయి. భూసార పరీక్ష పథకం మార్గదర్శకాల ప్రకారం నీటి వసతి ఉన్న భూముల్లోనైతే ప్రతి 2.5హెక్టార్లకు (6.25 ఎకరాలు) ఒక నమూనాను తీసుకోవాలి. వర్షాధార భూముల్లోనైతే ప్రతి 10హెక్టార్లకు (25 ఎకరాలు) ఒక నమూనాను సేకరించాలి. ఇన్ని ఎకరాల్లో ఒక నమూనా సేకరించి విశ్లేషిస్తే భూసార పరీక్షల్లో కచ్చితత్వం ఉండదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడం, క్రాప్ కాలనీల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో అది నీటి వసతిగల భూమి అయినా, వర్షాధార భూమి అయినా ప్రతి హెక్టారుకు ఒక నమూనా సేకరించి విశ్లేషిస్తేనే భూసార పరీక్షల్లో కచ్చితత్వం ఎక్కువగా ఉంటుందని అధికారులు ప్రభుత్వానికి వివరించారు. ప్రతి హెక్టారుకు నమూనా సేకరించేలా పథకం కింద అనుమతి ఇవ్వాలంటూ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కోరింది. అయితే ఇది దేశవ్యాప్తంగా అమలవుతున్న కార్యక్రమని, ఒక్క రాష్ట్రం కోసం మార్గదర్శకాలను సవరించలేమని కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రతి హెక్టారుకు ఒక నమూనాను సేకరించి భూసార పరీక్షల నిర్వహణ చేపట్టాలంటే రూ.100 కోట్లు అవసరమవుతాయి. కేంద్రం అనుమతికి నిరాకరించడంతో ఆ రూ.100కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించాల్సి ఉంటుంది.

పోలేపల్లిలో నీళ్ల మాఫియా

▸ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినందుకు నీళ్ల వ్యాపారుల దాడులు



పోలేపల్లిలో విష్ణువర్ధన్‌రెడ్డిపై దాడికి పాల్పడుతున్న తిరుపతిరెడ్డి తదితరులు

జడ్చర్ల అర్బన్, మార్చి 1: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లిలో నీళ్ల మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోయింది. నీటి అక్రమ వ్యాపారాన్ని ఆపాలని కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదుచేసినవారిపై దాడులకు తెగబడుతున్నారు. గ్రామస్థులు, బాధితుల కథనం ప్రకారం.. పోలేపల్లికి చెందిన కె.తిరుపతి రెడ్డి అనుమతులు లేకపోయినా స్థానిక అధికార పార్టీ నేతల ప్రోద్బలంతో కేటీఆర్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను గ్రామ సమీపంలో ఏర్పాటు చేశాడు. పోలేపల్లి సెజ్‌లోని కంపెనీలకు ప్రతి రోజు 3 లక్షల లీటర్ల శుద్ధి నీటిని ఏడాది కాలంగా అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ ప్లాంట్ వల్ల గ్రామ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, శుద్ధి చేయగా మిగిలిన కలుషిత నీటి వల్ల సమీపంలోని రంగనాయకుల స్వామి చెరువు కలుషితం అవుతుందని గ్రామస్థులు పలుమార్లు ధర్నాలు చేపట్టారు. ప్లాంటును సీజ్ చేయాలని తహసీల్దార్‌ను భూగర్భజల శాఖ అధికారులు ఆదేశించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఈ నెల 26న గ్రామస్థులంతా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి తక్షణమే సీజ్ చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ స్పందించకపోవటంతో గ్రామస్థులు బుధవారం నిలదీశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వాటర్ ప్లాంట్ యజమాని తిరుపతిరెడ్డి, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మరికొందరు వచ్చి తనతో పాటు మరికొందరిపై దాడులకు పాల్పడ్డారని బాధితుడు విష్ణువర్ధన్ చెప్పారు. దాడి వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

మండుటెండలో వృద్ధుల పింఛన్ కష్టాలు



ఎండ తీవ్రత తాళలేక చెట్ల కింద సేదతీరుతున్న వృద్ధులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏటూరునాగారం మండలంలో నాలుగు నెలలుగా నిలిచిపోయిన ఆసరా పింఛన్ల పంపిణీని గురువారం ప్రారంభించారు. అయితే పింఛన్ ఇస్తున్నట్లు తెలియడంతో ఒక్కసారిగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెద్దసంఖ్యలో మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట కిక్కిరిసిపోయారు. ఎండ వేడికి తాళలేక గంటల తరబడి నిలబడి ఉన్న ముగ్గురు వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయితే, నాలుగు నెలలుగా పింఛన్ అందించకపోవడంతో గురువారం ఒక్కసారిగా పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎండ వేడి, సమీపంలో మంచినీటి వసతులు లేక అవస్థలు పడ్డారు. - ఏటూరునాగారం

7.2శాతం వృద్ధితో వార్షిక లక్ష్యం వైపు సింగరేణి

మంచిర్యాల, మార్చి 1, (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ 2017-18 ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో దూసుకుపోతుంది. 65 మిలియన్ టన్నుల లక్ష్యంతో గడిచిన 11 నెలల్లో 7.2 శాతం వృద్ధిరేటును సాధించింది. మార్చి 31తో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. గడిచిన 11 నెలల్లో 582 లక్షల టన్నుల బొగ్గును సింగరేణి రవాణా చేసింది. ఫిబ్రవరి 28 వరకు కంపెనీ 546 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. ఫిబ్రవరిలో 4లక్షల టన్నుల బొగ్గు అధికంగా ఉత్పత్తి చేసి 7 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరిలో 58.6 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన కంపెనీ ఈ ఫిబ్రవరిలో 62.6 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసిందని ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో సింగరేణి సీఎండీ శ్రీధర్ పేర్కొన్నారు. 11 నెలల కాలంలో సింగరేణి సాధించిన అభివృద్ధి పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ కార్మికులను అభినందించారు. రానున్న 30 రోజుల్లో లక్ష్య సాధనకు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ధర్మసేవకుడు

కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి కన్నుమూత భక్తకోటికి తీరని లోటు. కొంతకాలంగా అస్వస్థులై ఉన్న ఆయన మఠం నిర్వహణలోనే ఉన్న శంకర మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన వందలాది మంది భక్తులు, శిష్యులు, పండితులతో కంచిమఠం కన్నీటి పర్యంతమైపోయింది. బుధవారం రాత్రంతా ప్రత్యేక భజనలు, కీర్తనలతో గడిచిపోయిన తరువాత, గురువారం మహాస్వామి చంద్రశేఖరేంద్ర సరస్వతి సమాధి పక్కనే జయేంద్ర 'బృందావన ప్రవేశం' కూడా ముగిసింది. దాదాపు నాలుగుదశాబ్దాల పాటు కంచిమఠం పీఠాధిపతిగా ఆధ్యాత్మిక ప్రచారానికే కాక, మానవసేవకు కూడా తన జీవితాన్ని వెచ్చించిన మహామనీషి జయేంద్ర సరస్వతి.

చంద్రశేఖరేంద్ర బాటలో హిందూ ధర్మ పరిరక్షణకే అగ్రస్థానాన్ని ఇచ్చినప్పటికీ, కంచిమఠం ఆధ్వర్యంలో సామాజిక సేవను మరింత విస్తృతం చేసినవారు జయేంద్ర. అధికంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితమైన మఠాన్ని సామాజిక కార్యక్రమాలతో జోడించిన కారణంగా మఠం పేరు విస్తరించింది, జయేంద్ర ప్రజాదరణా పెరిగింది. అధికంగా తమిళనాడుకు, కొంతమేరకు దక్షిణాదిలోనూ విస్తరించివున్న మఠాన్ని ఆయన ఈశాన్యం వరకూ విస్తరించగలిగారు. ప్రధానంగా విద్యాలయాలు, వైద్యాలయాల నిర్మాణం ద్వారా మఠాన్ని ఆయన సమాజంతో జోడించారు. సాధారణంగా పీఠాధిపతులు పోషించే పరిమితమైన పాత్రకు ఆయన కుదించుకుపోలేదు. ప్రజాసంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చారు. వాహనాల్లో సుదూర ప్రాంతాలు పర్యటిస్తూ, అవసరమైన సందర్భాల్లో సముద్రాలు కూడా దాటుతూ తన కార్యకలాపాలను సాగించారు. ఇతర మఠాధిపతులతో అనుబంధాన్నీ, ఇతర మతపెద్దలతో సుహృద్భావ సంబంధాలనూ పెంచుకున్నవారు జయేంద్ర. ఈయన ప్రదర్శిస్తున్న దూకుడు కారణంగా మఠంలోని ఇతరులతో విభేదాలు వచ్చినందువల్ల జయేంద్ర 1980లో ఎవరికీ చెప్పకుండా మఠాన్ని వదిలేసి వెళ్ళిపోయినట్టుగా చెబుతారు. కంచినీ, సన్యాసాన్నీ విడిచిపోయిన జయేంద్ర తిరిగి పీఠాధిపత్యాన్ని స్వీకరించడానికి వీల్లేదని తమిళనాడులోని కొన్ని రాజకీయపార్టీలు రచ్చచేయడం, మద్రాసు హైకోర్టులో అనేక పిటిషన్లు దాఖలు కావడం తెలిసిందే. చివరకు తలకావేరిలో ఉన్న ఆయనను ఒప్పించి తిరిగి కాంచీపురానికి రప్పించిన తరువాత ఆయన తన లక్ష్యానికి అనుగుణంగా పనిచేయడానికి ఏ అడ్డూ లేకపోయింది. జయేంద్రని వివాదంలోని నెట్టిన మరొక సంఘటన కంచి మఠం మేనేజర్ శంకర్ రామన్ హత్య కేసు. జయేంద్రకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న శంకర్‌రామన్ మఠం పరిసరాల్లోనే హత్యకు గురికావడం పెద్ద దుమారం రేపింది. ఈ హత్యకు నిరసనగా డీఎంకె నిరసనలు ఆరంభించింది. అప్పటివరకూ మఠానికీ, జయలలితకు సత్సంబంధాలున్న నేపథ్యంలో, సమీపంలోనే ఏవో ఎన్నికలు కూడా ఉన్నందున డీఎంకే దీనిని రాజకీయంగా ఉపయోగించుకుంటుదన్న అనుమానంతో జయలలిత జయేంద్రను అరెస్టు చేయించారని కొందరి వాదన. ఆసుపత్రులు, విద్యాలయాల నిర్మాణం పెద్ద ఎత్తున సాగిస్తున్న నేపథ్యంలో, అందుకు వీలుగా సేకరిస్తున్న విరాళాలే ఈ వివాదానికి అసలు కారణమని కొందరు అంటారు. ఈ అరెస్టు వెనుక ఆర్థికమే పనిచేసిందో, రాజకీయమే ఉన్నదో తెలియదు కానీ, 189మంది సాక్షుల విచారణతో, నాలుగేళ్ళపాటు న్యాయస్థానంలో కేసు కొనసాగి చివరకు ముద్దాయిలంతా నిర్దోషులుగా బయటపడ్డారు. మహబూబ్‌నగర్‌లో త్రిలోక విశ్వకల్యాణం చేయిస్తున్న జయేంద్రను తమిళనాడు పోలీసులు అర్థరాత్రి తీసుకుపోయి, దీపావళినాడు అరెస్టు చేసిన ఈ సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దక్షిణాదికంటే ఉత్తరాదిలోనే దీనిపై నిరసన ప్రదర్శనలు అధికంగా సాగడం ఆయన విస్తరించిన ప్రాచుర్యానికి నిదర్శనం. అయోధ్య వివాదాన్ని పరిష్కరించడానికి కూడా జయేంద్ర సంకల్పించి, విశేషమైన చొరవ చూపారు. ఆయనను 'పరివారం' పెద్దగా కొందరు అభివర్ణించినప్పటికీ, ఇరుమతాల పెద్దల మధ్యా చర్చలకు వీలైన సానుకూల వాతావరణాన్ని సృష్టించి, సమన్వయం సాధించడానికి చేసిన ప్రయత్నం విశేషమైనదే. హిందూ ధర్మ పరిరక్షణ సభల నిర్వహణ, జీర్ణదేవాలయాల ఉద్ధరణ, ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలకే పరిమితం కాకుండా, దళితులు, బలహీనవర్గాల ఉద్ధరణ లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టినవారు జయేంద్ర. ధర్మ ప్రచారానికి సేవాధర్మాన్ని మరింత బలంగా, నిర్దిష్టంగా జోడించిన మతపెద్ద ఆయన.

మౌనమే నాయుని జీవన పథం

"ఉదాత్తత, ఉదారత, మాన్యత, అసామాన్యత అనే నాలుగు గుణాల కలయికకు ప్రతీక నాయుని కృష్ణమూర్తి" – సింగమనేని నారాయణ

నాయుని కృష్ణమూర్తి పేరు తెలుగు సాహితీపరులలోని నిరాడంబరతకు, నిగర్వానికి మారుపేరుగా మ్రోగుతుంది. నాయుని ఆర్భాటంలేని రచయిత. ఎక్కడ సాహిత్య సభలు జరిగినా ఆయన ఉంటారు. కానీ ఎక్కడో వెనుకాల కనిపిస్తారు. సభలో ఎవరు ఏమి మాట్లాడినా వినయంగా విని, మౌనంగా లేచి వెళ్ళిపోతారు. అరవై ఏడేళ్ళ క్రితం రాయలసీమలోని చిత్తూరు జిల్లాలో మారుమూల పల్లె అయిన నడిమిచెర్ల గ్రామంలో ఒక పేద కుటుంబంలో పుట్టిన నాయుని ఎం.ఏ తెలుగు చదువుకొని జీవిక కోసం అనేక అగచాట్లు పడ్డారు. అనేక పత్రికల్లో సహాయ సంపాదకునిగా పనిచేశారు. సినిమా రంగంలోకి కాలు పెట్టారు. కొన్ని పత్రికలు ప్రారంభించారు. ఎక్కడా నిలబడలేక చౌడేపల్లికి వచ్చి పుస్తక ప్రచురణ సంస్థ పెట్టుకున్నారు. 'పాఠశాల', 'మాబడి' ప్రతికల ద్వారా పాఠశాల విద్యార్థుల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించారు. విజయవాణి పబ్లికేషన్స్ ద్వారా అనేక మంది సామాన్య రచయితలకు చేయూత నిచ్చారు.

తెల్లని బట్టలు, తెల్లని జుట్టు, తెల్లని గడ్డంతో సొంత జీవితం మీద అంత పట్టింపు లేని సన్యాసిగా కనిపించే కృష్ణమూర్తికి సమాజం మీద గొప్ప పట్టింపు ఉంది. ఇంత అత్యధునిక కాలంలోనూ అనేక మంది అన్నదమ్ములతో కలిసి ఉమ్మడి కుటుంబంలో జీవితం గడిపే కృష్ణమూర్తి ఇంటికి ఎవరు వచ్చినా అన్నం పెట్టందే బయటకు పంపేవారు కాదు. ఆత్మీయతకు, ఆతిథ్యానికి మారుపేరు నాయుని. తన సాహిత్యం కన్నా తానే ఒక మెట్టుపైన నిలబడ్డ వ్యక్తిత్వం నాయినిది. కళ కన్నా కళాకారుడు ఉన్నతంగా ఉండాలి అనే సూత్రానికి నాయిని గట్టి ఉదాహరణ.

నాయిని కృష్ణమూర్తి నవలా రచయిత, కథకుడు, నాటక రచయిత, కవి, నిఘంటు నిర్మాత, నటుడు. నేటితరం పాఠకులకోసం కృష్ణమూర్తి భారత, భాగవత, రామాయణాలను సులభమైన ఆధునిక తెలుగు భాషలోకి తర్జుమా చేశారు. ప్రధాన కథలను సంక్షిప్తంగా చెప్పారు. సమాజంలోని అవకాశవాద స్వభావాన్ని ప్రదర్శిస్తూ 'ఈ కోతి ఈ డ్రామాకు పనికొస్తుందా?' అనే అసంగత నాటిక రాశారు. 'యామినీకుంతలాలు', 'మనసు గుర్రము రోరి మనిషీ', 'ప్రలోభాలు' అనే మూడు నవలలు మధ్యతరగతి ప్రజా జీవితాన్ని ప్రతిబింబిస్తూ రాశారు. 30 కథానికలను రెండు సంపుటాలుగా ప్రచురించారు. కృష్ణమూర్తి రాసిన మూడు నవలలు మూడు రకాలైనవి. మొదటి నవలలో నీరజ, రెండవ నవలలో శివరామయ్య, మూడవ నవలలో వైజయంతి పాత్రలు పాఠకులను పట్టుకుని నిలబెడతాయి. 'కవీ, ప్రవక్త కాలం కన్నా ముందుంటారు' అని గురజాడ అన్నట్టు కృష్ణమూర్తి తన నవలల్లో ప్రతిపాదించిన అంశాలు తర్వాతి కాలంలో వాస్తవ రూపం ధరించాయి. గ్రామాలను అభ్యుదయవాదులు దత్తత తీసుకోవడమనే అంశం 'మనసు గుర్రము రోరి మనిషి' నవలా వస్తువు. ఇవాళ రాజకీయవాదులు పోటీపడి గ్రామాలను దత్తత తీసుకుంటున్నారు. మాధ్యమాల ఉచ్చులో చిక్కుకుని యువత ఎలా జీవితాలను పోగొట్టుకుంటున్నారో 'ప్రలోభాలు' నవల ఆవిష్కరించింది. ఇది కూడా నేటి సమాజంలో రుజువౌతున్నది. 'యామినీకుంతలాలు'లో నాయకుడు రాజేశ్వరరావు తానేనని రచయిత చెప్పకనేచెప్పారు. "చావు దగ్గరకొచ్చి మీదపడి కౌగలించుకునేవరకు ఎవరూ మృత్యువుకు ఎదురువెళ్ళి ఆహ్వానించకూడదు" అన్న సిద్ధాంతాన్ని ఈ నవలలో రచయిత ప్రతిపాదించారు. ఈ మూడు నవలల్లో 'ప్రలోభాలు' నాయుని సామాజిక పరిశీలనా శక్తికి దర్పణంగా ఉంది. కొడవటిగంటి కుటుంబరావు రాసిన 'పంచకళ్యాణి' నవలలాగా ఈ నవల ఉంది.



నివాళి

> **నాయుని కృష్ణమూర్తి ఏ సంఘంలోనూ సభ్యుడు కాడు. ఏ భావజాలాన్నీ జెండాగా పట్టుకు తిరిగినట్లు కనిపించదు. అయితే ఆయనలో మన సమాజం ఇప్పుడున్నట్లు కాకుండా మరో రకంగా ఉంటే బాగుంటుంది అన్న తపన కనిపిస్తుంది. ఏమైనా నాయుని నిశ్శబ్ద రచనా తరంగం. ఎక్కువమందికి తెలియని, అనేకులకు తెలియాల్సిన రచయిత.**

1974–2014 మధ్య నాయుని రాసిన కథలలో 30 మాత్రమే సంపుటాలుగా వచ్చాయి. "మొదట నేను కథలు విన్నాను. తర్వాత కథలు చెప్పాను. తర్వాతనే రాయడం అనే ప్రక్రియ మొదలయింది" అని కృష్ణమూర్తి చెప్పుకున్నారు. తాను కథా రచయితగా రూపుదిద్దుకోవడంలో తన అక్క చెంచుల గురుమూర్తెమ్మ పాత్ర ఉంది. ఆయన కథల్లో ఆయన స్వీయానుభవాలు, పరిశీలనలు వస్తువునందించాయి. 'ఏకవచనం', 'కుటుంబ రావుకు ఏదో అయింది' వంటి కథలలో కుటుంబ సంబంధాలను చిత్రించారు. 'ప్రేమలేఖ 2015', 'తెలు(గు)గోడు', 'టెలుగు వెలుగు' వంటి కథలలో తెలుగు భాషకు, తెలుగు సమాజానికి దాపురించిన దుర్భర స్థితిని ఆవిష్కరించారు. 'అతడు–ఆమె–అది' కథ సీరియల్ సంస్కృతి భార్యాభర్తల సంబంధాలపై చూపుతున్న ప్రభావాన్ని ప్రదర్శిస్తుంది. 'గాజుపెంకు', 'డ్రామా', 'మంచిగంధం', 'మీరయితే ఏమి చేస్తారు' కథ వంటి అనేక కథలలో నాయుని కృష్ణమూర్తి తనదైన కథన పద్ధతిలో వర్తమాన భారతీయ సామాజిక వాస్తవికతను ఆవిష్కరించారు. ఈయన కథలన్నీ చదివిన తర్వాత, కృష్ణమూర్తి పీడితజనం వైపు ఉన్నాడని అర్థమౌతుంది. కృష్ణమూర్తి ఏ సంఘంలోనూ సభ్యుడు కాడు. ఏ భావజాలాన్నీ జండాగా పట్టుకు తిరిగినట్లు కనిపించదు. అయితే ఆయనలో మన సమాజం ఇప్పుడున్నట్లు కాకుండా మరో రకంగా ఉంటే బాగుంటుంది అన్న తపన కనిపిస్తుంది.

నవలా రచనలోగాని, కథానికా రచనలోగాని నాయుని కృష్ణమూర్తి దుస్సాహస ప్రయోగాలకు పూనుకోలేదు. సమాజ పరివర్తన పట్ల ఇష్టం, పాఠకుల పట్ల ప్రేమ గల కృష్ణమూర్తి వాస్తవిక పద్ధతిలోనే రచన చేశారు. భాషలో కూడా ఆయన వీర మాండలిక రచనకు పూనుకోలేదు. నాయుని భాష వస్తువు దగ్గరికి పాఠకులను ఆకర్షిస్తుంది. నాయుని సంభాషణా రచన నాటకీయతను, వాస్తవికతను సమన్వయం చేస్తూ ఉంటుంది. కథాశిల్పానికి సంబంధించిన మెళకువల పట్ల నాయునికి సంపూర్ణ అవగాహన ఉంది. "కథ అనే మాధ్యమం ఎక్కువమంది అందుకునే స్థాయిలో ఉండాలి" అన్నది ఆయన అభిప్రాయం. "రచయిత పాఠకుడి చేతిని వదలకూడదు" అనే నాయుని అభిప్రాయం పాఠకుని పట్ల ఆయనకు గల ప్రేమను చాటుతుంది.

నాయుని కృష్ణమూర్తి తెలుగు ఇంగ్లీషు నిఘంటువును బొమ్మలతో సహా విద్యార్థుల కోసం ముద్రించారు. ఏమైనా నాయుని నిశ్శబ్ద రచనా తరంగం. ఎక్కువ మందికి తెలియని అనేకులకు తెలియాల్సిన రచయిత నాయుని. బహుశా నాయుని 'గాజుపెంకు' కథా రచయితగా, 'ప్రలోభం' నవలా రచయితగా స్థిరపడతారనుకుంటాను.

1951లో నాయుని నరసమ్మ, రామయ్య దంపతులకు నాల్గవ సంతానంగా పుట్టిన కృష్ణమూర్తి 2018 మార్చి 1న బెంగుళూరులో కన్నుమూశారు. ఆయన జీవితం అనేక ఎత్తుపల్లాల మధ్యనే సాగింది. ఆయన సాహిత్యం మీద జరగవలసినంత అధ్యయనం జరగలేదు. ఇప్పుడైనా మనం ఆ పని చేయాలి. అదే ఆయనకు సరైన నివాళి.

"రచయిత కన్నా కథ ముఖ్యమని నా అభిప్రాయం" – నాయుని కృష్ణమూర్తి

■ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

కరపత్రం

వర్గీకరణకు మద్దతుగా విరసం సదస్సు

తెలుగు నేల మీద ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఇరవై నాలుగేళ్లుగా ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో ఉద్యమం నడుస్తోంది. ఈ ఉద్యమం సామాజిక న్యాయాన్ని కోరుతున్నది. యాభై తొమ్మిది ఎస్సీకులాల మధ్య రిజర్వేషన్ ఫలాలు జనాభా దామాషా ప్రకారం పంపిణీ జరగాలని ఎమ్మార్పీఎస్ పోరాడుతున్నది. అట్టడుగున ఉన్నవారికి రాజ్యాంగ ఫలాలు అందినప్పుడే రాజ్యాంగ స్ఫూర్తి నెరవేరుతుందని అంబేద్కర్ ఆశించారు. ఆయన ఆశయాన్ని నెరవేర్చడం కోసం జరుగుతున్న ప్రజాస్వామిక ఉద్యమమే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం పోరాటం. సామాజిక న్యాయ భావనతో మొదలైన ఈ ఉద్యమానికి విప్లవ రచయితల సంఘం సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నది. భారతదేశంలో మనుధర్మ, బ్రాహ్మణిజం ఉత్పత్తి వర్గాల మధ్య నిచ్చెన మెట్ల ఆధారంగా విభజనను తీసుకొచ్చాయి. కులాల మధ్య అంతరాలను సృష్టించాయి. అంటరానితనాన్ని అమలు చేశాయి. అంటరాని కులాల్లో కూడా మరింత అంటరాని వాళ్లను తయారుచేసిన దుర్మార్గం హిందూ బ్రాహ్మణీయ వ్యవస్థది. వేల సంవత్సరాలుగా అణచివేయబడుతున్న మాల, మాదిగ కులాలకు మరో యాభై ఏడు ఉప కులాలు ఉండడం ఈ దేశంలో నెలకొన్న విషాదానికి నిదర్శనం. ఈ ఉపకులాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా రాజ్యాంగం కల్పించిన ఏ ఫలాలు అందకుండా, ఊరికి దూరంగా, సంచార కులాలుగా జీవిస్తున్నాయి. సామాజిక హోదా లేదు. భూమి లేదు. దుర్భర పేదరికం, వెంటాడుతున్న అంటరానితనం ఈ కులాలను పీడిస్తున్నది. డక్కలి, బుడగజంగం, చిందు, మాస్టి, బైండ్ల, పంబాల, దాసరి, బ్యాగరి, కాటి కాపరి మొదలైన కులంపేర్లతో మనచుట్టూ గ్రామాల్లో కనిపించే వీళ్ల షెడ్యూల్డు కులాల జాబితాలోని వారని చాలామందికి తెలియదు. ఎస్సీలనగానే మాల, మాదిగ కులాలు మాత్రమేనని ఎక్కువమంది భావిస్తారు. కనీసం సమాజం దృష్టిలో మనుషులుగా కూడా గుర్తింపులేని ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేస్తూ పోరాడుతున్నది.

వర్గీకరణకు మద్దతుగా విరసం నిర్వహిస్తున్న సదస్సు మార్చి 4 (ఆదివారం) ఉదయం 10 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ నందు జరుగుతుంది. సదస్సులో గీతాంజలి, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ డి. ఉదయభాను, రత్నమాల, సి. కాశీం, వరవరరావు, మంద కృష్ణ మాదిగలు పాల్గొంటారు.

■ విరసం

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన మెయిల్: editpage@andhrajyothy.com

పాత వ్యూహాలతో కొత్త పోరాటం



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'నా జేబులో స్విస్ బ్యాంక్ ఖాతా నెంబర్ ఉన్నది. బోఫోర్స్ ముడుపుల సొమ్మును ఆ ఖాతాలోనే జమ చేశారు' అని విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ 1989 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పదే పదే చెప్పారు. ఆ సార్వత్రక ఎన్నికల ప్రస్తావన వచ్చినప్పుడు దేశ ప్రజలందరికీ గుర్తుకు వచ్చేది ఈ విషయమే కాదా? అవినీతిని శాశ్వతంగా రూపుమాపడానికి కంకణం కట్టుకున్న నాయకుడిగా ప్రజల మనస్సుల్లో వి.పి.సింగ్ సుప్రతిష్ఠుడయ్యారు. ఆ ఎన్నికలలో వి.పి.సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ విజయం సాధించిందని, ఆయన ప్రధానమంత్రి అయ్యారని మరి చెప్పనవసరం లేదు. చెప్పవలసిన విషయమేమిటంటే ఎన్నికల ముందుగానీ, ప్రధానమంత్రి అయిన తరువాత గానీ వి.పి.సింగ్ ఆ స్విస్ బ్యాంక్ ఖాతా నెంబర్‌ను ప్రజలకు వెల్లడించనే లేదు! అప్పటికీ ఇప్పటికీ యమునానదిలో చాలా నీళ్ళు ప్రవహించాయి. దాదాపు ముప్పై సంవత్సరాల అనంతరం ఇప్పుడు రాహుల్ గాంధీ, దశాబ్దాల క్రితం తన తండ్రి రాజీవ్ గాంధీకి విశ్వనాథ్ మహాశయుడు చేసిన దానినే ఇప్పుడు నరేంద్ర మోదీకి తానూ చేయాలని ఆశిస్తున్నారు; చేయగలనని భావిస్తున్నారు.

ప్రధాని మోదీ అవినీతిపరుడని, రాఫెల్ విమానాల కొనుగోలులో అక్రమాలకు, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో భారీ కుంభకోణానికి బాధ్యులైన తన వివిఐపి మిత్రులను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని రాహుల్ గాంధీ నిత్యం నొక్కిచెప్పుతున్నారు. ఈ వ్యవహారాలలో ప్రధానమంత్రి ప్రమేయమందని రుజువుపరిచేందుకు ఎటువంటి ప్రత్యక్ష సాక్ష్యాధారాలను చూపడం లేదు. అయితే ఆరోపణలు తీవ్ర స్థాయిలో చేస్తున్నారు. మరి వి.పి.సింగ్ కు ఉన్న 'మిస్టర్ క్లీన్' అనే ప్రతిష్ఠ రాహుల్ గాంధీకి లేదు. అనేక కుంభకోణాలకు పాల్పడి అప్రతిష్ఠ పాలయి, ప్రజల తిరస్కారానికి గురైన పార్టీకి రాహుల్ నేతృత్వం వహిస్తున్నారు. అధికారంలో ఉన్న రాజకీయపక్షం పట్ల ప్రజలలో సహజంగా ఉండే వ్యతిరేకత నుంచి, గత సార్వత్రక ఎన్నికలలో మోదీ లబ్ధి పొందిన విధంగానే రాబోయే సార్వత్రక ఎన్నికలలో రాహుల్ కూడా ప్రయోజనం పొందే అవకాశమున్నది.

ఒక కీలక తరుణంలో బీజేపీ, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా రాహుల్ ఆరోపణలు చేయడం గమనార్హం. జాతీయ అధికార పక్షం, ప్రధాని మోదీ ఇప్పటికే ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులను, రాహుల్ ఆరోపణలు మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం తన పదవీకాలం నాలుగో సంవత్సరపు తుది నెల్లల్లో ఉన్నది. మరో ఏడాది కాలంలో జరగనున్న సార్వత్రక ఎన్నికలు ఇప్పటికే అన్ని రాజకీయ పక్షాలను ప్రభావితం చేస్తున్నాయి. మోదీ సర్కార్ పాలనాపరంగా చేపడుతున్న ప్రతి చర్య ఎన్నికలలో లబ్ధి పొందేందుకు ఉద్దేశించినదే అన్న విమర్శల నెదుర్కొంటోంది. ప్రతి పక్షాలు అడ్డూ అదుపులేకుండా పాలక పక్షంపై ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఓటర్ల దృష్టిలో పాలక పక్షం విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీయడమే విపక్షాల లక్ష్యమైపోయింది. వాస్తవాలతో సమంగా వాటిపట్ల అవగాహనలు సైతం ప్రాధాన్యం సంతరించుకొంటున్న సందర్భమిది.

ప్రజల మనస్సుల్లో తన గురించి, తన పాలనపైన ఉన్న సానుకూల భావనను మరింతగా పెంపొందించుకొనేందుకు ప్రధాని మోదీ ఆరాటపడుతున్నారు. అవినీతి నిర్మూలనకు పోరాడుతున్న ధర్మయోధుడని, జాతి సంపదకు నిజమైన సంరక్షకుడనే భావన ప్రజల్లో ఉన్నది. దీని ఆధారంగానే ప్రధాని మోదీ 2014లో అధికారంలోకి వచ్చింది మొదలు తన రాజకీయ వ్యూహాలను రూపొందించుకొంటున్నారు. తాను ఒక రాజకీయ 'చౌకీదార్'నని ఆయన సగర్వంగా చాటుకున్నారు. దేశసంపదను, పూర్తిగా దేశ ప్రజలకే ఉపయోగపడే విధంగా పరిరక్షిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు ఆయన్ని విశ్వసించారని చెప్పవచ్చు. ప్రజల్లో తనకు ఉన్న ఇటువంటి ప్రతిష్ఠ వలనే, యూపీఏ ప్రభుత్వాలకు సారథ్యం వహించిన డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను 'మౌన్–మోహన్' సింగ్ అని మోదీ అపహసించారు. దేశ ఖజానాను కొల్లగొడుతుంటే మన్మోహన్ మౌనంగా, చూస్తుండిపోయిన బలహీన నాయకుడని మోదీ తీవ్రంగా విమర్శించారు. నిజాయితీపరుడైన నాయకుడనే ప్రతిష్ఠను కాపాడుకొనేందుకే మోదీ ఎట్టకేలకు బుధవారంనాడు మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరం అరెస్ట్‌నకు అనుమతించడం జరిగింది. ఏడాదికి పైగా తాత్సారం చేసిన అనంతరం మాత్రమే కార్తీని మోదీ ప్రభుత్వం అరెస్ట్ చేసిందనేది గమనార్హం.

రాఫెల్ విమానాల కొనుగోలులో అధికార పక్షం వారికి ముడుపులు ముట్టాయన్న ఆరోపణను నిరూపించేందుకు స్వతంత్ర రుజువులు లేవన్న విషయాన్ని ఎవరూ పట్టించుకొంటున్నట్టుగా కన్పించడం లేదు. ఇంటి పేరు ఒకటే అయినప్పటికీ ప్రధాని మోదీతో పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం నిందితుడు నీరవ్‌కు ఎటువంటి సంబంధం లేదన్న వాస్తవంగానీ, ప్రభుత్వ రంగ బ్యాంకు శాఖ ఒక దానిలో చోటుచేసుకున్న అవినీతి బాగోతానికి ప్రధానమంత్రి కార్యాలయానికి ప్రత్యక్ష బాధ్యత ఉండడం అనేది అసాధ్యమన్న విషయం గానీ ప్రస్తుతం తీవ్ర స్థాయిలో జరుగుతున్న రాజకీయ చర్చకు పూర్తిగా అసంగతమయి పోయాయి.

గత నెలలో దావోస్‌లో ప్రధాని మోదీ నీరవ్‌తో కలిసి వున్న ఫోటో ఒకటి అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నది.



> **1989 ఎన్నికలలో విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ వ్యూహాన్నే ఇప్పుడు నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అనుసరిస్తున్నారు. 2014 పూర్వపు అవినీతి బాగోతాలు, వాటిని అరికట్టడంలో యూపీఏ ప్రభుత్వాల వైఫల్యాల ఆధారంగా 2019 ఎన్నికలలో కాంగ్రెస్‌ను మరోసారి తిరస్కరించేలా ప్రజలను పురిగొల్పడం అధికార పక్షానికి సాధ్యం కాదు.**

మరింత శోచనీయమైన విషయమేమిటంటే ప్రధానమంత్రి అధికారిక నివాసంలో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో నీరవ్ వ్యాపార భాగస్వామి, అతని సమీప బంధువు మెహుల్‌చోక్సీని ఉద్దేశించి 'మెహుల్‌భాయ్' అంటూ నరేంద్ర మోదీ ఆత్మీయంగా సంబోధించడం రాజకీయ ఆశ్రిత పక్షపాతాన్ని చెప్పకనే చెప్పుతుందనే అభిప్రాయం గట్టిగా వ్యక్తమవుతున్నది.

నిజం చెప్పాలంటే 2014 ఎన్నికలలో బీజేపీ అనుసరించిన పద్ధతులు ఇప్పుడు రాహుల్ గాంధీకి స్ఫూర్తిగా ఉన్నాయి. యూపీఏ ప్రభుత్వ హయాంలో 2జి స్పెక్ట్రమ్ వేలంలో ప్రభుత్వానికి 1.76 లక్షల కోట్ల రూపాయల మేరకు ఆదాయ నష్టం సంభవించిందని బీజేపీ తీవ్రంగా ఆరోపించింది. ఈ ఆరోపణ నిరాధారమైనదని కాంగ్రెస్ నాయకులు ఎంతగా ఖండించినప్పటికీ, సుదీర్ఘ వివరణలు ఇచ్చినప్పటికీ ప్రజలు వాటిని ఏ మాత్రం విశ్వసించ లేదు. యూపీఏ మంత్రుల నమ్మక ద్రోహం వల్లే దేశానికి అంత భారీ నష్టం వాటిల్లిందనే అభిప్రాయం వారి మనస్సుల్లో స్థిరపడిపోయింది. ఇప్పుడు నీమో (నీరవ్ మోదీ) కుంభకోణం వల్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.11,000 కోట్ల మేరకు నష్టపోయిందని పదే పదే ఆరోపిస్తున్నారు. అంతే నష్టం సంభవించిందా లేక అంతకన్న తక్కువ లేక అధిక నష్టం జరిగిందా అనే లెక్కలకు ఎవరూ పోవడం లేదు. మొత్తం మీద పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారీగా నష్టపోయిందన్న బావం ప్రజల మనస్సుల్లో నిలిచిపోయింది. ఒక సామాన్య బ్యాంకు ఖాతాదారు తాను చెల్లించవలసిన బాకీని ఏదైనా ఒక నెల చెల్లించలేకపోతే వెన్వెంటనే నోటీసులు జారీ చేసే బ్యాంకు అధికార గణం వేల కోట్ల రూపాయల లూటీని ఎలా అనుమతించిందని ఈ దేశ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో అక్రమాలకు ఎవరు కారకులని నిలదీస్తున్నారు.

నీమో కుంభకోణం తొలుత 2011లో ప్రారంభమయిందని, అప్పుడు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం దాన్ని గుర్తించ లేకపోయిందని మోదీ సర్కార్ వాదించవచ్చు. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా తమకు అనుకూలంగా ఉన్న కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను మంజూరు చేయించడం యూపీఏ ప్రభుత్వ వైఫల్యమన్న వాదనలో కూడా సహేతుకత ఉన్నది. దేశం ఎదుర్కొంటున్న బహుముఖ సంక్షోభానికి నెహ్రూ–గాంధీ కుటుంబ పాలనే కారణమని విమర్శిస్తున్న మోదీ బ్యాంకులను జాతీయకరణ చేయడం ద్వారా ఇందిరాగాంధీ ప్రథమ పాపం చేసిందని కూడా అనగలరు. 2014 సంవత్సరానికి పూర్వం జరిగిన అవినీతి బాగోతాలు, వాటిని అరికట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను 2019 సార్వత్రక ఎన్నికలలో తమకు అనుకూలంగా ఉపయోగించుకోవడం సాధ్యం కాదు అనే సత్యాన్ని మోదీ, బీజేపీ గుర్తించవలసివున్నది. ఆ పాలనా వైఫల్యాలకే 2014లో ఓటర్లు యూపీఏ ప్రభుత్వాన్ని శిక్షించారు. ఒకే నేరానికి 'ద్వంద్వ' శిక్షలు వేయాలని కోరడం ఎలా న్యాయబద్ధమవుతుంది? భారీ కుంభకోణాల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ అవినీతి నిర్మూలనలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని ఎలా చెప్పగలదు? ఆ అవినీతి బాగోతాల ఆధారంగా కాంగ్రెస్‌ను మరోసారి తిరస్కరించేలా ప్రజలను పురిగొల్పడం బీజేపీకి ఎంతమాత్రం సాధ్యం కాదు. జాతి సంపదకు కావలివాడుగా ఉంటానన్న హామీని పాటించడంలో మోదీ విఫలమయ్యారని చెప్పక తప్పదు. మీ కాపలాలో ఉన్న ఖజానా లూటీకిగురైన తర్వాత జాతి సంపదకు సంరక్షకుడుగా ఉండగలనని మీరు ఎలా చెప్పగలుగుతారు?


అక్రమార్జనలను అరికట్టే చట్టాలను మరింత పటిష్ఠంగా అమలు పరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని మోదీ సర్కార్ చెప్పుతున్నది. అయితే బుద్ధి పూర్వకంగా బ్యాంకు బాకీల చెల్లింపు ఎగవేసినవారికి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకుని, వారి ఆస్తులను స్వాధీనం చేసుకోనంత వరకు ప్రభుత్వాధినేతలు చెప్పుతున్న మాటలను ఎవరూ విశ్వసించరు. బినామీ చట్టం, దివాలా కేసుల విచారణ నిబంధనావళిని మరింత దృఢతరం చేసేందుకు తీసుకున్న చర్యలు ప్రశంసనీయమే. అయితే కుంభకోణాలకు పాల్పడిన 'పెద్దమనుషుల'కు వ్యతిరేకంగా చట్టబద్ధమైన చర్యలు చేపట్టడం చాలా ముఖ్యం. అవినీతి నిర్మూలన విషయమై ప్రధాన రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరులో చిత్తశుద్ధిని శంకిస్తున్న ఓటర్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది.

ఇప్పుడు అడగాల్సిన ప్రశ్న: ఈ దేశ చట్టాలను ఎదుర్కొనేందుకు, విదేశాలకు పరారయిన నీరవ్ మోదీని నరేంద్ర మోదీ వెనక్కి తీసుకువస్తారా? ఆ వజ్రాల వ్యాపారి కూడా విదేశాలలో భద్రంగా ఉండే మరో పలాయితుడుగా ఉండిపోతే అది మోదీ ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించదా? 1989లో బోఫోర్స్ కుంభకోణానికి సంబంధించి ఇటాలియన్ వ్యాపారి ఖత్రోకిని వి.పి.సింగ్ తప్పుపట్టారు. అయితే తాను అధికారంలోకి వచ్చిన తరువాత ఖత్రోకిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ఇప్పుడు ప్రధాని మోదీ కూడా నీరవ్‌ను స్వదేశానికి తీసుకువస్తారా లేక ఇచ్చిన మాటకు కట్టుబడి వుండడంలో విఫలమయ్యారన్న నింద పడతారా? వేచి చూడాలి.

తాజా కలం: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అవినీతిపరుడని, ఆయన్ని 'మిస్టర్ టెన్ పర్సెంట్' అని అనడం సబబని కర్ణాటక ఎన్నికల ప్రచారంలో మోదీ అన్నారు. ఆ సభా వేదికపై బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి బిఎస్ యెడ్యూరప్ప కూడా ఉండడంతో మోదీ నైతిక, రాజకీయ వాదన బలహీనపడిందని చెప్పక తప్పదు. ఎందుకంటే అవినీతి ఆరోపణల కారణంగా గతంలో యోడ్యూరప్పను ముఖ్యమంత్రి పదవి నుంచి బీజేపీ నాయకత్వం బలవంతంగా తొలగించింది. ఆయన కొంతకాలం జైలువాసం కూడా చేశారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

స్కామ్‌ల వెనక స్వాములు ఎవరు?



■ వి. శ్రీనివాస్

సారాంశం

> **శిక్ష పడదన్న అతిపెద్ద నమ్మకమే ఈ నేరాలు పదేపదే పునరావృతం కావడానికి కారణం. పాలనా వ్యవస్థ పదేపదే ఉద్దేశ్యపూర్వకంగా విఫలం కావడమే నేరగాళ్లలో పాతుకుపోయిన నమ్మకానికి కారణం. అధికారంలో ఉంటే మంత్రులుగా లేకుంటే ఆరితేరిన న్యాయవాదులుగా కొందరు ఘరానా నేరగాళ్లకు అండగా నిలవడమే వ్యవస్థల వైఫల్యానికి కారణం.**

'బిహైండ్ ఎవ్రీ గ్రేట్ ఫార్చ్యూన్ దేర్ ఈజ్ ఎ క్రైమ్.' కొన్ని వాక్యాలు మనల్ని వెన్నాడుతూ ఉంటాయి. అటువంటి వాటిలో మారియో పుజో 'గాడ్ ఫాదర్' నవల్లోని ఈ వాక్యం కూడా ఒకటి. సుప్రసిద్ధ ఫ్రెంచ్ రచయిత బాల్జాక్‌ను ఉటంకిస్తూ ఈ వాక్యంతో గాడ్‌ఫాదర్ నవలను మారియో పుజో ప్రారంభించారు. ప్రపంచ కుబేరుల జాబితాలను తిరగేస్తున్నా, రాత్రికిరాత్రే సంపన్నులుగా మారిన వారి విజయగాథలు విన్నా ఈ వాక్యం గుర్తుకువస్తుంది. క్రైమ్ అంటే మాఫియా నేరాలే కానక్కరలేదు. రక్తపాతాలే ఉండనక్కరలేదు. నిబంధనల చాటునే బ్యాంకులను కొల్లగొట్టడం, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి దగాకు పాల్పడటం, అభివృద్ధి పేరుతో ప్రజలందరికీ చెందాల్సిన విలువైన సంపదను కారుచౌకగా కొందరు వ్యక్తులు ప్రైవేట్ ఆస్తులుగా మార్చుకోవడం, అందుకు చట్టసభల సాక్షిగా మంత్రులు, అధికారులు సహకరించడం, చట్టం సాక్షిగా ఆమోదముద్ర పొందడం... ఇవన్నీ నేరాలు కాకుండా పోతాయా? కోట్లాది మంది ప్రజలు నిరంతరం కష్టపడుతునే ఉంటారు. తమ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగాలను నిజాయితీగా నిర్వహిస్తూ శ్రమను సంపదగా మారుస్తూనే ఉంటారు. కానీ మొత్తం సంపదలో 75 శాతం కేవలం ఒకటి రెండు శాతం మంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంటుంది. దీనికి కారణమేమిటో అందరికీ తెలుసు. తేలిగ్గా డబ్బు సంపాదించే అడ్డదారులు, రుణాల పేరుతో బ్యాంకులను, పబ్లిక్ ఇష్యూల పేరుతో అమాయక ఇన్వెస్టర్లను వంచించడం, ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టడం... దోపిడి ఘరానా పద్ధతుల్లో జరుగుతుంది. పెద్దల అండతో జరుగుతంది. చట్టం దానిని బయటపడినప్పుడే గుర్తిస్తుంది. జరగకుండా మాత్రం నిరోధించదు. కళ్లెదుటి ఘోరాలకు సగటుజీవి ఆత్మ మాత్రం ఘోషిస్తుంటుంది. అందుకే ఆ వాక్యం వెన్నాడుతూ ఉంటుంది.

నీరవ్ మోదీ స్కామ్ దేశాన్ని అట్టుడుకిస్తోంది. దీనిని దేశీయ బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద స్కామ్‌గా చెబుతున్నారు. ప్రభుత్వ రంగంలోని రెండో అతిపెద్ద బ్యాంకు పిఎన్‌బిని నీరవ్ మోదీ ఆయన మేనమామ చోక్సీ 12,000 కోట్ల రూపాయల మేర వంచించిన తీరుపై వార్తలు, విశ్లేషణలతో మీడియా హోరెత్తిపోతున్నది. ఒక సీజన్‌లాగా ఈ స్కామ్‌ను వెన్నంటే మరికొన్ని స్కామ్‌లు బయటకొచ్చాయి. రోటోమాక్ పెన్నుల కంపెనీ అధినేత కొఠారీ బ్యాంక్ ఆఫ్ బరోడాను 3,700 కోట్ల రూపాయల మేర ముంచారు. ద్వారకాదాస్ జువెలర్స్ అధినేత సభ్యాసేథ్ తన వంతుగా 400కోట్ల రూపాయలను ఓరియెంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌కు ఎగవేశారు. నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్ మెహుల్ చోక్సీ, రొటామాక్ కొఠారి, ద్వారకాదాస్ జువెలర్స్ సభ్యా సేథ్, ఐఎన్ఎక్స్ మీడియాకు సహకరించిన కార్తీ చిదంబరం వీరికి తోడుగా మరో అరడజను మంది వేరువేరు బ్యాంకుల ఉన్నతాధికారులు.... ప్రతిరోజూ మీడియాలో వినవస్తున్న పేర్లు ఇవి. నిజానికి అతిపెద్ద దృశ్యంలో ఆవిష్కారమైంది అతితక్కువ శాతమే.



మౌలిక వసతుల అభివృద్ధి, వ్యాపార విస్తరణ, ఎగుమతి, దిగుమతులు, ఆర్థికాభివృద్ధి పేర్లతో వినూత్న తరహాలో బ్యాంకులను దోచుకోవడం, అందులో అధికారులను, రాజకీయ నాయకులను భాగస్వాములను చేయడం గత పాతికేళ్లలో విరివిగా కనిపిస్తున్న పరిణామాలు. 1990లో దేశంలో ఆర్థిక సంస్కరణల పర్వం మొదలైన నాటి నుంచే ఈ రకమైన నేరాలకు బీజం పడింది. స్టాక్ మార్కెట్‌లో లాభాలను ఎరగా వేసి బ్యాంకులను, ఇన్వెస్టర్లను ఏకకాలంలో ఎలా దోచుకోవచ్చో హర్షద్ మెహతా, కేతన్ పరేఖ్‌లు ఒక పదేళ్ల వ్యవధిలోనే ప్రత్యక్షంగా చూపించారు. బ్యాంకుల సొమ్మునే స్టాక్ మార్కెట్లోకి మళ్లించి సొంతగా వేల కోట్లు గడించి, లక్షలాది మంది ఇన్వెస్టర్లను, డజనుకుపైగా బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలను వీరిద్దరూ ముంచారు.

బ్యాంకులను జాతీయం చేయడానికి ముందు జరిగిన మోసాలు జాతీయం తర్వాత జరక్కూడదు. ఒక బ్యాంకులో జరిగిన మోసం అదే తరహాలో మరో బ్యాంకులోనూ జరక్కూడదు. హర్షద్ మెహతా స్కామ్ తర్వాత కేతన్ పరేఖ్ స్కామ్‌కు ఆస్కారం ఉండకూడదు. ఈ ఇద్దరి స్కామ్‌ల తర్వాత నీరవ్ మోదీలు తెరపైకి రాకూడదు. అయినా, ప్రతి ఏడాది ఇలాంటి నేరాలు జరుగుతూనే ఉంటాయి. నేరగాళ్లు చట్టబద్ధంగా తప్పించుకొని దేశంలోనే దర్జాగా జీవిస్తుంటారు. లేదా సరిహద్దులు దాటేసి విదేశాల్లో శేషజీవితాన్ని సుఖంగా గడిపేస్తుంటారు. శిక్ష పడదన్న అతిపెద్ద నమ్మకమే ఈ నేరాలు పదే పదే పునరావృతం కావడానికి కారణం. పాలనా వ్యవస్థ పదేపదే ఉద్దేశ్యపూర్వకంగా విఫలం కావడమే నేరగాళ్లలో పాతుకుపోయిన నమ్మకానికి కారణం. అధికారంలో ఉంటే మంత్రులుగా అధికారంలో లేకుంటే ఆరితేరిన న్యాయవాదులుగా కొందరు ఘరానా నేరగాళ్లకు అండగా నిలవడమే వ్యవస్థల వైఫల్యానికి కారణం.

దేశాన్ని డ్రీమ్ బడ్జెట్లతో అలరించిన మార్కెట్ ఫ్రెండ్లీ చిదంబరం కుమారుడు ఇప్పుడు క్విడ్ ప్రో కో అవినీతి ఆరోపణలతో బోనులో నిలబడ్డాడు. హర్షద్ మెహతా స్కామ్ సమయంలోనే ఆరోపణలు ఎదుర్కొన్న చిదంబరం 28 ఏళ్ల తర్వాత మళ్లీ ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్–మాక్సిస్ అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్నారు. ఈ మధ్య కాలంలో ఆయన దేశ ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆయన నిర్వహించిన భూమికను ఇప్పుడేవిధంగా అర్థం చేసుకోవాలో మనం తేల్చుకోవాల్సి ఉంది.

బ్యాంకుల్లో స్కామ్‌లకు కొదువే లేదు. 10 లక్షల కోట్ల రూపాయల మొండి పద్దుల్లో బ్యాంకులు నికరంగా వసూలు చేసుకోగల మొత్తం 4 లక్షల కోట్ల రూపాయల కంటే మించదు. 6 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకర్లు, అధికారులు, రాజకీయనాయకులు, దళారులు కుమ్మక్కైన కారణంగా కోల్పోవల్సి వస్తున్నదే. ఇవన్నీ ఇంకా బయటకు రాని స్కామ్స్.

ఈ స్కామ్‌లు ఇప్పుడు పిఎస్‌యు బ్యాంకుల అస్తిత్వంపై చర్చకు దారితీశాయి. దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల మేర పేరుకుపోయిన మొండిపద్దులతో ప్రభుత్వరంగ బ్యాంకులు కుప్పకూలే స్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం ఏటా వందల కోట్ల రూపాయలను మూలధనంగా సమకూరిస్తే తప్ప నిలదొక్కుకోలేని స్థితిలో బ్యాంకులున్నాయి. ప్రతి స్కామ్‌ను వెన్నంటి ప్రభుత్వం నుంచి హడావుడి చర్యలు, దర్యాప్తునకు ప్రత్యేక కమిటీలు, వాటి నివేదికలు షరామామూలే. పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను జప్తు చేసుకునేందుకు బిల్లును తయారు చేస్తోంది.కొత్త బిల్లు వల్ల పారిపోయే ముందే ఆస్తులు కూడా అమ్ముకొని విదేశాలకు తరలించుకోవాలనే తెలివిడిని నేరగాళ్లకు కలిగించడం తప్ప మరేమీ లేదు.

స్కామ్‌లు బ్యాంకుల విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. బ్యాంకుల సిఇఒలు, మాజీ మేనేజింగ్ డైరెక్టర్లు దర్యాప్తు సంస్థల విచారణను ఎదుర్కోవడం పరిస్థితిని మరింత దిగజార్చింది. అందువల్లే, ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ పిఎస్‌యు బ్యాంకులను ప్రైవేట్ పరం చేయాలన్న వాదన ముందుకు తెచ్చారు. అదనుకోసం చూస్తున్నవారు ఆయనకు వంతపాడుతున్నారు. ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేసిన తర్వాత పరపతి పంపిణీలో మార్పులు వచ్చాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు, వ్యవసాయానికి పరపతి సహాయం పెరిగింది. సంప్రదాయ వ్యాపార కుటుంబాలు మాత్రమే ఏలిన దేశీయ వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో ఇతర వర్గాల ప్రమేయం, పాత్ర గణనీయంగా పెరిగాయి. ఆర్థిక రంగంలో గుణాత్మకమై మార్పు కనిపించింది. ఇప్పుడు పిఎస్‌యు బ్యాంకులను ప్రైవేట్ పరం చేయడమంటే, ఫైనాన్షియల్ ఎక్స్‌క్లూజన్‌ను ఆహ్వానించడమే. ఆర్థిక వృద్ధిలో మెజార్టీ ప్రజానీకానికి భాగస్వామ్యాన్ని నిరాకరించడమే. పటిష్ఠమైన వ్యవస్థలను నిర్మించలేని అసమర్థతను అంగీకరించడమే. దేశ ఆర్థిక రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగించాలన్న తహతహను చాటుకోవడమే. ■



తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కోదారి శ్రీను రూపొందించిన హోలీ పాటల సీడీని హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరిస్తున్న ఎంపీ కవిత

● హోలీ పాటల సీడీని ఆవిష్కరించిన కవిత

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సాంస్కృతిక విభాగం కన్వీనర్ కొదారి శ్రీను నేతృత్వంలో రూపొందించిన హోలీ పాటల సీడీని ఆ సంస్థ అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎంపీ కవిత గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్యాన్ని సహజ శైలిలో సమాజానికి అందించడంలో జాగృతి శ్రమిస్తోందని కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, ఉపాధ్యక్షుడు రాజీవ్ సాగర్, యువజన విభాగం కన్వీనర్ కోరబోయిన విజయ్ పాల్గొన్నారు.

● బంద్‌కు మద్దతివ్వండి: మందకృష్ణ

హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మార్చి 13న తెలంగాణ బంద్‌కు మద్దతివ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. గురువారం మందకృష్ణ ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి తార్నాకలోని కోదండ నివాసానికి వెళ్లారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని, దీనిపై కేంద్రం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ బంద్ పిలుపునిచ్చామని చెప్పారు.

● హైకోర్టులో లాయర్ల విధుల బహిష్కరణ

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి న్యాయవాదులు ఇచ్చిన విధుల బహిష్కరణ పిలుపుతో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టులో న్యాయసేవలు స్తంభించిపోయాయి. ఉమ్మడి హైకోర్టులో ఖాళీగా ఉన్న జడ్జిల పోస్టులు భర్తీ చేయాలని, హైకోర్టులో పూర్తి స్థాయి ప్రధాన న్యాయమూర్తిని నియమించాలని, హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని, పోలీసులకు విస్తృతాధికారాలు కల్పిస్తున్న సీఆర్‌పీసీ 41ఏ సెక్షన్‌ను రద్దు చేయడానికి చర్యలు తీసుకోవాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

● ఫుడ్ అలవెన్స్ ఇవ్వాల్సిందే..

ఇంటర్మీడియట్ నాన్ టీచింగ్ సిబ్బంది

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న తమకు ఫుడ్ అలవెన్స్ ఇవ్వాలని నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రధాన కార్యదర్శి ఫ్రాన్సిస్ బోర్డు కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. పరీక్షల నిర్వహణలో 24 గంటలు డ్యూటీలోనే ఉంటున్నప్పటికీ తమపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీచింగ్ స్టాఫ్, డీఐఈవోలతో సమానంగా నాన్‌టీచింగ్ సిబ్బందికీ ఫుడ్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

● ఏపీపీఎస్సీ డీఎల్‌లో తెలంగాణ వాసి ప్రతిభ


కుర్మేటి సుధాకర్

ఉస్మానియా యూనివర్సిటీ/హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన డిగ్రీ లెక్చరర్ (డీఎల్) పరీక్షల్లో జువాలజీ విభాగంలో తెలంగాణ విద్యార్థి కుర్మేటి సుధాకర్‌కు మొదటి ర్యాంక్ లభించింది. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం ఘడియ గౌరారం గ్రామానికి చెందిన సుధాకర్ పదోతరగతి వరకు అదే గ్రామంలో చదివారు. ఇంటర్ భువనగిరి సోషల్ వెల్ఫేర్ కళాశాల, నల్గొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, 2013లో ఓయూలో ఎమ్మెస్సీ (జువాలజీ) పూర్తి చేశారు. నెట్‌లో అర్హత సాధించి జేఆర్ఎఫ్‌కు ఎంపికయ్యారు.

తెలంగాణేతరులనూ అనుమతించండి

▸▸ పోటీ పరీక్షలపై టీఎస్ విద్యుత్ సంస్థలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (టీఎస్ఎస్‌పీడీసీఎల్), టీఎస్ ట్రాన్స్‌కో సంస్థలు ఏఈ, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో) పోస్టుల నియామకాలకు తెలంగాణేతరులను కూడా అనుమతించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఏసీజే జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం ఆదేశాలు జారీచేసింది. ఏఈ, జేఏవో పోస్టులకు తెలంగాణ స్థానికత కలిగిన అభ్యర్థులే దరఖాస్తు చేయాలని, తెలంగాణేతరులు అనర్హులంటూ ఆ రెండు సంస్థలు జారీ చేసిన నోటిఫికేషన్లను జి. పావని, సీహెచ్ నిఖిల్ అనే అభ్యర్థులు హైకోర్టులో సవాలు చేశారు. పిటిషనర్ల తరపున న్యాయవాది కె. లక్ష్మీనర్సింహ వాదించారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కోలు తెలంగాణ ప్రాంతానికి చెందిన అభ్యర్థులు మాత్రమే పోస్టులకు దరఖాస్తు చేయాలని నోటిఫికేషన్ జారీచేయడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఈ నిబంధన విధించి నోటిఫికేషన్ జారీ చేయడం ఆర్టికల్ 16(2)ని ఉల్లంఘించడమేనని తెలిపారు. నిబంధనలను సవరించే అధికారాలు విద్యుత్‌సంస్థలకు లేవని, ఏదేనా సవరణ చేయాలంటే పార్లమెంటుద్వారా మాత్రమే చేయాలన్నారు. ఈ సంస్థలు ఆర్టికల్ 371డీ పరిధిలోకి రావని తెలిపారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం... తెలంగాణేతరులను కూడా ఏఈ, జేఏవో పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు, పోటీ పరీక్షలు రాసేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది.

రిలయన్స్ 'బిగ్' ఆఫర్!

న్యూఢిల్లీ, మార్చి 1: రిలయన్స్ డిజిటల్ టీవీ బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఏడాది కిందట జియో సేవలతో టెలికం రంగంలో పెను సంచలనం సృష్టించిన రిలయన్స్ ఇప్పుడు డీటీహెచ్‌లోనూ ధరల యుద్ధానికి తెరలేపింది. రిలయన్స్ బిగ్ టీవీ హెచ్‌డీ హెచ్ఈవీసీ సెట్‌టాప్ బాక్సును కొంటే ఏడాది పాటు అన్ని హెచ్‌డీ చానెళ్లను ఉచితంగా అందజేస్తామని ప్రకటించింది. అలాగే 500 వరకు ఫ్రీ టు ఎయిర్ చానెళ్లను ఐదేళ్లపాటు ఉచితంగా అందిస్తామని తెలిపింది. గురువారం ఉదయం నుంచి రిలయన్స్ డిజిటల్ టీవీ అధికారిక వెబ్‌సైట్‌లో బుకింగ్స్‌ను ప్రారంభించింది. ముందస్తు బుకింగ్ చార్జీ రూ.499 చెల్లించాల్సి ఉంటుందని, ఇన్‌స్టాల్ చేసే సమయంలో రూ.1500తో పాటు కొత్త వినియోగదారులు రూ.250 ఇన్‌స్టాలేషన్ చార్జీల కింద చెల్లించాలని తెలిపింది. అనంతరం నెలకు రూ.300తో రీచార్జి చేయించుకుంటూ ఉంటే రెండేళ్ల తర్వాత రూ.1999 ఖాతాదారులకు తిరిగి ఇచ్చేస్తామని వెల్లడించింది.

'డ్రై డే' నాడే లిక్కర్ ఈవెంట్లు

▸▸ 'సాధారణ' దరఖాస్తుల తిరస్కరణ.. ఎక్సైజ్‌లో ద్వంద్వ విధానాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఓ వైపు మద్యం విక్రయాలు సాగించవద్దంటూ ఉత్తర్వులు జారీ చేసి.. మరోవైపు లిక్కర్ ఈవెంట్లకు ఎక్సైజ్ శాఖ పర్మిట్లు జారీ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అందులోనూ పలుకుబడి ఉన్న వారికి పర్మిట్లుఇస్తూ.. సాధారణ ప్రజల దరఖాస్తులను తిరస్కరించడం ఆ శాఖకే చెల్లింది. శాంతిభద్రతల దృష్ట్యా మద్యం విక్రయాలు సాగించవద్దంటూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసినా ఎక్సైజ్ శాఖ తన పని తాను చేసుకుపోతోంది. హోలీ పండుగను పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి ప్రాంతాల్లో మద్యం విక్రయాలు సాగించవద్దంటూ నగర పోలీసు కమిషనర్ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను మూసివేసి 'డ్రై డే' పాటించాలని ఆదేశించారు. ఈ ఆదేశాలను ఎక్సైజ్ కమిషనరేట్ అధికారులు వైన్ షాపులు, బార్లకు పంపించారు. కానీ తాము జారీ చేసిన ఉత్తర్వులనే ఎక్సైజ్ శాఖ తుంగలో తొక్కింది. నిబంధనలకు విరుద్ధంగా బుధవారం రాత్రి మద్యం ఈవెంట్ నిర్వహించుకునేందుకు ఓ వ్యక్తికి పర్మిట్(సీఆర్ నెంబర్ 3060/2018/సీపీఈ, టీ/ఎఫ్1) ఇచ్చింది. డ్రైడే ఉత్తర్వులు అమల్లోకి వచ్చినరోజే ఈవెంట్‌కు పర్మిట్ ఎలా ఇచ్చారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సదరు వ్యక్తికి పలుకుబడి ఉండడం, ఓ పారిశ్రామికవేత్తతో సిఫారసు చేయించడంతో ఎక్సైజ్ అధికారులు పర్మిట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. అదే రోజు మాదాపూర్‌లోని ప్రముఖ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మరో రెండు ఈవెంట్లకూ పర్మిట్లు ఇచ్చినట్లు సమాచారం. కాగా, పెళ్లిళ్లు, ఫంక్షన్ల దృష్ట్యా గురు, శుక్రవారాల్లో ఈవెంట్లు నిర్వహించుకునేందుకు అనుమతి కోరుతూ వచ్చిన 15 వరకు దరఖాస్తులను ఎక్సైజ్‌శాఖ తిరస్కరించింది. డ్రై డే పాటిస్తున్నామంటూ వారికి బదులిచ్చింది. ఇలా పలుకుబడి ఉన్న వారి పట్ల ఒక రకంగా, సామాన్యుల విషయంలో మరో రకంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బోర్డు.. డమ్మీ!

దాని నిర్ణయాలను రాష్ట్రాలు పాటించవు.. రాష్ట్రాల ఫిర్యాదులను అది పరిష్కరించదు

▸▸ బోర్డు అడిగిన అధికారాలను కేంద్రం ఇవ్వదు

▸▸ జల వివాదాలకు అసలు కారణాలు ఇవే

హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నీటి కేటాయింపు, పంపిణీ విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. వాటిని పరిష్కరించడంలో ఇటు బోర్డు, అటు కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు దాటవేత ధోరణి అనుసరిస్తున్నాయి. బోర్డులు అడిగిన అధికారాలను బదిలీ చేసేందుకు కేంద్రం చొరవ తీసుకోవడం లేదు. దీంతో రాష్ట్రాలు బోర్డు సూచనలను పాటించకుండా సొంత నిర్ణయాలు అమలు చేసుకుంటున్నాయి. రాష్ట్రాల ఫిర్యాదులను పరిష్కరించే స్థితిలో బోర్డులేదు. దాంతో, పరిస్థితి గందర గోళంగా మారింది. తాజాగా, సాగర్ కుడి కాల్వ వద్ద నీటి పంచాయితీ విషయంలోనూ ఇదే చోటు చేసుకుంది. దాదాపు ఒక టీఎంసీ నీటిని విడుదలచేయాలని ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తి చేయడం, కృష్ణా బోర్డు అంగీకరించడం వివాదాస్పదమవుతోంది.



బోర్డుల పక్షపాతం

రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ, ఏపీ మధ్య నీటి కేటాయింపులు, పంపిణీకి సంబంధించి గోదావరి, కృష్ణా బేసిన్లకు ప్రత్యేకబోర్డులు ఏర్పాటు చేశారు. సిబ్బంది, కార్యాలయాలు, అధికారాలు ఇచ్చినా సరైన నిర్ణయాలు తీసుకోవడంలో బోర్డులు విఫలమవుతున్నాయి. ప్రతిసీజన్లో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదాలు తలెత్తుతున్నాయి. గోదావరి బోర్డు కంటే కృష్ణా బోర్డుపై ఎక్కువ ఆరోపణలు వస్తున్నాయి. కృష్ణా బేసిన్‌లోని జనాభా, విస్తీర్ణం, నీటి లభ్యత, కరువు పీడిత ప్రాంతాలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని లభ్యత ఉన్న నీటిలో 66% ఏపీకి, మిగిలిన 34% తెలంగాణ కు కేటాయించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నిష్పత్తిలోనే కృష్ణా బోర్డు పంపిణీ చేస్తూ వస్తోంది. కానీ, బోర్డు తీసుకునే నిర్ణయాల అమల్లోనే అస లు సమస్య ఎదురవుతోంది. ఉదాహరణకు, ఈ ఏడాది నీటి పంపిణీలో ఏపీకి కేటాయించిన నీటిని ఇప్పటికే దిగువకు వదిలిపెట్టారు. ఆ రాష్ట్రం వాడుకోవడానికి ఉమ్మడి రిజర్వాయర్లలో నీరు లేదు. శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లలో ఎగువన కనీస నీటిమట్టం 36 టీఎంసీలు ఉంది. ఇదంతా తెలంగాణ కోటా పరిధిలోకి రానుంది. ఈ ఏడాది కోటా పూర్తి కావడంతో ఏపీకి నీటి సరఫరాను నిలిపి వేయాలని కృష్ణా బోర్డు నిర్ణయించింది. సాగర్ కుడి కాల్వ రైతులు ఆందోళనకు దిగడంతో ఏపీకి మళ్లీ 5 రోజులపాటు రోజూ 2000క్యూసెక్కుల చొప్పున 10 వేల క్యూసెక్కుల నీళ్లు ఇవ్వడానికి బోర్డు అంగీకరించింది. బోర్డు తీసుకున్న నిర్ణయానికి ఏపీ కట్టుబడి లేదని స్పష్టమవుతున్నా నీళ్ల విడుదల చేయడంపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఏపీకి కేటాయించిన నీటిని ఎక్కువగా పోతిరెడ్డి పాడు, హంద్రీ-నీవా ప్రాజెక్టుల నుంచి తరలించారని, అందుకే కుడి కాల్వ అవసరాలకు నీటి కొరత ఏర్పడిందని, ఈ విషయాన్ని ఎప్పటికప్పు డు తాము బోర్డు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటోంది. తమ కోటా నీటిని కూడా ఏపీకి కేటాయిస్తే భవిష్యత్తు వేసవి అవసరాలకు ఇబ్బంది తప్పదన్న ఆందోళన వ్యక్తం చేస్తోంది. టెలిమెట్రీ యంత్రాలను తెలంగాణలో ఏర్పాటు చేసిన బోర్డు, ఏపీ నీటిని తరలించే ప్రాంతాల్లో అమర్చలేదని తప్పుబడుతోంది. పోతిరెడ్డిపాడు వద్ద ఏర్పాటు చేసిన టెలీమెట్రీ యంత్రాలను పనిచేయనీయకుండా చేసి, అక్కడి నుంచి ఎక్కువ నీటిని తరలిస్తున్నా బోర్డు పట్టించుకోలేదని ఆరోపిస్తోంది. పట్టిసీమనుంచి కృష్ణాబేసిన్‌లోకి తరలించే గోదావరి నీటిలో తెలంగాణకు 45టీఎంసీలను కేటాయించాల్సి ఉందని బోర్డును పదే పదే తెలంగాణ ప్రభుత్వం కోరింది. దీనిపై తాము ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోలేమని, కేంద్రమే పరిష్కరించాలని బోర్డు స్పష్టం చేసింది. బోర్డు తీసుకున్న నిర్ణయాలు అమలు కాకపోవడంతో వాటికి ఆయా రాష్ట్రాలు కూడా కట్టుబడి ఉండడం లేదు. అదే సమయంలో, తమ నిర్ణయాలను అమలు చేయకపోతే ఆయా రాష్ట్రాలపై చర్యలు తీసుకోవడానికి ఎలాంటి అధికారాలు లే వని బోర్డు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బోర్డు అధికారాలు, పరిధి విషయంలో కేంద్రం ఇంకా తుది నిర్ణయాన్ని ప్రకటించలేదు. దాంతో బోర్డు తీసుకునే నిర్ణయాలు అమలు కాకపోవడం, వివాదాస్పదం కావడం జరుగుతోంది.


నాగార్జునసాగర్ కుడి కాల్వకు విడుదలవుతున్న నీరు

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

▸▸ ఐదు రోజుల పాటు 10 వేల క్యూసెక్కుల కేటాయింపు

▸▸ మూడో సారి పంతం నెగ్గించుకున్న ఏపీ

నాగార్జునసాగర్, మార్చి 1: నాగార్జున సాగర్ కుడికాల్వకు నీటి విడుదలపై ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు మరోసారి పంతం నెగ్గించుకున్నారు. కృష్ణా బోర్డు సూచన మేరకు తెలంగాణ అధికారులు గురువారం 2వేల క్యూసెక్కుల నీటిని కుడి కాల్వకు విడుదల చేశారు. రాష్ట్ర విభజన అనంతరం 2015ఫిబ్రవరి 11న నీటి కోసం సాగర్ ప్రధాన డ్యాంపై ఇరు రాష్ట్రాల నీటి పారుదల శాఖాధికారులు, పోలీసులు బాహాబాహీకి దిగిన విషయం తెలిసిందే. తర్వాత 2017 మే 1న కుడి కాల్వకు కేటాయించిన కోటా పూర్తవడంతో నీటి విడుదలను తెలంగాణ అధికారులు నిలిపివేయ గా, ఏపీ అధికారులు మరోసారి గొడవకు దిగారు. అప్పుడు అదనంగా 5 రోజుల పాటు కుడి కాల్వకు నీటి విడుదల చేయించుకున్నారు. ఈ రెండు పర్యాయాల్లోనూ ఏపీకి అనుకూలంగా కృష్ణా నది బోర్డు ఆదేశాలివ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. తాజాగా కుడి కాల్వకు కేటాయించిన 60 టీఎంసీల కోటా పూర్తవడంతో నీటి విడుదల ఆపేయాలని బుధవారం అధికారులను బోర్డు ఆదేశించింది. దీంతో ప్రధానడ్యాంపై ఉన్న కంట్రోల్‌రూంకు వచ్చిన ఏపీ అధికారులు మరో రెండు రోజు లు నీటి విడుదల కొనసాగించాలంటూ వాగ్వాదానికి దిగారు. దీనిపై సీఈ సునీల్ బోర్డును సంప్రదించగా, 2వేల క్యూసెక్కుల చొప్పున ఐదు రోజులు నీరు విడుదల చేయాలని సూచించింది. ఈ మేరకు గురువారం ఉదయం 9 గంటల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌లో నీటి మట్టం 523.20 అడుగుల మేర ఉంది. కుడి కాల్వకు 2,327 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1800 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 3,236 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 5,260 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 11,731 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.


గోరటి వెంకన్నను సత్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు తదితరులు

కళలకు కంచుకోట.. సిద్దిపేట

▸▸ గోరటి వెంకన్న పాటలు అక్షరసత్యాలు.. పచ్చని మాగాణే ప్రభుత్వ లక్ష్యం: హరీశ్

▸▸ సిద్దిపేటలో కళా ఉత్సవాలకు శ్రీకారం.. ఓపెన్ ఆడిటోరియాన్ని ప్రారంభించిన మంత్రి

సిద్దిపేట/సిద్దిపేట కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులకు సిద్దిపేట కంచుకోట అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం సిద్దిపేటలో రూ.6.25 కోట్లతో నిర్మించిన కోమటి చెరువు కళాక్షేత్రం ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాకారుల ప్రదర్శనలకు ఈ ఆడిటోరియం వేదికగా నిలువనుందన్నారు. కోమటి చెరువు వద్ద త్వరలోనే శిల్పారామం, మల్టీప్లెక్స్ థియేటర్, బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణను పచ్చని మాగాణిగా చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని, అందుకనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన పాలమూరు జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా నీళ్లు, పరవళ్లు తొక్కే చెరువులు, పచ్చని పంట పొలాలే దర్శనమిస్తున్నాయన్నారు. నాటి తెలంగాణ ఉద్యమంలో గోరటి వెంకన్న పాడిన పాటలు తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చాయని, నేడు బంగారు తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన పాటలు పాడటం గర్వంగా ఉందని మంత్రి తెలిపారు. ఆయన పాటలు వాస్తవికతో కూడిన అక్షరసత్యాలని కొనియాడారు. అనంతరం గోరటి వెంకన్నను ఘనంగా సత్కరించారు. కాగా ఆడిటోరియం ప్రారంభం సందర్భంగా కళాప్రదర్శనలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. కళాప్రదర్శనల ర్యాలీని మంత్రి హరీశ్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, సీఎం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. శుక్ర, శనివారాల్లోనూ వేడుకలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్, పర్యాటక శాఖ కమిషనర్ బుర్రా వెంకటేశం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, జిల్లా కలెక్టర్ వెంకట్రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ!



హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తెలిసో తెలియకో అసైన్డ్‌భూములను కొనుగోలు చేసిన వారికి ఆ భూములపై సర్వాధికారం కట్టబెట్టాలని ప్రభు త్వం నిర్ణయించింది. 2017 డిసెంబరు 31వ తేదీని కటాఫ్‌గా తీసుకొని ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములను రీ అసైన్ చేయనున్నారు. అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు జీవో జారీ చేసిన తర్వాత బిల్లు పెట్టాలా? లేక ఆర్డినెన్స్ జారీ చేయాలా? అని న్యాయశాఖ అభిప్రాయాన్ని రెవెన్యూశాఖ కోరగా.. 2017 డిసెంబరు 31వ తేదీని కటాఫ్‌గా నిర్ణయిస్తూ... ఆర్డినెన్స్ జారీ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) యాక్ట్-1977లోని సెక్షన్ 4(1)(బీ)(1) ప్రకారం 2007 జనవరి 29వ తేదీ నాటికి ఆక్రమణలో ఉన్న వారికే రీ అసైన్ చేయాలని నిబంధన ఉంది. చట్టంలోని క్లాజును మార్చాల్సి ఉండటంతో ఆర్డినెన్స్ తప్పనిసరి అని న్యాయశాఖ అభిప్రాయపడినట్లు సమాచారం. అయితే ఈనెల 12వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనుండటంతో 10 రోజుల కోసం ఆర్డినెన్స్ తేవడం కన్నా.. చట్టాన్ని సవరిస్తూ బిల్లు తేవడమే ఉత్తమమని రెవెన్యూ శాఖ భావిస్తోంది. ఈ అంశంపై సీఎంవో, సీఎస్‌తో చర్చించిన తర్వాతనే బిల్లు తయారు చేయాలని యోచిస్తోంది.

84 వేల మందికి ప్రయోజనం

రెవెన్యూ రికార్డుల నవీకరణ, శుద్ధీకరణ ద్వారా తెలంగాణలో 22,55,617 ఎకరాల అసైన్డ్ భూములున్నాయని గుర్తించారు. ఇందులో 20,13,868 ఎకరాలు ఒరిజినల్ అసైనీల (ప్రభుత్వం చేత పంపిణీ పొందిన లబ్ధిదారులు) చేతుల్లో ఉందని, 2,41,749 ఎకరాలు మూడో వ్యక్తులు(అక్రమంగా అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన వారు) చేతుల్లో ఉందని ఉందని తేలింది. వీరి సంఖ్య 84,706గా గుర్తించారు. ఇదంతా 2017 డిసెంబరు 31వ తేదీ నాటి లెక్కలు. ఆ తర్వాత యంత్రాంగం మరోమారు పరిశీలన ప్రారంభించడంతో ఈ సంఖ్య పెరిగినట్లు సమాచారం. అయితే మధ్యలో అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఒక మెమో కూడా ఇచ్చింది. దీని ప్రకారం 2007 జనవరి 29వ తేదీనే కటాఫ్‌గా ఉంది. కానీ దీనివల్ల ఏమాత్రం ప్రయోజనం లేదని గుర్తించిన యంత్రాంగం... క్రమబద్ధీకరణ (రీ అసైన్) దిశగా అడుగులు వేసింది. అయితే డిసెంబరు 31వ తేదీని కటాఫ్‌గా క్రమబద్ధీకరించాలని, ఆక్రమణదారులందరికీ ఎలక్ట్రానిక్ టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రతిపాదిత ఫైలుపై ఆయన సంతకం చేయడంతో ఏ నిర్ణయం తీసుకోవాలో చెప్పండి అంటూ న్యాయశాఖ అభిప్రాయాన్ని రెవెన్యూ కోరింది.

భూముల రికార్డులన్నీ క్లియర్!

ఇప్పటికే ప్రభుత్వం సాదా బైనామాల క్రమబద్ధీకరణకు ఉత్తర్వులిచ్చింది. సెప్టెంబరు 15వ తేదీ నుంచి డిసెంబరు 31వ తేదీ మధ్యలో జరిగిన రికార్డుల నవీకరణలో వచ్చిన 2.45 లక్షల దరఖాస్తులను క్లియర్ చేయాలని నిర్దేశించింది. అయితే సాదా బైనామాలకు తోడు అసైన్డ్ ఆక్రమణలకు చట్టబద్ధత కల్పిస్తే... ఆ భూముల రికార్డులు క్లియర్ కానున్నాయి. వాస్తవానికి 1954 (ఏపీ ఆవిర్భావం) నుంచి 2014 (తెలంగాణ ఆవిర్భావానికి ముందు) వరకు ఏడు విడతల భూపంపిణీ అనంతరం తెలంగాణలో పూర్వపు 9 జిల్లాలో 13,88,530 మందికి 21,35,664 ఎకరాల భూమిని ప్రభుత్వం అసైన్ (పంచింది) చేసింది. తెలంగాణ వచ్చాకా మూడున్నరేళ్ల కాలంలో 10,740 ఎకరాల స్థలాన్ని 4,087 మందికి పంచారు. అసైన్డ్ ఆక్రమణలకు చట్టబద్ధత కల్పిస్తే... రికార్డు అంతా క్లియర్‌గా ఉంటుందనే అభిప్రాయంతో రెవెన్యూ శాఖ ఉంది.

కేటీఆర్‌పై ఇదే నా చివరి మాట

అతని స్థాయికి నేను దిగజారను.. ఇక నుంచి కార్యకర్తలే స్పందిస్తారు

▸▸ పైస్థాయి వారిని తిడితే పెద్దవాళ్లవుతారా?: జానా

▸▸ కేటీఆర్.. ఒక బచ్చా: షబ్బీర్‌అలీ

▸▸ తండ్రీకొడుకులది కమీషన్ల దందా: కోమటిరెడ్డి



నిజామాబాద్ అర్బన్/మిర్యాలగూడ/హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): "కేటీఆర్ వ్యాఖ్యలపై నేను స్పందించడం ఇదే ఆఖరు. అధికార అహంకారంతో హేళనగా, సంస్కారహీనంగా మాట్లాడితే నేను స్పందించను. పైస్థాయి వాళ్లను తిడితే పెద్దవాళ్లమైపోతామని అనుకోవడం భ్రమ. అది నాయకత్వ లక్షణం కాదు. ప్రజాస్వామ్యానికి మంచిది కాదు" అని సీఎల్పీ నేత జానారెడ్డి వ్యాఖ్యానించారు. "జానా బాబా.. 40 దొంగలు" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. అసెంబ్లీలోని మీడియాహాల్‌లో గురువారం జానా మాట్లాడుతూ కేటీఆర్ అర్హతకు మించి అహంకారంతో మాట్లాడటం తగదన్నారు. మౌనం వహిస్తే బెదిరిపోయారని అంటారనే సూచనకు తలొగ్గి మీడియా ముందుకు వచ్చానని తెలిపారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పుకోవడం తమ హక్కు అని, అందుకే ప్రజాచైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రతిపక్షం మాట్లాడకూడదనే తీరులో టీఆర్ఎస్ వ్యవహరించడం విచారకరమన్నారు. టీఆర్ఎస్‌కు అసలు తమ గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. కేటీఆర్ అడిగితే సిరిసిల్లకు నిధులు కేటాయించానని, ఈటల రాజేందర్ కూడా తన నియోజకవర్గానికి ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు మంజూరు చేయించుకున్నారని తెలిపారు. కేసీఆర్‌కు కూడా రోడ్లు వేసుకునేందుకు నిధులు ఇచ్చానని చెప్పారు. భవనమంతా నిర్మించాక, పైన పెంట్‌హౌస్ వేసుకొని మొత్తం తమదేనన్నట్టుగా టీఆర్ఎస్ బీరాలు పలుకుతోందని చురకలంటించారు. అహంకార కూతలు కూసే వారికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఇకపై గర్వాంధులకు తాను సమాధానం చెప్పనని, తమ కార్యకర్తలే తగిన రీతిలో జవాబు ఇస్తారని స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ ఒక బచ్చా అని, అహంకారంతో కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని మండలి ప్రతిపక్షనేత షబ్బీర్ అలీ విమర్శించారు. నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలపై కేసుల గురించి మాట్లాడే ముందు కేసీఆర్‌పై ఉన్న కేసుల గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. అభివృద్ధి పథకాల పేరుతో కేసీఆర్, కేటీఆర్ కమీషన్ల దందా నడిపిస్తున్నారని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఆయన మాట్లాడుతూ తండ్రీకొడుకులు అధికార అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తండ్రీ కొడుకులను జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కేసీఆర్ నోరు బాగు చేయాలని ప్రార్థించా : పొన్నం



తిరుమల, మార్చి 1 : తెలంగాణ సీఎం కేసీఆర్ నోరు, మెదడు బాగు చేయమని వేంకటేశ్వర స్వామిని ప్రార్థించానని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ ఖుంటియాతో కలిసి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం పొన్నం మీడియాతో మాట్లాడుతూ ఉద్యమ సమయంలోనూ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను కేసీఆర్ ఇష్టమొచ్చినట్టు తిట్టారని, ఇప్పుడు కూడా వాడు వీడు అని మాట్లాడుతున్నారని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను విమర్శించేటప్పుడు రాష్ట్ర బడ్జెట్‌ను కూడా దృష్టిలో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ రైతులపై మొసలికన్నీరు కారిస్తే ఎవరూ నమ్మరన్నారు.


టీడీపీ-టీఎస్ నాయకులతో భేటీ అయిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు

ఎన్నికల్లో పొత్తు ఖాయం

▸▸ ఏ పార్టీతో అన్నది సందర్భాన్ని బట్టే.. ఖమ్మం బహిరంగ సభకు వస్తా: చంద్రబాబు

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో వంద శాతం పొత్తు ఉంటుంది. ఎవరితో అనే విషయంలో జాతీయ, రాష్ట్ర రాజకీయాలు, సమయం, సందర్భాన్ని బట్టి నిర్ణయం తీసుకుందామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. పొత్తులపై ఎన్నికలప్పుడే నిర్ణయం తీసుకుందామని, అప్పటివరకు అన్ని నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ తెలంగాణ నాయకత్వానికి సూచించారు. 'కార్యకర్తల్లో మంచి ఉత్సాహం ఉంది. ఇక మీరు కదలాలి. సంస్థాగతంగా బలోపేతం కావాలి. నాయకులు హైదరాబాద్‌ను వీడి క్షేత్రస్థాయికి వెళ్లండి. కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోండి' అని ముఖ్య నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు. కేడర్ బాగుందని, ప్రజలు టీడీపీ రావాలని వారు కోరుకుంటున్నారని అన్నారు. గురువారం తన నివాసంలో టీడీపీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ నాయకులతో చంద్రబాబు సమావేశమై.. దిశానిర్దేశం చేశారు. తెలంగాణకు తాను ఇప్పటివరకు ఎక్కువ సమయం ఇవ్వలేకపోయానని, ఇకపై అన్ని కార్యక్రమాలనూ తానే స్వయంగా పర్యవేక్షిస్తానని తెలిపారు.

పొత్తు వద్దన్నది బీజేపీయే..

'మనతో పొత్తు ఉండదని బీజేపీయే ప్రకటించింది. ఇప్పుడు మనం చేయాల్సిందల్లా అన్ని నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడమే. ప్రతిపక్షంలో ఎంతమంది నాయకులు ఉన్నారన్నది ముఖ్యం కాదు. తమ కోసం పోరాటం చేశారన్న విశ్వాసం ప్రజల్లో కల్పించడమే కీలకం' అని చంద్రబాబు అన్నారు అన్ని జిల్లాల్లోనూ పార్టీ కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని, ఖమ్మం జిల్లాలో సమావేశానికి తాను హాజరవుతానని చెప్పారు. తన కుటుంబ సభ్యులు తెలంగాణలో నాయకత్వం వహించడం పార్టీకి మంచిది కాదని, రాష్ట్రంలో నాయకత్వం లేకనే మళ్లీ వారిని పెట్టారనే అపవాదు వస్తుందని అన్నారు. తెలంగాణలో టీడీపీతో పొత్తు ఉండబోదని బీజేపీ నేతలు ప్రకటించడంపై చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఫలానా కారణంతో వెళ్లిపోతున్నామని ఏమైనా చెప్పారా? వారి ప్రకటనలో ధర్మం ఉందా?' అని చంద్రబాబు అన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం చంద్రబాబును కలుసుకున్నారు. టీఆర్ఎస్ సర్కారు తనను ఇబ్బంది పెడుతుండటాన్ని అధినేతకు వివరించారు. దీంతో వంటేరుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణకు చంద్రబాబు సూచించారు.

రిజిస్ట్రేషన్ల రాబడి అదుర్స్!

(మొదటి పేజీ తరువాయి)

నాటికి మొత్తం 10,41,732 డాక్యుమెంట్లు రిజిస్టర య్యాయి. ప్లాట్లు, ఫ్లాట్లు, అపార్ట్‌మెంట్ల క్రయ విక్రయాల్లో జీఎస్టీ వర్తింపుపై కేంద్రం స్పష్టతనిస్తూ రావడంతో స్థిరాస్తి రంగం పుంజుకొంది. పెద్ద నోట్ల రద్దు అనంతరం నగదు చెలామణి కూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ రూపంలో ఇప్పటివరకు రూ.850 కోట్ల రాబడి వచ్చింది. వాస్తవానికి ఏదైనా డాక్యుమెంట్‌ను రిజిస్టర్ చేసేటప్పుడు 6 శాతం మేర ఫీజు, డ్యూటీలను వసూలు చేస్తారు. ఇందులో 4 శాతం స్టాంపు డ్యూటీ, 0.5 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు, మరో 1.5 శాతం మేర ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ఉంటాయి. ఈ ట్రాన్స్‌ఫర్ డ్యూటీ మాత్రం రిజిస్ట్రేషన్ల శాఖకు చెందదు. దీన్ని స్థానిక సంస్థలకు బదిలీ చేస్తారు. అలా బదిలీ చేసే రూ.850 కోట్లు కూడా కలిపితే మొత్తం రూ.4,300 కోట్ల రాబడి వచ్చినట్లవుతుంది.

ఐఐటీ హైదరాబాద్‌లో టింకరింగ్ ల్యాబ్

- తెలుగు రాష్ట్రాల్లో తొలిసారి.. విద్యార్థులకు ఎంతో మేలు!

హైదరాబాద్‌లోని ఐఐటీ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ఐఐటీలో టింకరింగ్ ల్యాబ్‌ను అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ కొలంబియా కేపిటల్‌కు చెందిన డాక్టర్ హేమంత్ కనీక ప్రారంభించారు. విద్యార్థులు తమ ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్చుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ ఈ ల్యాబ్‌లో ఉంటాయి. ఈతరహా ల్యాబ్‌ను తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించడం ఇదే తొలిసారి. ఈ ల్యాబ్‌ను స్టూడెంట్ వలంటీర్లే నిర్వహిస్తారు. "ఒక ఆలోచనను పరిశోధన స్థాయికి తీసుకెళ్లి అక్కడ దానిని ఒక ఉత్పత్తిగా రూపొందించడానికి విద్యార్థులు చాలా శ్రమ పడుతుంటారు. దానికి అనేక పరికరాలు, మౌలిక సదుపాయాలు అవసరమవుతాయి. వీటన్నింటినీ మేము ఈ ల్యాబ్‌లో కల్పిస్తున్నాం. స్టెమ్(సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథ్) విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ ల్యాబ్‌ను ఉపయోగించుకోవచ్చు" అని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ యు.బి.దేశాయ్ అన్నారు. ఈ ల్యాబ్‌లో స్టార్టప్‌లను ప్రారంభించబోమని.. కానీ ఈ ల్యాబ్‌లో వచ్చే ఆలోచనలు స్టార్టప్‌లకు ప్రాతిపదిక కావాలనేది తమ ఉద్దేశమని తెలిపారు. ఐఐటీ విద్యార్థులందరికీ ఈ ల్యాబ్ అందుబాటులో ఉంటుందని ఇన్‌చార్జి ప్రొఫెసర్ సుష్మి బధులిక వెల్లడించారు. "మేము 1975లో ముంబై ఐఐటీలో చదువుకున్నాం. మా బ్యాచ్ వాళ్లందరం కలిపి టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించాం. విద్యార్థి దశలో ప్రోత్సాహం అందిస్తే ఫలితాలు బాగుంటాయి. అందుకే ల్యాబ్ నిర్మాణానికి నిధులు అందించాం" అని పేర్కొన్నారు.

- స్పెషల్ డెస్క్



ఆదిభట్లలో యుద్ధ విమానాల ప్రధాన భాగాల తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం చప్పట్లు కొడుతున్న కేంద్ర రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్, రతన్ టాటా, మంత్రి కేటీఆర్

అపాచీ రెడీ

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ యువకులు, టాటా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆయుధాల ఉత్పత్తికి దోహదం చేసే రక్షణ రంగ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పెద్ద ఎత్తున ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్న మన దేశం ఇక ఆయుధాల ఎగుమతుల్లోనూ సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆయుధ ఎగుమతుల్లోనూ మన దేశం ముందుండాలనే ప్రధాని మోదీ విధానాన్ని కొనసాగిస్తామని చెప్పారు. భారత ఆర్థికాభివృద్ధితోపాటు టాటా గ్రూపు ఎదుగుతోందన్నారు. టాటా, బోయింగ్ కంపెనీలను ఆమె అభినందించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తయారీ రంగానికి ప్రోత్సాహం లభించిందన్నారు.

రక్షణ పరిశ్రమల కారిడార్ ఇవ్వాలి: కేటీఆర్

తెలంగాణలో రక్షణ పరిశ్రమల కారిడార్‌ను ఏర్పాటు చేసే విషయం పరిశీలించాలని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. "హైదరాబాద్‌లో ఇప్పటికే బోయింగ్, లాక్‌హీడ్, ఎయిర్ బస్, సిరోస్కి వంటి అనేక అంతర్జాతీయ దిగ్గజ వైమానిక కంపెనీలు కొలువుదీరాయి. రక్షణ రంగానికి చెందిన పది ఆర్ అండ్ డీ సంస్థలు ఇక్కడే ఉన్నాయి. వీటన్నిటికీ అవసరమైన విడి భాగాలను స్థానికంగా 1,000 ఎంఎస్‌ఎంఈలు సరఫరా చేస్తున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్‌లో రక్షణ పరిశ్రమల కారిడార్ ఏర్పాటు చేసే విషయం పరిశీలించాలని రక్షణ మంత్రికి విజ్ఞప్తి చేస్తున్నా" అని అన్నారు. హైదరాబాద్‌లో పూర్తిస్థాయిలో విమానాలు తయారయ్యే రోజు కూడా త్వరలోనే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఇప్పటికే వైమానిక పరిశ్రమల కోసం మూడు ప్రత్యేక ఆర్థిక మండళ్లు ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. టాటా గ్రూపు గౌరవ చైర్మన్ రతన్ టాటా, భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్ పాల్గొన్నారు.

భవిష్యత్తు ఆశాజనకం

- బోయింగ్ సీఈవో లీనె కారెట్

భారత్‌లో ఉత్పత్తి రంగం అత్యంత ఆకర్షణీయంగా కనిపిస్తోందని బోయింగ్ కంపెనీ డిఫెన్స్, స్పేస్ అండ్ సెక్యూరిటీ విభాగం ప్రెసిడెంట్, సీఈవో లీనె కారెట్ అన్నారు. "గత రెండేళ్లలో భారత్ నుంచి విడి భాగాలు దిగుమతి చేసుకోవడం నాలుగింతలు పెరిగింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి ఏటా 100 కోట్ల డాలర్లకుపైగా విలువ చేసే విడి భాగాలు దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచ అవసరాలకు తగ్గట్టు భారత్‌లోనే అత్యాధునిక వైమానిక పరికరాల తయారీకి శ్రీకారం చుట్టాం. ఇందుకు స్థానికంగా ప్రతిభ, శిక్షణ, నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాం. టీబీఏఎల్ ఏర్పాటుతో మా అంతర్జాతీయ కస్టమర్లకు అపాచీ హెలికాప్టర్లను మరింత వేగంగా సరఫరా చేసేందుకు వీలవుతుంది" అని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం పదేళ్ల క్రితమే రతన్ టాటా తమను సంప్రదించారని, ఆ కల నేటికి నెరవేరిందని తెలిపారు. ఈ యూనిట్‌లో సైనిక అవసరాలకు ఉపయోగించే ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్ల అన్ని విడి భాగాలు తయారు చేస్తారని తెలిపారు.

తెలంగాణ యువకులకు తెలుగులో అభినందనలు

ఆదిభట్ల సెజ్‌లో బోయింగ్-టాటా ఏరోస్పేస్ యూనిట్‌కు శంకుస్థాపన చేసి ఏడాదిన్నర అయింది. ఇంత తక్కువ సమయంలోనే అత్యాధునిక అపాచీ హెలికాప్టర్ల విడి భాగాలను ఏమాత్రం లోపాలు లేకుండా (జీరో డిఫెక్ట్) తయారు చేశారు. తయారు చేసిన వాటిని అమెరికాకు పంపించగా అక్కడి నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. విడి భాగాలను అతి తక్కువ కాలంలో లోపాల్లేకుండా ఉత్పత్తి చేయడాన్ని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. కొద్దిపాటి శిక్షణతో ఇంత త్వరగా నైపుణ్యాలను వంట పట్టించుకున్నందుకు తెలంగాణ యువకుల్ని ఆమె తెలుగులో మాట్లాడి మరీ అభినందించారు. "ఇక్కడ ఎలాంటి ఆటోమేషన్ లేదు. ఉత్పత్తికి రోబోలనూ ఉపయోగించడం లేదు. కొద్దిపాటి శిక్షణతోనే తెలంగాణ యువకులు ఈ స్థాయికి చేరారు. అందుకు వారిని అభినందిస్తున్నా" అని అన్నారు. దాంతో, సమావేశ మందిరం కరతాళ ధ్వనులతో ప్రతిధ్వనించింది.

నేటి నుంచి థియేటర్లు బంద్

(మొదటి పేజీ తరువాయి)

మూతపడనుండగా.. కొన్ని మల్టీప్లెక్స్‌ల మేనేజర్లు మాత్రం తమకు ఇంకా ఎలాంటి సమాచారం అందలేదని చెబుతున్నారు. దీంతో మల్టీప్లెక్స్‌ల్లో సినిమాల ప్రదర్శనపై సందిగ్ధం నెలకొంది. కేపీహెచ్‌బీ సినీపొలిస్ మల్టీప్లెక్స్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ థియేటర్ల బంద్‌పై జేఏసీ నుంచి సమాచారం అందలేదని గురువారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మరికొన్ని మల్టీప్లెక్స్‌ల మేనేజర్లు కూడా ఇదే మాట చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మల్టీప్లెక్స్‌లో చిత్ర ప్రదర్శన ఉంటుందా? లేదా? అనే విషయంపై శుక్రవారం ఉదయం స్పష్టత రానుంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ఇతర ప్రాంతాల్లోని థియేటర్ల మేనేజర్లు మాత్రం జేఏసీ నిర్ణయం మేరకు సినిమా ప్రదర్శనలు నిలిపివేస్తామని స్పష్టం చేశారు. థియేటర్లు బంద్ అవుతుండటంతో హోలీ సెలవు దినమైన గురువారం అన్నిచోట్లా హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయి. వారాంతం ముందు థియేటర్లు మూసివేస్తుండడంతో సినీప్రియులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే చాలామంది వీకెండ్ సరదాగా గడిపేందుకు ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్నారు. బంద్ దృష్ట్యా వారికి డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని మేనేజర్లు చెబుతున్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు, నిర్మాతల మండలి జేఏసీ మధ్య జరుగుతున్న చర్చలు ఒకటి, రెండు రోజుల్లో సఫలీకృతమవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో చాలా థియేటర్ల మేనేజర్లు సిబ్బందిని విధులకు హాజరు కావాలని ఆదేశించారు. చిత్ర ప్రదర్శన ఉన్నా లేకున్నా విధులకు హాజరైతేనే వేతనాలు చెల్లిస్తామని పేర్కొంటున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 25 థియేటర్లను శుక్రవారం నుంచి మూసివేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న 15 థియేటర్లు, ఒక మల్టీప్లెక్స్ బంద్ కానున్నాయి. బంద్ ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియదని, థియేటర్లపై ఆధారపడి జీవిస్తున్న తాము ఉపాధి కోల్పోతామని చిరు, తినుబండరాల వ్యాపారులు, పనివారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 8 థియేటర్లలోనూ ప్రదర్శనలను నిలిపివేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 36 థియేటర్లు మూతపడనున్నాయి. వాటిలో పనిచేసే సుమారు 500 మంది కార్మికులపై ప్రభావం పడనుంది.

నష్టమే అయినా తప్పదు

థియేటర్లు మూసివేయడం భారమే. నిర్వహణ ఇప్పటికే కష్టంగా మారింది. నిర్మాతల మండలి జేఏసీ నిర్ణయాన్ని గౌరవించి బంద్ పాటిస్తున్నాం. ఒక్క షోకు రూ.1.24 లక్షల లెక్కన నాలుగు షోలకు రూ.4.96 లక్షలు వస్తాయి. బంద్‌తో ఆదాయం కోల్పోతాం. ఆర్థికంగా నష్టమే అయినా నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల ఇబ్బందులు కూడా మావిగానే భావిస్తున్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ 35ఎంఎం థియేటర్ మేనేజర్

ఇదీ యాజమాన్యాల వాదన

మారిన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రస్తుతం శాటిలైట్ ద్వారా సినిమాలు ప్రదర్శిస్తున్నారు. క్యూబ్, యుఎఫ్ఓ, ఏఎంఎఫ్ శాటిలైట్ కంపెనీలు రాష్ట్రంలో సినిమాలను ప్రదర్శించే హక్కులు పొందాయి. థియేటర్ల యాజమాన్యాల నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్లు తీసుకుని ప్రత్యేక ప్రొజెక్టర్లు ఏర్పాటు చేశారు. సినిమా విడుదలైన మొదటి వారంలో రూ.16 వేల నుంచి రూ.18 వేలు, రెండో వారంలో రూ.14 వేల నుంచి రూ.15 వేల చొప్పున సినిమాలు ప్రదర్శన చేసినందుకు వసూలు చేస్తున్నారు. మొదటి వారంలో ఉన్న కలెక్షన్ ఆ తర్వాత రోజుల్లో తగ్గుతుంది. దీని వల్ల నష్టాలు చవిచూస్తున్నామని, సినిమా విడుదలైన మొదటి వారం నుంచి ప్రతి వారం 25 శాతం చొప్పున చార్జీలు తగ్గించాలని థియేటర్ల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే పలు దఫాలు చర్చలు జరిగాయి. 9 శాతం చార్జీలు మాత్రమే తగ్గిస్తామని శాటిలైట్ ప్రసార హక్కులు పొందిన కంపెనీలు భీష్మించాయి. దీంతో థియేటర్ల యాజమాన్యాలు బంద్‌కు దిగాయి

బీజేపీలోనే క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు

- బంగారు లక్ష్మణ్ స్ఫూర్తిదాయకమైన వ్యక్తి
- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ నిలిచిందంటే అది క్రమశిక్షణ కలిగిన కార్యకర్తల వల్లే సాధ్యమైందని కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్ నాలుగో వర్ధంతి సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బంగారు లక్ష్మణ్ స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని ఆమె కొనియాడారు. దళిత సామాజిక వర్గం నుంచి వచ్చి జాతీయ స్థాయికి లక్ష్మణ్ ఎదిగారని, ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేఎల్పీ నేత కిషన్‌రెడ్డి మాట్లాడారు.

హుందాగా వ్యవహరించండి

ముఖ్యమంత్రి పదవిలో ఉన్నంత కాలం హుందాతనంతో వ్యవహరించాలని సీఎం కేసీఆర్‌కు బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ హితవు పలికారు. ఈ మేరకు ఆయన గురువారం, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. ప్రధాని మోదీని విమర్శించి ఆయన ఇమేజీని తగ్గించలేరని పేర్కొన్నారు.



బంగారు లక్ష్మణ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నిర్మలాసీతారామన్

ఉపాధి హామీలో 'హ్యాక్' కలకలం

- అప్రమత్తమైన శాఖలు.. ఆ వెబ్‌సైట్ వినియోగంలో లేదని వివరణ

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉపాధి హామీ చెల్లింపుల వెబ్‌సైట్ హ్యాక్ అయిందన్న వార్త ప్రభుత్వ శాఖల్లో కలకలం సృష్టించింది. తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్ (tspost.aponline.gov.in)ను హ్యాక్ చేశానంటూ ఫ్రెంచ్ ఇంటర్నెట్ రక్షణ పరిశోధకుడు ఇలియాట్ అండర్సన్ గత నెల 25న తన ట్వీటర్‌లో పోస్ట్ చేశాడు. దీంతో రాష్ట్ర ఐటీ, ఉపాధి హామీ శాఖలు అప్రమత్తమయ్యాయి. హ్యాక్ అయిన వెబ్‌సైట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వినియోగించామని, ప్రస్తుతం వినియోగంలో లేదని అధికారులు తెలిపారు. వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురైనప్పటికీ సమాచారమంతా భద్రంగా ఉందని వెల్లడించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఉపాధిహామీ వెబ్‌సైట్(ఛట్ఛజ్చ.ఛ్ఛజీ.జౌఠి.జీ)లో సురక్షిత చర్యలు తీసుకున్నామని, హ్యాకింగ్‌కు అవకాశమే లేదని స్పష్టం చేశారు.

బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బాలికల వసతి గృహాలను ఇకపై సీసీ కెమెరాల నిఘా మధ్యన కొనసాగించాలని సాంఘిక సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈమేరకు పోస్టుమెట్రిక్, ప్రీమెట్రిక్ బాలికల హాస్టళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రీమెట్రిక్ హాస్టల్స్ (9, 10 తరగతి) 168 ఉండగా, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలు 42 వరకు ఉన్నాయి. వీటన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. అయితే బాయ్స్ హాస్టల్స్‌లోనూ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఎస్సీ సంక్షేమ, అభివృద్ధి శాఖ డైరెక్టర్ కరుణాకర్ తెలిపారు.

వార్షిక లక్ష్యాల దిశగా సింగరేణి

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వార్షిక లక్ష్యాల్లో భాగంగా.. బొగ్గు ఉత్పత్తి పెంపు, రవాణాలో ఇక్కట్లను అధిగమించడం, పరిమితికి మించిన భారాన్ని (ఓబీ) తొలగించే దిశగా సింగరేణి అడుగులు వేస్తోంది. 11 నెలలకుగాను బొగ్గు రవాణాలో 7.2 శాతం, ఓవర్ బర్డెన్ తొలగింపులో 25 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం 582 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసింది. 546 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది.

భూపాలపల్లి గనులపై సింగరేణికి ఎన్జీటీ నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌లో పర్యావరణ ఉల్లంఘనలు జరగడంపై సమాధానం చెప్పాలంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, సింగరేణి, కేంద్ర పర్యావరణ శాఖలకు జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) నోటీసులు జారీ చేసింది. కాలుష్య రహిత చర్యలు తీసుకోకపోవడంతో అక్కడి ప్రజలు ఊపిరితిత్తుల సమస్యతో జబ్బు పడటంతోపాటు చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారంటూ నాగవెల్లి రాజలింగమూర్తి అనే బాధితుడు ఎన్జీటీలో వ్యాజ్యం దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ జావేద్ రహీం నేతృత్వంలోని నలుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పర్యావరణ ఉల్లంఘనలపై సమాధానం చెప్పాలని సింగరేణి, కాలుష్య నియంత్రణ మండళ్లు, తెలంగాణ సీఎస్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

అమరుల కుటుంబానికి ఒక సీటు ఇవ్వండి : రేవంత్

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు ఉన్న మూడు రాజ్యసభ సీట్లలో ఒకదాన్ని అమరుల కుటుంబానికి కేటాయించాలని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీఎల్పీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 63 మంది ఎమ్మెల్యేల బలమున్న టీఆర్ఎస్‌కు వాస్తవంగా రెండు రాజ్యసభ సీట్లు మాత్రమే దక్కుతాయన్నారు. మరో స్థానంలో అన్ని పార్టీల తరపున ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించాలని కోరారు. ఫిరాయింపుల బలంతో మూడో సీటునూ కైవసం చేసుకునేందుకు టీఆర్ఎస్ ప్రయత్నిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే విషయమై తాను పార్టీ పెద్దలతో మాట్లాడుతానని చెప్పారు.

చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం : రవీంద్ర నాయక్

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి కేసీఆర్ గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మాజీ ఎంపీ, టీపీసీసీ అధికార ప్రతినిధి రవీంద్ర నాయక్ విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఆదిలాబాద్ సభలో మాట్లాడిన కేసీఆర్.. ఆదిలాబాద్‌ను కశ్మీర్‌లా చేస్తానని చెప్పారని, ఇప్పటికే గిరిజనుల మధ్య చిచ్చు పెట్టి అల్లర్లతో అది కశ్మీర్‌లా మారిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు నాన్చివేత ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు.

మహిళా లెక్చరర్‌పై వైస్ ప్రిన్సిపల్ దాడి

- విద్యార్థుల సమక్షంలోనే ఘటన
- వైస్ ప్రిన్సిపల్‌ను చితకబాదిన పిల్లలు
- భువనగిరి ఆశ్రమ పాఠశాలలో ఉద్రిక్తత
- ఇద్దరినీ సస్పెండ్ చేస్తున్నాం: ప్రవీణ్ కుమార్

భువనగిరిటౌన్, హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అది ఓ సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల! ఆ ఆవరణలో అరుణ అనే తెలుగు లెక్చరర్ పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. అంతలో కొందరు ఇంటర్ విద్యార్థులు అక్కడకు వచ్చి పాఠాలపై ఆమెను సందేహాలు అడుగుతున్నారు. ఆమె నివృత్తి చేస్తున్నారు. ఆ సమయంలో ఆ వైపుగా వచ్చిన వైస్ ప్రిన్సిపల్ జనార్దన్‌కు ఈ పరిణామం రుచించలేదు. తీవ్ర ఆగ్రహంతో అరుణపై బూతులు అందుకున్నారు. అవాక్కయిన ఆమె.. ఎందుకు తిడుతున్నారంటూ ప్రశ్నించేలోపే అరుణపై దాడికి పాల్పడ్డారు. ఆమె చెంపపై ఎడాపెడా పలుమార్లు కొట్టారు! అనూహ్య పరిణామంతో అరుణ బీతిల్లిపోయారు! యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనను ప్రత్యక్షంగా తిలకించిన విద్యార్థులకు వైస్‌ప్రిన్సిపల్ తీరు ఆగ్రహం తెప్పించింది. దీంతో జనార్దన్‌పై వారంతా ముకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. బాధితురాలు, విద్యార్థుల సమాచారం మేరకు.. ఘటన విషయం తెలిసి ప్రిన్సిపల్ శ్రీరాం శ్రీనివాస్ అక్కడికి వచ్చేలోపే జనార్దన్ పాఠశాలలోకి పరుగులు తీసి రీజనల్ కోఆర్డినేటర్ శత్రునాయక్‌కు ఫోన్‌చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చి విద్యార్థులకు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ ఉదంతంపై ప్రిన్సిపల్.. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఎస్ఎంఎస్ రూపంలో నివేదిక పంపారు.



చెంపకు తగిలిన గాయాన్ని చూపుతున్న లెక్చరర్ అరుణ

తొలుత అరుణ.. తర్వాత వైస్‌ప్రిన్సిపల్ సస్పెన్షన్

ప్రిన్సిపల్ నివేదిక మేరకు లెక్చరర్ అరుణను సస్పెండ్ చేస్తూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, ఉత్తర్వులను తీసుకునేందుకు అరుణ నిరాకరించారు. దీంతో 'ఈ రగడ' బయటకు పొక్కింది. ఈ నేపథ్యంలో గురువారం లెక్చరర్ అరుణతో పాటు వైస్ ప్రిన్సిపల్ జనార్దన్‌ను కూడా సస్పెండ్ చేసినట్టు ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఇలాంటి గొడవలు జరగడం బాధాకరమన్నారు.

విద్యార్థుల పక్షాన ఉండడమే తప్పా?

"గత నెల 17న బదిలీపై భువనగిరికి వచ్చాను. పాఠశాల నిర్వహణ సక్రమంగా లేదు. దీనిని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాను. అప్పటి నుంచి మిగతా సిబ్బంది నాపై కక్షకట్టారు. విద్యార్థుల పక్షాన నిలబడడమే నా తప్పా?"

-అరుణ, బాధిత లెక్చరర్

ఆమె ముఖానికి చేతులు తాకాయంతే!

పరీక్షలు సమీపిస్తుండటంతో జీవశాస్త్రం పాఠాలు చదువుకోవాలని ఇంటర్ విద్యార్థులకు సూచించాను. కానీ లెక్చరర్ అరుణ.. వారిని చదువుకోనివ్వడం లేదన్న ఆగ్రహంతో నెట్టివేసే ప్రయత్నంలో ఆమె ముఖానికి నా చేతులు తాకాయి"

-జనార్దన్, వైస్ ప్రిన్సిపల్



నాకొచ్చే పెట్టుబడి సాయం రైతులకే

- మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం అందించే పెట్టుబడిసాయాన్ని పేద రైతుల సంక్షేమానికి విరాళంగా ఇవ్వనున్నట్లు మంత్రి మహేందర్‌రెడ్డి ప్రకటించారు. తన, భార్యాపిల్లల పేరిట వంద ఎకరాల భూమి ఉందని.. వాటిపై వచ్చే రూ.4లక్షల పెట్టుబడి సాయాన్ని పేద రైతుల సంక్షేమం కోసం రైతు సమితి కార్పొరేషన్‌కు అందించనున్నట్లు తెలిపారు. తాండూరులోని ఆయన నివాసంలో గురువారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. పెట్టుబడిసాయంపై ఈ నెల 5నుంచి మండలాలవారీగా రైతు సమన్వయ కమిటీలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాశ్చాత్య విధానం భారత్‌కు పనికి రాదు

- ఆర్ఎస్ఎస్ నేత దత్తాత్రేయ హొసబళే



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హొసబళే, తదితరులు

మాదాపూర్/హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ మేధోపరమైన స్వాతంత్ర్యం ఇంకా రాలేదని, ఈ పరిస్థితిని మార్చవలసిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహసర్ కార్యవాహ్ (జాయింట్ సెక్రటరీ)దత్తాత్రేయ హొసబళే అన్నారు. గురువారం మాదాపూర్‌లో జరిగిన 'శివాజీ-స్వరాజ్యం నుంచి సురాజ్యం దాకా' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా అసంపూర్ణమైన, అసమగ్రమైన విదేశీ మూస ఆలోచనా ధోరణినే ఈదేశంపై రుద్దే ప్రయత్నం కొనసాగుతోందని ఆయన అన్నారు. పాశ్చాత్య ఆలోచనలు భారత దేశపు సమస్యలకు పరిష్కారం చూపలేవని ఆయన పేర్కొన్నారు. సుపరిపాలన ప్రజాకేంద్రితమై ఉండాలని, ప్రజాసంక్షేమమే ప్రాతిపదికగా ఉండాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో వాటి అమలులో ప్రజలను భూమిక చేయాలని అన్నారు. శివాజీ తన రాజ్యంలోని పరిస్థితులను గురించి సాధారణ మహిళలను అడిగి తెలుసుకునే వారని చెప్పారు. శాంతి పర్వంలోని భీష్మ-యుధిష్ఠిర సంవాదం, చాణక్యనీతి వంటి గ్రంథాలు భారతీయ ఆలోచన విధానంలో పరిపాలన, ప్రజా సంక్షేమం గురించి విస్తృతంగా చర్చించాయన్నారు. నేటి పాలకులు వీటి నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. మాజీ కేంద్ర మంత్రి అనిల్ మాధవ్ భవే హిందీలో రాసిన శివాజీ- స్వరాజ్ సే సురాజ్ తక్ పుస్తకాన్ని 'శివాజీ - స్వరాజ్యం నుంచి సురాజ్యందాకా' పేరిట సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్‌రావు తెలుగులోకి అనువదించారు. శ్రీశైలం శివాజీ స్ఫూర్తి కేంద్రం, సోషల్ కాజ్, చేతన సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుల్లారెడ్డి విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.సుబ్బారెడ్డి, సోషల్ కాజ్ అధ్యక్షులు సోమరాజు సుశీల ప్రసంగించారు.



బాబ్లీ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

ఆర్మూర్/మెండోర, మార్చి 1 : మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి గురువారం 0.048 టీఎంసీల నీటిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు 0.6 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉండగా, ప్రాజెక్టులో 0.048 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో ఆ మొత్తం నీటిని గోదావరిలోకి వదిలారు. సీడబ్ల్యూసీ కమిషనర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఉదయం 10.45 గంటలకు బాబ్లీ గేట్లు ఎత్తగా, సాయంత్రం 4 గంటలకు ప్రాజెక్టు ఖాళీ అయింది. మార్చి ఒకటిన నీరు విడుదల చేయాల్సి ఉన్నందున ప్రాజెక్టు అధికారులు ఫిబ్రవరి 20న బాబ్లీ అధికారులకు లేఖ రాశారు. అతి తక్కువ మొత్తంలో విడుదలైన నీరు శ్రీరాంసాగర్ వరకు చేరుతుందో లేదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హోలీ వేడుకల్లో విషాదం

- నీట మునిగి ఐదుగురి మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): హోలీ వేడుకల్లో విషాదం నెలకొంది. తోటి స్నేహితులతో కలిసి ఆనందంగా హోలీ జరుపుకున్న ఐదుగురు యువకులు స్నానం కోసం వెళ్లి, నీట మునిగి మృత్యువాత పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం కరిశలబోడు తండాకు చెందిన గుగులోతు విజయ్(22), ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన సాయికృష్ణ(18) హోలీ తర్వాత స్నానం కోసం బావిలోకి దిగి నీట మునిగారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం గంగారం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రసాద్(15) తోటి విద్యార్థులతో హోలీ ఆడుతూ ప్రమాదవశాత్తు ధోబీఘాట్‌పై నుంచి కాలుజారి దిమ్మెపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయమవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మెదక్ జిల్లా పుల్కల్ మండలం కోర్పోలు గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థులు చల్లా సాయికిరణ్(15), సాయికుమార్(15) స్నేహితులతో కలిసి హోలీ ఆడిన తర్వాత మంజీర నదిలో స్నానం చేస్తుండగా నీట మునిగి గల్లంతయ్యారు. స్థానికులు మృతదేహాలను వెలికి తీశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



విజయ్



సాయికృష్ణ



సాయికిరణ్, సాయికుమార్(ఫైల్)

శుభలేఖలు రాసిన వేళ నుంచి... కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోయే అందమైన ఆ ఆనంద క్షణాలకు దగ్గరయ్యే కొద్దీ మదిలో మనోరాగాలు పలుకుతుంటాయి. పెళ్లి వేదిక మీద పెళ్లికూతురు ప్రత్యేకంగా, అందంగా కనిపించాలి అనుకోవడం సహజం. అందుకే జీవితంలో ఎంతో ప్రత్యేకమైన ఆ రోజు కోసం పట్టు చీరలను ఏరికోరి ఎంచుకుంటారు. వాటిలో కంజీవరం మరింత ప్రత్యేకం!

పిల్ల కల పెళ్లి కళ

సొగసు



కాంట్రాస్ట్ బోర్డర్ ప్యూర్ సిల్క్, ప్యూర్ జరీ చీర. చిలకాకు పచ్చ చీరకు గులాబీ రంగు అంచు ఇచ్చారు. చీర మీద బుటా డిజైన్ ఇచ్చి, ఏడంగుళాల అంచు ఇచ్చారు. ట్రెండీగా కనిపించే ఈ చీరను పెళ్లికే కాకుండా ఇతర వేడుకలకు కూడా కట్టుకోవచ్చు.
ధర: రూ.26,500

బాలీవుడ్ నటి రేఖ కట్టుకునే స్టయిల్ కంజీవరం చీర ఇది. చీరంతటా గోల్డ్ జరీ వాడారు. నెమలి, ఏనుగుల డిజైన్లు కాంట్రాస్ట్ రంగులో చీరంతా నేశారు. అంచుకు మాత్రం గులాబీ, బంగారు రంగులు వాడి నెమలి డిజైన్ ఇచ్చారు. పింకిష్ గోల్డ్ జరీ బ్లౌజ్ వల్ల ఇంకాస్త స్పెషల్ లుక్ వస్తుంది చీరకు. పెళ్లికోసమే డిజైన్ చేసినప్పటికీ... రిసెప్షన్ వేడుకలకు కూడా కట్టుకోవచ్చు.
ధర: రూ.49,500

పసుపు రంగు సిల్క్ చీర. ప్యూర్ జరీతో నేసారు. మ్యాచింగ్ బ్లౌజ్ కలుపుకుని వచ్చిన ఈ చీర ఎంతందంగా ఉందో కదా!
ధర: రూ.28,500

ప్యూర్ సిల్క్ చీర అంతటా జరీ వస్తుంది. అలాగే అంచులు, పల్లులో కూడా వస్తుంది. చీర మొత్తం టిష్యూ జరీ వర్క్ చేయడం వల్ల చూడగానే బంగారు రంగు అనిపిస్తుంది.
ధర: రూ.17,000

చేతితో నేసే ఈ సిల్క్ చీరలను వాషింగ్ మెషిన్‌లో ఉతక్కూడదు. డ్రై క్లీనింగ్ మాత్రమే చేయాలి. నీడలో మాత్రమే ఆరేయాలి. బాక్స్‌ల్లో లేదా పాలిథీన్ కవర్లలో దాచి పెట్టొద్దు.

సౌజన్యం: http://kanjivaramsilks.com



అఖిలం... మధురం

విజయేంద్ర సరస్వతి స్వామి గురుస్మరణ

స్వామి జయేంద్ర సరస్వతిపై ప్రత్యేకవ్యాసం

'నవ్య' లోపలి పేజీలో...

సమ్మర్ జ్యూస్

లెమన్ స్క్వాష్

కావలసినవి:
నిమ్మరసం, మంచి నీళ్లు - ఒక్కో కప్పు చొప్పున, పంచదార - అర కిలో, కుంకుమపువ్వు - అర టీస్పూన్ (ఇష్టపడితేనే), ఆకుపచ్చ యాలక్కాయల పొడి - ఒక టీస్పూన్.



తయారీ:
- సాస్ పాన్‌లో కప్పు నీళ్లు పోసి, పంచదార వేయాలి. పాన్‌ను సన్నటి మంట మీద పెట్టి మధ్యమధ్యలో గరిటెతో కలుపుతూ పంచదార మిశ్రమాన్ని వేడిచేయాలి.
- పంచదార పూర్తిగా కరిగాక మిశ్రమం పట్టుకుంటే చేతి వేళ్లకు అతుక్కుంటుంది. అప్పుడు స్టవ్ ఆపేయాలి.
- వేడివేడి పంచదార నీళ్లను ఒక గిన్నెకు పలుచని బట్ట కట్టి వడకట్టాలి. గోరు వెచ్చగా లేదా గది ఉష్ణోగ్రతకు చేరుకునే వరకు అలానే ఉంచాలి.
- తరువాత అందులో నిమ్మరసాన్ని కలిపి, యాలక్కాయల పొడి, కుంకుమపువ్వు వేసి బాగా కలియబెడితే లెమన్ స్క్వాష్ రెడీ.
- దీన్ని శుభ్రమైన గాజు సీసాలో పోసి గట్టిగా మూత బిగించి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి.
- ఎప్పుడు లెమన్ స్క్వాష్ తాగాలనిపిస్తే అప్పుడు తయారుచేసుకుని తాగేయొచ్చు. అదెలాగంటే నాలుగు టేబుల్ స్పూన్ల లెమన్ స్క్వాష్‌ను ఒక గ్లాసులో తీసుకుని, నీళ్లు పోసి, ఇందులో ఐస్ క్యూబ్‌లు కలుపుకోవచ్చు లేదా చల్లటి నీళ్లు కలిపైనా తాగేయొచ్చు.

పేరెంటచ్

వేగంగా చదవడం అంటే..?

అప్పటికే ఎన్నోసార్లు చదివిన పుస్తకాన్ని ప్రతిసారీ మొత్తంగా చదవాలంటే విసుగే అనిపిస్తుంది. అలా అని మొత్తంగా వదిలేస్తే మరిచిపోయే ప్రమాదమూ ఉంది. అయితే ఏం చేయాలి? చదవడాన్ని దశలు దశలుగా విభజించుకోవడం ఒక సరైన విధానం. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ అధ్యయనం ఒక దశ నుంచి మరో దశకు మారుతూ ఉండాలి. మొదటి దశలో ఒకటి రెండు సార్లు అన్ని అధ్యాయాలు వరుసగా చదివేయడం అనివార్యమే అవుతుంది. అలా అయితేనే విషయం సాకల్యంగా అర్థం కాదు. అలాగని ఆ తర్వాత కూడా ప్రతిసారీ మొత్తంగా చదివే పని పెట్టుకోకూడదు. ముందు జాగ్రత్తగా మొత్తంగా చదువుతున్నప్పుడే ముఖ్యమైన వాక్యాల్ని అండర్‌లైన్ చేయడంగానీ, లేదా ఆ వాక్యాల పక్కన చుక్క పెట్టడం గానీ చేయాలి. ఎందుకంటే ఆ తర్వాత చదువుతున్నప్పుడు అండర్‌లైన్ చేసిన వాక్యాల్ని మాత్రమే చదివేసినా మొత్తం సారం మననంలోకి వస్తుంది. ఆ తర్వాత అండర్‌లైన్ చేసిన వాక్యాలతో కూడా పనిలేకుండా, కేవలం ఉపశీర్షికలు (సబ్ హెడింగ్స్) చదివినా మొత్తం విషయం గుర్తుకొస్తుంది. అయితే, ప్రతి ముఖ్య అంశానికి సంబంధించిన ఉపశీర్షికలన్నీ పుస్తకంలోనే ఉంటే సరి. ఒకవేళ అవి చాలా తక్కువగానే ఉంటే, స్వయంగా కొన్ని సబ్‌హెడింగ్స్ తయారు చేసుకోవాలి. పరీక్షలు ఒకటి రెండు రోజుల్లో ఉన్నప్పుడు కేవలం ఉపశీర్షికలను చూసుకున్నా సరిపోతుంది. అలాకాకుండా, చివరి నిమిషంలో ప్రతి అధ్యాయాన్ని చదవాలంటే కుదరదు. దానివల్ల పూర్తిగా చదవలేకపోయానే అనే అసంతృప్తి ఉంటుంది. అది క్రమంగా తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తుంది. ఈ ఆందోళన వల్ల పిల్లలు అంతకు ముందు బాగా చదివిన విషయాల్ని కూడా మరిచిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఉప శీర్షికలన్నింటినీ ఒక సంక్షిప్త పట్టికగా సిద్ధం చేసుకుంటే, పరీక్షల్లో పిల్లలు అనుకున్న స్కోర్ తప్పక సాధిస్తారు.



కౌన్సెలింగ్ కార్నర్

స్నేహం మానేయాలా?

నేను ఒక అమ్మాయితో స్నేహం చేస్తున్నా. అంటే చాటింగ్ చేస్తూ ఉంటా. అప్పుడప్పుడు ఫోన్లో కూడా మాట్లాడతా. ఈ మధ్య తెలిసినవాళ్ళు ఆ అమ్మాయి మంచిది కాదన్నారు. దాంతో కొన్ని రోజులు మాట్లాడలేదు. నా ఫ్రెండ్‌తో చెబితే, అవన్నీ నమ్మవద్దు అన్నాడు. మళ్ళీ మాట్లాడటం స్టార్ట్‌చేశా. కానీ ఈ మధ్య ఆ అమ్మాయిని చూసి మంచిది కాదంటున్నాడు నా స్నేహితుడు. ఆమెతో స్నేహం మానేయాలని ఉంది. కానీ ఆమె ఎందుకని అడిగితే, ఏమని చెప్పాలో తెలియడం లేదు. మీరే సలహా చెప్పాలి.
- నాని




నీ లేఖను బట్టి చూస్తే నువ్వు ఇంకా టీనేజ్ దాటలేదనిపిస్తోంది. ఈ వయసులో ఇంతకన్నా గొప్పగా ఆలోచించలేరు కాబోలు. లేకపోతే ఏమిటీ రాతలు? చదువు, ఫ్రెండ్స్... అన్నీ ఓకే. అమ్మాయిలతో ఫ్రెండ్ షిప్ కూడా తప్పుకాదు. కానీ ఆ అమ్మాయి గురించి ఎవరైనా ఏదన్నా అనగానే స్పందిస్తున్నావు చూడు... అది కచ్చితంగా స్నేహం కాదు. అలాగే ఆ అమ్మాయి మంచిది కాదని చెప్పినవాడు నీ ఫ్రెండూ కాదు. నిజానికి ఈ పాటికి మంచి స్నేహితులు ఉండి ఉండాలి. అలా లేకుండా ఇలా తికమక పడుతున్నావంటే జాలి వేస్తోంది. నువ్వనే కాదు, చాలామంది ఇలానే ఉంటున్నారు. స్కూలు రోజుల్లోనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అంటూ వెర్రెత్తిపోవడం, అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించడం, సమస్యలు కొనితెచ్చుకోవడం మామూలైపోయింది. నిజానికి నీ సమస్య జవాబు ఇవ్వాల్సినంత పెద్దది కాకున్నా ఈ విధంగా నీలాంటి అబ్బాయిలు అమ్మాయిలు తెలుసుకుంటారని చెబుతున్నా. స్నేహం అనే మాటకి అర్థం తెలుసుకోండి. ఆ పదాన్ని కలుషితం చేయకండి. బాయ్ ఫ్రెండ్స్, గర్ల్‌ఫ్రెండ్స్ ఉంటేనే గొప్ప అనే ఆలోచన నుంచి బయటపడండి. చక్కటి చదువు, మంచి పుస్తకాల ద్వారా వచ్చే జ్ఞానం మంచి ఆలోచనలు కలిగిస్తాయి. ఈ వయసులో నీకు అది అవసరం. అలాగే ఆడ -మగ, బీద- గొప్ప తేడాలు లేనిది స్నేహం. దానికి వక్ర భాష్యాలు చెప్పొద్దు. ఎవరికైనా మంచి స్నేహితులు అవసరం. జీవితంలో చివరికంటా మిగిలేది వారే! అటువంటి మంచి స్నేహితులను సంపాదించుకోవడానికి ప్రయత్నించండి.

• **కె.శోభ,** ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com

మంచి మాట

మీ లాగే... మీ పిల్లలు!

మన భారతీయ సంస్కృతిలో గృహస్థాశ్రమానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆ ఆశ్రమ ధర్మం ప్రకారం దంపతులు ఒకే మాట, ఒకే బాటగా జీవితం సాగించాలి. వాళ్ళను బట్టే, వాళ్ళకు కలిగే పిల్లలూ తయారవుతారు. ఇవాళ్టి పిల్లలే రేపటి మన భవిష్యత్తు. మనకు అనాది కాలంగా వస్తున్న సనాతన ధర్మంలో ఎన్నో మంచి విషయాలున్నాయి. వాటిని ఈనాటి పిల్లలకు బోధిస్తూ, ధర్మం చెప్పడం ఎంతో అవసరమనేది అందుకే! అది ఎలాంటి ధర్మం అంటే- అహింస, సత్యం, అస్తేయం, శౌచం, ఇంద్రియ నిగ్రహం ఉన్న ధర్మం. ఈ అయిదూ అందరికీ అవసరం. అయితే, వాటిని ముందుగా తల్లితండ్రులు ఆచరించాలి. తల్లితండ్రుల ప్రవర్తనే పిల్లలకు గురువుగా మార్గదర్శనం చేస్తుంది. అలా పిల్లలకు తమ ప్రవర్తన ద్వారా నేర్పాలి. ఇలా జాతి అంతా ఐకమత్యంగా ధర్మమార్గంలో వెళితే, అప్పుడే దేశ సౌభాగ్యం.



జీవితాన్ని ధన్యం చేసుకోవడానికి ఇదే మార్గం. ధర్మం విషయంలో ఎప్పుడైనా, ఏదైనా సందేహం కలిగితే, ఉత్తముడైన గురువును ఆశ్రయించాలి. మామూలు మాటల్లో చెప్పాలంటే, పరోపకారమే పరమ ధర్మం. వృద్ధులను సేవించడం, తోటివారిని ప్రేమించడం, ఆపదలో... అవసరంలో... ఉన్నవారిని ఆదుకోవడం... ఇంతకు మించి వేరే ధర్మం ఏముంటుంది! ఇలాంటి ధర్మాచరణ వల్ల మనుషులు బాగుంటారు. మనుషులు బాగుంటే, జీవితం బాగుంటుంది. చుట్టుపక్కల అందరి జీవితం బాగుంటే, సమాజం బాగుంటుంది. అంటే మన దేశం బాగుంటుంది.

గురుస్మరణ

అఖిలం మధురం



'మహాస్వామి'కి యువ జయేంద్ర సరస్వతీ స్వామి గురువందనం

చిరస్మరణీయం

అదే నాకు భిక్షా వందనం!

కంచి పీఠం పెద్ద స్వామీజీ చంద్రశేఖరేంద్ర సరస్వతి ఇప్పటికి 64 ఏళ్ల క్రితం తన ఉత్తరాధికారిగా జయేంద్ర సరస్వతిని ఎంపిక చేశారు. అప్పటికి జయేంద్ర సరస్వతి (పూర్వాశ్రమ నామం సుబ్రమణియం మహదేవ అయ్యర్) వయసు 19 ఏళ్ళే. అది జరిగింది 1954లో. ఆ ఏడాది మార్చి 22వ తేదీన పెద్ద స్వామి తన శిష్యుడికి సన్యాస దీక్ష నిచ్చి, కంచి కామకోటి పీఠానికి తన ఉత్తరాధికారిగా, చిన్న స్వామీజీగా పీఠారోహణ జరిపించారు. కాంచీపురంలోని సర్వతీర్థ కుళం (ఆలయ కోనేరు) ఒడ్డున విశ్వేశ్వర ఆలయంలో ఉత్సవం చేశారు. సరిగ్గా ఆ ఉత్సవం జరిగి, 54 పూర్తి అవుతున్న సందర్భంగా 2003లో భక్తులందరూ కలసి 'పీఠారోహణ స్వర్ణజయంతి మహోత్సవం' ప్రారంభించారు. అయితే, వారందరూ బలవంతాన జయేంద్ర సరస్వతీ స్వామిని ఆ ఉత్సవానికి అంగీకరింపజేయాల్సి వచ్చింది. అప్పుడు ఆయన ఒకటే మాట అన్నారు... "నేను 50 ఏళ్ళుగా ఉన్నాను అనేది పెద్ద విషయం కాదు. ప్రజల కోసం ఏం చేశామన్నదే ముఖ్యం." జనం కోసం ఏదైనా చేయాలనే ఆయన తపన అలాంటిది. అలాగే, పీఠారోహణ జరిపి 60 ఏళ్ళయిన సందర్భంగా 2014లో భక్తులు వజ్ర మహోత్సవం జరపాలని అనుకున్నారు. అప్పుడు కూడా జయేంద్ర సరస్వతీ స్వామి ఒకటే షరతు పెట్టారు. "పేదసాదల ఆకలి తీర్చాలి. అవసరంలో ఉన్నవారి బాగోగులు చూడాలి. నిరక్షరాస్యులకు విద్యను అందించాలి. ఎవరికి వారు రోజూ తమ జీవనానికి కావాల్సిన సంపాదన ఆర్జించేలా, వారిని స్వశక్తులను చేయాలి. గౌరవప్రదమైన జీవితం గడిపేలా చూడాలి. మీ కృషి, ప్రయత్నాల ద్వారా అలా వారు తినే ప్రతి అన్నం ముద్దా మీరు నాకు సమర్పించే భిక్షా వందనం!'

గణపతి అంశ

మరో సందర్భంలో కొందరు తాము ప్రారంభించే నూతన కార్యక్రమానికి ఆశీస్సుల కోసం మహా స్వామి దగ్గరకు వచ్చారు. అప్పుడు ఆయన, 'పుదు పెరియవాళ్' వద్దకు వెళ్ళి, ఆశీస్సులు తీసుకోండని చెప్పారు. జయేంద్ర సరస్వతీ స్వామి... సాక్షాత్తూ గణపతి అంశ. అందుకని మీరు కనీసం ఓ రూపాయి అయినా ఆయనకు అందించి, ఆయన చేతుల మీదుగా ఆ రూపాయి తీసుకొని, ఆశీస్సులు పొందండి. అందువల్ల మీకు విఘ్నాలన్నీ తొలగిపోతాయి అని మహా స్వామి చెప్పారు.

దశావధాని

కంచి మహా స్వామీజీ తన శిష్యులైన జయేంద్ర సరస్వతీ స్వామి శక్తిసామర్థ్యాలను వివిధ సందర్భాల్లో మెచ్చుకున్నారు. ఓ సందర్భంలో ఓ భక్తుడితో మాట్లాడుతూ, "నేను నీతో మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా వస్తే, నీతో మాటలు ఆపేసి, వాళ్ళతో మాట్లాడడం మొదలుపెడతా. అలా చాలాసేపు మాట్లాడుతుండే సరికి, దర్శనం కోసం నిరీక్షించే భక్తుల క్యూ పెరిగిపోతుంది. కానీ, 'పుదు పెరియవాళ్' (కొత్త పెద్ద స్వామిజీ... అంటే జయేంద్ర సరస్వతి) మాత్రం ఏకకాలంలో పది వేర్వేరు పనులు చేయగల 'దశావధాని'. ఆయన ఒక పక్కన భక్తులకు ప్రసాదం ఇస్తూనే, మరోపక్క కొందరు భక్తులు వేసే ప్రశ్నలకు సమాధానం చెబుతారు. నేను అలా చేయలేకపోతున్నా" అన్నారు. అలా మహా స్వామి తన శిష్యుడి సామర్థ్యాలను మెచ్చుకున్నారు.

గురుప్రియులు

గురుభక్తికి ఉత్తమ నిదర్శనంగా నిలుస్తారు... బుధవారం నాడు సిద్ధి పొందిన కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామిజీ. గురువు గారైన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామీజీ (కంచి మహా స్వామి) పట్ల ఆయనకున్న భక్తి అంతా ఇంతా కాదు. పెద్ద స్వామీజీ ఎప్పుడూ... తాను 'ఇచ్ఛాశక్తి' అయితే, తన శిష్యుడైన జయేంద్ర సరస్వతీ స్వామీజీ 'క్రియాశక్తి' అని పేర్కొనేవారు. అచంచల శ్రద్ధాభక్తులున్న శిష్యుడిగా గురువు గారి ప్రతి ఇచ్ఛనూ జయేంద్ర సరస్వతీ స్వామి నెరవేర్చారు. అందుకే, పెద్ద స్వామీజీ అలా ప్రస్తావించేవారు. పీఠాధిపతి అయిన తరువాత జయేంద్ర సరస్వతి తమ గురువు గారి కోరిక మేరకు బ్రహ్మసూత్ర భాష్యంపై ఒక గ్రంథం రాశారు. దానికి 'గురుప్రియ' అని పేరు పెట్టారు. బ్రహ్మసూత్రాలకు శంకర భాష్యంలోని సత్యాలను వివరిస్తూ సాగిన ఆ వ్యాఖ్య అత్యద్భుతమైనదని మహా పండితులు సైతం ప్రశంసించారు. ఎంతో స్పష్టంగా, క్లుప్తంగా, సముచితంగా సాగే గ్రంథం అది. మననం (ధ్యానం)లో గడిపే విద్యార్థులకు ఆ గ్రంథం ఒక మంచి పునశ్చరణగా ఉపకరించే రచన.



ప్రతి ఒక్కరికీ, వారి జీవితంలో మేలిమలుపుగా నిలిచిపోయే, బాగా గుర్తుండిపోయే రోజు ఒకటి ఉంటుంది. నా జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అలాంటి రోజు 1983 మే 29వ తేదీ. ఆ రోజున మా గురుదేవులు శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామీజీ చేతుల మీదుగా నేను సన్యాస దీక్ష తీసుకున్నాను. దివ్యస్వరూపులైన నా గురువు నన్ను అక్కున చేర్చుకొని, పక్షి తన పిల్లను సాకినట్టు నన్ను సాకడం నా భాగ్యం! వెనక్కి తిరిగి చూసుకుంటే మా గురువుగారి సన్నిహిత సాహచర్యంలో నేను గడిపిన సంవత్సరాలు కనిపిస్తున్నాయి. అయస్కాంతం ఇనుప రజనును లాగినట్టు నన్ను ఆయన తన వైపు ఆకర్షించుకున్నారు. చాలా సన్నిహితంగా ఉంటూ నేను ఆయనలో



గమనించిన గొప్ప గుణాల గురించి వ్యక్తపరచడానికి నా దగ్గరున్న మాటలు సరిపోవు. "శ్రీమఠం' (కంచి కామకోటి పీఠం) కోసం మీ గురువు (జయేంద్ర సరస్వతి) చేసిన సేవలు మరెవరూ చెయ్యలేరు" అంటూ పరమాచార్య (శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి) నాతో అన్న మాటలు నాకు గుర్తొస్తున్నాయి. అవి ఇప్పటికీ నా చెవుల్లో మారుమోగుతున్నాయి. నా గురువు బహుముఖీనమైన వ్యక్తి. శ్రీకృష్ణుణ్ణి స్తుతిస్తూ వల్లభాచార్య రచించిన శ్లోకం ఒకటుంది.

అధరం మధురం వదనం మధురం
నయనం మధురం హసితం మధురం
హృదయం మధురం గమనం మధురం
మధురాధిపతే రఖిలం మధురం

ఇదే విధంగా మా గురువుగారి ప్రతి లక్షణాన్నీ నేను గణించినట్టయితే, ఆయన సర్వ సద్గుణాల రాశిగా దర్శనమిస్తారు. ఆయనను విశ్వంలో విశిష్ట వ్యక్తిగా చేసిన కొన్ని లక్షణాలను చెప్పాలనుకుంటున్నాను.



శ్రీ ఆది శంకర భగవత్పాదులు రెండువేల అయిదువందల సంవత్సరాల కిందట స్థాపించిన 'శ్రీ కంచి కామకోటి పీఠం' అధిపతిగా అత్యున్నతమైన పదవిని నిర్వహిస్తున్నప్పటికీ పూజ్య గురువులు చాలా నిరాడంబరంగా, ఎల్లప్పుడూ చిరునవ్వు తొణికిసలాడే మోముతో ఉండేవారు. ఎవరైనా ఆయనను చాలా సులభంగా కలుసుకోవచ్చు. తన భక్తుల జీవితాల్లో సమస్యలను ఆయన చాలా ఓపికగా వింటారు. పరిహారాలతో పరిష్కారాలు సూచిస్తారు. వారిని ఆశీర్వదిస్తారు. తనకు అసౌకర్యం కలిగినా లెక్క చెయ్యకుండా దర్శనం వారికి ప్రసాదిస్తారు. తన దగ్గరకు వచ్చినవారెవరినీ ఆశాభంగంతో తిరిగి వెళ్ళనివ్వరు. భగవంతుడికి అనేక నామాల్లో అచ్యుతుడనేది ఒకటి. 'తన దగ్గరకు చేరిన వారిని తన చేతుల నుంచీ విడవని వాడు' అని దాని అర్థం. సరిగ్గా మా గురుదేవులు అలాంటివారే!

మేనేజిమెంట్ స్టడీస్‌కు పాఠం

మా పూజ్య గురువులు నడిచే విజ్ఞాన సర్వస్వం. సూర్యుడి వెలుగు పడేవాటిలో ఆయనకు తెలియని విషయం ఏదీ లేదు. మంచి విషయాలను ఆయన గౌరవించేవారు. అవి ఎక్కడున్నా వాటిని గుర్తించేవారు, అభినందించేవారు. ఆయన నైపుణ్య నిర్వహణ (స్కిల్ మేనేజ్‌మెంట్) మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులకు ఒక పాఠ్య పుస్తకం లాంటిది. ఆయన కచ్చితమైన ప్రణాళిక, దేనినైనా జాగ్రత్తగా అమలు చేయడం లాంటివి అనుసరించాల్సిన పాఠాలు. అలాగే సాగదీతలేవీ లేకుండా, ఆయన త్వరగా నిర్ణయాలు తీసుకొనేవారు. ఉదాసీనత, ఉపేక్ష అనేవి ఆయన నిఘంటువులో లేని పదాలు. సరైన ఫలితాల కోసం సరైన పనిని సరైన వ్యక్తికే ఎప్పుడూ ఆయన అప్పగించేవారు. గురువు గారి కరుణకు ఎల్లలు లేవు.

ఆది శంకరుల అడుగుజాడల్లో...

'వేదో నిత్యం అధీయతామ్!' - వేదాలను ప్రతిరోజూ అధ్యయనం చేయాలని ఆదిశంకరులు చెప్పారు. వేదాలపైనా, వేద విద్యార్థులపైనా మా గురువుగారి అనురాగం మాటలకు అందనిది. అధ్యయనం గురించీ, చదువుల్లో వారు నిమగ్నం కావడానికి ప్రోత్సాహకంగా సమకూర్చే సౌకర్యాలూ, ఇతర అవసరాల గురించీ విద్యార్థులను ఆయన వాకబు చేసేవారు. వేద పండితులను సత్కరించేవారు. వేద భాష్యం అధ్యయనం చేయాలని వారిని ప్రోత్సహించేవారు. ఆది శంకరుల అడుగుజాడలను పూజ్య గురువులు మనసా వాచా కర్మణా అనుసరించారు. ఆది శంకరులు తన కాలంలోని అన్ని శక్తులనూ ఏకం చేశారు. మా గురుదేవులు వివిధ వర్గాల ఐక్యతకు కేంద్రశక్తిగా నిలిచారు. దేశంలో భిన్నత్వంలోని ఏకత్వాన్ని స్థిరంగా నిలపడానికి కృషి చేశారు. ఆది శంకరుల తరువాత కైలాస పర్వతం దగ్గరకు పీఠం నుంచి వెళ్ళింది మా గురువుగారే! ఆ పర్వత పాదాల దగ్గర ఆది శంకరుల విగ్రహాన్ని ఆయన ఏర్పాటు చేశారు. 51 శక్తి పీఠాలు, ఏడు మోక్ష పురాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలు... ఇలా దేశంలోని పుణ్య స్థలాలన్నిటినీ ఆయన దర్శించారు. ఏడు పవిత్ర నదులతో సహా పుణ్య నదులన్నిటిలో స్నానం చేశారు.

ఆయన అంచనా అద్భుతం!

ఆయన గురుభక్తి సుప్రసిద్ధం. తన గురువు శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామీజీ ఏది కోరినా, దాన్ని తప్పనిసరిగా నెరవేర్చారు. మా గురుదేవులు రచించిన వేదాంత గ్రంథం 'గురుప్రియ' అత్యుత్తమమైనది. పరిస్థితులను మదింపు చేయడంలో, ఒక వ్యక్తిని అంచనా వేయడంలో, రాబోయే వాటిని గ్రహించడంలో ఆయన ఎప్పుడూ విఫలం కాలేదు. ఆయన అనుసరించదగిన ఆదర్శప్రాయులు. ఇతర మతాల గురువులు ఆయన పట్ల చూపించే గౌరవం, మన్నన ఆయన గొప్పతనానికి రుజువు. ఆయన దృక్పథం ఏ ఒక్క ప్రాంతానికో సంకుచితం కాలేదు. అది ప్రపంచానికీ, ప్రత్యేకించి ఈ దేశానికీ సంబంధించినది. గురుదేవుల ఆలోచన, కార్యక్రమాలూ ఎల్లప్పుడూ దేశ సమగ్రత కోసం ఉద్దేశించినవే.

ఆ ఘనత ఆయనదే!


మన సంప్రదాయం, సంస్కృతి పట్ల ఆయన విశ్వాసం లోతైనది. మన సంస్కృతిని ప్రచారం చెయ్యడానికి అధునాతన శాస్త్ర సాంకేతిక విజ్ఞాన పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించేవారు. ఇది ఆయనను పాతకూ, కొత్తకూ మధ్య ఒక గొప్ప వారధిగా నిలబెట్టింది. ప్రధానంగా చెప్పుకోవలసింది- సామాజిక పునరేకీకరణ పట్ల ఆయన దృక్పథం. గతంలో హిందూయిజం వ్యక్తి ఆధారితంగా ఉండేది. పునర్జన్మ లేని ఒక స్థితిని అందుకోవడానికి ఆధ్యాత్మిక పరంగా వ్యక్తి ఎదగాలని చెప్పేది. 'జనకల్యాణ్-జనజాగరణ్' ఉద్యమం ద్వారా జన సముద్ధరణ కోసం సమాజం గుమ్మం దగ్గరకు హిందూ మతాన్ని తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. 'మానవసేవే మాధవ సేవ' అని హృదయపూర్వకంగా నమ్మి, అన్ని వర్గాలకూ, సమాజానికీ సేవలు అందించడం ముఖ్యమని ప్రజలు గ్రహించేట్టు చేయాలని ఆయన ప్రయత్నించారు. ఇది ఆయన సేవల్లో శిఖరాయమానం!



● శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి
(కంచి కామకోటి పీఠం నూతన పీఠాధిపతి)

ఉపదేశం

విద్య ఏమివ్వాలి?




సరైన విద్య... భగవంతుడే సత్యం అనేది మనం తెలుసుకొనేలా చెయ్యాలి. విజ్ఞానం.... మనలో మంచి లక్షణాలను నింపాలి. దీని ద్వారా మాత్రమే సత్యాన్ని అంటే భగవంతుడిని తెలుసుకోగలరు. కాబట్టి, జ్ఞానానికి లక్ష్యం అంతిమ సత్యాన్ని అర్థం చేసుకోవడం! వినయం, ఆత్మ నిగ్రహం అనేవి విద్య అందించే తొలి ప్రతిఫలాలు కావాలి!!

● కంచి మహాస్వామీజీ శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి

శ్రీ రమణ కథామృతం

శ్రీభగవాన్ కృప



(గత సంచిక తరువాయి)


నారాయణ అయ్యర్ అనే ఆయన ప్రభుత్వ ఉద్యోగి. నాస్తికుడు. సాధువులు, సన్యాసులు, స్వాములు అంటే అసహ్యం ఆయనకి. వాళ్లంతా సమాజానికి చీడపురుగులు వంటి వారని నమ్మేవారు. అతని మిత్రుని ప్రోద్బలం వల్ల తిరువణ్ణామలైలో శ్రీరమణులని దర్శించుకున్నారు. ఆ మిత్రుని తల్లి చిన్నప్పుడు రమణులతో ఆడుకునేది.

ఒకసారి కొందరు సంస్కృత విద్వాంసులు ఉపనిషత్తుల గురించి, శాస్త్రాల గురించి శ్రీభగవాన్‌తో చర్చిస్తున్నారు. వాళ్లంతా ఎంతో విద్యావంతులనీ అటువంటి విషయాలు శ్రీభగవాన్‌తో చర్చించగలవారనీ, తనకి ఆ అదృష్టం లేదే అని నారాయణ అయ్యర్ ఎంతో చింతింపసాగాడు. విద్వాంసులంతా సెలవు తీసుకున్న తరువాత శ్రీభగవాన్ అతని వైపు తిరిగి అతని మనస్సులోని విషయాన్నంతా గ్రహించారు కాబట్టి ఇట్లా అన్నారు. "ఈ విద్వత్తూ, శాస్త్రగ్రంథాలని అప్పగించగలగడం వృథా. సత్యాన్ని తెలుసుకోవడానికి ఈ అవస్థనంతా పడాల్సిన అవసరం లేదు. చదివితే సత్యం తెలుస్తుందా? ఊరికే ఉండు. అదే సత్యం. నిశ్చలంగా ఉండు. అదే భగవంతుడు" అన్నారు. కాసేపయిన తరువాత శ్రీభగవాన్ వైఖరిలో మాటలో ఏదో మార్పు వచ్చింది. నారాయణ అయ్యర్‌ని 'నువ్వు గడ్డం గీసుకుంటావా' అని అడిగారు. ఈ ప్రశ్నకు విస్తుపోతూనే అయ్యర్ అవునని సమాధానం చెప్పాడు. అప్పుడు శ్రీభగవాన్ 'గడ్డం గీసుకోవడానికి అద్దం ఉపయోగిస్తావు కదా! అద్దంలో చూసుకుంటూ నీ ముఖం మీద ఉన్న గడ్డాన్ని గీసుకుంటావే గానీ అద్దంలో ఉన్న ప్రతిబింబాన్ని కాదు కదా. అన్ని మతగ్రంథాలూ సాక్షాత్కారానికి మనకు దారి చూపేవే. వాటిలో చెప్పిన వాటిని అభ్యసించాలి, సాధించాలి. కేవలం పుస్తకాల పరిచయం, వాటి గురించి చర్చలూ అద్దంలోని ప్రతిబింబానికి గడ్డం గీయడం లాంటివే' అన్నారు.ఈ మాటలతో నారాయణ అయ్యర్‌కి కొండంత బలం వచ్చింది.

(సశేషం)

● పింగళి సూర్యసుందరం

మీకు తెలుసా?



సప్త నదులు

'గంగే చ యమునే చైవ
గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్
సన్నిధిం కురు'

గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి... ఈ ఏడూ పవిత్రమైన నదులని పురాణాలు చెబుతున్నాయి. స్నానం చేసేటప్పుడు, పూజల్లో కలశస్థాపన చేసేటప్పుడు ఈ నదులను తలచుకొని, పైన పేర్కొన్న మంత్రం పఠించడం ఆనవాయితీ!

ధర్మపథం

సాధనే ముఖ్యం!

విషయాన్ని సరిగ్గా తెలుసుకోవడం జ్ఞానం. అజ్ఞాని కంటే జ్ఞాని గొప్పవాడు. జ్ఞాని అయిన పండితుని కంటే, ఆ జ్ఞానాన్ని ఆచరణలో చేసి చూపించేవాడు అంతకంటే గొప్పవాడు. అలాంటి వాణ్ణి ప్రాజ్ఞుడు అంటారు. ఎందుకంటే జ్ఞానం మరొకరు చెబితే తెలిసేది. మన అనుభవంలోనిది కాదు. కానీ, ప్రజ్ఞ మన భావానిది. మన ఆచరణకు చెందినది. సిద్ధాంతం జ్ఞానం అయితే, ఆచరణ ప్రజ్ఞ అన్నమాట.

అమరకోశం 'ప్రజ్ఞాయతే అనయేతి ప్రజ్ఞా!' అంది. అంటే 'దీనివల్ల లెస్సగా తెలియగలదు!' అని. అంటే ఆచరణ వల్లే జ్ఞానం అనుమానం లేకుండా అవగతం అవుతుంది. అనుభవైకవేద్యం అవుతుంది.

బుద్ధుడు జ్ఞానానికి ప్రాధాన్యం ఇచ్చినా, ప్రజ్ఞకే పెద్ద పీట వేశాడు. 'జ్ఞాని కన్నా సాధకుడు మిన్న' అని చెప్పిన ఎన్నో ఉదంతాలు బౌద్ధంలో ఉన్నాయి. పోతలి భిక్షువు కథ అలాంటిదే!

పోతలి భిక్షువు ధర్మ ప్రవచనాలను ప్రబోధించడంలో దిట్ట. బుద్ధుడు చెప్పిన ధర్మాన్ని ఎంతో తేలిగ్గా, గంభీరంగా చెప్పగలడు. గొప్ప ధర్మపండితుడు. అతనితో వాదానికి దిగి గెలిచిన వారు లేరు. దానితో 'నేనే గొప్ప ప్రబోధకుణ్ణి!' అనే అహం అతనిలో పొడసూపింది.

బుద్ధుడు అతణ్ణి సంస్కరించాలనుకున్నాడు. అతను ఎప్పుడు వచ్చినా అంటీముట్టనట్టు మాట్లాడేవాడు. తన గొప్పతనాన్ని బుద్ధుడు కీర్తిస్తాడని అనుకుంటే, దానికి విరుద్ధంగా అసలు బుద్ధుడు తనను పట్టించుకోకపోవడం చూసి పోతలి ఆలోచనలో పడ్డాడు. 'ఏమై ఉంటుంది?' అని తర్కించుకున్నాడు. 'నాలో ఏదో దోషం ఉండి ఉంటుంది' అనుకున్నాడు. ధ్యాన సాధన సరిగా లేదని గ్రహించి- సాధన చేయాలనుకొని, అక్కడికి దూరంగా ఉన్న ఒక విహారానికి వెళ్ళాడు.

అక్కడ ఉన్న ఒక పెద్ద భిక్షువు వద్దకు వెళ్ళాడు ఆ భిక్షువు వయస్సులో, అనుభవజ్ఞానంలో, సాధనలో పోతలి కన్నా పెద్దవాడు. పోతలి విషయం తెలిసిన ఆ భిక్షువు, పోతలిని శిష్యునిగా స్వీకరించలేదు. ఆ ఆరామంలో ఉన్న పెద్ద భిక్షువులందరూ అతణ్ణి తిరస్కరించారు. దీనితో పోతలి నిరాశ చెందలేదు. చివరికి ఆ ఆరామంలో ఉన్న ఒక చిన్న భిక్షువు (శ్రామణేరుడు) దగ్గరకు వెళ్ళి అడిగాడు. ఆ శ్రామణేరుడు సరేనని కొన్ని నిబంధనలు పెట్టాడు. 'నేను చెప్పింది తప్పకుండా ఆచరించాలి. నాతో వాదోపవాదాలకు దిగకూడదు. నాపట్ల విధేయతతో ఉండాలి. చెప్పినట్టు సాధన కొనసాగించాలి'- ఇవీ ఆ నిబంధనలు.


సరేనని పోతలి ఒప్పుకొని, ఆ చిన్న భిక్షువు దగ్గర శిష్యరికం చేశాడు. ధ్యాన సాధన చేసి అనతి కాలంలోనే శ్రేష్ఠ సాధకుడయ్యాడు. అప్పుడు అతని క్రమశిక్షణ, నియమ నిబద్ధత, ధ్యాన నిమగ్నతలను బుద్ధుడు శ్లాఘించాడు. పోతలి గురించి చెప్తూ-

'యోగావే జాయతీ భూరి / అయోగా భూరి సంఖయో / ఏతం ద్వేధా పథం ఞత్వా భవాయ విభవాయ చ / తథత్తానం నివేసెయ్య / యథా భూరి పవడ్ఢతి!'

ధ్యాన సాధన వల్ల ప్రజ్ఞ ప్రభవిస్తుంది. సాధన లేకపోతే ప్రజ్ఞ పతనమైపోతుంది. ఈ విషయాల్ని తెలుసుకొని సాధకుడు ముందుకు సాగాలి. ప్రవృద్ధి చెందాలి.

ఆచరణకూ, సాధనకూ బుద్ధుడు ఎంత ప్రాధాన్యమిచ్చారో తెలిపే సంఘటన ఇది.

● బొర్రా గోవర్ధన్



ఆత్మజ్ఞానమే ఆత్యాశకు మందు

నాలుగైదాయుధమ్ములు కేలదాల్చి
నిలిచియుందువు దేనికో నిశ్చలముగా
ఎవ్వరిని రక్ష చేయని ఎవ్వరికిని
శిక్ష వేయని నిర్లిప్త సాక్షివేమో

నవజీవనవేదం

అత్యాశలకు మందు వేసుకోవడానికి భౌతికంగా తీసుకోవాల్సిన చర్య ఒక టుంది. అదే ఆర్థిక చర్య. ఎట్టి పరిస్థితుల్లో మన ఆదాయానికి మించి ఖర్చు పెట్టవద్దు. అప్పు తీసుకోవద్దు. అది బ్యాంకులోనైనా సరే. అప్పు అభివృద్ధికి బాట అంటూ ఇవాళ చాలా దుర్మార్గంగా ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగత జీవితంలో ఎప్పుడూ అప్పు లేని వాడే అధిక సంపన్నుడు. మన దగ్గర డబ్బులుంటే కొనుక్కుంటాం. లేదంటే మానేస్తాం. కౌటిల్యుడు అర్థశాస్త్రంలో చెబుతాడా విషయం...

అయమేవ పరోధర్మః ఇయమేవ విదగ్ధతా!
ఇదమేవ హి పాండిత్యం యదాయాన్నాధికో వ్యయః!!

తాత్పర్యం: ఇంతకు మించిన ధర్మం లేదు. ఇంతకు మించిన తెలివి లేదు. ఇదే నిజమైన పాండిత్యమంటే. అదేంటంటే... ఆదాయాన్ని మించి ఖర్చు పెట్టకపోవడమే!

...ఇది రాజ్యానికే చెప్పాడాయన. ఇక వ్యక్తులకు ఎందుకు వర్తించదు! నేడు ఉద్యోగులు, నిరుద్యోగులు, చివరకు విద్యార్థులు కూడా బ్యాంకు లోను పెట్టనివారు ఉండటం లేదు. ఈ చదువు నిజంగా అప్పు చేసి చదివేంత గొప్ప చదువా? ఈ అప్పు నిజంగా చదువుకే వాడుతున్నారా? నెలకు ఐదు వేల రూపాయల ఆదాయం ఉన్నవాడు అంతలోనే తన బడ్జెట్ వేసుకోవాలి. భార్య భర్తను ప్రేమించడానికి... భర్త భార్యను ప్రేమించడానికి, ఇద్దరూ సరసమాడుకోవడానికి రూపాయలు అక్కర్లేదు. ఒక్క రూపాయి పన్ను కట్ట క్కర్లేని ఈ ఛలోక్తుల్లో, సరసాల్లో ఎంత ఆనందం ఉంటుందో పొంది చూడండి. దానివల్ల గతంలో ఉన్న అపార్థాలు, కోపాలు అన్నీ సర్దుకొం టాయి. వాయిదాల పద్ధతిలో వస్తున్నాయంటే... అసలు ఎందుకు కొనాలి వాయిదాల పద్ధతిలో! అసలా వస్తువు ఇప్పుడు అవసరమా లేదా అనేది ఆలోచించుకోవాలి. కొన్నాళ్లు కొనకుండా ఉంటే అసలా వస్తువు అవసరమే ఉండదేమో! ఆలోచించండి. చాలామంది టీవీలు, సోఫాలు, టేబుళ్లు... ఇంటి నిండా సామాను పరుచుకుంటున్నారు. కానీ... ఏ రోజన్నా జీతం వచ్చిన రోజు ఆనందంగా ఉన్నామా? రకరకాల వాయిదాలన్నింటికీ కాస్త కాస్త వెళ్లి పోతాయి. చివరకు చేతిలో ఐదు వేలో... పది వేలో మిగులుతాయి. అవి ఐదో తారీఖు వచ్చే సరికే అయిపోతాయి. అవసరమంటే చేతిలో డబ్బులుం డవు. అప్పుడు అన్ని వాయిదాలతో పాటు సుఖ సంసారం కూడా వాయిదా పడిపోతుందా... లేదా! ఇది ఆలోచించుకుంటే కౌటిల్యుడు ఎందుకు చెప్పాడో అర్థమవుతుంది. అత్యాశలకు పోకుండా ఉన్న డబ్బును ప్రణాళికా బద్ధంగా ఖర్చు పెట్టుకుంటే ఏ బాధలూ ఉండవు. ఏదైనా ఆనందం ముఖ్యం. డబ్బు ద్వారా అది రాదు. డబ్బున్నవారి ఆనందం దేనిపై ఆధారపడి ఉంటుంద న్నది భర్తృహరి సుభాషితాల్లో చెబుతాడు... ధనానికి ఎప్పుడూ మూడు స్థితులు ఉంటాయి... దానము, భోగము, నాశనం. అందుకే... 'ఇదంతా దైవా నిది. మనమంతా ధర్మకర్తలం' అనుకోవాలి. మన ఆస్తిని మన కోసం ఖర్చు పెట్టుకుంటూ చేతనైన సాయం చేస్తుంటే చాలదా! అంతా ఆత్మస్వరూ పమే... అంతా విష్ణు స్వరూపమే. ఇవాళ సంపాదించడం ఒక చింత. దాన్ని ఎలా దాచుకోవాలన్నది పెద్ద చింత. ఆదాయంలో కనీసం నాలుగో వంతు దానం చేయమని ధర్మశాస్త్రం చెబుతోంది. ఆ నాలుగో వంతు దానం చేస్తే మనకు నాలుగు వందల రెట్లు కలిసి వస్తుంది. ఇవేవీ చేయకుండా అది కూడా దాచేసుకునే వాడి సొమ్ము నాశనమవడం ఖాయం.

డబ్బు జాగ్రత్తగా ఖర్చు పెట్టుకోవాలన్నా, దాన్ని అక్రమంగా సంపాదిం చకుండా ఉండాలన్నా భారతంలో చెప్పిన ఒక్క విషయాన్ని మనం గుర్తు పెట్టుకోవాలి...

శ్రూయతాం ధర్మ సర్వస్వం శ్రుత్వాచైవ అవధారరతాం
ఆత్మనః ప్రతికూలాని పరేషాం నరేసమాచరే

తాత్పర్యం: అన్ని ధర్మాలూ విను. అనేక గ్రంథాలు చదువు. విని వదిలే యకుండా దాన్ని కాస్త అవగాహన చేసుకో. గుర్తు పెట్టుకో. అందులో మంచి, చెడులు చర్చిస్తూ ఉండు. మొత్తంమీద జీవిత సారం ఒక్కటే. నీకు ఏది బాధ కలిగిస్తుందో అది ఇతరులకు కూడా బాధ కలిగిస్తుందని మరి చిపోకు.


అత్యాశలతో, అక్రమాలతో సంపాదిస్తున్నావారు ఏం సాధిస్తున్నారు? అన్ని సంపదలూ పొందావు. అన్ని కోరికలూ తీరాయి. అయితే ఏంటి? అన్నింటి కంటే పొందవలసింది ఒకటుంది... అదే ఆత్మజ్ఞానం. భోగాలు, భోజనాలపై ఒకనాటికి విరక్తి రావడం ఖాయం. ఆత్మజ్ఞానాన్ని పొందక పోతే... నేనెవరూ అని ఆలోచించుకోక పోతే... ఆత్మ సాక్షాత్కారాన్ని పొందలేక పోతే మొత్తం జీవితం దండగ. ఆత్మ జ్ఞాన సాధన మొదలు పెడితే అత్యా శలు, అసంతృప్తులు, ఒత్తిళ్లు, ఆందోళ నలూ సమస్తం అణిగిపోతాయి. దాని ముందు ఇవన్నీ దిగదుడుపు. అందుకే ఆత్మజ్ఞానం సాధించే ప్రయత్నం చేద్దాం.



● డాక్టర్ గరికిపాటి నరసింహారావు

సందేశం

దేవుడు వద్దన్న వడ్డీ



వడ్డీని 'దివ్య ఖుర్‌ఆన్'లో 'రిబా' అంటారు. 'రిబా' అంటే అధికం, అదనం, ఎక్కువ అనే అర్థాలు వస్తాయి. ఒక వ్యక్తి మరో వ్యక్తికి కొంత సొమ్మును ఒక నిర్ణీత గడువు కోసం అప్పుగా ఇచ్చి, దాన్ని తిరిగి తీసు కొనే సమయంలో అసలుతో పాటు అదనంగా వసూలు చేయడం! అద నంగా వసూలు చేసే ఆ సొమ్మునే మన భాషలో 'వడ్డీ' అంటున్నాం. మనలో కొంతమంది ఈ పద్ధతినే వ్యాపారంగా మలుచుకున్నారు. దీనినే జీవన మార్గంగా ఎన్నుకున్నారు. అయితే పద్ధతి- అంటే ఈ వడ్డీ వ్యాపారం నిషిద్ధమని అల్లాహ్ చెప్పాడు. వడ్డీ సొమ్మును తినే వారిని ఉద్దేశించి 'దివ్య ఖుర్‌ఆన్'లోని 'అల్ ఖబర సూరా' 275 నుంచి 280 'ఆయత్'లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

వడ్డీ తినేవారి స్థితి సైతాన్ పట్టడం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. వారు ఈ స్థితికి గురికావడానికి కారణం ఏమిటంటే, 'వ్యాపారం కూడా వడ్డీ లాంటిదేగా!' అని వారు అంటారు. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మ సమ్మతం చేశాడు. వడ్డీని మాత్రం నిషిద్ధం చేశాడు. ఆ వ్యవహారం చివరకు అల్లాహ్ వద్దకే పోతుంది. కనుక ఈ హితబోధ అందే వ్యక్తి ముమ్ముందు వడ్డీ తినడం త్యజిస్తే మంచిది. అతను పూర్వం ఏదో తిన్నాడు. కానీ ఈ ఆదేశం అందిన తరువాత మళ్లీ ఈ దుష్టచర్యకు పాల్పడేవాడు నిశ్చయంగా నరకవాసియే! అక్కడ అతడు శాశ్వతంగా ఉంటాడు. అల్లాహ్ వడ్డీని నశింపజేస్తాడు. దానధ ర్మాలను పెంచి, అధికం చేస్తాడు. కృతఘ్నుడూ, దుష్టుడూ అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు. విశ్వసించి మంచి పనులు చేసేవారికీ, నమాజును స్థాపించేవారికీ, జకాతును ఇచ్చేవారికీ అల్లాహ్ వద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది. వారికి భయం కలిగే అవకాశం అసలే ఉండదు.

విశ్వసించిన ప్రజలారా! మీరు నిజంగా విశ్వాసులే అయితే అల్లాహ్‌కు భయపడండి. ఇంకా మీకు రావలసిన వడ్డీని విడిచిపెట్టండి. కాని ఒక వేళ మీరు అలా చెయ్యకపోతే మీపై అల్లాహ్ తరఫు నుంచి, ఆయన ప్రవక్త తరఫు నుంచి యుద్ధ ప్రకటన ఉందనే విషయం తెలుసుకోండి. ఇప్పుడైనా మీరు పశ్చాత్తాపపడి, వడ్డీని వదులుకుంటే అసలు సొమ్ము తీసుకోవడానికి హక్కుదారు అవుతారు. మీకు అన్యాయం జరగకూడదు. కాబట్టి మీ బాకీదారు ఆర్థిక ఇబ్బందులలో ఉంటే అతని పరిస్థితి మెరు గుపడేవరకూ గడువు ఇవ్వండి. లేదా మీకు తెలిసినవారే అయితే ఆ బాకీని అతనికి దానం చెయ్యండి! అది ఇంకా ఎంతో శ్రేయస్కరం!

'దివ్య ఖుర్‌ఆన్'లో వడ్డీ గురించి అల్లాహ్ అన్ని విషయాలను తెలియ జేశాడు. అందుకే, వడ్డీ అన్నది ఏ రూపంలో ఉన్నా అది అధర్మమైనదే. వడ్డీ అనేది ఘోరమైన పాపమని అనేక 'హదీసు'ల ద్వారా కూడా మనకు తెలుస్తోంది.

● మహమ్మద్ వహీదుద్దీన్

వ్యాసపీఠం

ఆధ్యాత్మిక తిరుగుబాటు

"నేను తిరుగుబాటును బోధిస్తానే కానీ, విప్లవాన్ని బోధించను. నా దృష్టిలో తిరుగుబాటు వైఖరి ఒక ధార్మికునికి ఉండవలసిన ముఖ్య లక్షణం. అదే సంపూర్ణ స్వచ్ఛతతో కూడిన అసలైన ఆధ్యాత్మికత!" అంటారు ఓషో. "గతంలో చాలా నిశ్శబ్దంగా, ప్రశాంతంగా ప్రేమ పరవశంలో జీవించిన వ్యక్తులు తిరుగుబాటుదారులు కాకపోవడమే మానవాళి దుఃఖానికి కారణమయింది!" అని ఆయన స్పష్టం చేస్తారు. విప్లవానికీ, తిరుగుబాటుకూ మధ్య తేడానూ, తిరుగుబాటుదారుడి (రెబెల్) లక్షణాలనూ, సమాజానికి రెబెల్స్ ఆవశ్యతనూ ఈ 'రెబెల్' పుస్తకంలో ఆయన వివరించారు. అలెగ్జాండర్, మహాత్మా గాంధీ, బుద్ధుడు, జీసస్, హిట్లర్ తదితరుల జీవితాల నుంచీ, రష్యా, జర్మనీ లాంటి దేశ చరిత్రల నుంచీ అనేక ఉదాహరణలను సందర్భోచితంగా తీసుకున్నారు. "సమాజానికి దాని తప్పులను అర్థం అయ్యేలా చేసి, కొత్త చైతన్యంతో కూడిన కొత్త సమాజం ఏర్పడడానికి తిరుగుబాటు చేసేవాడే రెబెల్" అంటూ సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చారు ఓషో. ప్రశ్నోత్తరాల రూపంలో- సంక్లిష్టమైన అంశాలను సైతం సులభంగా అర్థం అయ్యేలా బోధించిన ఈ ఓషో రచనలను అంతే సరళంగా, సమర్థంగా భరత్ తెలుగులోకి అనువదించారు.



అనువాదం: భరత్
పేజీలు: 208
వెల: రూ. 250 రూపాయలు
ప్రచురణ: ధ్యానజ్యోతి పబ్లికేషన్స్, సికింద్రాబాద్
ప్రతులకు: ఫోన్ నెంబర్లు: 8121098500, 9293226169, విశాలాంధ్ర బుక్ హౌస్, నవచేతన పబ్లిషింగ్ హౌస్ అన్ని శాఖలు

దైవమార్గం

మరణించినా సజీవమే!



వ్యక్తిగా మెదడుతో ఆలోచించి ప్రతిస్పందిస్తే పగ, ద్వేషం, ఆవేశం వీటన్నిటికీ మూలమైన స్వార్థమే కట్టలు తెంచుకుంటుంది. అతనే దేవుణ్ణి ప్రతిష్ఠించుకున్న గుండెతో విశ్వాసిగా ప్రతిస్పందిస్తే యేసు నేర్పిన క్షమ, కరుణ, త్యాగం- వీటన్నిటికీ ప్రాప్తిస్థానమైన ప్రేమ ప్రవాహంగా పెల్లుబుకుతుంది. సాధారణ వ్యక్తికీ, విశ్వాసికీ ఉన్న ఈ తేడా పౌలు జీవితంలో స్పష్టంగా కనిపిస్తుంది. అతని పూర్వజీవితం ద్వేషం, పగ, జ్ఞానమదం, హింసాప్రవృత్తితో సాగింది. అనుకోకుండా ఒకరోజు యేసు సాక్షాత్కారంతో అతని జీవితం పెనుమార్పుకు గురైంది. నష్టాలబాట పట్టిన ఒక 'దివాళాకోరు కంపెనీ' ఉన్నట్టుండి లాభాలు వరదగా కురిసి తేరుకున్న అనుభవానికి అతని జీవితం లోనైంది. అదే లాభనష్టాల భాషలో తన జీవితాన్నీ, మరణాన్నీ అద్భుతంగా నిర్వచిస్తూ 'నా మట్టుకు బతుకుట క్రీస్తే, చావైతే లాభం' అంటాడు పౌలు (ఫిలి 1).

జీవితం, మరణం వంటి అత్యంత సంక్లిష్టమైన అంశాలను ఎంతో సరళంగా లోకానికి వివరించిన క్రైస్తవ మేధావి, బైబిలు అధ్యయన పండితుడు ఆయన. విశ్వాసిగా మారి తాను అనుభవిస్తున్న జీవితానందం, జీవనసాఫల్యాన్ని త్వరలోనే 'రోమా' ప్రభుత్వం అమలుచేయనున్న 'శిరచ్ఛేదన' మరణశిక్ష అంతం చేయలేదన్నది పౌలు ధీమా!! తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన తానే స్థాపించిన ఫిలిప్పీ చర్చికి రోమా చెరసాల నుంచి రాసిన 'సువార్త పత్రిక'లో పౌలు ఈ విషయం పేర్కొన్నాడు. లోకానికి మరణమంటే ఒక్కమాటలో చెప్పాలంటే 'చచ్చేంత భయం'!! మరణం మాట వింటనే లోకం హడలిపోతుంది. 'దేశాధినేతలు, యుద్ధవీరులు, శూరులు, కుబేరులు, సినీతారలు, సెలబ్రిటీలను సైతం మరణం వదిలిపెట్టదు. మరణానికి మిత్రులు లేరు. శత్రువులు లేరు. అది కొందరికి ఎదురై తన విషకౌగిలిలో బంధించిన అతిథి. మరికొందరిని ఎంతో కాలంగా ఊరించి, వేధించి వరించిన ప్రేయసి.

కానీ మరణానికి విరుగుడు విశ్వాసి జీవితమే అన్నది యేసు బయల్పరిచిన ఒక మహోన్నత సత్యం!! ఇదెలా? పౌలు పరిభాషలో చెప్పాలంటే తాను విశ్వాసినయ్యాక ఆరంభమైన 'విశ్వాసి జీవితానందాన్ని 'మధ్యలో తుంచేసే శక్తి మరణానికి లేదనీ, విశ్వాసిగా మారిన తనకు మరణం ఒక తాత్కాలిక మజిలీ మాత్రమేనని పౌలు నమ్మాడు. ఆ గడప దాటిన మరుక్షణం పరలోకం అనే అద్భుత లోకవాసిగా తాను నిత్యత్వంలోనికి ప్రవేశించినా తన ఆనందం కొనసాగుతూనే ఉంటుందని పౌలు వివరించాడు. అందుకే యేసు శిలువలో మరణాన్ని తృణప్రాయంగా ఎంచి సజీవుడయ్యాడు. ఆయన శిష్యులు ఇతర అపోస్తులులు క్షమా సువార్త కోసం ఆనందంగా ప్రాణార్పణ చేశారు. విశ్వాసి ముందు మరణం విస్తుపోతుంది. నిస్సహాయమవుతుంది. ఎందుకంటే అది యేసు పునరుత్థానంలో తన శక్తిని కోల్పోయింది!

● సుశీల్ సందేశ్



నవ్య సకల

కళ్లజోడు వాడుతున్నా తలనొప్పి తగ్గడం లేదు



కౌన్సెలింగ్

నా వయసు 22. బి. టెక్. చేస్తున్నాను. కళ్లు పొడిబారిపోవడం, కళ్లనొప్పి, తల నొప్పి కారణంగా ఏడాది క్రితం కంటి డాక్ట ర్‌ను సంప్రదించాను. అన్ని పరీక్షలూ చేసి తలనొప్పికి దృష్టిలోపం ఒక్కటే కారణమని చెప్పారు. కళ్లజోడు వాడితే సమస్యలన్నీ పోతాయన్నారు. ఆయన సూచించిన కళ్ల జోడు వాడుతూనే ఉన్నా, తలనొప్పి మాత్రం తగ్గలేదు. కళ్లు పొడిబారిపోవడం, కళ్లనొప్పి కూడా అలాగే ఉన్నాయి. దీనివల్ల ఒక గంటయినా నిలకడగా చదవలేకపో తున్నాను. క్లాస్‌లోనూ మనసు లగ్నం కావడం లేదు. నిద్రకూడా సరిగా పట్టడం లేదు. నా సమస్యకు పరిష్కారం చెప్పండి.

● డి. వేణు, నిజామాబాద్

మీ తలనొప్పికి అసలు కారణం మైగ్రేన్. కళ్లు పొడిబారిపోవడం, కళ్ల నొప్పి కూడా ఈ వ్యాధిలో ఉంటాయి. లక్షణాల ఆధా రంగా తెలుసుకోవడమే తప్ప ఈ వ్యాధి ఏ పరీక్షల్లోనూ బయటపడదు. ఆహార లోపాలు, నిద్రలేమి, మానసిక ఒత్తిళ్లు ఈ సమస్యకు ప్రధాన కారణాలు. సరియైన వేళకు భోజనం చేయడం, మానసిక ఒత్తిళ్లకు దూరంగా ఉండడం మీకు చాలా అవసరం. వైద్య చికిత్సగా స్కామినూరియా -30 మందును వారానికి ఒకరోజు మూడు పూటలా మూడు డోసుల చొప్పున నాలుగు వారాలు వేసుకోవాలి. అదే సమయంలో న్యాటంమూర్-6 ఎక్స్ అనే మందును రోజుకు రెండు సార్ల చొప్పున ఒక నెల వాడితే మీ సమ స్యలు తగ్గిపోతాయి. కొంత ఉపశమనం రాగానే మీకు నిద్ర కూడా సరి గానే పడుతుంది. దాంతో మైగ్రేన్ తగ్గే అవకాశాలు మరింత పెరుగు తాయి. ఒకవేళ అప్పటికీ తగ్గకపోతే మీకు దగ్గరలో ఉన్న హోమియోపతి డాక్టర్‌ను సంప్రదించండి.

- డాక్టర్ బి. సోహన్ సింగ్
రిటైర్డ్ సూపరింటెండెంట్
ప్రభుత్వ హోమియోపతి కళాశాల, హైదరాబాద్

మీకు మీరే డాక్టర్

మాడు నొప్పి మటుమాయం



- ఆరతులం గుంటగలగర ఆకు చూర్ణానికి సమానంగా బెల్లం, కరక్కాయ చూర్ణం కలిపి తింటే ఎసిడిటీ, పుల్లటి తేన్పులు, వాంతులు తగ్గుతాయి.
- గుంటగలగర చెట్టు తాలూకు వేళ్లు, కాండం, ఆకులు, పూలు, కాయలు అనే ఈ పంచాంగాలను ఇతర ఆకుకూ రలుగా వండి గానీ లేదా పచ్చడి నూరి అన్నంతో తింటూ ఉంటే రక్తహీనత తగ్గి, దేహదారుఢ్యం ఏర్పడుతుంది. తెల్ల వెంట్రుకలు వచ్చే అవకాశం లేకుండా పోతుంది.
- ఆకు రసంతో తయారు చేసిన తైలాన్ని తలకు రాసుకుంటే, తలనొప్పి, జుట్టు సమస్యలు, చుండ్రు తగ్గుతాయి.
- త్రిఫళా చూర్ణాన్ని ఆకు రసంతో నూరి ఎండించిన చూర్ణాన్ని రెండు గ్రాముల చొప్పున రెండు పూటలా తీసు కుంటూ ఉంటే తెల్లవెంట్రుకలు నల్లబడతాయి. కంటి చూపు వృద్ధి అవుతుంది.
- ఆకు రసాన్ని మర్దన చేస్తూ ఉంటే, కాళ్లూ, చేతుల మంటలు తగ్గుతాయి.

ట్రై సుడోకు - 119

6			4					3
		4	7	3	6			
5		9						
			1		4	3		
	4	6				2	7	
		3	6		7			
						9		2
			3	6	2	8		
2					9			4

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 118 సమాధానం

4	2	9	7	3	5	1	6	8
7	5	1	8	4	6	3	2	9
6	8	3	1	2	9	5	7	4
5	1	2	4	6	7	8	9	3
8	6	7	9	5	3	2	4	1
9	3	4	2	1	8	6	5	7
1	9	8	6	7	2	4	3	5
3	4	6	5	9	1	7	8	2
2	7	5	3	8	4	9	1	6


రామ్‌చరణ్


అమల

నన్ను నన్నుగా బతకనిస్తారా?

- అమల

వయసు మీదపడుతున్న కొద్దీ శారీరకంగా ఎన్నో మార్పులుంటాయి. వ్యక్తిత్వానికీ, రూపురేఖలకూ సంబంధం ఉండాల్సిన పని లేదు. అయినా నిత్యం అర్థంలేని ప్రశ్నలు సెలబ్రిటీలను వేధిస్తూనే ఉంటాయి. అలాంటి వాటి నుంచి తనకు కాస్త ఉపశమనం కల్పించి, తనను తానుగా బతకనివ్వమని అర్థం వచ్చేటట్టుగా అమల అక్కినేని తన అభిప్రాయాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శ్రీదేవి మరణానంతరం పలు కోణాల్లో వార్తలు వినిపిస్తోన్న నేపథ్యంలో అమల అక్కినేని ఫేస్‌బుక్‌లో చేసిన పోస్ట్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. గ్లామర్ రంగంలో ఎదిగిన వారి భావోద్వేగాలకు ప్రశ్నల రూపమిచ్చి రాసుకున్న ఆ పోస్ట్ సారాంశం...

"నేను ఎంత అలసిపోయి కనిపిస్తున్నానో, ఎంత బరువు పెరిగానో అనే విషయం మీద అభిప్రాయం చెప్పనవసరం లేకుండా నన్ను ప్రశాంతంగా ఉండనిస్తారా? కళ్లజోడు వల్ల కళ్లకింద ఏర్పడ్డ నల్లటి వలయాలు, వయసు వల్ల వచ్చిన మచ్చల గురించి ప్రస్తావించకుండా ఉంటారా? ఆయా సీజన్‌కు తగిన విధంగానో, సైజ్ జీరో వాళ్లు ధరించే దుస్తులనో.. ధరించలేకపోతున్నాననే భావనను నాలో కలగనివ్వకుండా ఉంటారా? మెనోపాజ్ దశలో నాకు సౌకర్యవంతంగా ఉన్న నూలు వస్త్రాలు ధరించడంలోనే ఆనందం ఉంటుంది. అది చేనేతకూ చేయూతనిస్తుంది. నా జుట్టుకు రంగులు వేసుకోమని చెప్పకుండా ఉంటారా?ఇప్పుడు కురచగా ఉన్న నా జుట్టును చూసి, 19 ఏళ్ల వయసులో 'పుష్పక్'లో కనిపించిన నా వాలుజడను గుర్తు చేయకుండా ఉంటారా? నాలో ఉన్న తెలివితేటలను కాకుండా, కేవలం పలచబడ్డ జుట్టునే ఎందుకు ప్రస్తావించడం? కెమెరాలు తప్పకుండా మనిషి లోతుల్ని స్పృశిస్తాయి. అంతేగానీ పైపై అందాలని మాత్రమే కాదు కదా? నాతో మాట్లాడేటప్పుడు 'నేనెలా వండుతాను?', 'ఇటీవల వచ్చిన గాసిప్స్ మీద ఎలా స్పందిస్తాను' వంటి ప్రశ్నలు అడగకుండా అర్థవంతమైన విషయాలను చర్చిస్తారా? నేను మన్నులో కలవకముందే ఏదో గొప్ప మార్పును చూడాలనే సంకల్పం నా లోలోతుల్లో ఆరాటపడుతోంది. నిష్ప్రయోజనంగా సాగే సమావేశాల్లో పాల్గొనమని నాకు నిత్యం సందేశాలను పంపకుండా నా దినచర్యను ప్రశాంతంగా సాగనిస్తారా? మీకు అత్యంత కీలకమైనవిగా తోచే అంశాలన్నీ నా బుర్రలో తొక్కిసలాడేటట్టు కాకుండా, నా జీవితాశయాన్ని పూర్తి చేయనిస్తారా? బాక్సాఫీస్ లెక్కలకు, టీఆర్‌పీ యుద్ధాలకు, పేజ్ త్రీ పోజులకు, సామాజిక మాధ్యమాల్లో లైకులకు, కామెంట్లకు అతీతమైన స్వేచ్ఛను నాకు ప్రసాదిస్తారా? నా మనసుకు నచ్చినట్టు నేను ఉండాలని అనుకుంటున్నప్పుడు ఒకానొక సమయ చట్రంలో, ఫేమ్ అనే పంజరంలోనే ఎందుకు బంధిస్తున్నట్టు? నా జీవితాన్ని నాకు వదిలేయండి. నాకు ఏకాంతాన్నివ్వండి. మానవత్వంతో ఉండనివ్వండి. ఓ లక్ష్యంతో, నిజాయతీతో, కరుణతో బతకనివ్వండి. మనల్ని వదిలివెళ్లిపోయిన వాళ్లని గౌరవించండి."

రంగా... రంగ... చిందేయంగ!


'**రం**గా... రంగ... రంగస్థలాన' పాటకు చిందేయడానికి సిద్ధంగా ఉండమంటున్నారు సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్! రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'కు ఆయన సంగీతమందిస్తున్న సంగతి తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలోని రెండో పాట 'రంగా.. రంగ.. రంగస్థలాన' ఈ రోజు సాయంత్రం ఆరు గంటలకు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ పాట ఎలా ఉంటుందో చెప్పడానికి అన్నట్టు చిన్న సాంగ్ మేకింగ్ వీడియోని విడుదల చేశారు. ఒరిజినల్ ఫోక్ రిథమ్ ప్లేయర్స్‌తో 1980లలో సంగీతాన్ని, వాతావరణాన్ని ప్రతిబింబించేలా పాటను రికార్డ్ చేశారని అర్థమవుతోంది. పాటలో చిట్టిబాబు వేసే చిందులతో ప్రేక్షకులు కూడా కాలు కదుపుతారట! చిత్రదర్శకుడు సుకుమార్‌తో దేవికి వరుసగా ఏడో చిత్రమిది. ఇప్పటివరకూ వచ్చిన ఆరు చిత్రాల్లోని పాటలు ప్రేక్షకులను అలరించాయి. వాటికి మించి ఈ చిత్రంలో పాటలు ఆకట్టుకుంటాయని చిత్రబృందం చెబుతోంది. సమంత హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 30న చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఎంత సక్కగున్నావే... శ్రీదేవికి అంకితం!

'రంగస్థలం'లోని తొలిపాట 'ఎంత సక్కగున్నవే... లచ్చిమి ఎంత సక్కగున్నవే' పాటను కొన్ని రోజుల క్రితం విడుదల చేసిన సంగతి తెలిసిందే. శ్రోతల నుంచి విపరీతమైన స్పందన లభించిన ఈ పాటను తిరిగిరాని లోకాలకు వెళ్ళిన అతిలోక సుందరి శ్రీదేవికి అంకితం ఇస్తున్నట్టు చిత్రబృందం తెలిపింది.

మండే సూర్యుడు!

అల్లు అర్జున్, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీని దర్శకుడిగా పరిచయం చేస్తూ, కె. నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శిరీషా-శ్రీధర్, 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. కథానాయకుడితో పాటు కీలక పాత్రధారులు చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ "గురువారం హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్ స్టార్ట్ చేశాం. ఈ నెల 14 వరకూ ముఖ్యమైన సన్నివేశాలు చిత్రీకరిస్తాం. హోలి సందర్భంగా 'పోస్టర్ ఇంపాక్ట్'ను విడుదల చేశాం. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి మే 4న ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేస్తాం" అన్నారు. తమిళ నటులు అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బాబు, సంగీతం: విశాల్-శేఖర్.


అల్లు అర్జున్


స్ట్రైక్ కాదు... సామరస్యం కావాలి!

- డి. సురేశ్‌బాబు


సునీల్ నారంగ్, దామోదర్‌ప్రసాద్, కల్యాణ్, సురేశ్‌బాబు, కిరణ్, మురళీమోహన్

"**డి**జిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (డి.ఎస్.పి) కూడా సినిమా పరిశ్రమలో ఒక భాగమే. మాతో మేం ఎప్పుడూ స్ట్రైక్‌లు కోరుకోం. సామరస్యాన్నే ఆశిస్తాం. ప్రస్తుతం చర్చలు సఫలం కాకపోవడం వల్ల శుక్రవారం నుంచి థియేటర్లలో ప్రదర్శనలను నిలిపివేయక తప్పడం లేదు. దక్షిణాది పరిశ్రమలన్నీ కలిసి తీసుకున్న నిర్ణయం ఇది. మల్టీప్లెక్స్‌లలోనూ ప్రాంతీయ చిత్రాలు ఆడవు" అని జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ డి.సురేశ్‌బాబు వెల్లడించారు. కన్వీనర్ పి.కిరణ్, సభ్యులు సి.కల్యాణ్, కె.ఎల్.దామోదరప్రసాద్, ముత్యాల రాందాస్, కె.మురళీమోహన్, సునీల్ నారంగ్‌తో కలిసి ఆయన గురువారం విలేకరులతో సమావేశమయ్యారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ "ప్రస్తుతం డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు ఆంగ్ల చిత్రాలకు వీపీఎఫ్ (వర్చువల్ ప్రింట్ ఫీస్) వసూలు చేయడం లేదు. ప్రాంతీయ చిత్రాలకు మాత్రం చేస్తున్నారు. గతంలో అసలు సమావేశాలకు కూడా హాజరు కానివారు ఇప్పుడు చర్చలదాకా వచ్చారు. మేం 25 శాతం తగ్గించమని కోరితే వాళ్లు 15శాతం వరకు తగ్గించడానికి ముందుకు వస్తున్నారు. కానీ ఇంకా చర్చలు సఫలం కాలేదు. ప్రస్తుతానికి పాతిక శాతాన్ని తగ్గించి, భవిష్యత్తులో అసలు వీపీఎఫ్ అనేది లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే మేం పోరాడుతున్నాం. ప్రత్యామ్నాయ విధానం గురించి కూడా ఆలోచనలున్నాయి. ప్రస్తుతం థియేటర్ల మూసివేత వల్ల తాత్కాలిక ఇబ్బందులు ఉన్నప్పటికీ భవిష్యత్తులో తప్పకుండా మంచి ఫలితాలు ఉంటాయి. థియేటర్లన్నీ నలుగురి చేతుల్లోనే ఉంటున్నాయనే మాటలు వాస్తవం కాదు. అదే నిజమైతే ఇలాంటి సమస్యలు నాలుగు నిమిషాల్లో కొలిక్కి వచ్చేవి. మా పోరాటం కూడా వ్యక్తులతో కాదు.. డిజిటల్ సర్వీస్ ప్రొవైడింగ్ వ్యవస్థతోనే" అని చెప్పారు. తెలంగాణ స్టేట్ ఫిల్మ్ చాంబర్ తరఫున కె.మురళీమోహన్ మాట్లాడుతూ "డిజిటల్ ప్రొవైడర్లు థియేటర్లలో ఉంచిన పరికరాలను కొనుగోలు చేయడానికి ఎగ్జిబిటర్లు సిద్ధంగా ఉన్నప్పటికీ, విక్రయించడానికి వాళ్లు ముందుకు రాకపోవడం శోచనీయం" అని అన్నారు.

రజనీ మావయ్య... కొలవెరి డీ కుర్రాడు!


రజనీకాంత్


అనిరుధ్

వై థిస్ కొలవెరి కొలవెరి డి... ఒక్కటంటే ఒక్క పాటతో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచంద్రన్ సంచలనం సృష్టించాడు. ఆ పాట రజనీకాంత్ అల్లుడు ధనుష్ హీరోగా, రజనీ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహించిన '3'లోనిది! చిత్రబృందం విడుదల చేసిన తొలిపాట కూడా అదే. సంగీత దర్శకుడిగా అనిరుధ్ ఓపెనింగ్ అదిరింది! తర్వాత చాలామంది స్టార్ హీరోల చిత్రాలకు సంగీతం అందించాడు. విజయాలు అందుకున్నాడు. కానీ, మావయ్య నుంచి పిలుపు రావడానికి ఏడేళ్ళు ఎదురు చూడాల్సి వచ్చింది. రజనీకాంత్ హీరోగా 'పిజ్జా' ఫేమ్ కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించే చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందించనున్నాడని చిత్రనిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ తెలిపింది. ఇంతకీ, అనిరుధ్ మావయ్య ఎవరు? అనుకుంటున్నారా! రజనీయే. ఆయన సతీమణి లత సోదరుని కుమారుడే అనిరుధ్. అంటే... అతనికి రజనీ మావయ్యే కదా! మామా అల్లుళ్ళ కాంబినేషన్‌లో తొలి చిత్రమిదే!

ఇలాంటి జోనర్ చెయ్యను

- శ్రీనివాసరాజు


పూజాగాంధీ

రవిశంకర్, పూజాగాంధీ, మకరంద్ దేశ్‌పాండే, రవికాలే ప్రధాన పాత్రధారులుగా శ్రీనివాసరాజు దర్శకత్వం వహించిన చిత్రం 'దండుపాళ్యం 3'. రజనీ తాళ్లూరి తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇటీవల ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. రవి కాలే మాట్లాడుతూ "తెలుగులో చాలా సినిమాలు చేశా. 'దండుపాళ్యం' సిరీస్‌తో వచ్చిన గుర్తింపు మరే సినిమాకు రాలేదు" అన్నారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ "ఓ హిట్ సినిమాకు సీక్వెల్ పెద్దగా ఆడింది లేదు. అలా అనుకోవడం తప్పని 'దండుపాళ్యం' రుజువు చేసింది. ఇలాంటి కథతో సినిమా చెయ్యాలంటే గట్స్ ఉండాలి" అని అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మరో మూడేళ్ల వరకు ఈ జోనర్ సినిమాలు చెయ్యను. ఈసారి కొత్త తరహా కథతో వస్తా" అని అన్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. పూజా గాంధీ, మకరంద్ దేశ్‌పాండే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



వినోదాత్మకం


షఫీ, లక్కీ, సాయికిరణ్, పూజశ్రీ, మేఘన, జ్యోతిక యాదవ్ కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'నందికొండ వాగుల్లోన'. సత్యనారాయణ దర్శకుడు. రఘు హెచ్ నిర్మాత. నవనీత్ సంగీతం అందించిన ఈ చిత్రం పాటల్ని ఆదివారం ఫిల్మ్ ఛాంబర్‌లో విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "పూర్తి వినోదాత్మకంగా సాగే చిత్రమిది. 'అర్జున్‌రెడ్డి'లో ఉన్న టెమ్టేషన్ ఇందులోనూ ఉంటుంది" అని అన్నారు. నిర్మాత రఘు మాట్లాడుతూ "ఆర్.కె.గౌడ్, సాయివెంకట్ సహాయంతో సినిమాను విడుదల చెయ్యబోతున్నాం. మార్చ్ 2న విడుదల చెయ్యాలను కున్నాం. బంద్ కారణంగా పోస్ట్ పోన్డ్ చేసుకున్నాం" అని తెలిపారు.

నిధి కోసం అన్వేషణ


ప్రభుదేవా, హన్సిక

ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకుడు. నటి రేవతి శక్తిమంతమైన పాత్రలో నటించారు. తమిళనాట సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రాన్ని ఇప్పుడు అదే పేరుతో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా పతాకంపై మల్కాపురం శివకుమార్ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. మార్చి 16న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ "గులేబకావళి అనే గ్రామంలో నిక్షిప్తమైన నిధి కోసం కొందరు చేసే అన్వేషణ నేపథ్యంలో చిత్రకథ సాగుతుంది. పూర్తి వినోదాత్మకంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రభుదేవా నృత్యాలు, నటన చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ. తమిళంలో ఘనవిజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకూ తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. మన్సూర్ అలీఖాన్, మధు, ఆనంద్‌రాజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి పోరాటాలు: పీటర్ హెయిన్, సంగీతం: వివేక్ మెర్విన్.

నింగిపై...నీడలా!


అరుణ్, కీరవాణి

రాజ్ మాదిరాజు దర్శకత్వంలో ఇంద్రనీల్ సేన్‌గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి ముఖ్య తారలుగా ఫర్మ్ 9 పతాకంపై కె. విజయరామారాజు, హేమంత్ వల్లపురెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'ఐతే 2.0'. స్వరకర్త. ఆయన స్వరపరిచిన 'నింగిపై... నీడలా' పాటను సంగీత దర్శకుడు కీరవాణి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "పాట కొత్తగా వుంది. సాహిత్యంలో 'ఆశగా ఆశకే ఆయువు పెంచగా...' వంటి పదాలు స్ఫూర్తివంతంగా ఉన్నాయి. పాటలతో పాటు చిత్రం విజయవంతం అవుతుందని నమ్ముతున్నా" అన్నారు. "చిత్రంలో మూడు పాటలున్నాయి. ముగ్గురు హీరోలకు సంబంధించి వివిధ నేపథ్యాల్లో ఆకలి, ఆశ, కోపం అంశాలపై పాటలు ఉంటాయి. ఈ చిత్రంతో అరుణ్ చిలువేరుని సంగీత దర్శకుడిగా పరిచయం చేయడం సంతోషంగా ఉంది" అన్నారు రాజ్ మాదిరాజు. మార్చి 16న చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నామని నిర్మాతలలో ఒకరైన విజయరామారాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్యాణ్‌మాలిక్, గాయకుడు నరేశ్ అయ్యర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సాహిత్యం: కిట్టు విస్సాప్రగడ.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
34046.94	10458.35	30380	38085	65.17	64.25
↓137.10	↓34.50	↓155 (ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత))	↓125		

శిరోజాల సంరక్షణకు 'నూర్‌క్రిన్'

» డెన్మార్క్ కంపెనీతో గ్లెన్‌మార్క్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహిళల శిరోజాల సంరక్షణకు మరో కొత్త ఉత్పత్తి మార్కెట్లోకి వచ్చింది. డెన్మార్క్‌కు చెందిన ఫార్మా సంస్థ ఫార్మా మెడికో ఉత్పత్తి అయిన 'నూర్‌క్రిన్' టాబ్లెట్లను దేశీయ ఫార్మా దిగ్గజం గ్లెన్‌మార్క్ మార్కెట్‌లోకి ప్రవేశపెట్టింది. భారత మార్కెట్లో ఆ ఔషధం మార్కెటింగ్‌కు ఆ సంస్థతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నట్లు గ్లెన్‌మార్క్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ కపూర్ గురువారం ఇక్కడ తెలిపారు. అయితే ఇది శిరోజాలకు సంబంధించిన పోషకాలను అందించేదే అయినప్పటికీ ఓటీసీ ఔషధం కాదని, వైద్యుల ప్రిస్క్రిప్షన్ ద్వారా మాత్రమే దాన్ని పొందడం సాధ్యం అవుతుందని ఆయన అన్నారు. దేశ జనాభాలో 59 కోట్ల మంది మహిళలుండగా వారిలో 9 కోట్ల మంది శిరోజాలు రాలిపోయి ఇబ్బంది పడుతున్నారని, తీవ్ర మైన ఒత్తిడులు, శిశు జననం, కాలుష్యం, స్టైలింగ్ ఉత్పత్తుల వినియోగం వంటివి ఇందుకు కారణమని హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రశ్మి విశ్లేషించారు. రోజుకి 10 నుంచి 50 వరకు వెంట్రుకలు రాలితే అది సాధారణమేనని, 50 నుంచి 100 మధ్యన రాలుతుంటే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. సరైన పోషకాహారం లేకపోవడం వల్లనే ఈ సమస్య ఎదురవుతుందని ఆమె చెప్పారు. డెన్మార్క్ ద్వారా కార్యకలాపాలు సాగిస్తున్న ఫార్మామెడికో సంస్థ పోషకాహార ప్రత్యామ్నాయాల సరఫరాలో పేరెన్నిక గన్నదని, తమ పోర్ట్‌ఫోలియోలో కూడా డెర్మటాలజీ ఉత్పత్తులు అధిక సంఖ్యలో ఉన్నందున ఆ శిరోజ సంరక్షణి నూర్‌క్రిన్ కోసం ఆ సంస్థ నుంచి మార్కెటింగ్ లైసెన్సు పొందామని కపూర్ చెప్పారు. నూర్‌క్రిన్ టాబ్లెట్ల రూపంలో అందుబాటులో ఉంటుందని, ఒక్కో ప్యాక్‌లో నెల రోజులకు సరిపోయే 60 టాబ్లెట్లు ఉంటాయని ఆయన అన్నారు. శిరోజాలు పెరగడం ఒక్క రోజు లేదా ఒక్క నెలలో జరిగే పని కాదు గనుక మంచి ఫలితాల కోసం ఆరు నెలల వాడవలసివస్తుందని ఆయన చెప్పారు. 60 టాబ్లెట్ల ప్యాక్ ధర మూడు వేల రూపాయలని కపూర్ తెలిపారు.



నూర్‌క్రిన్ టాబ్లెట్లను విడుదల చేస్తున్న రాజేశ్ కపూర్

ఎస్‌బిఐ రుణాలు మరింత ప్రియం

వడ్డీ రేట్లలో 0.20 శాతం వరకు పెరుగుదల.. తక్షణమే అమల్లోకి..



ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు మరింత ప్రియంకానున్నాయి. ఇప్పటికే రుణం తీసుకున్న వారు చెల్లించే నెలవారీ వాయిదా (ఇఎంఐ)లు పెరగనున్నాయి. డిపాజిట్లపై వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు ప్రకటించిన మరుసటి రోజే రుణాలపైనా వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు గురువారం ఎస్‌బిఐ ప్రకటించింది. గరిష్ఠంగా రుణాలపై వడ్డీ రేటు పెరుగుదల 0.20 శాతం వరకు ఉంది. పెంచిన వడ్డీ రేట్లు తక్షణమే అమల్లోకి వస్తాయని బ్యాంకు పేర్కొంది. 2016 ఏప్రిల్ తర్వాత మొదటి సారిగా ఎంసిఎల్‌ఆర్ ఆధారిత వడ్డీ రేట్లను సవరించినట్లు బ్యాంకు తెలిపింది. తాజా సవరణ ప్రకారం.. ఏడాది కాలపరిమితి గల ఎంసిఎల్‌ఆర్ (నిధుల సమీకరణ వ్యయ ఆధారిత వడ్డీ రేటు) 7.95 శాతం నుంచి 8.15 శాతానికి పెరిగింది. ఆరు నెలల కాలానికి ఎంసిఎల్‌ఆర్‌ను 0.10 శాతం పెంచడంతో 8 శాతానికి చేరుకుంది. మూడేళ్ల కాలానికి రుణ రేటు 0.25 శాతం పెరిగి 8.35 శాతానికి చేరింది. రేట్ల పెంపు మొత్తం రుణగ్రహీతలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ ఈ నిర్ణయాన్ని ఎస్‌బిఐ సమర్థించుకుంది. గత నెల నుంచి లిక్విడిటీ తక్కువ కొద్ది లోటు స్థాయిలో ఉందని ఎస్‌బిఐ మేనేజింగ్ డైరెక్టర్ పికె గుప్తా తెలిపారు. బాండ్ రాబడులు 1.25-1.50 శాతం పెరిగినందున లిక్విడిటీ దృష్టిలో ఉంచుకుని కొన్ని సర్దుబాట్లు చేయాల్సి ఉందని, ఇప్పుడదే చేశామని పేర్కొన్నారు. రుణాలకు డిమాండ్ పెరిగిందని, డిసెంబరుతో ముగిసిన మూడు నెలల కాలంలో 11 శాతం వృద్ధి నమోదైందని చెప్పారు. రుణాలపై వడ్డీ రేట్లు పెంచినప్పటికీ ఇతర బ్యాంకులతో పోల్చితే తమ వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలోనే ఉన్నాయని తెలిపారు.

పిఎన్‌బి రేట్ల పెంపు

ఎస్‌బిఐ బాటలోనే ప్రభుత్వరంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) రుణాలపై వడ్డీ రేట్లను పెంచింది. ఈ మేరకు ఏడాది కాలానికి సంబంధించిన ఎంసిఎల్‌ఆర్‌ను 8.15 శాతం నుంచి 8.30 శాతానికి పెంచింది. అంతేకాకుండా ఒక రోజు, మూడు నెలలు, ఆరు నెలలకు సంబంధించి రేట్లను (0.15 శాతం చొప్పున పెంపు) వరుసగా 7.95 శాతం, 8.10 శాతం, 8.25 శాతానికి పెంచినట్లు తెలిపింది. ఈ రేట్లు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొంది. డిపాజిట్లపై వడ్డీ రేట్లను కూడా పిఎన్‌బి పెంచింది. రిటైల్, బల్క్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను 0.45 శాతం వరకు పెంచినట్లు తెలిపింది. ఏడాది నుంచి మూడేళ్ల కాలంలో మెచ్యూర్ అయ్యే రిటైల్ డిపాజిట్లపై వడ్డీ రేటును 0.25 శాతం పెంచి 6.75 శాతానికి చేర్చినట్లు బ్యాంకు పేర్కొంది. ఏడాది కాలంలో మెచ్యూర్ అయ్యే బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేటును 6.50 శాతం నుంచి 6.75 శాతానికి పెంచింది.

వెంకీస్ @ రూ. 4,108

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పౌల్ట్రీ ఉత్పత్తుల రంగంలోని వెంకీస్ ఇండియా లిమిటెడ్ షేరు గత ఏడు ట్రేడింగ్ సెషన్లలో 69 శాతం దూసుకుపోయింది. గత నెల 20వ తేదీన 2,673 రూపాయల వద్ద ఉన్న ఈ షేరు గురువారం ఒక దశలో 4,530 రూపాయల స్థాయికి చేరినా చివరకు 4,108 రూపాయల వద్ద ముగిసింది. కంపెనీ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటం నేపథ్యంలో ఈ షేరులో ర్యాలీ ప్రారంభమైంది. గత రెండేళ్ల కాలంలో సెన్సెక్స్‌లో నమోదైన వృద్ధి 43.6 శాతం కాగా ఈ షేరు 1,610 శాతం దూసుకుపోయింది. 265 రూపాయల నుంచి ప్రస్తుత స్థాయికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలంలో 79 శాతం వృద్ధితో 148.50 కోట్ల రూపాయల నికరలాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ప్రకటించిన లాభం 83 కోట్ల రూపాయలు కాగా ఏడాది మొత్తానికి 124.8 కోట్ల రూపాయల లాభం ఆర్జించింది. పౌల్ట్రీ, పౌల్ట్రీ ఉత్పత్తుల రంగంలో పని తీరు గణనీయంగా మెరుగుపడడం కలిసి వచ్చిందని కంపెనీ చైర్‌పర్సన్ అనూరాధా దేశాయ్ అన్నారు.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,330	---	31,280	31,350	30,380
క్రితం ముగింపు	31,360	31,400	31,410	31,300	30,530
22 క్యారెట్లు	29,010	---	28,770	29,500	28,930
క్రితం ముగింపు	29,030	29,150	28,890	29,080	29,080
వెండి (కేజీ)	39,200	---	39,200	39,400	41,100
క్రితం ముగింపు	39,300	39,700	39,300	39,400	41,300

త్వరలో పబ్లిక్ ఇష్యూకు దేవీ సీఫుడ్స్

» రూ.900 కోట్ల సమీకరణ

» మర్చంట్ బ్యాంకర్ల నియామకం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న దేవీ సీఫుడ్స్ త్వరలో పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు రెడీ అవుతోంది. ఐపిఒకు సంబంధించి కంపెనీ ఇద్దరు మర్చంట్ బ్యాంకర్లను నియమించుకుంది. ఈ ఇష్యూ ద్వారా దేవీ ఫుడ్స్ 900 కోట్ల రూపాయల వరకు సమీకరించాలని భావిస్తోంది. 1992లో విశాఖపట్నం కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించిన దేవీ సీఫుడ్స్, రొయ్యల హేచరీ, ఆక్వాకల్చర్ ఫామ్స్, సొంత ప్రాసెసింగ్ ప్లాంట్లతో పాటు ఫ్రోజెన్ ష్రింప్స్ సరఫరాదారుగా ఉంది. ఐపిఒ ద్వారా ప్రమోటర్లు కొంత వాటాను విక్రయించడంతో పాటు ప్రైమరీ మార్కెట్ ద్వారా మరికొన్ని నిధులను సమీకరించాలని యోచిస్తున్నారు. గడచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో ఏటా 20 శాతం వరకు వృద్ధి సాధిస్తున్న దేవీ సీఫుడ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,000 కోట్ల రూపాయల రాబడిని ఆర్జించవచ్చని అంచనా వేస్తోంది. ప్రస్తుతం కంపెనీ వోల్గా ఫ్రెష్, సింధు ఫ్రెష్, మార్నింగ్ హార్వెస్ట్ బ్రాండ్ ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తోంది. కంపెనీ మొత్తం ఎగుమతుల్లో 90 శాతం వాటా అమెరికాదే ఉండగా 7 శాతం వరకు కెనడా ఉంది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అపెక్స్ ఫ్రోజెన్ పబ్లిక్ ఇష్యూకు వచ్చి అదరగొట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇదే రాష్ట్రానికి చెందిన సంధ్య మెరైన్స్ ఐపిఒకు సంబంధించి మార్కెట్ నియంత్రణ సంస్థ సెబికి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డిఆర్‌హెచ్‌పి) దాఖలు చేసింది. ఇష్యూ ద్వారా 450-500 కోట్ల రూపాయల సమీకరించాలని సంధ్య మెరైన్స్ భావిస్తోంది.

హెచ్‌పిసిఎల్ కొనుగోలుకు షేర్‌హోల్డర్ల అనుమతి కోరిన ఓఎన్‌జిసి

న్యూఢిల్లీ: హెచ్‌పిసిఎల్‌లో ప్రభుత్వానికి చెందిన 51.11 శాతం వాటా కొనుగోలు నిర్ణయానికి ఓఎన్‌జిసి తన షేర్‌హోల్డర్ల అనుమతి కోరింది. పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఓటింగ్ జరగనుందని, రెండు సంస్థల్లో వాటా కలిగి ఉన్నందున ప్రభుత్వం ఈ ప్రక్రియలో పాల్గొనబోదని ఓఎన్‌జిసి తెలిపింది. హెచ్‌పిసిఎల్‌లోని ప్రభుత్వ వాటాకు చెందిన ఒక్కో షేరును 473.97 రూపాయల చొప్పున కొనుగోలు చేసిన ఓఎన్‌జిసి.. ఈ డీల్ కోసం 36,915 కోట్ల రూపాయలు వెచ్చించింది.

మూడో రోజూ దిగువకే..

సెన్సెక్స్ 137 పాయింట్లు డౌన్



ముంబై: ఆర్థిక రంగం రికవరీ పథంలో పయనిస్తున్నదని జిడిపి గణాంకాలు నిరూపిస్తున్నప్పటికీ ఆ వార్త స్టాక్ మార్కెట్లో ఉత్సాహం నింపలేకపోయింది. వరుసగా బయటకు వస్తున్న బ్యాంకు కుంభకోణాలతో బ్యాంకింగ్ స్టాక్లలో అమ్మకాల ఒత్తిడి యథాతథంగా కొనసాగుతూనే ఉంది. దీనికి తోడు విత్తలోటు నిర్దేశిత లక్ష్యాన్ని దాటిపోయిందన్న వార్తలు, అమెరికాలో వడ్డీ రేట్ల పెంపు భయాల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అమ్మకాలు కూడా మార్కెట్‌ను ఊపిరిసలపని పరిస్థితి కల్పించాయి. దీంతో వరుసగా మూడో రోజు కూడా స్టాక్ మార్కెట్ నష్టాల్లోనే ముగిసింది. జిడిపి గణాంకాల ఉత్తేజంతో పాజిటివ్‌గా ప్రారంభమైనప్పటికీ సర్వత్రా ప్రతికూల పరిస్థితుల నడుమ మార్కెట్ కొద్ది సేపటికే నష్టాల బాట పట్టింది. సెన్సెక్స్ 137.10 పాయింట్ల నష్టంతో 34046.94 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 34.50 పాయింట్ల నష్టంతో 10458.35 పాయింట్ల వద్ద క్లోజయింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 95.21 పాయింట్లు, నిఫ్టీ 32.70 పాయింట్లు నష్టపోయాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నడుమ ఇన్వెస్టర్లు "పెరిగినపుడు అమ్ముకో" అనే వైఖరికి వచ్చారని విశ్లేషకులంటున్నారు.

● బ్యాంకింగ్ షేర్లలో భారీ అమ్మకాలు సాగగా విద్యుత్, ఆటోమొబైల్ అమ్మకాలు పెరగడంతో ఆ రంగానికి చెందిన షేర్లకు డిమాండ్ ఏర్పడింది. సెన్సెక్స్ షేర్లలో ఐసిఐసిఐ బ్యాంక్ 2.63 శాతం నష్టంతో అగ్రస్థానంలో ఉండగా ఎస్‌బిఐ 2.31 శాతం నష్టంతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇన్ఫోసిస్, పవర్ గ్రిడ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐటిసి, యాక్సిస్ బ్యాంక్, ఆర్ఐఎల్, హీరోమోటోకార్ప్, డాక్టర్ రెడ్డీస్, టిసిఎస్ నష్టపోయిన షేర్లలో ఉన్నాయి. కోల్ ఇండియా, ఎల్ అండ్ టి, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యుఎల్, మహీంద్రా, కోటక్ బ్యాంక్, ఓఎన్‌జిసి, టాటా మోటార్స్, మారుతి సుజుకీ లాభపడ్డాయి.

హోలీ పర్వదినం సందర్భంగా శుక్రవారం మార్కెట్లకు సెలవు. స్టాక్ మార్కెట్, బులియన్, మెటల్స్, ఫారెక్స్, కమాడిటీ మార్కెట్లన్నీ పని చేయవు.

నేడు మార్కెట్లకు సెలవు

టొరెంట్ నిధుల సమీకరణ పరిమితి పెంపు

రుణ సమీకరణ పరిమితిని 10 వేల కోట్ల నుంచి 15 వేల కోట్ల రూపాయలకు పెంచుకునేందుకు వాటాదారులు అనుమతి ఇచ్చినట్టు టొరెంట్ ఫార్మా ప్రకటించింది. ఇందులో 12,500 కోట్ల రూపాయల సమీకరణ ప్రైవేట్ ప్లేస్‌మెంట్ విధానంలో ఎన్‌సిడిలు, బాండ్ల జారీకి కూడా అనుమతి లభించిందని తెలిపింది.

ప్రారంభ దశలోనే విక్రయం : రుచి

ఎన్‌సిఎల్‌టి విచారణ పరిధిలో ఉన్న వ్యాపార విక్రయం ప్రక్రియ ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నట్టు రుచి సోయా తెలిపింది. కంపెనీపై ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ దాఖలైన తర్వాత బోర్డు అధికారాలన్నింటినీ ఎన్‌సిఎల్‌టి ఐఆర్‌పి (ఇంటెరిమ్ రిజల్యూషన్ ప్రొఫెషనల్) అప్పగించింది. ఎన్‌సిఎల్‌టి పరిధిలోని వ్యాపారం విక్రయానికి ఐఆర్‌పి ఫిబ్రవరి ఎనిమిదో తేదీన ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ ఇచ్చిన నోటిఫికేషన్ గడువు 22న ముగిసినట్టు పేర్కొంది. అయితే చర్చలు ఇంకా శైశవ దశలోనే ఉన్నట్టు తెలిపింది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెంకాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	72.00	విజయవాడ	73.00
కరీంనగర్	73.00	గుంటూరు	72.00
వరంగల్	72.00	ఒంగోలు	75.00
మహబూబ్‌నగర్	72.00	చిత్తూరు	68.00
కర్నూలు	72.00	నెల్లూరు	70.00
విశాఖపట్నం	78.00	అనంతపురం	67.00
గోదావరి	72.00		



రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.05		నెక్ (100 గుడ్లు)	
హైదరాబాద్	345.00	చిత్తూరు	378.00
వరంగల్	347.00	చెన్నై	385.00
విజయవాడ	340.00	నమక్కల్	370.00
గోదావరి	340.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	350.00	ముంబై	390.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	59.32	68.78
పౌండ్	81.59	94.62
యూరో	72.33	83.89
ఆస్ట్రేలియా డాలర్	45.87	53.07
బహ్రెయిన్ దినార్	160.64	184.08
కువైట్ దినార్	179.91	223.96
ఒమని రియాల్	157.31	179.97
సౌదీ రియాల్	15.77	18.70
సింగపూర్ డాలర్	44.76	53.03
యుఎఇ దిరమ్	16.14	18.87

బిఎస్ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు BSE

ACI INFOCOM 4.6(4.84)330
ADITYA SPIN. 8(8.2)530
AGRO TECH FO 657.9(630.15)4509
AISHWARYA TE 5.95(5.82)3424
ALPHAGEO (I) 806.4(809.15)1527
ALU FLUORIDE 114.5(114.15)3074
AMAR RAJA BA 812.7(822.5)16842
ANDHRA BANK 45.2(46.05)175334
ANDHRA CEMEN 10.99(10.91)19237
ANDHRA PETRO 58.75(58.9)38895
ANJANI PORTL 190(191.3)1253
ASTRA MICRO 89.65(90.65)42614
AUROB.PHARMA 624.1(613.45)253077
AVANTEL LTD 560.55(533.9)14214
AVANTI FEEDS 2431.55(2401.95)35923
B.N.RATHI SE 42.55(41.4)7335
BALAJI AMINE 633.25(644.55)7162
BAMBINO AGRO 247.85(236.05)724
BARTRONICSIN 13.23(12.88)8226
BHAGIRA.CHEM 309(301.7)1250
BHAGYA INL 48.05(48.65)24017
BHARATFIN 1032.35(1025.5)95996
BNR UDYOG 31(30.6)1562
CAMBRIDGE 75.2(73.75)1119
CAT TECHN. 1.24(1.3)500
CCHHL 13.98(13.8)8350
CCL PRODUCTS 299.45(297.45)5156
CELESTIAL 16.55(17.25)8611
CIL SECURITS 30.5(30.25)2396
COROM INTER 549.8(558.3)5974
CUBEX TUBING 25.9(25.4)1001
CYBERMATE 3.1(3.26)48556
CYIENT 633.5(636.5)5838
DANLAW TECH. 69.85(66.75)4213
DECAN CEMENT 568.15(569)354
DHAN ROTO SP 55(53.55)4642
DIAMONPOWER 12.59(13.1)104908
DIVI'S LAB. 1017.25(1023.3)90735
DIVYA.GRANIT 94(92.5)3707
DQ ENT 14.22(14.3)5622
DR.REDDY'S 2228.05(2235.65)23063
EMPEE SUGARS 4(3.89)11996
EVEREST ORG. 142.9(143.25)350
FACOR ALLOYS 3.02(3.01)121681
FIRSTOBJ 16.45(15.75)7075
GATI LTD. 111.8(111.75)57148
GAYATRI PROJ 210.7(211.55)25855
GENNEX LAB 4.36(4.36)132501
GMR INFRASTR 18.6(18.95)1913750
GODAVARI DRU 34.9(34.9)260
GOLDST INFRA 216.85(217.1)25198
GOLDSTONE EN 15.39(15)2867
GRANULES (I) 116(118.4)79064
GVK POWERINF 16.5(16.95)503462
HBL P SYS 56.95(55.55)59943
HERITGFOOD 683.95(669.95)1022
HIND.FLUROCA 12.07(12.7)3100
I.C.S.A. IND 3.11(3.06)11583
IKF TECHNO .66(.65)58989
INCAP LTD. 91.35(88.1)639
IPAPPM 308.8(308.5)4412
IVRCL LTD 4.44(4.45)81878
KAKATIYA CEM 295.1(291.8)1150
KALLAM SPG. 31.05(31)24085
KAVERI SEED 493.5(499.55)8638
KCP LTD 127.75(127.4)9792
KERNEX MICRO 43(41.75)2901
KNR CONST 303.2(308.9)14019
KREBS BIOCHM 175.3(171.05)9714
LANCO INFRA 1.26(1.27)861283
LOKESH MACH 66.05(65.95)3748
LOTUS CHOC 50.9(51.3)605
MADHUCON PRJ 27.3(27.35)7447
MOLD-TEK TEC 60(60.95)700
MOSCHIP SEMI 31.8(32)26327
MSR INDIA 50.8(51.95)5192
N C L IND. 233.25(228.3)21127
NACLIND 43.5(43.5)4062
NATCO PHARM 781.7(799.2)46700
NCC 130.55(131.35)486410
NEHA INTER. 6.92(7.18)31269
NETTLINX LTD 77.45(76.6)6515
NEULAND LAB. 714.5(719)830
NIHAR INFO 14.03(14.75)490
NILE LTD. 798.9(803.75)2867
NTL 3.94(4.14)11158
OIL COUNTRY 42.4(42.7)2435
PADMALAYA TE 4.79(4.64)11063
PALRED 87.3(89.85)9075
PANYAM CEMEN 47.65(46.4)8257
PENNAR STEEL 58.25(58.6)43870
PFL INFOTECH 8(8.38)12173
PHYTOCHEM I. 63.25(61.8)6725
PITTI LAMIN. 92.85(93.95)17283
POKARNA LTD 213.05(215.05)1804
PRAJAY ENGS. 11.25(11.75)23148
PREMIER EXPL 387.05(388.5)1226
PRISM CEMENT 126.5(126.3)72488
RAIN 362(381)753889
RAJ PACKAGIN 35.8(37.05)21059
RAJVIR IND 47.2(43)400
REG.CERAMIC 5.85(5.85)212
RESTILE CER. 6.98(6.97)2396
SAGAR CEM. 966.35(980)320
SAMKRG PIST. 299.9(298.8)3886
SAMPRE NUTRI 51.4(51)3240
SANGHI IND. 117.7(116.35)46494
SATVAH.ISPAT 22.9(22.55)35180
SAVEN TECHNO 25.4(25.6)18348
SMPL 1.39(1.41)15750
SMS PHARMACE 86.2(87.5)3400
SREE RAYALA 170.5(165.8)495
STEEL EXCH 29.55(30.05)67616
SUJANA INDUS .9(.93)2100
SURANATP 5.5(5.57)44
SURYACHAKRA .91(.95)25736
SURYAMBA SP 76.8(76.7)142
SURYLAK.COTT 78.7(80.05)80
SUVEN LIFE S 190.55(188.35)19916
TAJ GVK HOTL 164.95(166.1)3142
TANLA 35.35(34.7)217444
TCI INDUS. 900(921)6
TRANSCORP IN 33.45(33.5)1307
TRANSGENE BI 2.62(2.5)93211
TRANSPORT CO 271(272.9)609
USHER AGRO 6.24(6.28)6261
VICEROY HOTE 15.65(15.7)51137
VIJAY TEXTIL 52.3(52.3)1137
VIMTA LABS 203.8(208.75)1875
VIRAT CRANE 54.3(51.75)72727
VIRINCHI 116.6(118.8)34365
VISAKA IND. 686(689.7)3682
VISTA PHARMA 50.85(53.5)1300944
VIVIMED LABS 77.6(77.35)95416
VST INDUS. 3172(3172)30
WATERBASE 312.95(311.9)243704
XLENERGY 2.75(2.8)4710
YBRANTDIGI 5.3(5.05)436543
ZEN TECH 138.5(117.6)356332
ZENOTECH 42.5(43.2)13785

ఎన్ఎస్ఇ-500 NSE

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా


AARTIDRUGS 607.85(600.4)2974
AARTIIND 1172.25(1173.05)40353
ABAN 169.6(170.5)540101
ABB 1525.15(1531.75)74109
ABFRL 149.95(152.3)171836
ABGSHIP 10.6(10.55)7116
ACC 1633.8(1623.05)128434
ADANIENT 199.15(203.55)3600007
ADANIPORTS 406.1(408.35)1216685
ADANIPOWER 31.35(31.65)5109574
ADANITRANS 204.2(203)764453
AEGISCHEM 250.45(252.6)107759
AHLUCONT 375.5(379.3)10312
AIAENG 1443.5(1439.6)4580
AJANTPHARM 1398.05(1397.75)299284
AKZOINDIA 1796.75(1800.2)80098
ALBK 51.5(52.65)3222285
ALLCARGO 179.15(179.75)135026
ALOKTEXT 3.15(3.2)1178590
AMARAJABAT 812.45(822.25)170234
AMBUJACEM 253.15(252.35)3184053
AMTEKAUTO 24.95(25.15)500441
ANANTRAJ 55.05(55.85)962139
ANDHRABANK 45.3(46.05)2245740
APARINDS 783.9(797.25)9940
APLLTD 553.4(552.75)369787
APOLLOHOSP 1183.5(1203.05)166112
APOLLOTYRE 265.7(274.55)3851150
ARVIND 414.8(419.95)1877997
ASHIANA 172.2(172.25)43012
ASHOKA 225.35(219)1047709
ASHOKLEY 140.95(141.5)19650623
ASIANPAINT 1118.9(1117.75)736217
ASTRAL 876.95(906.55)103186
ASTRAZEN 1016.9(1024.25)3679
ATUL 2672.35(2687.5)1618
AUROPHARMA 624.1(613.9)3649095
AVANTIFEED 2431.45(2397.9)195686
AXISBANK 525.75(528.75)9827510
BAJAJ-AUTO 3020.9(3020.6)503301
BAJAJCORP 483.9(479.85)89413
BAJAJELEC 536.95(527.55)504682
BAJAJFINSV 4999.4(5051.7)84916
BAJAJHIND 12.55(12.6)1257374
BAJAJHLDNG 2720.65(2723.55)10466
BALKRISIND 1060.15(1086.7)194135
BALLARPUR 13.5(13.5)364125
BALMLAWRIE 231.55(231.35)43891
BALRAMCHIN 117.45(119.75)3361043
BANKBARODA 138.3(141.95)13912882
BANKINDIA 113.15(116.2)9463499
BASF 2046.2(2037)12631
BATAINDIA 723.3(729.95)400430
BBTC 1416.7(1428.1)306442
BEML 1233.55(1235.1)405488
BERGEPAINT 245.75(248.7)167355
BFUTILITIE 436.2(441.45)265648
BGRENERGY 117.1(116.85)69695
BHARATFIN 1035.05(1026.1)639894
BHARATFORG 784(789.85)1447995
BHARTIARTL 427.75(428.55)5260644
BHEL 90.7(89.9)6768063
BHUSANSTL 46.45(46.45)1994318
BIOCON 626.85(630.05)1682637
BIRLACORPN 899.55(900.3)29988
BLISSGVS 192.25(193.5)104409
BLUEDART 4303.5(4284.15)24825
BLUESTARCO 759.2(743.9)52555
BOMDYEING 255.6(258.65)1946168
BOSCHLTD 18707.5(18687.3)13447
BPCL 441.9(429.55)6222197
BRFL 58.55(60.1)93237
BRIGADE 282.3(285.3)47070
BRITANNIA 4943.85(4994.25)52535
CADILAHC 404.05(405.1)577581
CANBK 290.3(299.25)8339200
CAPF 668.5(666.3)607745
CARERATING 1360.05(1367.2)34607
CASTEXTECH 4.8(4.95)1006007
CASTROLIND 201.8(201.95)1833770
CCL 299.25(296.4)74899
CEATLTD 1578.05(1602.45)456653
CENTRALBK 64.8(65.3)233286
CENTURYPLY 331.85(329.4)90987
CENTURYTEX 1223.05(1220.25)466853
CERA 3374.45(3359.5)7186
CESC 1004.75(1023.45)184118
CHAMBLFERT 163.7(168.75)955898
CHENNPETRO 360.05(364.7)280517
CHOLAFIN 1451.5(1469.95)1376349
CIPLA 581.7(589.65)1343806
CLNINDIA 581.45(582.7)9235
COALINDIA 312.9(309.15)2535090
COLPAL 1056.9(1041.1)1128302
CONCOR 1312.35(1304.15)126000
COROMANDEL 550.7(558.75)124226
CORPBANK 32.7(33.55)233673
COX&KINGS 241.05(238.75)136485
CRISIL 1939.5(1927.15)14260
CUB 180.7(174.8)1727585
CUMMINSIND 804.1(795.95)444246
CYIENT 633.4(636.55)127770
DABUR 325.2(325.05)818541
DALMIABHA 2742.5(2632.5)657094
DBCORP 331.65(334.55)26685
DBREALTY 56.75(58.1)216916
DCBBANK 162.35(164)1231629
DCMSHRIRAM 569.05(565.75)62092
DEEPAKFERT 334.5(340.15)108538
DELTACORP 351.15(346.85)1625212
DEN 100.25(102.3)223124
DENABANK 20.55(20.6)576484
DHANUKA 621.75(619.35)14838
DHFL 537.6(546.2)2670884
DISHTV 71.6(73.6)2382949
DIVISLAB 1018.45(1025.9)272425
DLF 224.3(226.25)3581145
DREDGECORP 679.05(683.1)145060
DRREDDY 2231.5(2237.25)430777
DYNAMATECH 1948.55(1975.25)14852
ECLERX 1373.5(1368.45)7327
EDELWEISS 278.15(268.75)3138632
EICHERMOT 27742.35(27437.75)91423
EIDPARRY 318.8(316.55)68679
EIHOTEL 169.75(173.8)166222
ELECTCAST 30.75(31.2)199552
ELGIEQUIP 308.25(309.2)8770
EMAMILTD 1081.2(1080)65696
ENGINERSIN 171.8(173.1)1012690
EROSMEDIA 198.85(195.75)430277
ESCORTS 885.05(892.85)1725774
ESSDEE 62.2(65.15)22192
ESSELPACK 267(267.05)37002
EVEREADY 392.9(392.85)22696
EXIDEIND 209.6(207.4)1115887
FCONSUMER 59.5(59.8)3798502
FDC 288.25(283.5)50816
FEDERALBNK 94(94.25)3975513
FINCABLES 706.35(716.95)32050
FINPIPE 656.6(653.1)25262
FLFL 419.75(400.05)1275850
FORTIS 161.05(159.8)40490589
FSL 53.25(51.45)19152976
GAIL 454.25(457.5)2148217
GATI 111.6(112.15)235888
GDL 209.9(208.75)64034
GEPIL 838.2(840.3)15353
GESHIP 365.15(365.6)254701
GET&D 418.1(407.7)72705
GILLETTE 6647.7(6651.6)1516
GLAXO 2378.9(2384.15)5259
GLENMARK 544.5(544.55)973598
GLOBOFFS 31.55(31.65)10328
GMDCLTD 137.85(140.7)201943
GMRINFRA 18.6(18.95)22049883
GODFRYPHLP 871.15(873.15)28703
GODREJCP 1080.2(1070.45)765999
GODREJIND 545.85(551.75)694731
GODREJPROP 779.05(780.2)361417
GPPL 141.5(142)183153
GRANULES 115.75(118.4)1265195
GREAVESCOT 123.1(124.05)308104
GREENPLY 340.75(343.65)70412
GRINDWELL 511.6(509.85)15132
GRUH 535.45(536)582685
GSFC 128(128.15)1099913
GSKCONS 6791.5(6696.9)17637
GSPL 201.7(207.05)242516
GUJFLUORO 785.1(773.65)32382
GUJGASLTD 866.9(870)9293
GULFOILLUB 980.45(997.2)7943
GVKPIL 16.5(16.9)1875492
HATHWAY 36.7(37.45)224137
HAVELLS 511.25(507.65)1428365
HCC 34.05(33.9)4341665
HCL-INSYS 62.15(63.9)2581050
HCLTECH 942.8(940.3)1386115
HDFC 1814.15(1808.7)3272003
HDFCBANK 1874.35(1884.2)977460
HDIL 48.05(49.9)14813193
HEIDELBERG 156.55(159.35)97457
HEROMOTOCO 3576.9(3596.7)200696
HEXAWARE 343.6(346.1)505044
HFCL 29.7(29.95)8420243
HIMATSEIDE 350(351.55)76082
HINDALCO 240.8(245.4)5767109
HINDCOPPER 72.55(73)1148629
HINDPETRO 376.75(380.15)2354494
HINDUNILVR 1324.25(1317.75)961945
HINDZINC 315.6(326.45)2251422
HMT 34.55(33)3519
HMVL 239.1(236.9)6309
HONAUT 17103.95(17267.15)739
HOTELEELA 18.7(18.85)316239
HSIL 436(439.7)35589
HTMEDIA 91.6(92)54460
IBREALEST 212.1(215.35)3281287
IBULHSGFIN 1256.3(1254.1)1170536
ICICIBANK 304.95(313.25)18986889
ICRA 3811.4(3844.45)569
IDBI 80.35(74.55)65150780
IDEA 83.05(83.9)15125877
IDFC 52.6(52.95)2756352
IFBIND 1419.45(1435.55)12134
IFCI 22.75(22.65)6027463
IGARASHI 820.8(818.45)3171
IIFL 804.3(756.1)1151643
IL&FSTRANS 70.35(70.65)179474
INDHOTEL 137(137.15)3115115
INDIACEM 157.25(159.25)1890764
INDIANB 317.25(331.1)2710444
INDOCO 258.15(255.25)61169
INDUSINDBK 1700.35(1680.75)760617
INEOSSTYRO 930.55(942.4)1634
INFRATEL 345.2(346.7)3367869
INFY 1160.75(1172.6)3289926
INGERRAND 726.3(723.3)5853
INOXLEISUR 280.45(280.85)46165
INOXWIND 135.3(124.15)1444599
INTELLECT 196.25(193.95)421400
IOB 19.65(19.6)874165
IOC 381.5(379.3)3630009
IPAPPM 307.95(308.8)30078
IPCALAB 686.2(672.85)454538
IRB 224.1(228.6)778837
ITC 264(265.05)7781553
J&KBANK 66.95(66.6)210862
JAGRAN 167(166.05)36253
JAICORPLTD 155.6(157.75)1160537
JBCHEPHARM 319.65(315.15)63592
JBFIND 149.25(153.55)65366
JCHAC 2308.4(2272.3)8603
JETAIRWAYS 742.8(746.1)2250213
JINDALPOLY 354.5(354.9)41543
JINDALSTEL 248.85(254.4)6401382
JISLJALEQS 115.05(116.95)4384555
JKCEMENT 1024.9(1011.8)21133
JKIL 318.55(322.35)39320
JKLAKSHMI 431.6(424.85)96815
JKTYRE 153.3(150.5)1298477
JMFINANCIL 144.65(147.55)1107533
JPASSOCIAT 17.45(17.7)31165412
JPINFRATEC 12.7(12.75)1507294
JPPOWER 6.05(6.05)783153
JSWENERGY 80.65(80.7)867926
JSWHL 1776.85(1794.6)3630
JUBILANT 834.45(877.5)1236543
JUBLFOOD 2005.85(2034)423544
JUSTDIAL 448.6(451.9)1405596
JYOTHYLAB 344.35(343.2)65892
KALPATPOWR 492.75(501.3)104192
KANSAINER 488.2(491.6)41183
KEC 410.35(415.25)409860
KESORAMIND 127.2(127.3)132941
KIRLOSENG 360.05(356.85)9578
KITEX 269.15(264.6)196727
KOLTEPATIL 337.4(349)90824
KOTAKBANK 1095.7(1090.55)1480594
KPIT 214.75(216.1)1979678
KRBL 551.55(551.15)177306
KSCL 493.3(500.3)258476
KSK 10.45(11)845631
KTKBANK 132.7(135.15)1348076
KWALITY 84.6(84.2)2390009
L&TFH 162.5(162.3)1753008
LAKSHVILAS 104.55(104.4)501351
LAOPALA 646.65(649.2)16682
LAXMIMACH 6665.8(6778.6)8933
LICHSGFIN 507.05(507.8)1153910
LITL 1.3(1.25)1792394
LT 1315.2(1318.15)1927606
LUPIN 803.9(819.95)1311644
M&M 732.55(728.35)1831321
M&MFIN 427.25(432.65)1083094
MAGMA 162.45(160.35)46736
MAHINDCIE 237.3(239.1)142034
MAHLIFE 453.95(451.25)6626
MANAPPURAM 107.8(107.95)1684383
MANPASAND 390.4(379.9)407366
MARICO 312.15(308.15)824485
MARKSANS 37.95(38.15)1258850
MARUTI 8873.45(8850.95)609369
MAYURUNIQ 510(510.05)10409
MCDOWELL-N 3244.85(3291.95)249927
MCLEODRUSS 164(165.1)205364
MERCK 1546.5(1578.4)27861
MHRIL 290.25(290.55)67653
MINDACORP 191.8(187.25)311491
MINDTREE 814.05(815.1)1343617
MMTC 51.5(52.05)485819
MOIL 224.25(221.35)1080134
MONSANTO 2541.5(2510.95)10833
MOTHERSUMI 319.9(330)3280816
MOTILALOFS 1154(1136.05)89574
MPHASIS 854.85(859.7)171263
MRF 72683.65(73391.6)5016
MRPL 118.15(119.25)578643
MTNL 22.1(22.5)898151
MUTHOOTFIN 388.3(391.8)502948
NATCOPHARM 780.4(798.7)360818
NATIONALUM 67.3(68.55)4301132
NAUKRI 1299.3(1282.1)24971
NAVKARCORP 170.9(169.9)881058
NCC 130.65(131.7)6066623
NETWORK18 50.5(50.65)451739
NHPC 27.8(27.3)6651917
NIITTECH 871.4(834.5)2025848
NITINFIRE 5.6(5.65)383240
NLCINDIA 97.9(98.05)170260
NMDC 130.7(129.35)3679563
NTPC 163(163.25)2146760
OBEROIRLTY 510.05(519.15)655534
OFSS 3855.55(3941.6)35921
OIL 349.75(349.85)339238
OMAXE 225.8(226.4)260037
ONGC 189.7(188.3)3450224
ORIENTBANK 98.5(100.25)7970919
ORIENTCEM 159.8(159.9)47767
ORISSAMINE 1683.4(1692.35)3527
PAGEIND 21955.35(21887.7)7068
PARSVNATH 20.85(20.75)145752
PCJEWELLER 333.25(333.15)6189760
PEL 2547.05(2582.55)149181
PERSISTENT 834.8(855.25)97931
PETRONET 240.8(247.3)2138106
PFC 102.45(105.1)5933557
PFIZER 2282.9(2272.2)18332
PFS 29.9(30.15)1070452
PGHH 9413.85(9392.75)4290
PHOENIXLTD 606.05(576.6)220005
PIDILITIND 894.4(900.95)122382
PIIND 882.45(872.6)73240
PNB 101.05(101.4)122105493
POLARIS 471.5(471)31320
POWERGRID 197.4(197.7)4560010
PRAJIND 90.8(90.75)447104
PRESTIGE 328.1(335.3)174388
PRISMCEM 126.65(126.35)505911
PTC 100.5(102.75)1304179
PUNJLLOYD 20(19.8)784559
PURVA 141.1(145.05)109947
PVR 1305.35(1320.45)184880
RADICO 350.45(346.8)1021433
RAIN 362.35(380.9)5470534
RAJESHEXPO 796.65(837.55)208048
RALLIS 231.35(231.4)159278
RAMCOCEM 742.35(752.6)215752
RAMCOSYS 447.1(460.2)11183
RATNAMANI 963.2(945.5)16258
RAYMOND 936.9(954.45)523674
RCF 81.85(82.7)1173567
RCOM 27.9(28.35)81087484
RECLTD 142.15(144.3)5610855
REDINGTON 141.3(144.05)2489633
RELAXO 615.1(610.3)7700
RELCAPITAL 458.15(472.25)4931087
RELIANCE 948.4(954.55)4094652
RELINFRA 441.95(455.6)2242710
RENUKA 15.85(15.65)3059282
REPCOHOME 573.15(564.6)327446
RIIL 462.2(472.15)237698
RKFORGE 745.45(752)12127
RNAVAL 39.45(40.4)3808321
ROLTA 68.65(68.9)855230
RPOWER 43.45(44.7)8698793
RTNPOWER 5.95(6)2252426
RUCHISOYA 18.3(17.95)2505898
SADBHAV 398(400.9)65083
SADBHIN 132.05(134.55)63525
SAIL 80.9(83.2)12875529
SANOFI 5123(5096.25)3320
SBIN 262.15(268)22859175
SCHAEFFLER 5500.7(5447.4)6599
SCHNEIDER 107.85(110.05)142441
SCI 71.15(71.65)559776
SHARDACROP 398.4(400.15)10698
SHILPAMED 435.7(437.15)24281
SHK 290.4(284.8)121069
SHOPERSTOP 538.35(539.05)192031
SHREECEM 16595.35(16623.45)8558
SHRIRAMCIT 2008.95(2020.6)43924
SIEMENS 1153.15(1167.9)111727
SIMPLEXINF 570.55(579.65)4823
SINTEX 20.45(20.65)2636269
SITINET 18.65(18.75)172048
SJVN 34.7(34.6)284797
SKFINDIA 1768.8(1780.05)4693
SMLISUZU 804.8(815.4)19939
SNOWMAN 51.25(51.75)391353
SOBHA 554(554.75)129167
SOMANYCERA 676.75(677.95)12639
SONATSOFTW 319.05(321.2)275707
SOUTHBANK 26.05(26.6)6318573
SPARC 419.2(425.35)199192
SREINFRA 83.65(85)1005585
SRF 1892.65(1898.75)91056
SRTRANSFIN 1338.55(1333.85)523804
STAR 710.25(717.5)203912
STCINDIA 154.35(156.1)31770
SUNDARMFIN 1712.55(1757.15)16306
SUNDRMFAST 554.65(564.4)125434
SUNPHARMA 535.4(535.35)4264631
SUNTV 916.65(927.8)732700
SUPREMEIND 1191.7(1189.05)32220
SUVEN 191.25(187.85)144422
SUZLON 12.75(12.8)18430034
SWANENERGY 192.15(188.5)439088
SYMPHONY 1789.6(1786.8)70648
SYNDIBANK 60.65(61.1)4762791
SYNGENE 601.9(590.2)47886
TAKE 168.45(169.95)82047
TATACHEM 699.7(704.65)591242
TATACOFFEE 131.35(131.9)234829
TATACOMM 638.15(642.35)271665
TATAELXSI 1044.55(1053.25)296768
TATAGLOBAL 274.85(275.5)2322191
TATAMOTORS 370.75(369.9)6991806
TATAMTRDVR 207.45(206.9)1066276
TATAPOWER 84.3(84.5)6936315
TATASPONGE 1053.7(1049.1)188450
TATASTEEL 675.05(671.6)7128399
TBZ 104.2(104)78921
TCS 3037.7(3035.05)859062
TECHM 611.9(612.65)2226114
TECHNO 369.15(379.5)13840
TEXRAIL 94.3(94.85)308145
THERMAX 1217.7(1154.55)67248
THOMASCOOK 241.35(242.85)104979
TIDEWATER 6460.6(6451.35)331
TIMKEN 778.45(786.4)13682
TITAN 810.2(816.15)975986
TNPL 360.85(359.65)47471
TORNTPHARM 1338.1(1368.65)442347
TORNTPOWER 266.15(264.65)950377
TREEHOUSE 12(12)21675
TRIDENT 72.15(71.45)286665
TRITURBINE 119.05(122)214437
TTKPRESTIG 6956.35(6917.55)1431
TTML 6.15(6.2)381447
TV18BRDCST 61.7(62.65)5939188
TVSMOTOR 677.4(680.95)790120
TVSSRICHAK 3706.45(3769.3)2236
TVTODAY 458.55(465.5)58279
UBL 1054.2(1059.4)163160
UCOBANK 25.65(25.95)461429
UFLEX 372.85(370.8)81875
ULTRACEMCO 4153.3(4155.6)198915
UNICHEMLAB 333.9(331.45)137289
UNIONBANK 103.6(105.55)5853028
UNITECH 7.05(7.05)6299842
UPL 714.25(728.75)1877954
VAIBHAVGBL 692.65(693.95)2264
VAKRANGEE 154.6(162.7)389368
VEDL 323.25(329.75)8160931
VIDEOIND 14.2(14.65)2485896
VIJAYABANK 57.4(59.9)1120131
VINATIORGA 818.95(852.25)41969
VIPIND 347.95(338.45)269300
VOLTAS 619(609.4)3773902
VRLLOG 413.95(407.75)219884
VSTIND 3170.05(3176.55)860
VTL 1359.55(1347.95)16736
WABAG 548.85(550.6)43747
WABCOINDIA 7919.4(8092.05)15713
WELCORP 178.55(175.7)479064
WELSPUNIND 63.9(64.5)542797
WHIRLPOOL 1431.7(1432.5)15756
WIPRO 292.5(292.8)4085785
WOCKPHARMA 815.3(820.1)1508864
WONDERLA 380.55(378.25)20964
ZEEL 555.4(565.35)1671540
ZEELEARN 40.7(40.8)188632
ZENSARTECH 890.85(893.25)4986
ZYDUSWELL 1295.7(1251.25)55153

నేటి నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మూడు రోజులపాటు జరిగే క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో శుక్రవారంనాడు ప్రారంభంకానుంది. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రద ర్శన ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. నగరంలోని 150 మంది డెవలపర్లు ఈ ప్రాపర్టీ షోలో తమ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. రియల్టర్లు, డెవలపర్లు, బిల్డింగ్ మెటీరియల్ మాన్యుఫ్యాక్చ రర్లు, కన్సల్టెంట్లు, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్లు ఇందులో పాల్గొంటున్నట్టు ప్రదర్శన నిర్వాహకులు తెలిపారు. ఇంటి గ్రేటెడ్ టౌన్‌షిప్స్, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, గ్రీన్ బిల్డింగ్స్, రిటైల్, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఈ ప్రదర్శనలో భాగంకానున్నాయి.

పారిపోతే ఆస్తి జప్తు

పరారీ నేరగాళ్ల బిల్లుకు కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ: బ్యాంకుల నుంచి విచ్చలవిడిగా భారీ మొత్తంలో రుణాలు తీసుకుని వాటిని చెల్లించకుండా బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టేసి దేశం వదిలి పారిపోయే నీరవ్ మోదీ, విజయ్ మాల్యా వంటి మోసగాళ్ల ఆటలు కట్టినట్టే. అలాంటి వారి ఆస్తులను ఎలాంటి అను మతులతో పని లేకుండా స్వాధీనం చేసుకునేందుకు వీలు కల్పించే పరారీ నేరగాళ్ల బిల్లుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో శుక్ర వారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇలాంటి మోసగాళ్లు బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటినీ రికవరీ చేయడమే ఈ బిల్లు లక్ష్యం. 100 కోట్ల రూపాయల వరకు రుణ బకా యిలు ఉండి దేశం వదిలి పరారైన మోసకారులందరికీ ఇది వర్తిస్తుం దని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ కేబినెట్ సమావేశం అనంతరం తెలి పారు. ఈ నెల ఐదో తేదీ నుంచి ప్రారంభమయ్యే రెండో విడత పార్ల మెంటు బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లుకు సభల అనుమతి కోరను న్నట్టు ఆయన చెప్పారు. ప్రస్తుతం అమలులో ఉన్న మనీ లాండ రింగ నిరోధక చట్టానికి ఇది భిన్నంగా ఉంటుందని ఆయన అన్నారు. పిఎంఎల్‌ఏ చట్టం ప్రకారం నేరపూరిత చర్య ద్వారా ఆర్జించిన లాభాన్ని మాత్రమే రాబట్టుకునే వీలుంటుందని, అది కూడా కోర్టు నేరస్థుడుగా ప్రకటించిన తర్వాత మాత్రమే చర్యకు దిగాల్సిఉంటుం దని జైట్లీ తెలిపారు. కానీ కొత్త చట్టంలో అలాంటి మోసగాళ్ల సంబం ధిత రుణం ద్వారా సమకూర్చుకున్న ఆస్తులేకాకుండా వారి మొత్తం ఆస్తికి ఇది వర్తిస్తుందని ఆయన చెప్పారు. దేశం వదిలి పారిపోయిన నేరగాళ్లపై విచారణ ఎప్పటికీ పూర్తి కాదని, అలాంటప్పుడు వారి ఆస్తుల స్వాధీనం అనే అంశంలో హేతుబద్ధత ఎక్కడని ఆయన ప్రశ్నించారు. అందుకే "లొంగుబాటుకు సిద్ధం కాని వ్యక్తి అన్న కార ణంగా కోర్టు వారెంటు జారీ చేసిన మరుక్షణం నుంచి కొత్త చట్టం వర్తిస్తుంది" అని జైట్లీ చెప్పారు. 2017-18 బడ్జెట్‌లోనే ఇందుకు సంబంధించిన ప్రకటన చేసినా పిఎన్‌బికి టోపీ వేసి నీరవ్ మోదీ, అతని బంధువు మెహుల్ చోక్సీ దేశం వదిలి పరారైన సంఘటన నేపథ్యంలో దీన్ని త్వరితం చేశామని ఆయన అన్నారు. పాత, కొత్త కేసులన్నింటికీ కూడా ఇది వర్తిస్తుందని, ప్రత్యేక కోర్టు ద్వారా వారి ఆస్తుల రికవరీకి ఈ చట్టం వీలు కల్పిస్తుందని ఆయన తెలిపారు.

తప్పుడు ఆడిటర్ల కోసం ఎన్‌ఎఫ్ఆర్ఏ

మోసపూరిత కంపెనీలకు అండగా నిలిచే ఆడిటర్లకు ఉచ్చు బిగించడం లక్ష్యంగా జాతీయ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్‌ఎఫ్ఆర్ఏ) ఏర్పాటుకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. తప్పుడు పనులకు పాల్పడే ఆడిటర్లు, ఆడిటింగ్ సంస్థలపై చర్యలు తీసుకునేందుకు సంపూర్ణ అధికారాలు ఎన్ఎఫ్ఆర్ఏకి ఉంటాయి. ఇది సంపూర్ణ సర్వస్వతంత్ర సంస్థగా వ్యవహరిస్తుంది. కంపెనీల చట్టం 2013లోనే ఇందుకు సంబంధించిన నిబంధన ఉన్నప్పటికీ పిఎన్‌బి కుంభకోణంలో ఆడిటర్ల పాత్ర కూడా చర్చనీయాంశంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వ్యవస్థ ఏర్పాటయినట్టయితే తప్పుడు కార్య కలాపాలకు పాల్పడే ఆడిటర్లపై ప్రస్తుతం ఐసిఏఐకి గల అధికారాలన్నీ దానికి బదిలీ అవుతాయి.

తప్పుడు పనులు చేసే ఆడిటర్లు, ఆడిటింగ్ సంస్థ లను పది సంవత్సరాల వరకు డిబార్ చేయ డంతోపాటు భారీ పెనాల్టీలు విధించే అధికారం ఎన్ఎఫ్ఆర్ఏకు ఉంటుంది. ఎన్ఎఫ్ఆర్ఏలో చైర్ పర్సన్, ముగ్గురు పూర్తి కాల సభ్యులతో కలిపి 15 మంది సభ్యులుంటారు. వాస్తవా నికి కంపెనీల చట్టంలోని పలు అంశాలు 2014 ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వచ్చా యని, ఒక్క ఎన్ఎఫ్ఆర్ఏ ఏర్పాటు మాత్రమే జాప్యం అయిందని జైట్లీ అన్నారు. ఇది ఆడిటర్లందరి పర్యవేక్షణ సంస్థగా ఉండడంతో పాటు అన్ని లిస్టెడ్ కంపెనీలు, లిస్టింగ్ కాని భారీ కంపెనీలు కూడా దాని పరిధిలోకి వస్తాయని ఆయన చెప్పారు. అంతే కాకుండా ప్రజాప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఏ సంస్థ గురించైనా దర్యాప్తు చేపట్టే బాధ్యత దానికి అప్పగించవ చ్చునని ఆయన అన్నారు.

పరారీ నేరగాడెవరు?


నిర్దిష్ట నేరంపై కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసి ఉండి, ప్రాసిక్యూషన్ తప్పించుకు నేందుకు దేశం వదిలి పారిపోయిన లేదా విచారణ ఎదుర్కొనేందుకు దేశానికి తిరిగి రావడానికి నిరాకరిస్తున్న వ్యక్తిని పరారీలో ఉన్న నేరగాడుగా ఈ బిల్లులో నిర్వచిం చారు.

ఎన్‌ఎఫ్ఆర్ఏ ఏమిటి...?

తప్పుడు కార్యకలాపాలకు పాల్పడే కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసే ఆడి టర్ల కార్యకలాపాలకు ఉచ్చు బిగించే సర్వస్వతంత్ర వ్యవస్థ ఇది. దేశంలోని ఆడిటర్లు, ఆడిటింగ్ సంస్థలు, స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ అయిన కంపెనీలు, లిస్టింగ్ కాని భారీ కార్పొరేట్లు దీని పరిధిలోకి వస్తాయి.

ప్రపంచ కుబేరుల్లో భారత్‌కు మూడో స్థానం

దేశంలో 131 మంది శ్రీమంతులు
అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ





న్యూఢిల్లీ : ప్రస్తుతం చైనా, అమెరికా తర్వాత మన దేశంలోనే ఎక్కువ మంది సంపన్నులున్నారు. గురువారం వెలువడిన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ -2018' ప్రకారం... ప్రస్తుతం మన దేశంలో 100 కోట్ల డాలర్లు (బిలియన్) లేదా అంతకంటే ఎక్కువ ఆస్తులు ఉన్న వారి సంఖ్య 131. గత ఏడాదితో పోలిస్తే కొత్తగా 31 మంది ఈ జాబితాలో చేరారు. స్టాక్ మార్కెట్లో కొనసాగిన బూమ్ ఇందుకు బాగా దోహదం చేసింది.

ముకేశ్ అంబానీయే నెంబర్ వన్

గత ఏడాదిలా ఈ సంవత్సరం కూడా 45 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.92 లక్షల కోట్లు) ఆస్తులతో ముకేశ్ అంబానీ అత్యంత సంపన్నుడిగా నిలిచారు. గౌతమ్ అదానీ 14 బిలియన్ డాలర్ల (సుమారు రూ.91,000 కోట్లు) ఆస్తులతో రెండో స్థానంలో నిలిచారు. గత ఏడాదితో పోలిస్తే అంబానీ ఆస్తుల విలువ 73 శాతం, గౌతమ్ అదానీ ఆస్తుల విలువ 109 శాతం పెరిగాయి. హురున్ సంపన్నుల జాబితా ప్రకారం... ప్రస్తుతం ముకేశ్ అంబానీ ప్రపంచంలోని అత్యంత సంపన్నుల్లో 19వ స్థానంలో, అదానీ 98వ స్థానంలో ఉన్నారు. ప్రవాస భారతీయ సంపన్నులను కూడా కలుపుకుంటే జాబితాలోని భారత బిలియనీర్ల సంఖ్య 170కి చేరుతుంది. దాదాపు 18 బిలియన్ డాలర్ల ఆస్తులున్న ఉక్కు దిగ్గజం లక్ష్మీ నివాస్ మిట్టల్... ముకేశ్ అంబానీ తర్వాత రెండో అత్యంత సంపన్నుడైన భారతీయుడవుతారు.

రంగాల వారీగా ...

రంగాల వారీగా చూస్తే మన దేశంలోని అత్యంత సంపన్నుల్లో 19 మంది ఫార్మా రంగానికి, 14 మంది ఆటోమొబైల్ రంగానికి, 11 మంది కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగానికి చెందిన వ్యక్తులు ఉన్నారు.

ప్రపంచ జిడిపిలో 13.2 శాతం

ప్రపంచంలోని 68 దేశాల్లో 100 కోట్ల డాలర్ల (బిలియన్ డాలర్లు)కంటే ఎక్కువ సంపద ఉన్న వ్యక్తులు 2,694 మంది, కంపెనీలు 2,157 ఉన్నాయి. వీరి సంపద మొత్తం విలువ 10.5 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.682.5 లక్షల కోట్లు). ప్రపంచ జిడిపిలో ఇది 13.2 శాతానికి సమానం. గత ఏడాది కాలంలోనే ఈ కుబేరుల సంపద విలువ 31 శాతం పెరిగింది.

అమెరికాను అధిగమించిన చైనా

ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న బిలియనీర్లలో 819 మంది కమ్యూనిస్టు చైనాలో ఉంటే, అమెరికాలో 571 మంది మాత్రమే ఉన్నారు. గత ఏడాది ఈ విషయంలో రెండు దేశాలు దాదాపు ఒకే విధంగా ఉన్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల హవాతో ఈ సంవత్సరం చైనా ఈ విషయంలో అమెరికాను మించిపోయింది.

అమెజాన్ అధినేత అత్యంత ధనికుడు

ఈ సంవత్సరం 123 బిలియన్ డాలర్ల ఆస్తులతో అమెజాన్ చీఫ్ జెఫ్ బెజోస్ ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా నిలిచారు. తర్వాత 102 బిలియన్ డాలర్ల ఆస్తులతో వారెన్ బఫెట్ రెండో స్థానంలో, 90 బిలియన్ డాలర్ల ఆస్తులతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ మూడో స్థానంలో, 79 బిలియన్ డాలర్ల ఆస్తులతో ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ నాలుగో స్థానంలో నిలిచారు.

నాగర్నార్ ప్లాంట్‌లో 220 కెవి జిఐఎస్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : చత్తీస్‌గఢ్‌లోని నాగర్నార్ వద్ద ఎన్ఎండిసి నిర్మిస్తున్న స్టీల్ ప్లాంట్ ప్రారంభానికి సంబంధించి తొలి అడుగుపడింది. నాగర్నార్ ప్లాంట్‌లో 220 కెవి జిఐఎస్ (గ్యాస్ ఇన్‌సులేటెడ్ స్విచ్) మెయిన్ రిసీవింగ్ సబ్‌స్టేషన్‌ను ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ దశ్ ప్రారంభించారు. ఆపరేషనల్ పవర్ రిసీవింగ్ సిస్టమ్ ప్రారంభంతో స్టీల్ ప్లాంట్‌ను పూర్తి స్థాయిలో ఆరంభించే దిశగా అడుగులు పడినట్లయింది. జిఐఎస్ సిస్టమ్‌కు సంబంధించి మెయిన్ రిసీవింగ్ స్టేషన్ (ఎంఆర్ఎస్)ను ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకోగా జిఇ ఇండియా 140 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసింది. ఈ స్టేషన్‌కు సంబంధించి చత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (సిఎస్‌పిటిసిఎల్)కు చెందిన పర్చాన్‌పాల్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా కానుంది. నాగర్నార్ ప్లాంట్‌కు 296 మెగావాట్ల విద్యుత్ అవసరం కానుంది. ఇందులో 241 మెగావాట్లను సిఎస్‌పిటిసిఎల్ గ్రిడ్ ద్వారా ఎన్ఎండిసి అందుకోనుంది. కాగా గత ఏడాది సెప్టెంబరులో ఎన్ఎండిసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బజేంద్ర కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.

ముడి ఇనుప ఖనిజ ధర తగ్గింపు

మార్చి నెలకుగాను ముడి ఇనుప ఖనిజం ధరలను టన్నుకు 100 రూపాయలు తగ్గించినట్లు ఎన్ఎండిసి తెలిపింది. హయ్యర్ గ్రేడ్ ఐరన్ (లంప్స్) ధరలను టన్నుకు 3,100 రూపాయల నుంచి 3,000 రూపాయలకు తగ్గించినట్లు పేర్కొంది. అలాగే లో గ్రేడ్ ముడి ఇనుము ధరలను 2,760 రూపాయల నుంచి 2,660 రూపాయలకు తగ్గించినట్లు తెలిపింది.

హెపటైటిస్ సి ఔషధ అనుమతికి ఎఫ్‌డిఏకు నాట్కో దరఖాస్తు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రాణాంతక హెపటైటిస్- సి చికిత్సలో వినియోగించే సోఫోసుబువిర్ 400 ఎంజి టాబ్లెట్లకు సబంధించిన అనుమతి కోసం అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యుఎస్ ఎఫ్‌డిఏ)కి అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్ (అండా) దాఖలు చేసినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. ప్రస్తుతం ఈ ఔషధాన్ని గిలీడ్ సైన్సెస్ ఇంక్... సోవాల్డి బ్రాండ్ కింద విక్రయిస్తోంది. ఈ ఔషధానికి సంబంధించి పేరాగ్రాఫ్ 4 కింద ఎఫ్‌డిఏకు అండాను దాఖలును చేసినట్లు నాట్కో తెలిపింది. సోఫోసుబువిర్ ఔషధానికి ఎఫ్‌డిఏ నుంచి 180 రోజులు ప్రత్యేక మార్కెటింగ్ హక్కులను అందుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది. 2017, డిసెంబరుతో ముగిసిన పన్నెండు నెలల కాలానికి గాను అమెరికాలో ఈ ఔషధ విక్రయాలు 13 కోట్ల డాలర్లుగా ఉన్నాయి.

సింభోలీ షుగర్స్‌పై మనీలాండరింగ్ కేసు

సోదాల్లో కీలక పత్రాలు స్వాధీనం

న్యూఢిల్లీ: దాదాపు వంద కోట్ల రూపాయల బ్యాంక్ రుణ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సింభోలీ షుగర్స్, దాని ఉన్నతాధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించి హపూర్, నోయిడాలో సోదాలు కూడా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. సోదాల్లో భాగంగా కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు, పలు బ్యాంకుల నుంచి కంపెనీ, దాని ఉన్నతాధికారుల ఆర్థిక వివరాలను కూడా ఇడి సేకరించిందని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఈ వారం తొలినాళ్లలో సింభోలీ షుగర్స్‌పై సిబిఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఇడి తాజాగా సంస్థపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఏ) ప్రకారంగా క్రిమినల్ కేసు దాఖలు చేసింది. బ్యాంక్ నుంచి రుణంగా తీసుకున్న నిధులతో లాండరింగ్‌కు పాల్పడి అక్రమాస్తులు, నల్లధనాన్ని కూడబెట్టుకున్నారా..? అన్న దిశగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ దర్యాప్తు చేయనుంది. దేశంలోని అతిపెద్ద చక్కెర మిల్లుల్లో సింభోలీ షుగర్స్ ఒకటి.

ఇదీ కేసు నేపథ్యం..

ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఒబిసి) నుంచి సింభోలీ షుగర్స్ 2011లో రూ.148.60 కోట్ల రుణం తీసుకుంది. అప్పట్లో ఆర్‌బిఐ ప్రకటించిన ఓ స్కీమ్‌లో భాగంగా 2012లో జనవరి 25 నుంచి మార్చి 13 వరకు కంపెనీకి చెరకు సరఫరా చేసేందుకు వీలుగా 5,762 మంది రైతులకు నిధులు సమకూర్చేందుకు సంస్థ ఈ రుణం పొందింది. కానీ ఈ రుణ నిధులను సంస్థ తన సొంత అవసరాల కోసం వాడుకుంది. మార్చి 13, 2015లో ఈ రుణ ఖాతాకు సంబంధించిన రూ.97.85 కోట్ల బకాయిలు మొండి పద్దుల్లోకి చేరాయి. సంస్థ తమను మోసం చేసిందని 2015 మే 13న ఒబిసి రిజర్వ్ బ్యాంక్‌కు సమాచారం అందించింది. ఇది కాకుండా, 2015 జనవరి 25న సంస్థకు బ్యాంక్ కార్పొరేట్ రుణంగా రూ.110 కోట్లు మంజూరు చేసింది. రూ.97.85 కోట్ల పాత బకాయిలను తీర్చేందుకే ఈ రుణం అందించినట్లు బ్యాంక్ తెలిపింది. కానీ ఈ రుణ ఖాతా కూడా 2016 నవంబరు 29న మొండి పద్దుల జాబితాలో చేరింది. సింభోలీ షుగర్స్ తమను మోసం చేసిందని ఒబిసి గత ఏడాది నవంబర్ 17న సిబిఐకి ఫిర్యాదు చేసింది. అయితే ఏజెన్సీ ఈనెల 22న క్రిమినల్ కేసు నమోదు చేసింది. సింభోలీ షుగర్స్‌తోపాటు అప్పట్లో దాని చైర్మన్ గుర్మీత్ సింగ్, డిప్యూటీ ఎండి (ప్రస్తుత డైరెక్టర్) గురుపాల్ సింగ్, సిఇఒ జిఎస్‌సి రావు, సిఎఫ్ఒ సంజయ్ తపారియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గురసిమ్రన్ కౌర్ మన్ తదితరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. ఈ సంస్థ బ్యాంక్‌ను రూ.97.85 కోట్ల మేర మోసగించిందని, ఫలితంగా బ్యాంక్‌కు రూ.109.08 కోట్ల నష్టం వాటిల్లిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు సంస్థ తీసుకున్న రెండు రుణాలపై ప్రధానంగా దృష్టిసారించనున్నాయి.

'ద్వారకా దాస్' కేసులో ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించిన సిబిఐ

ఢిల్లీకి చెందిన జువెలరీ సంస్థ 'ద్వారకా దాస్ సేథ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్' ప్రమోటర్ సభ్య సేథ్‌ను వెతికి పట్టుకునే విషయంలో సిబిఐ ఇంటర్‌పోల్ సాయం కోరింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఒబిసి)లో వెలుగు చూసిన రూ.389.85 కోట్ల రుణ మోసం కేసులో సేథ్ ప్రధాన నిందితుడు. 2007 నుంచి 2012 మధ్యకాలంలో ద్వారకా దాస్ సేథ్ సంస్థ ఒబిసి నుంచి పలు దఫాల్లో రూ.389 కోట్ల రుణాలు తీసుకుంది. ఈ కేసుకు సంబంధించి సేథ్ తల్లి రీటా సేథ్ (ఎఫ్ఐఆర్‌లో ఈమె పేరు కూడా ఉంది), భార్య పునీతను ఏజెన్సీ గురువారం నాడు ప్రశ్నించింది.

పంజాబ్ సిఎం అల్లుడిపై ప్రశ్నల వర్షం

సింభోలీ షుగర్స్ కేసుకు సంబంధించి పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ అల్లుడు గురుపాల్ సింగ్‌ను సిబిఐ ప్రశ్నించింది. గురుపాల్ సింగ్ ఈ సంస్థకు డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. తన అల్లుడిపై వచ్చిన ఆరోపణలను పంజాబ్ సిఎం తోసిపుచ్చారు. గురుపాల్ సింగ్‌తోపాటు సంస్థ మాజీ సిఇఒ జిఎస్‌సి రావును సైతం సిబిఐ ప్రశ్నించింది.

ఉచ్చు బిగుస్తోంది

పిఎన్‌బి స్కామ్‌పై ఇడి దర్యాప్తు ముమ్మరం

- రూ.1,217 కోట్ల చోక్సీ ఆస్తుల జప్తు
- బ్యాంక్ ఎండిని విచారించిన ఏజెన్సీ



ముంబై/న్యూఢిల్లీ: పిఎన్‌బి కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.. గీతాంజలి జెమ్స్, దాని ప్రమోటర్ మెహుల్ చోక్సీకి చెందిన 41 ఆస్తులను జప్తు చేసింది. వీటి విలువ రూ.1,217.2 కోట్లు ఉండవచ్చని ఇడి అంచనా వేస్తోంది. అంతేకాదు, గురువారం ముంబైలోని తన జోనల్ కార్యాలయంలో పిఎన్‌బి ఎండి, సిఇఒ సునీల్ మెహతాను ఏజెన్సీ విచారించింది. ఈ మోసం ఎలా జరిగింది అన్న విషయంపై ఓ అవగాహనకు వచ్చేందుకు ఈవారం తొలినాళ్లలో బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవి బ్రహ్మాజీ రావ్‌ను ఇడి ప్రశ్నించిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఏ) ప్రకారంగా ఇడి అటాచ్ చేసిన చోక్సీ ఆస్తుల జాబితాలో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో గీతాంజలి జెమ్స్‌కున్న 170 ఎకరాల పార్క్ కూడా ఉంది.

నీరవ్‌పై ఐటి లుక్ ఔట్ నోటీసు

పిఎన్‌బి స్కామ్‌లో ప్రధాన నిందితుడు నీరవ్ మోదీపై పన్ను ఎగవేత ఆరోపణలకు సంబంధించి ఆదాయం పన్ను (ఐటి) శాఖ నాలుగు స్థిరాస్తులను జప్తు చేసింది. అందులో ఫామ్‌హౌజ్, సోలార్ పవర్ ప్లాంట్ కూడా ఉన్నాయి. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు వ్యతిరేకంగా లుక్ ఔట్ నోటీసు కూడా జారీ చేసింది.

నీరవ్ సంస్థల డిపాజిట్ ఖాతాల స్తంభన

నీరవ్ మోదీ గ్రూప్ సంస్థలకు చెందిన మూడు డిపాజిట్ ఖాతాలను స్తంభింపజేసినట్లు ఎస్‌బిఐ ప్రకటించింది. ఈ ఖాతాల వివరాలను దర్యాప్తు ఏజెన్సీలకు అందజేసినట్లు బ్యాంక్ అధికారులు తెలిపారు. తామే చొరవ తీసుకొని అంతర్గత తనిఖీ జరపగా, విదేశాల్లోని బ్యాంక్ బ్రాంచీల్లో నీరవ్‌కు చెందిన మూడు డిపాజిట్ అకౌంట్‌ల వివరాలు బయటికొచ్చాయని వార న్నారు. ఈ ఖాతాలు ఎస్‌బిఐకి దుబాయ్, బహ్రెయిన్, అంట్‌వెర్ప్‌లో ఉన్న శాఖలకు చెందినవి.

ఎల్ఒయు సంబంధిత పత్రాలు స్వాధీనం

పిఎన్‌బి స్కామ్‌లో సోదాలను కొనసాగిస్తున్న సిబిఐకి లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్ (ఎల్ఒయు)ల ద్వారా నీరవ్ మోదీ పొందిన రుణాలకు సంబంధించి కీలక పత్రాలు లభించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో అరెస్ట్ అయిన కొందరు వ్యక్తులను విచారించడం ద్వారా లభించిన సమాచారం ఆధారంగా ఈ సోదాలు జరిపినట్లు అధికారులు తెలిపారు. ముంబైలోని వడాలాలో ఉన్న అద్దె గృహాల సముదాయంలో ఈ పత్రాలు లభించాయి. అధికారికంగా తన పేరుమీద లేకపోయినప్పటికీ ఆ బిల్డింగ్ నీరవ్ మోదీదే అని సమాచారం.

మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్ అరెస్ట్

ఈకేసులో పిఎన్‌బికి చెందిన మరో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను సిబిఐ అరెస్ట్ చేసింది. అంతర్గత చీఫ్ ఆడిటర్ బిష్ణుబ్రత మిశ్రాను అదుపులోకి తీసుకుంది. పిఎన్‌బి ముంబై బ్రాడీ హౌజ్ బ్రాంచ్‌లో 2011-2015 కాలానికి ఆడిటింగ్ నిర్వహించి జోనల్ ఆఫీసుకు రిపోర్టు చేయాల్సిన బాధ్యతలను ఈయనే నిర్వహించారు.


యుబిఐ మాజీ సిఎండిపై కేసు



ఆదాయానికి మించి ఆసులున్నాయన్న ఆరోపణలపై యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) అర్చన భార్గవపై సిబిఐ కేసు నమోదు చేసింది. భార్గవ రూ.3.63 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నారని, తన అధికారిక ఆదాయం కంటే 133.23 శాతం అధికమని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. పలు బ్యాంకుల్లో కీలక పదవుల్లో పని చేసిన అర్చన భార్గవ.. 2004లో పిఎన్‌బి డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. 2008లో జనరల్ మేనేజర్ అయ్యారు. అలాగే 2011 ఏప్రిల్ 1 నుంచి 2013 ఏప్రిల్ 22 వరకు కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2013 ఏప్రిల్ 23న యుబిఐ సిఎండిగా నియమితులై 2014 ఫిబ్రవరి 20 వరకు కొనసాగారు. 2016లోనే భార్గవపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి సిబిఐ ఆమెపై కేసు నమోదు చేసింది. ప్రస్తుత కేసుకదే మూలాధారం. అప్పట్లో భార్గవ ఇంట్లో సిబిఐ సోదాలు జరిపి రూ.2.85 కోట్ల విలువైన ఆభరణాలతో పాటు ఆమె, తన కుటుంబ సభ్యుల పేరిట లాకర్లలో దాచుకున్న రూ.10.50 లక్షల నగదు, రూ.5.42 కోట్ల డిపాజిట్లను స్వాధీనం చేసుకుంది. అలాగే తన బ్యాంక్ ఖాతాల్లోని రూ.2.26 కోట్ల సొమ్మును, రెండు ఆస్తుల పత్రాలను కూడా రికవర్ చేసుకుంది.

సుభిక్షా గ్రూప్ చైర్మన్ సుబ్రమణియన్ అరెస్టు

- బిఒబికి రూ.77 కోట్ల రుణం ఎగవేత



చెన్నై (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ ఆఫ్ బరోడా(బిఒబి) నుంచి పొందిన రూ.77 కోట్ల రుణాన్ని తిరిగి చెల్లించకుండా మోసగించాడనే ఆరోపణలపై చెన్నైకి చెందిన సుభిక్షా గ్రూప్ చైర్మన్ ఆర్ సుబ్రమణియన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది. సుబ్రమణియన్ చెన్నైలో సుభిక్షా బ్రాండ్‌నేమ్‌తో సూపర్ మార్కెట్లను నిర్వహించేవారు. వాటికి తోడు విశ్వప్రియ ఫైనాన్స్ పేరుతో అధిక వడ్డీలిస్తామంటూ ఇన్వెస్టర్లను రూ.250 కోట్ల దాకా మోసగించారనే ఆరోపణలున్నాయి. ఇన్వెస్టర్ల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన చెన్నై క్రైం పోలీసులు 2015లో ఆయనను అరెస్టు చేశారు. ఆయనకు చెందిన రూ.53 కోట్ల ఆస్తులను అప్పట్లో జప్తు చేశారు. ఇదిలా ఉండగా.. సుభిక్షా సూపర్ మార్కెట్లను విస్తరించేందుకు ఆయన బిఒబి నుంచి రూ.77 కోట్ల రుణం పొంది, దానిని ఫైనాన్స్ సంస్థ కోసం వాడుకున్నారని సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణలో వెల్లడైంది. దాంతో సుబ్రమణియన్‌ను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్ఏ) కింద సుబ్రమణియన్, ఆయన సంస్థలకు చెందిన రూ.4.5 కోట్ల ఆస్తులను గత ఏడాది జప్తు చేసింది. సుభిక్షా సూపర్ మార్కెట్ల పేరు మీద బ్యాంకుల కన్సార్షియం నుంచి తీసుకున్న రూ.790 కోట్ల రుణాన్ని కూడా సుబ్రమణియన్ తిరిగి చెల్లించలేదని తమ దృష్టికి వచ్చినట్లు దర్యాప్తు ఏజెన్సీ పేర్కొంది.

సీజన్




మామిడి దిగుబడి భేష్

- పండ్ల తోటల విస్తీర్ణంలో సగానికి సగం మామిడే
- నీటి యాజమాన్య పద్ధతుల వల్లే అధిక దిగుబడులు



తెలంగాణ వ్యాప్తంగా 2.04 లక్షల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి. తోటలు ప్రస్తుతం పూత దశలో వున్నాయి. ఈసారి పూత ఆలస్యంగా వచ్చినా దిగుబడికి ఢోకా లేదంటున్నారు శాస్త్రవేత్తలు. మామిడి పూతను కాపాడుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? నీటి యాజమాన్య పద్ధతులు ఎలా పాటించాలనే అంశాలపై కథనం.

తెలంగాణ రాష్ట్రంలో మామిడి తోటల పెంపకంలో బంగినపల్లి రకానికి గిరాకీ అధికం. రాష్ట్రంలో సుమారు 2.04 లక్షల హెక్టార్లలో మామిడి తోటలున్నాయి. ప్రతి సంవత్సరం 17 మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి అవుతున్నది. రాష్ట్రంలో ముఖ్యంగా ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో మామిడి పంట విస్తారంగా పండుతున్నది. రాష్ట్రంలో పండ్ల తోటల విస్తీర్ణంలో సగానికి సగం మామిడి ఉన్నది. మామిడి పంటలో వాణిజ్య రకమైన బంగినపల్లి రకం సుమారు డెబ్భై శాతం విస్తీర్ణంలో వుంది. మామిడితో పాటు పలు ఉద్యాన పంటలపై సంగారెడ్డిలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన ఫల పరిశోధనా కేంద్రం పరిశోధనలు చేస్తున్నది. దశాబ్దం కిందట మంజీర పేరుతో కొత్తరకం మామిడిని కూడా ఈ పరిశోధన కేంద్రం కనుగొన్నది.

నీటి యాజమాన్యం ప్రధానం

మామిడికాయ పెద్దదిగా, రుచిగా రావాలంటే సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. డ్రిప్ పద్ధతి ద్వారా ప్రతి చెట్టుకు రోజుకు కనీసం గంట నుంచి రెండు గంటల వరకు నీరు అందించాల్సి ఉంటుంది. పదిహేను సంవత్సరాల పైనున్న చెట్టుకు నాలుగు డ్రిప్‌ల ద్వారా నీరు ఇవ్వాలి. మామిడి పూత పిందె సమయంలో బూడిద రోగం ఆశించి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. బూడిదరోగ నివారణకు నీటిలో కరిగే గంధకం (సల్ఫర్) మూడు గ్రాములు లీటర్ నీటికి లేదా హెక్సికోనజోల్ ఒక మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడికాయలు మంచి సైజులో పెరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. కాయ నిమ్మకాయ దశలో ఉన్నప్పుడే 10 గ్రాముల 13-0-45 గ్రేడు మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మామిడిలో నీరు కట్టడం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ చివరి వారం వరకు చేయాలి. కాయ కోతకు పదిరోజుల ముందే నీరు పెట్టడం ఆపాలి.

ఈసారి ఆలస్యంగా పూత

గత ఏడాదితో పోలిస్తే ఈసారి 20 రోజులు ఆలస్యంగా మామిడి పూత వచ్చింది. మామిడి పూతను ఉష్ణోగ్రత చాలా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా రాత్రిపూట తగిన ఉష్ణోగ్రతలు అవసరం. రాత్రిపూట ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే తక్కువగా 15 రోజులు వరసగా వుండటం మామిడి పూత వచ్చేందుకు ప్రధానం. ఈ కారణంగా మామిడిపూత ఏటా 20 రోజుల ముందు కాని 20 రోజుల తర్వాత కాని వస్తుంది. ఈ ఏడాది పూత ఆలస్యంగా వచ్చినా ఇప్పటికే చిన్న పిందెలు వస్తున్నాయి.

సంగారెడ్డి మామిడిచెట్లను దిగుబడి రావడానికి ఆర్నెల్ల ముందే టెండర్ల ద్వారా వేలం వేస్తారు. వేలంలో మామిడి చెట్లను పొందిన వారు స్థానికంగా షాపులు ఏర్పాటుచేసి, మామిడి పండ్లను విక్రయిస్తారు. అలాగే హైదరాబాద్‌లోని విక్రయ కేంద్రాలకు ఇక్కడి నుంచి మామిడి పండ్లను సరఫరా చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి

నీరు కడితే ఎక్కువ పిందెలు



తెలంగాణలో ప్రస్తుతం వున్న వాతావరణ పరిస్థితులు మామిడి తోటల్లో పిందె కట్టడానికి అనుకూలంగా ఉన్నాయి. ఈ సమయంలో రైతులు మామిడికి నీరు కట్టాలి. దీనివల్ల పిందెలు ఎక్కువగా వస్తాయి. పిందెను, కాయను కాపాడుకోవడం ద్వారా మంచి దిగుబడి సాధించే అవకాశం వుంటుంది.


- డా. ఎ.భగవాన్, ప్రధాన శాస్త్రవేత్త, మామిడి పరిశోధనా క్షేత్రం, సంగారెడ్డి




బెంగుళూరు వంటి శీతల ప్రాంతాల్లో అధికంగా పండే క్యాప్సికమ్‌ను పాలిహౌజ్‌లో సాగుచేస్తూ లాభాలు అందుకుంటున్నారు మహిళారైతు చింతకుంట్ల శాలిని. ఆధునిక పద్ధతిలో సేద్యం చేస్తున్న రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని మొదళ్లగూడకు చెందిన ఆ రైతును కలుద్దాం రండి.

క్యాప్సికం సాగులో మహిళారైతు విజయం

పాలీహౌజ్ సేద్యం .. 2 నుంచి 4 లక్షలు లాభం



విజయగాథ

భర్త చింతకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగి. పెద్దల నుంచి సంక్రమించిన భూమిని ఎవరికో సాగుకు ఇచ్చే కంటే సొంతగా సేద్యం చేయాలనుకున్నారు ఆయన సతీమణి శాలిని. ప్రభుత్వం కల్పించిన 75 శాతం సబ్సిడీతో మూడు ఎకరాల్లో మూడు పాలీహౌజ్‌లను నిర్మించారు. పాలీహౌజ్‌లో పంటల సాగుపై శిక్షణ పొందిన శాలిని మొదటి రెండు సంవత్సరాలు కలర్ క్యాప్సికమ్, కీరా పంటలను సాగు చేశారు. ఎరుపు, పసుపు రంగుల్లోని క్యాప్సికమ్‌ను సాగుచేసి అధిక ఉత్పత్తులను సాధించారు. కలర్ క్యాప్సికమ్ ఉత్పత్తులకు మార్కెట్ సమస్యలు ఎదురవడంతో గత ఏడాది నుంచి గ్రీన్ క్యాప్సికమ్‌ను సాగు చేస్తున్నారు. నారు పోసి మొక్కనాటిన రెండు నెలల నుంచి కాయల దిగుబడి మొదలవుతుంది. తగిన సస్యరక్షణ చర్యలు తీసుకుంటే ఏడు నెలల వరకు పంట వస్తుంది. ఎకరం పాలీహౌజ్‌లో 40 టన్నుల వరకు క్యాప్సికమ్ దిగుబడిని సాధించవచ్చన్నారామె. కలర్ క్యాప్సికమ్ సాగు కోసం ప్రతి షెడ్డుకు విత్తనం మొదలుకుని పంట పూర్తి అయ్యే వరకు రెండు లక్షల వరకు ఖర్చయింది. నాలుగు లక్షల లాభం వచ్చింది. గ్రీన్ క్యాప్సికమ్‌లో లక్షా యాభై వేల వరకు ఖర్చు వచ్చినా రెండు నుంచి నాలుగు లక్షల వరకు ఆదాయం పొందవచ్చంటున్నారామె. హైదరాబాద్ పరిసరాల్లోని పాలీహౌజ్‌ల్లో క్యాప్సికమ్ ఉత్పత్తులు పెరిగినా ధర మాత్రం ఆశించినంతగా వుండటం లేదు. బెంగళూర్ నుంచి క్యాప్సికమ్ మన మార్కెట్‌కు దిగుమతి కావడం, ధరలు తగ్గడం రైతులకు సమస్యగా మారాయి. గత ఏడాది మాదిరిగా కిలో 50 నుంచి 60 రూపాయల వరకు ధర ఉంటే క్యాప్సికమ్ సాగు కాసుల కురిపిస్తుందంటున్నారు రైతులు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, షాద్‌నగర్

ధర ఉంటే.. మంచి లాభాలు

వ్యవసాయ ఉత్పత్తులకు ఇస్తున్నట్టుగానే కూరగాయల పంటలకు కూడా ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తే రైతులు లాభపడతారు. కలర్ క్యాప్సికమ్ పండించినా, పంటను అమ్మాలంటే మాల్స్‌ను ఆశ్రయించాలి. వారిచ్చిన ధర తీసుకోవాలి. అందుకే గ్రీన్ క్యాప్సికం పండిస్తున్నాను. షాద్‌నగర్, శంషాబాద్ మార్కెట్లకు తీసుకువెళ్తే 15 నుంచి 20 రూపాయల ధర మాత్రమే వస్తున్నది. మా నుంచి తక్కువకు కొని వ్యాపారాలు మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవచూపాలి. ధర తక్కువ వున్నా క్యాప్సికమ్ సాగు తప్పక లాభాలు అందిస్తుంది. సేద్యం చేయడంతో పాటు పదిమందికీ ఉపాధి కల్పిస్తున్నందుకు ఆనందంగా వుంది.

- చింతకుంట్ల శాలిని



సలహా

కాండం తొలిచే పురుగుతో భద్రం

వివిధ పంటలకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతాంగానికి ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు ఈ దిగువ సూచనలు చేస్తున్నారు.

వరి : రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా వాతావరణం ప్రధానంగా పొడిగా ఉంది. ఈ పరిస్థితుల్లో వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశించే ప్రమాదం ఉంది కాబట్టి ఆ పురుగు ఆశించకుండా ముందు జాగ్రత్తగా నాటిన 15-20 రోజుల లోపు కార్బోఫ్యూరాన్ 3-జి గుళికలు ఎకరానికి 10 కిలోలు వేసుకోవాలి. వరిలో జింకు ధాతు లోపం గమనించినట్లయితే రెండు గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి అయిదు నుంచి ఏడు రోజుల వ్యవధిలో రెండు మూడుసార్లు పిచికారీ చేయాలి.

మొక్కజొన్న : మొక్కజొన్నలో బెట్ట వాతావరణ పరిస్థితులలో పేనుబంక ఆశించే అవకాశాలున్నాయి. దీని నివారణకు రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్ లేదా మిథైల్ డెమిటాన్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

దేశీ ఆవుపాలు అమృతం

లీటరు 80కి విక్రయం

నెలకు 50 వేల ఆదాయం

వైవిధ్యం



వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం కొత్తపెల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి బీఎస్సీ వరకు చదువుకున్నాడు. ఒక స్వచ్ఛంద సంస్థలో అయిదేళ్లు పనిచేశాడు. ఆ తరువాత ఒక సహజ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నప్పుడు ఆవు గొప్పతనం తెలుసుకున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న తన కుమారుడికి నిత్యం ఆవుపాలు తాగించడం వల్ల స్వస్థత చేకూరడంతో గోవులను అది కూడా దేశీ గోవులను పెంచాలని సంకల్పించాడు. గ్రామ శివార్లలో ఆయనకు ఆరెకరాల భూమి వుంది. దాన్ని గో పోషణ క్షేత్రంగా మార్చారు రమణారెడ్డి. 2016లో బ్యాంక్ నుంచి రూ. 12 లక్షల రుణం తీసుకున్నారు. గుజరాత్ రాష్ట్రానికి వెళ్లి అధిక పాలనిచ్చే ఎనిమిది గిర్ జాతి ఆవులను కొనుగోలు చేసి తీసుకొచ్చారు. తన వ్యవసాయ భూమిలో షెడ్డు నిర్మించి ఆవులను పోషించడం మొదలుపెట్టారు. మిగిలిన పొలంలో గోవుల కోసం పచ్చిగడ్డిని పెంచుతున్నాడు. ఎనిమిది ఆవులు సగటున ఏడు లీటర్ల చొప్పున పాలు ఇస్తుండగా రోజూ సుమారుగా 60 లీటర్ల పాలను, లీటర్‌కు రూ.80 చొప్పున విక్రయిస్తున్నాడు. పాలను లీటర్, అర లీటర్ ప్యాకెట్లలో నింపి విక్రయించడం ప్రారంభించారు. లీటరుకు 10 రూపాయల కమిషన్ ఇచ్చి ఇద్దరు యువకులను పంపిణీకి నియమించుకున్నారు. వరంగల్, కాజీపేట, హన్మకొండలో పలు కుటుంబాలకు స్వచ్ఛమైన దేశీ గోవు పాలను విక్రయిస్తున్నాడు. ఆవుల సంరక్షణకు బీహార్‌కు చెందిన ఇద్దరు యువకుల్ని నియమించుకున్నారు రమణారెడ్డి. వారికి ఒక్కొక్కరికి రూ.12వేల జీతం ఇస్తున్నారు. పాల విక్రయం ద్వారా రోజుకు అయిదు వేల ఆదాయం పొందుతున్నారు. గో మూత్రాన్ని సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు లీటరుకు 10 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు. గోవుల పేడను ట్రాక్టరు రూ.2500 చొప్పున విక్రయిస్తున్నారు.

తల్లి పాలు అంతగా లభ్యంకాని శిశువులు, నెలల వయసున్న చిన్న పిల్లలకు తాగించడానికి పలువురు ఆవుపాలను ఎంచుకుంటున్నారు. కొందరు డైరీ ఫాం నిర్వహిస్తున్న వ్యక్తులు కూడా వారి కుటుంబాల కోసం తమ దగ్గర నుంచి ఆవు పాలను కొనుగోలు చేస్తున్నట్లు రమణారెడ్డి తెలిపారు. పాల అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో 70 శాతం ఖర్చులకు పోతున్నది. ఆవుల పేడ, మూత్రం విక్రయాల వల్ల అదనపు ఆదాయం సమకూరుతున్నట్లు ఆయన తెలిపారు. యజ్ఞ, యాగాదులకు అవసరమైన అగరబత్తులను, పిడకలను తయారుచేయాలని ఆలోచనతో ఉన్నట్లు రమణారెడ్డి వివరించారు.

> **ఆవు మూపురంలో వున్న గల సూర్య కేతునాడి ఎండ నుంచి శక్తిని గ్రహించి పాలలో, పేడలో, మూత్రంలో పోషకాలను కలిగిస్తుంది. ఆక్సిజన్‌ను పీల్చుకొని, ఆక్సిజన్‌ను బయటికి వదిలేది ఆవు ఒక్కటే. ఆవు ఇంటి ముందుంటే దాని ఉచ్వాస, నిశ్వాసలతో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుందంటున్నారు రమణారెడ్డి.**

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్ అర్బన్

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే అవకాశం వుండటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలువురు రైతులు మల్బరీ సాగు, పట్టుగూళ్ల పెంపకంపై దృష్టి సారించారు. ప్రభుత్వ సబ్సిడీలు పట్టుసాగును మరింత ఆకర్షణీయంగా మార్చాయి.

చిన్నరైతుకు పట్టు సిరులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, దుమ్ముగూడెం, అశ్వాపురం, మణుగూరు, బూర్గంపాడు, పాల్వంచ, ములకలపల్లి, పినపాక, కరకగూడెం, అశ్వారావుపేట, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో రైతులు మల్బరీ సాగుపై దృష్టి సారిస్తున్నారు. జిల్లాకు చెందిన 60 మంది రైతులు 145 ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తున్నారు. ప్రభుత్వం మల్బరీ సాగుపై ప్రత్యేక శద్ధ చూపడం, రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడంతో మరింతమంది రైతులు పట్టు సాగు దిశగా అడుగులు వేస్తున్నారు.

ఉపాధి



పట్టు సాగు వల్ల ఏడాది పొడవునా ఉపాధి లభిస్తుంది. నీటి వసతి తక్కువగా వున్న ప్రాంతాల్లో కూడా, అతి తక్కువ పెట్టుబడితో దీనిని సాగు చేయవచ్చు. చౌడు, నల్లరేగడి భూములు మినహా మిగతా అన్ని రకాల భూముల్లో, అన్ని కాలాల్లో మల్బరీ సాగు చేసుకోవచ్చు. ఏడాది పొడవునా మంచి ఆదాయం పొందే వీలు కూడా వుండటంతో పలువురు రైతులు పట్టు సాగు చేపడుతున్నారు. మల్బరీ సాగు చేసే రైతులకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పట్టు పురుగుల పెంపకం గది(షెడ్డు) నిర్మాణానికి రూ.1.03 లక్షలు అందిస్తోంది. సాగు ఖర్చుల కోసం మొదటి ఏడాది రూ.50,468, రెండో ఏడాది రూ.44,269 చొప్పున రైతుకు ప్రభుత్వం అందిస్తున్నది. ఎస్సీ, సన్న చిన్నకారు రైతులకు రెండెకరాల మల్బరీ సాగుకు, పట్టు పురుగుల పెంపకానికి రూ.3.49 లక్షలను ప్రభుత్వం రాయితీపై అందజేస్తోంది. మల్బరీ మొక్కను ఒకసారి నాటితే 15 సంవత్సరాల వరకు దిగుబడి పొందవచ్చు. మల్బరీ తోటను రెండు లేదా మూడు భాగాలుగా సాగు చేస్తే ఏడాదిలో 10-11 పంటలు తీసే వీలుంటుంది. ఆధునిక పద్ధతులలో రేరింగ్ గది నిర్మించి తగినన్ని పరికరాలు ఏర్పాటు చేసుకుంటే దిగుబడి పెరిగే అవకాశాలున్నాయి. హైదరాబాద్‌లోని తిరుమలగిరి, జనగామ జిల్లాలోని జనగామలో పట్టుగూళ్ల మార్కెట్లున్నాయి. ఇక్కడ గూళ్ల నాణ్యతను బట్టి ధరలుంటాయి. బీవీ పట్టు గూళ్లపై కిలో రూ.75, సీ, బీ, గూళ్లపై కిలో రూ.40 ప్రభుత్వం ప్రోత్సాహంగా అందజేస్తోంది. ఏడాదికి 20-30 వేలు పెట్టుబడి పెడితే రూ.6 లక్షలు వరకు సంపాదించుకొనేందుకు అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, భద్రాచలం టౌన్

అధిక లాభాలు

ఎకరంలో మల్బరీ సాగు చేసి పట్టుగూళ్లు పెంచడం వల్ల 45 రోజుల్లోనే రూ. 2.84 లక్షలు ఆదాయం వచ్చింది. గతంలో పత్తి సాగు చేసేవాడిని. ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఈ ఏడాది పట్టు సాగు చేశా. వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయం మల్బరీ పంట.

- ఎం.ముకుందరెడ్డి, లక్ష్మీపురం రైతు

మల్బరీ సాగు మేలు

సన్న, చిన్నకారు రైతులకు మల్బరీ సాగు ఎంతో లాభదాయకం. పెట్టుబడి తక్కువ. ప్రభుత్వ రాయితీల కారణంగా అధిక లాభాలు కూడా పొందే వీలుంటుంది. పత్తి సాగు చేపట్టి చేతులు కాల్చుకునే కంటే మల్బరీ సాగు చేసి, పట్టు గూళ్లు పెంచకోవడం శ్రేయస్కరం.

- పి. సూరిబాబు, జిల్లా పరిశ్రమ సహాయాధికారి

ఇండోర్ మొక్కలతో కనువిందు

గృహ శోభ

> **ఇంటి అందాన్ని రెట్టింపు చేయడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడంలో మొక్కల పాత్ర ఎనలేనిది. అందుకే మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి వ్యాపకంగా మారింది.**

వరండాలో, పెరట్లో, పోర్టికోలో, టెర్రస్ మీద కూడా మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపేవారి సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. ఠీవీగా నిలబడే అరుదైన మొక్కలు కార్యాలయాల హుందాతనాన్ని మరింతగా పెంచుతున్నాయి. అపార్టుమెంట్లు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారికి మొక్కలు పెంచుకోవాలనే ఆలోచన వున్నా ఆచరణలో కష్టంగా మారుతున్నది. వారి కోరికను ఇండోర్ ప్లాంట్స్ తీరుస్తున్నాయి. బెడ్‌రూమ్‌ల్లో, టీవీ వద్ద, డైనింగ్ టేబుల్ మీద, స్టడీటేబుల్ మీద, టీపాయ్ మీద, కార్యాలయాలలోనూ సూర్యరశ్మి అందని ప్రదేశాల్లో కూడా పెంచుకునే వీలుంది. హేంగింగ్‌పాట్స్‌లో కూడా ఈ అందమైన మొక్కల్ని పెంచుకునే వీలుంది. ఏడాదికి 4 నుండి 5 అంగుళాలు మాత్రమే పెరుగుతూ ఉండే ఈ ఇండోర్‌ప్లాంట్స్‌ను సన్‌లైట్‌లో పెట్టాల్సిన అవసరం కూడా లేదు. ఇంటి అందాల్ని రెట్టింపు చేసే కొన్ని ఇండోర్ ప్లాంట్స్ ఇవి...

అగ్లోనిమా లిప్‌స్టిక్ రెడ్: "అగ్లోనిమా లిప్‌స్టిక్ రెడ్" అనే పేరుతో పిలిచే ఈ మొక్క థాయిలాండ్ దేశానికి చెందినది. ఈ మొక్క ఎరుపు రంగులో చూడటానికి ఎంతో అందంగా ఉంటుంది. వీటిలో సుమారు 5 నుండి 6 రకాల వరకు ఉన్నాయి. రెండు రోజులకొకసారి మాత్రమే నీరు పోస్తూ జాగ్రత్తగా ఈ మొక్కలు పెంచుకోవాలి. అపుడపుడు బ్లైటాక్స్ మందు పిచికారీ చేయాలి.

మెరంటా రెడ్ : ఈ మొక్క మెరంటా జీబ్రా కుటుంబానికి చెందినది. ఇతర దేశాల నుండి బెంగుళూరు వచ్చిన ఈ మొక్క ప్రస్తుతం కడియం నర్సరీల్లో హాట్‌కేకులా మారింది. ఈ మొక్క ఆకుపై సన్ననిగీతలుంటాయి. ఇందులో ఎరుపు, తెలుపు, పసుపు తదితర రంగుల్లో మొక్కలున్నాయి.

అగ్లోనిమా డౌ: కలకత్తాకు చెందిన ఈ ఇండోర్‌ప్లాంట్ అగ్లోనిమా జాతికి చెందినది. ఇందులో అగ్లోనిమాడౌ రెడ్, అగ్లోనిమాడౌ గ్రీన్, అగ్లోనిమాడౌ రాజా అనే రకాలు ఉన్నాయి.

జెనడాగోల్డ్: ఫెలోడేండ్రన్ జీనాడోగా పిలిచే ఈ మొక్కలో గ్రీన్, ఎల్లో వంటి రకాలు ఉన్నాయి. బెంగుళూరు నుండి తీసుకొచ్చిన ఈమొక్క ప్రస్తుతం కడియం నర్సరీల్లో అందాల్ని ఒలకబోస్తుంది.

ఫెలోడేండ్రన్ సేలం: బెంగుళూరుకు చెందిన ఈ మొక్క 'ఫెలోడేండ్రన్' రకానికి చెందినది. ఇందులో గ్రీన్, ఎల్లో వంటి రకాలు ఉన్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కడియం





గ్రూప్-2 గెలిచా.. గ్రూప్-1 సాధిస్తా



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 ఎగ్జిక్యూటివ్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచాడు ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన చింతలపూడి విజయకుమార్ రెడ్డి. 2007 గ్రూప్-2లోనే విజయం సాధించి ప్రస్తుతతం విశాఖపట్నంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక చాలా మంది రిలాక్స్ అవుతారు. కానీ విజయ్ మాత్రం ఇంకా సాధించాలనే తపనతో నిత్యం కృషి చేస్తూనే ఉన్నాడు. అందుకు తార్కాణమే గ్రూప్-2లో టాపర్‌గా నిలవడం. ఈ నేపథ్యంలో విజయ్ స్ఫూర్తిదాయక పయనం అతన్ని మాటల్లోనే..

గ్రూప్-2లో టాపర్‌గా నిలవడం ఆనందం కలిగించింది. ప్రస్తుత ర్యాంక్‌తో డిప్యూటీ తహశిల్దార్‌గా అవకాశం లభించింది. అయినప్పటికీ.. విశ్రమించకుండా గ్రూప్-1లో టాపర్‌గా నిలవడమే లక్ష్యంగా నా ప్రయత్నం సాగిస్తాను. ఈ లక్ష్యం దిశగా ఎప్పటి నుంచో కృషి చేస్తున్నాను. ఆ ప్రయత్నమే ఈ రోజు నన్ను గ్రూప్-2లో టాపర్‌గా నిలబెట్టింది.

కుటుంబ నేపథ్యం

ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం కంభంపాడు గ్రామం మా స్వస్థలం. మాకు 30 ఎకరాల వ్యవసాయ భూమి ఉండేది. నాన్న సుబ్బారెడ్డి మా చదువు, వ్యాపారం చేయాలనే ఆలోచనతో ఉన్న పొలం, ఇళ్లు అమ్మారు. మార్కాపురం వచ్చి ఇటుకలు, బొగ్గుల బట్టీ వ్యాపారం ప్రారంభించాడు. నష్టాలు రావటంతో వ్యాపారాన్ని వదిలేశాడు. అప్పుడే వ్యాపారం కంటే చదువు వల్లే అభివృద్ధి అనే భావన నాలో పెరిగింది. ఆర్థిక పరిస్థితులను పెద్దగా పట్టించుకోకుండా పిల్లలను చదివించాలనే పట్టుదలతో చిన్నతనం నుంచే ఎక్కడా లోటు తెలియకుండా పెంచారు. మా తమ్ముడు అశోక్ కుమార్‌రెడ్డి కూడా ఇప్పుడు గ్రూప్-2లో డిప్యూటీ తహశిల్దార్ పోస్టు సాధించాడు. నా భార్య గీతా కుమారికి కూడా డిప్యూటీ తహశిల్దార్ పోస్టు వచ్చింది. దీంతో మా కుటుంబంలోనే ముగ్గురికి డిప్యూటీ తహశిల్దార్ పోస్టులు రావటం, మార్కాపురం ప్రాంతంలో మా కుటుంబానికి గుర్తింపు రావటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

సగటు విద్యార్థినే

మొదటి నుంచి నేను సగటు విద్యార్థినే. 10వ తరగతిలో కేవలం 364 మార్కులు వచ్చాయి. ఇంటర్‌లో 73 శాతం మార్కులు వచ్చాయి. ఎంఏ హిస్టరీ చేశాను. ఉపాధ్యాయుడిగా స్థిరపడాలనే లక్ష్యంతో గణితం, ఆంగ్లంలో బీఈడీ పూర్తిచేశాను. తరవాత డీఎస్సీ కోసం గుంటూరులో కోచింగ్‌కు చేరిన సమయంలో పోటీ పరీక్షలపై అవగాహన వచ్చింది. 2006 డీఎస్సీ ద్వారా ఎస్జీటీగా ఎంపికయ్యాను. అయినప్పటికీ 2008లో గ్రూప్-2 పరీక్ష రాశాను. అప్పటి ఫలితాల ఆధారంగా లేబర్ ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. కానీ సొంత జిల్లా, జోన్‌లో పనిచేయాలనే లక్ష్యం ఉండేది. అందుకే 2016లో మరోసారి గ్రూప్-2 రాశారు. ఈ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 357.35 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించాను.

దోహదపడిన కంబైన్డ్ స్టడీ

నా భార్య గీతాకుమారి అనంతపురం జిల్లా మడకశిరలో అబ్కారీ సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తుంది. నేను, తను ఇద్దరం కలిసి కంబైన్డ్ స్టడీ చేశాం. ప్రిపరేషన్ కోసం ఇద్దరం కూడా మా ఉద్యోగాలకు నాలుగు నెలలు సెలవు పెట్టి ఇంటిలో ఉండి పరీక్షలకు సిద్ధమయ్యాం. ఇద్దరం కలిసి పుస్తకాలు, వెబ్‌సైట్లలో ఉన్న సమాచారాన్ని చర్చించుకునేవాళ్లం. ఇంకా ఏదైనా సందేహం వస్తే నా మిత్రుడు జ్ఞానేంద్రప్రసాద్‌ను సంప్రదించేవాణ్ని. అతను కూడా గ్రూప్-2లో జోన్-4లో టాపర్‌గా నిలిచాడు. అతను చదివే పుస్తకాల్లోని విషయాలు నాకు, నేను చదివే విషయాలు అతనికి చెప్పుకుంటూ ఫోన్‌లోనే చర్చించుకుని ప్రిపేర్ అవ్వటం మాకు ఎంతో ఉపయోగపడింది. నా భార్య గీతాకుమారికి కూడా ప్రస్తుత గ్రూప్-2 ద్వారా డిప్యూటీ తహశిల్దార్ పోస్టు వచ్చింది. గతంలో కూడా 2008లో జరిగిన గ్రూప్-2 పరీక్షలకు ఐదు మంది స్నేహితులం కలిసి ప్రిపేర్ అయ్యాం. ఆ సందర్భంలో వివిధ అంశాలపై చర్చించుకోవడం, విషయాలను పంచుకోవడం జరిగేది. అది కూడా అప్పట్లో విజయానికి దోహదం చేసింది.

టాపర్స్ వాయిస్

> గతంతో పోల్చితే ప్రస్తుతం పరీక్ష స్వభావంలో చాలా మార్పు వచ్చింది. గతంలో మాదిరిగా కొన్ని గైడ్లు, పుస్తకాలు చదివితే ఎటువంటి ప్రయోజనం ఉండదు. ప్రతి అంశంపై సమగ్ర అవగాహన ఉంటేనే విజయం సాధించగలరు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఈ విషయాన్ని గమనంలోకి తీసుకోవాలి.

సమాచారం కోసం అన్వేషణ

గ్రూప్-2 కోసం ఎలాంటి కోచింగ్ తీసుకోలేదు. కేవలం పోటీ పరీక్షల పుస్తకాలు, వెబ్‌సైట్లలోని సమాచారం ఆధారంగా అధ్యయనం సాగిస్తూ వచ్చాను. అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకున్నాను. కరెంట్ అఫైర్స్ కోసం ఇన్‌సైడ్ ఐఏఎస్, విజన్ ఐఏఎస్, ప్రెస్ రిలీజెస్ పేరుతో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వచ్చే విషయాలను ఫాలో అయ్యేవాడిని. ఏపి ఎకనామిక్ సర్వే, నీతి ఆయోగ్ వెబ్‌సైట్‌లు బాగా ఉపయోగపడ్డాయి. యోజన, సర్వే, ప్రెస్ ఇన్ఫర్మేషన్ రిలీజెస్ వంటి ప్రభుత్వ అధికారిక పబ్లికేషన్స్ ఎక్కువగా చదివాను. ఇక సబ్జెక్టుల వారీగా కూడా ప్రామాణిక పుస్తకాలను చదివాను.

వైద్యురాలే అయినా..

విజయకుమార్‌రెడ్డి భార్య గీతాకుమారి బీడీఎస్ చదివారు. వైద్యురాలే అయినా గ్రూప్స్ లక్ష్యంతో 2012లో గ్రూప్-2 రాశారు. మంచి మార్కులతో అర్హత సాధించారు. ఎక్సైజ్ ఎస్ఐగా ఉద్యోగంలో చేరారు. సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుత గ్రూప్-2 ఫలితాల్లో ఆమె కూడా 310 మార్కులతో రాయలసీమ జోన్‌లో 4వ ర్యాంకును పొంది డిప్యూటీ తహశిల్దార్‌గా అర్హత సాధించారు. విజయకుమార్ రెడ్డి, గీతాకుమారిలలో ఒకరు వైజాగ్‌లో, మరొకరు అనంతపురంలో ఉద్యోగాల్లో ఉండటంతో వారిద్దరు ఒక చోట కలిసి పనిచేసేందుకే గ్రూప్-2 రాశారు. ప్రస్తుత ఫలితాలతో ఒకే ప్రాంతంలో కలిసి పని చేసే అవకాశం వస్తుందని భావించారు. కానీ గీతాకుమారి తిరిగి అదే జోన్ రాయలసీమకు ఎంపిక కాగా, విజయకుమార్ రెడ్డి జోన్-3 (ప్రకాశం, నెల్లూరు, గుంటూరు)కు ఎంపికయ్యాడు. కాని తిరిగి రాయలసీమ జోన్‌లోనే అవకాశం దక్కించుకున్న గీతాకుమారి ఎక్సైజ్ శాఖలో కొనసాగటమో, డిప్యూటీ తహశిల్దార్‌గా బాధ్యతలు తీసుకోవటమో ఆలోచిస్తున్నామన్నారు.



ఉద్యోగానికి రాజీనామా చేసి..



విజయ్ కుమార్ రెడ్డి సోదరుడు అశోక్ కుమార్ రెడ్డి కూడా రాష్ట్ర స్థాయిలో 39వ ర్యాంకు, జోన్‌లో 16వ ర్యాంకుతో డిప్యూటీ తహశిల్దార్ పోస్టుకు అర్హత పొందాడు. అశోక్ మార్కాపురంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాడు. 2007 డీఎస్సీలో స్టేట్ ఫస్ట్ వచ్చినప్పటికీ ఉపాధ్యాయునిగా కాకుండా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో క్లర్క్‌గా చేరాడు. 2015 వరకు ఆ విధుల్లో ఉన్నాడు. సివిల్స్ రాయాలనే ఆలోచనతో ఉద్యోగానికి రాజీనామా చేసి గ్రూప్-2 పరీక్షలకు హాజరై ఈ విజయం సాధించాడు.



విజేతల ప్రస్థానంలో ఎన్నో విభిన్న కోణాలు ఉంటాయి. అటువంటిదే ఒక భిన్నమైన కథ ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామానికి చెందిన బత్తి వెంకట సుబ్బారావుది. ఒక దశలో చదువే వద్దనుకున్నాడు. చదువుకు స్వస్తి పలికాడు. తొమ్మిదేళ్ల తరవాత దూర విద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశాడు. తరవాత ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ఇప్పుడు గ్రూప్-2లో డిప్యూటీ తహశిల్దార్‌గా ఎంపికయ్యాడు. చదువు వద్దు అనే దశ నుంచి అందరూ స్ఫూర్తిగా తీసుకునే స్థాయికి చేరిన వెంకట సుబ్బారావు విజయ నేపథ్యం అతని మాటల్లోనే..

చదువే వద్దనుకున్నా..

నాకు 10వ తరగతిలో 359 మార్కులు వచ్చాయి. ఒక్క మార్కు తేడాతో ఫస్ట్ క్లాస్ చేజారింది. దాంతో చదువుపై ఆసక్తి కలగలేదు. చదువుకు ఫుల్‌స్టాప్ పడింది. తిరిగి 9 సంవత్సరాల తరవాత వన్‌సిట్టింగ్‌తో ఇంటర్మీడియెట్, దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశాను. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పోస్టుల కోసం పరీక్షలు రాస్తే ఒకేసారి రెండు ఉద్యోగాలు వచ్చాయి. ఆ తరవాత ఇప్పుడు గ్రూప్-2 రాస్తే డిప్యూటీ తహశిల్దార్ పోస్టుకు ఎంపికయ్యాను.

ప్రభుత్వ పాఠశాలలోనే...

ఎర్రగొండపాలెం మండలం కొలుకుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే 7వ తరగతి వరకు చదివాను. తరవాత కుటుంబ పరిస్థితుల దృష్ట్యా ఎర్రగొండపాలెంలోని బాలుర వసతి గృహంలో చేరి అక్కడి పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాను. 10వ తరగతిలో ఫస్ట్ క్లాస్ చేజారడం, దాంతో చదువు మీద ఆసక్తి కుదరకపోవడం, అదే సమయంలో మా సోదరి భర్త (బావ) చనిపోవటంతో ఇంటి వద్దే పొలం పని చూసుకుంటూ ఉన్నాను. 2000లో 10వ తరగతి అయిపోతే 2009 వరకు చదువు జోలికి వెళ్లలేదు. అదే సమయంలో నాకు తెలిసిన ముగ్గురు ఉపాధ్యాయులు.. నీవు తెలివైనవాడివి ఉన్న అవకాశాలతో చదవచ్చు అని ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహంతో దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశాను. నాకు లెక్కలపై ఆసక్తి ఉన్నా సులువుగా ఉంటుందని బీఏ ఎంచుకున్నాను. పుస్తకాలు తెచ్చుకుని ఇంటివద్ద ఉంటూ డిగ్రీ పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ తప్పనిసరి కావటంతో వన్‌సిట్టింగ్ విధానంలో ఇంటర్ కూడా పూర్తి చేశాను.

ఒకేసారి రెండు ఉద్యోగాలు..

డిగ్రీ అయిపోయిన తరవాత 2013లో గ్రూప్-2 కోచింగ్‌కు హైదరాబాద్ వెళ్లాను. కేవలం నాలుగు నెలలు కోచింగ్ తీసుకున్నాను. ఇంతలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వచ్చాయని మిత్రులు చెప్పటంతో వాటికి దరఖాస్తు చేశాను. పంచాయతీ కార్యదర్శి రాతపరీక్షలో 100 మార్కులకుగాను 94 మార్కులు, వీఆర్వో పరీక్షలో 300 మార్కులకుగాను 249 మార్కులు సాధించాను. దీంతో రెండు పోస్టులూ వచ్చాయి. వీఆర్వోపై ఆసక్తితో ఆ ఉద్యోగంలో చేరాను. అయినప్పటికీ గ్రూప్స్‌లో విజయం సాధించాలనే పట్టుదలతో ఉద్యోగానికి లాస్ ఆఫ్ పే కింద సెలవు పెట్టి తొమ్మిది నెలలు కోచింగ్ తీసుకున్నా. ప్రస్తుత గ్రూప్-2 ఫలితాల్లో 322 మార్కులతో బీసీ-బీ కోటాలో జోన్‌లో 3వ ర్యాంకుతో డిప్యూటీ తహశిల్దార్‌గా అవకాశం వచ్చింది. కానీ గ్రూప్-1 రాయాలనుకుంటున్నా.

> పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు కొందరు ఎప్పటికప్పుడు కొత్త కొత్త పుస్తకాలు చదువుతుంటారు. అలాంటి వాళ్లను చూసి కొత్త పుస్తకాలవైపు పోవాల్సిన పనిలేదు. మనకు తెలిసిన, చదివిన పుస్తకాలనే పదేపదే చదువుతూ ఉండాలి. అవగాహన చేసుకోవాలి. అప్పుడే విజయం సాధ్యం.

మనోధైర్యం నిలబెట్టింది

చదువు మానేసినప్పటికీ ఇతరుల ప్రోత్సాహంతోపాటు మనోధైర్యమే నన్ను నిలబెట్టింది. హైదరాబాద్ కోచింగ్‌కు వెళితే అక్కడ ఇనిస్టిట్యూట్‌లో ఉన్నవారంతా ఉన్నత విద్యను అభ్యసించినవారే. అటువంటి వారితో 10వ తరగతి చదివిన నేను పోటీపడగలనా అని అధైర్యపడలేదు. గ్రూప్స్ కోసం తీసుకున్న కోచింగ్ పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో పరీక్షలకు ఉపయోగపడింది. గ్రూప్స్ కోసం కోచింగ్ మెటీరియల్‌తోపాటు కరెంట్ అఫైర్స్, అకాడమీ పుస్తకాలు ఎక్కువగా చదివేవాడిని. ప్రభుత్వ వెబ్‌సైట్‌లను చూస్తూ ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకునేవాడిని.

- బంకా శ్రీనివాసరావు (ఆంధ్రజ్యోతి, మార్కాపురం)

ఉపకరించిన సివిల్స్ కోచింగ్



త్రిపురాంతకం మండలం చెరువుకొమ్ము తండాకు చెందిన వెంకటేశ్వర్లు నాయక్ గ్రూప్ - 2లో 299 మార్కులతో ఎస్టీ కోటాలో జోన్ మొదటి ర్యాంకును సాధించి డిప్యూటీ తహశిల్దార్‌గా అవకాశం పొందాడు. 10వ తరగతి వరకు గణపవరం గురుకుల పాఠశాలలోను, ఇంటర్మీడియట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను చదివిన వెంకటేశ్వర్లు నాయక్ బీఎస్సీ కంప్యూటర్స్, ఆ తరవాత ఎంసీఏ పూర్తి చేశాడు. 2011-12లో సివిల్స్ కోసం కోచింగ్ తీసుకుంటున్న సమయంలో ఆర్ అండ్ బి శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగం చేసుకుంటూనే ఇటీవల గ్రూప్-2 పరీక్ష రాసి డిప్యూటి తహశిల్దార్‌గా అవకాశం పొందాడు. సివిల్స్ కోసం తీసుకున్న కోచింగ్ గ్రూప్-2 పరీక్షలో విజయానికి ఉపకరించిందని చెప్పాడు.

- **నేపథ్యం: తల్లిదండ్రులు రామావత్ డీప్లానాయక్, మంగిబాయి. ఇద్దరు సోదరుల్లో ఒకరు వ్యవసాయం చేస్తుండగా, మరొకరు రెవిన్యూ శాఖలో సర్వేయర్‌గా పని చేస్తున్నారు.**

కౌన్సెలింగ్

బయోటెక్నాలజీలో పీహెచ్‌డీ ఎలా?

ప్ర: నేను ఎంటెక్ (బయోటెక్నాలజీ) చేశాను. ప్రస్తుతం ఒక ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. నాకు బయోటెక్నాలజీలో పిహెచ్‌డి చేయాలని ఉంది. దీనికోసం ఏ పరీక్షలు రాయాలో తెలపండి?

- ఆర్. సతీష్, వైజాగ్

జ: డాక్టోరల్ ప్రోగ్రామ్స్ చేయాలనుకొనేవారు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పటి నుంచే ప్రిపరేషన్ మొదలు పెట్టాలి. నిర్దేశించిన సిలబస్‌ను క్షుణ్నంగా అవగాహన చేసుకొని పరీక్షలకు సన్నద్ధమవ్వాలి. ఫెలోషిప్‌తో కూడిన కొన్ని డాక్టోరల్ ప్రోగ్రామ్స్ వివరాలు ఇక్కడ ఇస్తున్నాం.

డిబిటి - బిఇటి (బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్)

- ఈ పరీక్షను ఏడాదికి ఒకసారి నిర్వహిస్తారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు రెండు కేటగిరీల్లో అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. కేటగిరీ 1 కింద అభ్యర్థులు దేశంలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో పిహెచ్‌డి కోసం రిజిస్టర్ చేసుకోవచ్చు. మొదటి 275 మందికి ఈ అవకాశం లభిస్తుంది. కేటగిరీ 2 కింద సుమారు 100 మందిని డిబిటి స్పాన్సర్డ్ ప్రాజెక్టుకు ఎంపిక చేస్తారు. కేటగిరీ 2 అభ్యర్థులకు డిబిటి ఫెలోషిప్ లభించదు.
- అర్హత: బయోటెక్నాలజీ & సంబంధిత విభాగాల్లో 60 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ లేదా ఇంజనీరింగ్ కోర్సులు చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- వెబ్‌సైట్: www.bcil.nic.in

సిఎస్ఐఆర్ - నెట్ (నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్)

- ఈ పరీక్షను ఏడాదికి రెండుసార్లు నిర్వహిస్తారు. లైఫ్ సైన్స్ లేదా సంబంధిత విభాగాల్లో పీజీ చేసినవారు, ఇంజనీరింగ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఈ పరీక్షకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ, ఇతర వివరాల కోసం వెబ్‌సైట్ చూడగలరు.
- వెబ్‌సైట్: http://csirhrdg.res.in/

టాటా మెమోరియల్ సెంటర్

- లైఫ్ సైన్సెస్ విభాగాల్లో పిహెచ్‌డి ప్రోగ్రామ్స్‌ను టాటా మెమోరియల్ సెంటర్ నిర్వహిస్తుంది. 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ (అప్లయిడ్ బయాలజీ, బయోకెమిస్ట్రీ, బయో ఇన్ఫర్మాటిక్స్, బయో ఫిజిక్స్, బయో టెక్నాలజీ, బోటనీ, లైఫ్ సైన్సెస్, మైక్రో బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ, జువాలజీ) / ఎంటెక్ (బయో ఇన్ఫర్మాటిక్స్, బయోటెక్నాలజీ), ఎంవిఎస్సీ, ఎంఫార్మసీ ఉత్తీర్ణులు, ఆఖరు ఏడాది పరీక్షలు రాసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వెబ్‌సైట్: www.actrec.gov.in

- డాక్టర్ యు.ఎస్.ఎన్. మూర్తి

జాబ్ కార్నర్

ఈసీఐఎల్‌లో టెక్నికల్ పోస్టులు


హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **14**
- పోస్టులు: టెక్నికల్ ఆఫీసర్ 8, సైంటిఫిక్ అసిస్టెంట్ 6
- విభాగాలు: ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ సైన్స్
- కాంట్రాక్ట్ వ్యవధి: మూడేళ్లు
- వర్క్ ప్లేస్: విశాఖపట్నం
- వయసు: జనవరి 31 నాటికి ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు, అసిస్టెంట్ పోస్టులకు 25 ఏళ్లు మించకూడదు.
- అర్హత: టెక్నికల్ ఆఫీసర్ పోస్టులకు కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బిఇ / బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు ఫస్టు క్లాసు మార్కులతో డిప్లొమా పూర్తిచేసి ఉండాలి. పోస్టులన్నింటికీ జనవరి 31 నాటికి ఏడాది అనుభవం ఉండాలి
- నెల వేతనం: ఆఫీసర్ పోస్టులకు రూ.21,000; అసిస్టెంట్ పోస్టులకు రూ.16,978
- ఎంపిక: టెక్నికల్ ఆఫీసర్లకు ఇంటర్వ్యూ ద్వారా, సైంటిఫిక్ అసిస్టెంట్లకు రాత పరీక్ష / ట్రేడ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఇంటర్వ్యూ: మార్చి 3న
- వెబ్‌సైట్: www.ecil.co.in

జూనియర్ కన్సల్టెంట్లు

హైదరాబాద్ - విద్యానగర్‌లోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ జూనియర్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **7**
- పోస్టులు: ఎలక్ట్రీషియన్ / వైర్‌మన్ 2, క్యాడ్ / క్యామ్ / సీఎన్‌సీ 1, వెల్డింగ్ 1, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ 1, ఫిట్టర్ 1, ప్రిన్సిపల్స్ ఆఫ్ టీచింగ్ 1.
- కాంట్రాక్ట్ వ్యవధి: 11 నెలలు
- అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్ / డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు అయిదేళ్ల బోధన అనుభవం ఉండాలి.
- వేతనం: నెలకు రూ.30,000
- ఎంపిక: రాత పరీక్ష, ప్రాక్టికల్ స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 15
- వెబ్‌సైట్: atihyderabad.ap.nic.in



ఐబీబీఐలో ఆఫీసర్లు

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా, గ్రేడ్ - ఏ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **18**
- వయసు: మార్చి 1 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: సీఏ / సీఎస్ / సీఎంఏ / ఎల్‌ఎల్‌బి / ఎంబీఏ - ఫైనాన్స్ / పీజీ (ఎకనామిక్స్ / కామర్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 14
- వెబ్‌సైట్: www.ibbi.gov.in

ఎయిర్ ఇండియా

ఎయిర్ ఇండియా ఆధ్వర్యంలోని ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్ లిమిటెడ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **35**
- పోస్టులు: డిప్యూటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ 1, చీఫ్ ఆఫ్ ఐటీ 1, సింథటిక్ ఫ్లయిట్ ఇన్‌స్ట్రక్టర్స్ 2, ట్రైనీ క్యాబిన్ క్రూ 16, స్టేషన్ మేనేజర్స్ 14, ఇన్‌స్ట్రక్టర్ టెక్నికల్ 1
- అర్హత: పోస్టును అనుసరించి సీఏ (ఐసీఏఐ) / (బీఈ / బీటెక్) (కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) / డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.
- పోస్టింగ్: ఢిల్లీ, హైదరాబాద్
- దరఖాస్తు చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 23
- వెబ్‌సైట్: www.airindia.in

రక్షణ మంత్రిత్వ శాఖలో ఖాళీలు

భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలోని 16 ఫీల్డ్ అమ్యూనిషన్ డిపో, 16 కోర్ హెడ్ క్వార్టర్లు వివిధ పోస్టుల భర్తీకి విడివిడిగా ప్రకటనలు విడుదల చేశాయి.

- మొత్తం ఖాళీలు: **38**

16 ఫీల్డ్ అమ్యూనిషన్ డిపో — ఖాళీలు: 15

- పోస్టులు: లోయర్ డివిజన్ క్లర్క్ 7, ఫైర్‌మన్ 8
- అర్హత: ఎల్‌డీసీకి ఇంటర్, ఫైర్‌మన్‌కు ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి
- వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
- అర్హత: ఎల్‌డీసీ పోస్టులకు ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. నిమిషానికి 35 ఇంగ్లీషు పదాలు / 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి. ఫైర్‌మన్ పోస్టులకు పదోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ప్రాక్టికల్ / ఫిజికల్ / ట్రేడ్ / స్కిల్ / టైపింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థుల అకడమిక్ మెరిట్ ఆధారంగా దరఖాస్తులను స్క్రీనింగ్ చేస్తారు. ఖాళీలకు 50 రెట్లమందిని ఎంపిక చేసి రాత పరీక్ష నిర్వహిస్తారు
- రాత పరీక్ష వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 2 గంటల సమయంలో 150 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. పోస్టును అనుసరించి ఇంటర్ / పదోతరగతి స్థాయిలోనే ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఇంటలిజెన్స్ అండ్ రీజనింగ్ నుంచి 25 ప్రశ్నలు (25 మార్కులు), న్యూమరికల్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు (25 మార్కులు), జనరల్ ఇంగ్లీష్ నుంచి 50 ప్రశ్నలు (50 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ నుంచి 50 ప్రశ్నలు (50 మార్కులు) ఇస్తారు. ప్రశ్నలు హిందీ, ఇంగ్లీషు భాషల్లో ఉంటాయి. రాత పరీక్షలో అర్హత పొందినవారిని తదుపరి ప్రక్రియలకు అనుమతిస్తారు.
- ప్రొబెషన్: రెండేళ్లు
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఎంప్లాయిమెంట్ న్యూస్‌లో ఈ ప్రకటన వెలువడిన నాటి నుంచి 21 రోజుల్లోపు దరఖాస్తు పంపుకోవాలి.
- చిరునామా: The Commandant, 16 Field Ammunition Depot, C/O 99 APO, Pin - 909716

16 కోర్ హెడ్ క్వార్టర్స్ — ఖాళీలు: 23

- పోస్టులు: ఫైర్ ఇంజన్ డ్రైవర్ 4, ఫైర్‌మన్ 16, ఇండస్ట్రియల్ మజ్దూర్ 3
- అర్హత: పదోతరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. డ్రైవర్ పోస్టులకు లైసెన్స్ తప్పనిసరి
- వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి
- ఎంపిక: రాత పరీక్ష, ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ / ప్రాక్టికల్ ట్రేడ్ టెస్ట్ ద్వారా
- రాత పరీక్ష వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 2గంటల సమయంలో 100 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి ప్రశ్నకు 1 మార్కు కేటాయించారు. జనరల్ ఇంటలిజెన్స్ & రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, జనరల్ అవేర్‌నెస్ విభాగాలకు సంబంధించి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు (25 మార్కులు) ఇస్తారు. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు.
- ప్రొబెషన్: రెండేళ్లు
- దరఖాస్తు ఫీజు: రూ.25
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 19
- చిరునామా: Commanding Officer, 898 At Bn ASC, C/O 56 APO, Pin - 905898
- వెబ్‌సైట్: www.indianarmy.nic.in



హర్మన్ ప్రీత్.. ఇక డీఎస్పీ

చండీగఢ్: భారత మహిళా టీ20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గురువారం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించింది. పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, డీజీపీ సురేష్ అరోరా ఆమె యూనిఫామ్‌కు స్టార్స్‌ను తగిలించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం హర్మన్‌ప్రీత్ మాట్లాడుతూ పంజాబ్ పోలీస్‌లో భాగం కావడం తన అదృష్టమని, ముఖ్యమంత్రి, డీజీపీ స్వయంగా బాధ్యతలు అప్పజెప్పడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపింది.


భరత్ అరుణ్

దృష్టంతా రిజర్వ్ పేస్‌పైనే..

బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్

న్యూఢిల్లీ: వన్డే వరల్డ్‌కప్‌నకు సమయం మరో ఏడాదే ఉంది. 2019లో ఇంగ్లండ్‌లో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు ప్రతిభావంతులతో కూడిన రిజర్వ్ పేస్ బౌలింగ్ దళాన్ని తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాడు టీమిండియా బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్. తన తదుపరి లక్ష్యం అదేనని అతడు ప్రకటించాడు. భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా వన్డేలలో ప్రధాన పేసర్లుగా ఇప్పటికే సేవలందిస్తున్నారు. అయితే వీరికి దన్నుగా మరో ముగ్గురు పేసర్లను తయారు చేయాలని అరుణ్, ప్రధాన కోచ్ రవిశాస్త్రి, కెప్టెన్ కోహ్లీ ఇప్పటికే నిర్ణయించారు. 'మా రిజర్వ్ పేస్ బౌలింగ్ విభాగం సమర్థతను పరిశీలించేందుకు శ్రీలంకలో జరగనున్న ముక్కోణపు టీ20 సిరీస్ చక్కటి వేదిక. ఇప్పటికే భువీ, బుమ్రాల రూపంలో ఇద్దరు ప్రపంచస్థాయి బౌలర్లు జట్టులో ఉన్నారు. ఇక శ్రీలంక వెళ్లనున్న మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కట్ అక్కడ సత్తా చాటాలని తహతహలాడుతున్నారు' అని అరుణ్ చెప్పాడు. 'రాబోయే రోజుల్లో సుదీర్ఘ సిరీస్‌లు ఆడాల్సి ఉంది. ఆ సందర్భంగా గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలు ఎదురైతే వాటిని అధిగమించేందుకు మేం సిద్ధంగా ఉండాలి. ఉనాద్కట్ సౌతాఫ్రికాలోనూ చక్కగా రాణించాడు. దేవధర్ ట్రోఫీలో ఆడనున్న షమి, ఉమేష్ కూడా జట్టులో చోటుకోసం పోటీలో ఉంటారు' అని వివరించాడు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) మాజీ కోచ్‌గా..ప్రస్తుతం దేశంలోని జూనియర్ పేస్ బౌలర్లను అరుణ్ నిశితంగా గమనించిన వాడే. టీ20ల్లో మెరుగైన ప్రదర్శన చేస్తున్న ఉనాద్కట్ వన్డే జట్టులోకి వస్తాడని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు 'నేను సెలెక్టర్‌ను కాను. అందువల్ల వన్డే జట్టులో అతడు ఉంటాడా, ఉండడా అన్న విషయాన్ని చెప్పలేను. కానీ ఈస్థాయిలో ఆడే ప్రతి ఒక్క బౌలర్ ప్రతిభావంతుడనే నేను విశ్వసిస్తాను' అని అరుణ్ బదులిచ్చాడు. 'టీ20లు, వన్డేలకు అనుగుణంగా బౌలింగ్ చేయగలగడమే ప్రధానం. అయితే విభిన్న ఫార్మాట్లకు అలవాటు పడడమనేది ఒక్కో క్రికెటర్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. జయదేవ్ కనుక అలా అలవాటు పడితే వన్డే జట్టులో అతడికి చోటెందుకు ఉండదు' అని ప్రశ్నించాడు. టీ20ల స్పెషలిస్ట్‌గా అంతర్జాతీయ కెరీర్ ప్రారంభించి క్రమంగా వన్డేలు, టెస్టుల స్థాయికి ఎదిగాడు గుజరాత్ బౌలర్ బుమ్రా. ఇలా మూడు విభాగాల్లోనూ అతడు విజయవంతం అవుతాడనడంలో తనకు ఎలాంటి సందేహాలు కలగలేదని అరుణ్ స్పష్టం చేశాడు. 'జస్ప్రీత్ సత్తాపై మాకు ఎప్పుడూ నమ్మకం ఉంది. ఏ ఫార్మాట్‌లోనైనా ఎలాంటి బ్యాట్స్‌మెన్‌నైనా కొత్త, పాత బంతులతో ఇబ్బందులుపెట్టడం అతడి సమర్థతకు నిదర్శనం' అని తెలిపాడు. బుమ్రా బౌలింగ్ యాక్షన్ ఇంగ్లండ్ పరిస్థితుల్లో పని చేయదని వెస్టిండీస్ బౌలింగ్ దిగ్గజం మైకేల్ హోల్డింగ్ ఇటీవల వ్యాఖ్యానించాడు. హోల్డింగ్ అభిప్రాయంతో అరుణ్ ఏకీభవిస్తూనే మెరుగుపరుచుకొనేందుకు ఎప్పుడూ అవకాశం ఉంటుందని గుర్తు చేశాడు. 'ఇంగ్లండ్ పిచ్‌లపై బుమ్రా ఇంకా బౌలింగ్ చేయకుండానే అతడు అక్కడ విజయవంతం కాలేడన్న నిర్ణయానికి రావడం కరెక్ట్ కాదు. పిచ్‌లకు తగ్గట్టుగా బౌలింగ్ శైలిని మార్చుకొనేందుకు ఏ బౌలరైనా ప్రయత్నిస్తాడు' అని వివరించాడు.

వినేష్‌కు రజతం

ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

బిష్కెక్(కిర్గిస్థాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో వినేష్ ఫొగట్ భారత్‌కు రజతాన్ని అందించింది. 50 కిలోల విభాగం ఫైనల్లో వినేష్ 2-3 తేడాతో చైనాకు చెందిన చున్ లీ చేతిలో ఓటమిపాలై రజతంతో సంతృప్తి చెందింది. ఆసియా స్థాయి టోర్నీలో వినేష్‌కు లభించిన రెండో రజతమిది. ఈ టోర్నీలో భారత్‌కిది మూడోపతకం. అంతకుముందు గ్రీకో రోమన్ రెజ్లర్లు హర్‌ప్రీత్ సింగ్, రాజేంద్రకుమార్‌లకు కాంస్య పతకాలు దక్కాయి.

సెమీఫైనల్లో జపాన్‌కు చెందిన యుకి ఇరీపై 4-4 పాయింట్లతో సమంగా స్కోరు సాధించినా సాంకేతిక పాయింట్ల తేడాతో వినేష్ ఫైనల్‌కు చేరుకుంది. అయితే ఫైనల్లో అదే ఫలితాన్ని పునరావృతం చేయడంలో విఫలమైంది. తొలి రౌండ్‌లో ఇరువురూ ప్రత్యర్థి తప్పిదాల కోసం ఎదురుచూశారు. రెండో రౌండ్‌లో వినేష్ 2-1 ఆధిక్యం సాధించింది. అయితే చైనా బాక్సర్ వెంటనే కోలుకుని తదుపరి రౌండ్‌లో రెండు పాయింట్లు సాధించి 3-2తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ సమయం మరో నిమిషమే మిగిలి ఉండడంతో వినేష్ కోలుకునే అవకాశం లేకపోయింది. 59 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో జరిగిన బౌట్‌లో సంగీత కాంస్య పతకం సాధించింది. ఆమె కొరియాకు చెందిన ఉమ్ జీయున్‌ను 9-4 తేడాతో ఓడించింది. కాగా గత ఏడాది రజత పతకం సాధించిన 19 ఏళ్ల దివ్య కక్రన్‌కు ఈసారి ఏ పతకమూ లభించలేదు. కాంస్య పతక పోరులో ఆమె స్థానిక క్రీడాకారిణి మీరిమ్ జుమనజెరోవ చేతిలో 6-12 తేడాతో ఓడిపోయింది.


వినేష్

విరాట్ కోహ్లీ.. జట్టులోకి వచ్చిన కొత్తలో దూకుడుగా కనిపిస్తూ వివాదాలతో సహవాసం చేసిన ఆటగాడు.. కానీ ఒక్కసారిగా ఎంఎస్ ధోనీ నుంచి నాయకత్వ బాధ్యతలు అందుకోగానే అతడిలో అనూహ్య మార్పే చోటుచేసుకుంది.. అప్పటికే సారథిగా అత్యంత ఆదరణ పొందిన ధోనీ మాజీ హోదాలో జట్టులోనే ఉన్నా ఎలాంటి అభద్రతాభావానికి లోనుకాకుండా కోహ్లీ అతడి అపార అనుభవాన్ని చక్కగా ఉపయోగించుకుంటున్నాడు. అంతేకాదు ఇతర ఆటగాళ్లకు కూడా ప్రేరణగా నిలుస్తూ జట్టును ముందుకు తీసుకెళుతున్నాడు. అందుకే ధోనీకి సరైన వారసుడిగా కోహ్లీ నిలుస్తున్నాడని మరో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కొనియాడుతున్నాడు. అతడి ప్రవర్తన అందరికీ ఆదర్శంగా ఉందని అంటున్నాడు..

అదే.. కోహ్లీ గొప్పతనం


గంగూలీ

ముంబై: ఓ అద్భుత ఆటగాడిగానే కాకుండా కెప్టెన్‌గా కూడా విరాట్ కోహ్లీకి నూటికి నూరు మార్కులు వేయవచ్చని భారత జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా ధోనీని అతడు ఉపయోగించుకుంటున్న తీరు చూస్తే ముచ్చటేస్తోందని అన్నాడు. ఇటీవల ముగిసిన సఫారీ పర్యటనలో లెగ్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్‌లకు ధోనీ ఏ రీతిలో బౌలింగ్ చేయాలో చెబుతూ వారి అద్భుత ప్రదర్శనకు కారణమయ్యాడు. అలాగే యువ ఆటగాళ్లకు తగిన సలహాలిస్తున్నాడు. కానీ కోహ్లీ కాకుండా మరో కెప్టెన్ ఎవరైనా అయ్యుంటే జట్టులో అలాంటి పరిస్థితి కనిపించేది కాదేమోనని అన్నాడు. తన ఆటో బయోగ్రఫీ 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్' పుస్తకావిష్కరణ సందర్భంగా పలు విషయాలపై తన అభిప్రాయాలను చెప్పాడు..

భారత జట్టు కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ ఎలా రాణిస్తున్నాడు?

అద్భుతమనే చెప్పాలి. నిజానికి జట్టులో ఉన్న మాజీ సారథుల సలహాలను తాజా కెప్టెన్లు తీసుకోవడం ఎక్కువగా కనిపించదు. ఈ విషయంలో కోహ్లీని అభినందించాల్సిందే. నిస్సంకోచంగా ధోనీ నుంచి కోహ్లీ సలహాలు తీసుకోవడం మనం చూస్తూనే ఉన్నాం. నిజానికి మాజీ కెప్టెన్లను మెల్లగా జట్టు నుంచి తప్పించడానికే ప్రయత్నిస్తారు. కానీ కోహ్లీ అలాంటి వాటిపై దృష్టి పెట్టకుండా అద్భుత నాయకుడుగా మారుతున్నాడు. అతడో జట్టును నిర్మించుకున్నాడు. ప్రతి ఒక్కరినీ తనతో పాటుగా తీసుకెళుతున్నాడు.

కోహ్లీ నాయకత్వంలో జట్టు మరింత ముందుకు వెళుతుందని భావిస్తున్నారా?

కచ్చితంగా.. ధోనీ, రోహిత్, శిఖర్ ధవన్, పాండ్యాలపై అతడు ఉంచిన నమ్మకాన్ని చూడండి. అందుకే జట్టు కెప్టెన్‌గా కోహ్లీ ఉన్నంతకాలం ఈ జట్టు ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందనే ఆశిస్తున్నాను.

విదేశీ సిరీస్‌ల్లో ఇదే జోరు రాబోయే సిరీస్‌లలో కూడా కనిపిస్తుందని అనుకుంటున్నారా?

దక్షిణాఫ్రికా పర్యటనలో భారత జట్టు అందరి అంచనాలను తలకిందులు చేసి ఆకట్టుకోగలిగింది. అలాగే మున్ముందు జరగబోయే ఇంగ్లండ్, ఆసీస్ పర్యటనల్లో కూడా సమష్టి కృషితో రాణిస్తుందనే నమ్మకముంది. ఇంగ్లండ్ గడ్డపై బ్యాటింగ్‌లో రాణించగలిగితే బౌలింగ్ విభాగం మిగతా పనిచూసుకుంటుంది.

మీరు భారత జట్టు సభ్యుడిగా ఉన్నప్పుడు ఫిట్‌నెస్ ఎలా కాపాడుకున్నారు?

ఈ విషయంలో నేను చాలా కఠినంగా ఉండేవాడిని. క్రికెట్ ఫీల్డ్‌లో నన్ను చూసిన వారు పలురకాల అభిప్రాయంతో ఉండేవారు. కానీ మైదానం ఆవల నేనో విభిన్న వ్యక్తిని. ఒకవేళ నేను ఫిట్‌గా లేకుంటే 400కి పైగా మ్యాచ్‌లను భారత్ తరఫున ఆడేవాడిని కాను. ఇంకా ఫస్ట్ క్లాస్, కౌంటీ మ్యాచ్‌లు కూడా ఉన్నాయి. కెరీర్ సాగుతున్నకొద్దీ ఫిట్‌నెస్‌పై కొత్త విషయాలు తెలుసుకోగలిగాను. 1996లో జట్టులోకి వచ్చినప్పటికీ ఇప్పటికీ ఫిట్‌నెస్ కల్చర్ చాలా మారింది.


ధోనీ-కోహ్లీ


2003 ప్రపంచకప్‌లో ధోనీ ఉంటే బాగుండేది..

ఎంఎస్ ధోనీ కెరీర్‌లో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రోత్సాహం వెలకట్టలేనిది. ఆరంభం నుంచే అతడిపై దాదా ఎంతో నమ్మకం పెట్టుకున్నాడు. అలాగే 2003 ప్రపంచకప్‌లో ఫైనల్ వరకు వెళ్లిన జట్టులో ధోనీ ఆడి ఉంటే ఇంకా బాగుండేదని తన ఆత్మకథ 'ఎ సెంచరీ ఈజ్ నాట్ ఎనఫ్' పుస్తకంలో పేర్కొన్నాడు. 'వరల్డ్‌కప్‌లో ఒత్తిడిని తట్టుకుంటూ మ్యాచ్‌ను మలుపు తిప్పగల ఆటగాళ్ల కోసం నేను కొంతకాలంగా ఎదురుచూస్తున్నాను. కానీ నేను అతడిని 2004లో గుర్తించాను. 2003 ప్రపంచకప్‌లో అతడు ఆడి ఉంటే పరిస్థితి మరోలా ఉండేద'ని దాదా పేర్కొన్నాడు.

ఆ రోజు హర్భజన్‌ను అతి కష్టంగా ఆపాం..

ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్, పాక్ మాజీ ఆటగాడు మహ్మద్ యూసుఫ్‌ల మధ్య 2003 ప్రపంచకప్‌లో జరిగిన గొడవపై కూడా తన పుస్తకంలో రాసుకొచ్చాడు. 'లంచ్ సమయంలో వీరిద్దరి మధ్య గొడవ ప్రారంభమైంది. అది ఎందుకు జరిగిందో తెలీదు కానీ చాలా సీరియస్ అయ్యింది. దీంతో ఇరు జట్ల సీనియర్ ఆటగాళ్లం వారిని పక్కకు తీసుకెళ్లాల్సి వచ్చింది' అని తెలిపాడు.

ముంబై టీ20లో అర్జున్ ఆడడట!


అర్జున్

ముంబై: త్వరలో ప్రారంభం కానున్న ముంబై టీ20 లీగ్‌కు బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ దూరం కానున్నాడు. ఇటీవల కోచ్ అతుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో తన బౌలింగ్ శైలిలో అర్జున్ మార్పులు చేసుకున్నాడు. అయితే ఈ కొత్త శైలికి అతను అలవాటుపడలేదు. ఈ శైలిలో ఇంకా నైపుణ్యం సాధించాల్సి ఉండడంతో తండ్రి సలహా మేరకు ఈ లీగ్‌లో ఆడకూడదని 18 ఏళ్ల అర్జున్ నిర్ణయం తీసుకున్నాడు. ఈనెల 11 నుంచి 21 వరకు జరిగే ముంబై టీ20 లీగ్‌కు సచిన్ బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్నాడు.



పాక్ క్రికెట్ గతినే మార్చేశాడు!

● ఇమ్రాన్‌ఖాన్‌కు వాల్ష్ ప్రశంసలు

కరాచీ: ఇమ్రాన్ ఖాన్.. పాకిస్థాన్ క్రికెట్ రూపురేఖలు మార్చిన గొప్ప కెప్టెన్ అని వెస్టిండీస్ దిగ్గజం కోట్నీ వాల్ష్ కొనియాడాడు. తన దూరదృష్టి, సానుకూల దృక్పథంతో పాక్ క్రికెట్‌లో విప్లవాత్మక మార్పులు తెచ్చాడని వాల్ష్ అన్నాడు. అందుకే తాను ఇమ్రాన్‌కు పెద్ద అభిమానినని చెప్పాడు. వసీం అక్రమ్, వకార్ యూనిస్ లాంటి యువ ప్లేయర్లకు మద్దతుగా నిలిచి.. చాంపియన్ జట్టును తయారు చేశాడన్నాడు.

డైలమాలో ఎమర్జింగ్ నేషన్స్ కప్

● జట్టును పంపేందుకు నిరాకరించిన బీసీసీఐ

కరాచీ: పాకిస్థాన్‌లో నిర్వహించనున్న ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్‌నకు భారత జట్టును పంపడానికి బీసీసీఐ నిరాకరించింది. దీంతో ఏప్రిల్‌లో నిర్వహించాల్సిన టోర్నీ సందిగ్ధంలో పడింది. పాక్‌కు తమ జట్టును పంపడానికి భారత బోర్డు సుముఖంగా లేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి చెందిన ఓ అధికారి చెప్పాడు. ఈ నేపథ్యంలో శ్రీలంక లేదా బంగ్లాదేశ్‌కు టోర్నీని తరలించే అవకాశాలున్నాయని తెలిపాడు. ఆసియా ఎమర్జింగ్ నేషన్స్ కప్, సెప్టెంబరులో భారత్‌లో జరగాల్సిన ఆసియాకప్‌పై ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని పీసీబీ చైర్మన్ నజమ్ సేథ్ చెప్పాడు.

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 225/5

● దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు


స్టీవ్ స్మిత్ (56)

డర్బన్: కెప్టెన్ స్టీవ్ స్మిత్ (114 బంతుల్లో 11 ఫోర్లతో 56), వార్నర్ (79 బంతుల్లో 6 ఫోర్లతో 51) అర్ధ సెంచరీలతో ఆదుకోవడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో ఆస్ట్రేలియా కోలుకుంది. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 76 ఓవర్లలో ఐదు వికెట్లకు 225 పరుగులు చేసింది. షాన్ మార్ష్ (96 బంతుల్లో 6 ఫోర్లతో 40) చక్కటి సహకారం అందించాడు. ప్రస్తుతం క్రీజులో మిచెల్ మార్ష్ (32 బ్యాటింగ్), పెయిన్ (21 బ్యాటింగ్) ఉన్నారు. వెలుతురు మందగించడంతో మరో 14 ఓవర్లు మిగిలిఉండగానే అంపైర్లు ఆటను ముగించాల్సి వచ్చింది. ఫిలాండర్, కేశవ్ మహరాజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. 39 పరుగులకే రెండు వికెట్లు పడిన దశలో స్మిత్, వార్నర్ జోడీ నిలకడ ప్రదర్శించింది. పిచ్ నుంచి తోడ్పాటు అందకపోవడంతో ఓపిగ్గా క్రీజులో నిలిచి ఇన్నింగ్స్‌ను వారు నిర్మించారు. ముందుగా 72 బంతుల్లో వార్నర్ అర్ధ సెంచరీ చేసిన అనంతరం ఫిలాండర్ అతడిని పెవిలియన్‌కు పంపాడు. మూడో వికెట్‌కు 56 పరుగులు జత చేరాయి. ఆ తర్వాత స్మిత్‌కు మార్ష్ జత కలిశాడు. 94 బంతుల్లో స్మిత్ అర్ధ సెంచరీని పూర్తి చేశాడు. దాదాపు 23 ఓవర్లపాటు క్రీజులో నిలిచి ప్రమాదకరంగా మారుతున్న వీరిని కేశవ్ విడదీశాడు. డివిల్లీర్స్‌కు క్యాచ్ ఇచ్చి స్మిత్ అవుట్ కావడంతో నాలుగో వికెట్‌కు మరో 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది.


వార్నర్ (51)

పారా స్విమ్మర్‌పై మూడేళ్ల నిషేధం

● మహిళా స్విమ్మర్లను వీడియో తీసిన ఫలితం


ప్రశాంత కర్మాకర్

న్యూఢిల్లీ: మహిళా స్విమ్మర్లను వీడియో తీసిన పారా స్విమ్మర్ ప్రశాంత కర్మాకర్‌పై భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ) మూడేళ్ల నిషేధం వేటు వేసింది. గత ఏడాది జాతీయ చాంపియన్‌షిప్స్ సందర్భంగా అనుమతి లేకుండా వీడియోలు తీశాడని అతడిపై ఫిర్యాదు అందింది. 'అమర్యాదగా ప్రవర్తించడంతోపాటు దాడులకు పాల్పడ్డాడని ప్రశాంతపై లిఖిత పూర్వక ఫిర్యాదు అందింద'ని పీసీఐ ప్రకటనలో తెలిపింది. ఈవెంట్ సందర్భంగా మహిళా స్విమ్మర్లను వీడియో తీయాలని తన సహాయకుడికి కర్మాకర్ సూచించాడని ఆరోపణ. క్రీడాకారిణుల తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేయగా.. ప్రశాంత షూట్ చేయాలని చెప్పడం వల్లే అలా చేశానని అతడు పీసీఐ చైర్మన్ వీకే దబాస్‌కు తెలిపినట్లు సమాచారం. కర్మాకర్ కూడా మహిళా స్విమ్మర్లను కెమెరాతో షూట్ చేస్తూ అడ్డంగా దొరికిపోయాడని కమిటీ చెప్పింది. వివరణ కోసం పిలిస్తే.. వీడియో తీయకుండా తన మనిషిని ఎందుకు అడ్డుకున్నారని చైర్మన్, ఆఫీసు బేరర్లపై ప్రశాంత విరుచుకుపడ్డాడని పీసీఐ తెలిపింది. ఆ వీడియోలను డిలీట్ చేయడానికి కూడా నిరాకరించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్టు చేయగా.. వీడియోలను డిలీట్ చేయాలనే షరతుతో వదిలిపెట్టారు. 2003లో వరల్డ్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన అథ్లెట్‌గా ప్రశాంత మంచి గుర్తింపు పొందాడు. 16 సార్లు జాతీయ చాంపియన్ కూడా. 2016 రియో పారాలింపిక్స్‌లో భారత స్విమ్మింగ్ కోచ్‌గానూ వ్యవహరించాడు.

పాక్ లీగ్‌లో విరాట్ క్రేజ్ !

ఆడాలంటూ అభిమాని బ్యానర్



దుబాయ్: సరిహద్దులు ఎరుగని క్రేజ్ టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ సొంతం. క్రికెట్ ఆడే దేశాల్లో అతడికి ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ముఖ్యంగా పాకిస్థాన్‌లో అయితే కోహ్లీని అభిమానించేవారు కోకొల్లలు. విరాట్ అంటే పాకిస్థానీయులకు ఎంత ఇష్టమో పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) సందర్భంగా మరోసారి ప్రస్ఫుటమైంది. దుబాయ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్-క్వెట్టా గ్లాడియేటర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 'పీఎస్ఎల్‌లో విరాట్ కోహ్లీని చూడాలనుకుంటున్నాం' అని ఓ అభిమాని పట్టుకొని కనిపించిన బ్యానర్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గత ఏడాది ఐసీసీ వరల్డ్ లెవెన్-పాకిస్థాన్ నడుమ లాహోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఓ మహిళా పోలీసు 'కోహ్లీ..నన్ను పెళ్లి చేసుకో' అని ప్రదర్శించిన ప్లకార్డ్ సామాజిక మాధ్యమాల్లో ఎలా హల్‌చల్ చేసిందో తెలిసిందే.



రాజ్‌షాహి కింగ్స్ కోచ్‌గా వెటోరీ

ఢాకా: బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ (బీపీఎల్)లో రాజ్‌షాహి కింగ్స్ హెడ్ కోచ్‌గా న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ డానియెల్ వెటోరీ నియమితుడయ్యాడు. ఈ మేరకు రెండేళ్లపాటు ఒప్పందం కుదిరింది. ఐపీఎల్ టీమ్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు వెటోరీ కోచ్‌గా సేవలందిస్తున్న సంగతి తెలిసిందే.

ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్క్



ప్రపంచంలోనే అతిపెద్ద సోలార్ పార్క్ బెంగళూరులో ఆవిష్కృతమైంది. 'శక్తి స్థల'గా పిలిచే ఈ మెగా ప్రాజెక్టును కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పావగడలోని తిరుమణి గ్రామంలో గురువారం ప్రారంభించారు. కర్ణాటక సౌర విద్యుత్ అభివృద్ధి సంస్థ సహకారంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సుమారు 13 వేల ఎకరాల్లో ఈ పార్కును ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. - ఆంధ్రజ్యోతి, బెంగళూరు

ఈ ప్రాజెక్టు విశేషాలు..

- ఈ సోలార్ ప్రాజెక్టు 13 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని ఖర్చు రూ. **16500** కోట్లు.
- ఈ ప్రాజెక్టు కోసం భూమిని రైతుల నుంచి **28** సంవత్సరాలపాటు లీజుకు తీసుకున్నారు. ఇందుకుగానూ ఏడాదికి ఒక్కో ఎకరానికి రూ. **21** వేల చొప్పున అద్దె చెల్లిస్తారు.
- ఈ ప్రాజెక్టు కోసం 2300 మంది రైతులు భూములు లీజుకిచ్చారు.



చిన్నారుల వ్యథ

ముట్టడించి, మాడ్చి, లొంగదీసుకునే పథకంలో భాగంగా సిరియాలోని తూర్పు గౌటాపై అధ్యక్షుడు బసర్ గత వారంలో జరిపిన దాడుల్లో 120 మంది చిన్నారులతో సహా కనీసం 600 మంది మృతి చెందగా, వేలాది మంది పౌరులు గాయపడ్డారు. ఆకాశం నుంచి బాంబుల దాడులు ఆగినప్పటికీ శిథిలాల్లోంచి ఇప్పటికీ మృతదేహాలు బయల్పడుతున్నాయి. కూడు లేక ఆకలితో అలమటిస్తూ, తల దాచుకునేందుకు సరైన గూడు లేని దీనావస్థ ఈ చిన్నారులది.

జయేంద్ర సరస్వతి మహాసమాధి

పరమాచార్యులవారి మహాసమాధి పక్కనే!.. క్రతువు నిర్వహించిన విజయేంద్ర సరస్వతి.. 3 గంటలకు పైగా సాగిన మహాభిషేకం





జయేంద్ర సరస్వతి స్వామి పార్థివ దేహానికి మహాభిషేక క్రతువు నిర్వహిస్తున్న నూతన పీఠాధిపతి విజయేంద్ర, జయేంద్ర సరస్వతి స్వామి మహాసమాధి

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహానిర్యాణం పొందిన కంచి కామకోటి 69వ పీఠాధిపతి సద్గురు జయేంద్ర సరస్వతి స్వామి.. గురువారం మహాసమాధిలోకి వెళ్లిపోయారు. గుండెపోటు కారణంగా స్వామి బుధవారం ఉదయం కంచిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శివైక్యం చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలియగానే వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామికి అంజలి ఘటించారు. గురువారం ఉదయం ఆయన మహాసమాధి ప్రక్రియ జరిగింది. కంచిమఠం ఆవరణలోనే ఉన్న బృందావనంలో.. పరమాచార్య చంద్రశేఖర సరస్వతి మహాసమాధి పక్కనే గురువారం ఉదయం 9.50 గంటలకు జయేంద్ర మహాసమాధి అయ్యారు. ఈ క్రతువును కంచిపీఠంలోని స్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించారు.బృందావన ప్రవేశ కార్యక్రమంలో భాగంగా.. స్వామి పార్థివదేహానికి మహాభిషేకం నిర్వహించారు. దేశంలోని సమస్త నదుల జలాలను తెప్పించి వాటితో, పాలు, చందనం, పన్నీరు, విభూతితో అభిషేకం చేశారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ మహాభిషేక క్రతువును నూతన పీఠాధిపతి విజయేంద్రసరస్వతి స్వయంగా నిర్వహించారు. దేశంలోని ప్రముఖ మఠాధిపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు.. మహాసమాధి కోసం బృందావనంలో ఏడడుగుల పొడవు, ఏడడుగుల వెడల్పు, తొమ్మిది అడుగుల లోతుతో గొయ్యి తవ్వారు. ఆ గోతిలో గంధపు చెక్కలు, సుగంధ ద్రవ్యాలు, నవరత్నాలు, బంగారం, వజ్రవైడూర్యాలు వేసి, గంపలో జయేంద్రస్వామిని కూర్చుండబెట్టి ఆ భంగిమలోనే ఖననం చేశారు. గంపలో ఉప్పు, పలు రకాల ఔషధ మూలికలు వేశారు. సరిగ్గా 10.30 గంటలకు ఖనన ప్రక్రియ పూర్తయింది. స్వామివారికి కడసారి వీడ్కోలు పలకడానికి దేశవిదేశాల్లోని పలువురు ప్రముఖులు మఠానికి చేరుకున్నారు. తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్, కేంద్రమంత్రులు సదానంద గౌడ, పొన్ రాధాకృష్ణన్, మాజీ కేంద్రమంత్రి జాఫర్ షరీఫ్ తదితరులు మహాసమాధి కార్యక్రమానికి వచ్చారు.

స్వామి బాటలోనే నడుస్తా : విజయేంద్ర

మహాసమాధి అయిన జయేంద్ర సరస్వతి స్వామి బాటలోనే నడుస్తానని, ఆయన ఆశయ సాధనకోసం కృషి చేస్తానని కంచి నూతన పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన విజయేంద్ర సరస్వతి ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం నూతన పీఠాధిపతిగా పూర్తిస్థాయిలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జయేంద్ర సరస్వతి స్వామి హిందూ మతానికి దీపం లాంటివారని కొనియాడారు. భారతదేశంలో ఉన్న అన్ని మతాలను, సంస్కృతీసంప్రదాయాలనూ సమానంగా గౌరవించారని గుర్తుచేశారు. దేశ ప్రజల మనోభావాలను గ్రహించి, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారన్నారు.

విజయేంద్ర సరస్వతి వారసుడెవరు?

- ఉత్తరాధికారి ఆగమమెప్పుడో?
- కామకోటి మఠంలో చర్చ.. భక్తుల్లో ఉత్కంఠ



చిన్ననాటి విజయేంద్ర సరస్వతి

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కంచి కామకోటి 69వ పీఠాధిపతి సద్గురు జయేంద్ర సరస్వతి శివైక్యం చెంది మహాసమాధిలోకి వెళ్లిపోయారు. ఆయన చిన్నతనంలోనే సన్యాసదీక్ష ఇచ్చి, ఉత్తరాధికారిగా నియమించిన విజయేంద్ర సరస్వతి స్వామి పీఠాధిపతి అయ్యారు. ఇప్పుడు ఉత్తరాధికారి ఎవరన్న చర్చ మొదలైంది. మఠంలో అనాది నుంచీ.. అధిపతి, ఉత్తరాధికారి ఉండడం ఆనవాయితీగా వస్తోంది. దేశంలోని ఇతర పీఠాల సందర్శనకు అధిపతి వెళ్లినప్పుడు కంచి కామకోటిలో జరగాల్సిన రోజువారీ పూజాది కార్యక్రమాల్లో ఉత్తరాధికారి పాల్గొంటుంటారు. పీఠాధిపతి కాలం చేసినా.. ఉత్తరాధికారి ఆ వారసత్వాన్ని తీసుకోవడం సుదీర్ఘకాలంగా జరుగుతోంది. ఈ క్రమంలోనే మఠంలో ఉత్తరాధికారి నియామక సంప్రదాయం కొనసాగుతోంది. కామకోటి అనుబంధ సంస్థలు, వాటి ఆస్తుపాస్తులన్నీ పీఠాధిపతి ఆధీనంలోనే వుంటాయి. అయితే పరమాచార్యులు చంద్రశేఖరేంద్ర సరస్వతి హయాంలో అనివార్య కారణాల వల్ల పీఠంలో ముగ్గురు స్వాములుండాల్సి వచ్చింది. చంద్రశేఖరేంద్రస్వామి శివైక్యం పొందిన తరువాత మళ్లీ ఇద్దరు స్వాముల సంప్రదాయమే కొనసాగుతూ వచ్చింది. ఇప్పుడు జయేంద్ర సరస్వతి కన్నుమూయడంతో ఉత్తరాధికారి ఎవరు, ఎప్పుడొస్తారన్న చర్చ మొదలైంది. కామకోటి నూతన పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి వయసు ప్రస్తుతం 49 సంవత్సరాలే. మరో 12 రోజుల్లో ఆయన 50వ పడిలోకి అడుగిడనున్నారు. 14 ఏళ్ల చిరుప్రాయంలోనే విజయేంద్ర మఠంలోకి అడుగు పెట్టినందున పూజాది కార్యక్రమాలన్నింటిపైనా ఆయనకు సంపూర్ణ అవగాహన వుంది. నిజానికి జయేంద్ర సరస్వతి ఉన్నప్పుడు కూడా విజయేంద్ర సరస్వతే మఠం కార్యకలాపాలను పర్యవేక్షించేవారని సమాచారం. ఇప్పుడాయన తన వారసుడిగా ఎవరిని ఎంపిక చేసుకుంటారోనని అన్ని వర్గాలూ చర్చించుకుంటున్నాయి. మరో రెండేళ్ల తరువాతే ఆ ప్రయత్నాలు ప్రారంభం కావచ్చని మఠంలో వర్గాలు పేర్కొంటున్నప్పటికీ.. సంప్రదాయం ప్రకారం ఉత్తరాధికారి ఉండాల్సిందే కనుక ఆ మేరకు విజయేంద్ర చర్యలు తీసుకుంటారని మరికొన్ని వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భక్తులు సైతం దీని గురించి ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

ఎంపీలో బీజేపీకి ఆశాభంగం

సీఎం శివరాజ్ హవా తగ్గుతోందా?

- సర్వశక్తులూ ఒడ్డినా ఓడిన కాషాయదళం
- రెండు స్థానాలూ తిరిగి కాంగ్రెస్‌కే
- ఒడిసాలో కాంగ్రెస్ డిపాజిట్ గల్లంతు

భోపాల్/భువనేశ్వర్, మార్చి 1: మధ్యప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో గెలుపు కోసం అధికార బీజేపీ సర్వశక్తులూ ఒడినా ప్రయోజనం లేకపోయింది! ఓటర్లకు గాలం వేసేందుకు ముఖ్యమంత్రి, 17 మంది మంత్రులు, ఎంపీలు, కేంద్ర మంత్రి.. ప్రచారం చేశారు! రెండు నియోజకవర్గాల్లో 121 రోడ్ షోలు.. రూ.1500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేస్తామని ప్రకటించారు! ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఈ నియోజకవర్గాల్లో ఏడు రాత్రులు గడిపారు! కొలారస్‌లో 19 బహిరంగ సభలు, 63 రోడ్ షోలు.. ముంగోలి నియోజకవర్గంలో 25 సభలు, 58 రోడ్ షోల్లో పాల్గొన్నారు! అయినా ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతు పలికారు. ముంగోలిలో 2,124 ఓట్లు, కొలారస్‌లో 8,083 ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో ఈ ఉప ఎన్నికలను సెమీ ఫైనల్‌గా భావించి సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. అయినా బీజేపీకి ఓటమి తప్పలేదు. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ప్రజాదరణ తగ్గుతోందనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఒడిసాలో మాత్రం కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. బీజేపూర్ స్థానంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబల్ సాహూ ఆకస్మిక మరణంతో ఉప ఎన్నిక జరగ్గా.. ఆ పార్టీ తరఫున బరిలోకి దిగిన ప్రణయ సాహూకు డిపాజిట్ కూడా దక్కలేదు. సుబల్ సాహూ భార్య, అధికార బీజేడీ అభ్యర్థి రీటా సాహూ భారీ విజయం సొంతం చేసుకున్నారు.

క్రికెట్ ఆడిన కరుణానిధి

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న డీఎంకే అధ్యక్షుడు ఎం.కరుణానిధి క్రమేణా కోలుకుంటున్నారు. 93 ఏళ్ల వయసులో ఉన్న ఆయన ఇంట్లో మునిమనవడితో క్రికెట్ ఆడుకుంటున్న వీడియోను డీఎంకే వర్గాలు గురువారం ఇక్కడ విడుదల చేశాయి. తన కుమారుడు తమిళరసన్ మనవడు బ్యాటింగ్ చేస్తుండగా, కరుణానిధి పలుమార్లు బంతి విసరడం ఆ వీడియోలో కనిపించింది



రూ. 1,217 కోట్ల చోక్సీ ఆస్తులు అటాచ్

న్యూఢిల్లీ, మార్చి 1: పీఎన్‌బీ కుంభకోణంలో గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీకి చెందిన రూ. 1,217 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం అటాచ్ చేశారు. దేశవ్యాప్తంగా 41 ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ ప్రకటించింది. వీటిలో.. ముంబైలోని 15 ఫ్లాట్లు, 17 కార్యాలయాలు, తెలంగాణలోని హైదరాబాద్ జెమ్స్ సెజ్, కోల్‌కతాలోని ఓ షాపింగ్ మాల్, అలీబాగ్‌లోని ఓ ఫాంహౌస్, మహారాష్ట్ర, తమిళనాడుల్లోని 231 ఎకరాల భూములు ఉన్నాయి.

కార్తికి 5 రోజుల సీబీఐ కస్టడీ

- బినామీ సంస్థలు ఆయనవే: సీబీఐ
- సమన్లు లేకుండా కస్టడీయా: కార్తి



పటియాలా కోర్టుకు హాజరైన సందర్భంలో కార్తి చిదంబరం అభివాదం

న్యూఢిల్లీ, మార్చి 1: ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణానికి సంబంధించి అరెస్ట్ చేసిన కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తిని ఐదురోజుల పాటు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించేందుకు ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు సీబీఐకి అనుమతి ఇచ్చింది. 14 రోజుల కస్టడీకి అనుమతివ్వాలని సీబీఐ కోరినా కోర్టు అందుకు అంగీకరించక మార్చి 6వ తేదీ వరకూ మాత్రమే ఆయనను కస్టడీలో ఉంచాలని స్పష్టం చేసింది. కార్తి బుధవారం రాత్రి ఆస్పత్రిలోనే ఉన్నారని, తాము ప్రశ్నించలేకపోయామని, కొద్ది సమయం గురువారం దొరికినా ఆయన సమాధానాలు దాటవేశారని కోర్టుకు విన్నవించింది. రాజకీయ కక్షసాధింపులకు తాము పాల్పడుతున్నామన్న కార్తి చిదంబరం ఆరోపణల్లో నిజం లేదని, స్కాంలో కార్తి పాత్రకు సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. 'ఐఎన్ఎక్స్ నుంచి సొమ్ము అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్‌కు బదలాయించారన్న దాని కి ఆధారంగా అప్పటి ఇన్‌వాయిస్‌లు, రసీదులు, ఈమెయిల్స్ తమ వద్ద ఉన్నాయని, అడ్వాంటేజ్ సంస్థ చిదంబరానిదేనని, ఆయన బినామీలే దాన్ని నడిపారని' తుషార్ ఆరోపించారు. ఎప్పుడో తొమ్మిది నెలల కిందట ప్రశ్నించాక- ఇపుడు ఆకస్మికంగా అరెస్ట్ చేయడమేంటని, అదీగాక అరెస్ట్‌కు ముందు సమన్లు కూడా ఇవ్వలేదని కార్తి తరఫున వాదనలు వినిపించిన సీనియర్ లాయర్ అభిషేక్ సింఘ్వి నిలదీశారు. వాదనలు సాగుతున్నంత సేపూ చిదంబరం, ఆయన భార్య నళిని కోర్టు హాల్లోనే ఉన్నారు.

చిదంబరాన్నీ ప్రశ్నిస్తాం: సీబీఐ

- అసలు నేరం ఆయనదే : స్వామి

న్యూఢిల్లీ, మార్చి 1: ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణంలో పాత్ర ఉందని ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరం కూడా త్వరలో అరెస్ట్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. విదేశీ పెట్టుబడుల క్లియరెన్స్‌లో అవకతవకలకు సంబంధించి ఆయనను ప్రశ్నిస్తామని సీబీఐ వర్గాలు కొన్ని వార్తా ప్రసారమాధ్యమాలకు తెలియపర్చాయి. 'ఆదాయపు పన్ను దాడులతో ఉక్కిరిబిక్కిరై న ఐఎన్ఎక్స్ మీడియా ప్రతినిధులకు చిదంబరమే 'మార్గం' చూపారు. 'ఈ నెలాఖరులోగా చిదంబరా న్ని సీబీఐ కస్టడీలోకి తీసుకొంటుంది' అని వ్యాఖ్యానించారు బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి. ఇంద్రాణి ముఖర్జీ ఇచ్చిన వాంగ్మూలం నిజమేనని తనకు అని పిస్తోందని స్వామి అభిప్రాయపడ్డారు. అటు బీజేపీ చిదంబరంపై దాడిని ము మ్మరం చేసింది. 'ఇది అతి పెద్ద ఆర్థిక నేరం. ఈ అవినీతికి బాటలు పరిచి నడిపిన వ్యక్తి చిదంబరం అని బీజేపీ అధికార ప్రతినిధి నరసింహారావు దుయ్యబట్టారు. సీబీఐని పంజరంలో చిలు క అని అభివర్ణించడం సరికాదని, ప్రస్తు తం అది ప్రభుత్వ పెద్దల, తన రాజకీయ బాసుల మాటలను వల్లెవేసే పక్షిలా మారిందని కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబాల్ వ్యాఖ్యానించారు.

కార్తి అరెస్ట్ టైమింగే కీలకం

పార్లమెంట్‌లో కాంగ్రెస్ దాడిని ఎదుర్కోడానికే!

యూపీఏ హయాం స్కాంలపై నిర్దిష్ట చర్యలేవీ?

న్యూఢిల్లీ, మార్చి 1: ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణంలో హఠాత్తుగా కార్తి చిదంబరాన్ని సీబీఐ అరెస్ట్ చేయడం వెనక రాజకీయ కారణాలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. సోమవారం నుంచి పార్లమెంట్ బడ్జెట్ మలివిడత సమావేశాలు ప్రారంభం కానుండడంతో పీఎన్‌బీ కుంభకోణం, నీరవ్ మోదీ పరార్, రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందం తదితర అంశాలపై ప్రభుత్వం మీద విపక్షాలు దాడికి సిద్ధమయ్యాయి. వాస్తవానికి కార్తి వ్యవహారం బీజేపీకి పెద్దగా కలిసొచ్చే అంశం కాదు. కుమార్తెను లండన్‌లో ఓ కాలేజీలో చేర్పించి ఇండియాకు తిరిగి రాగానే ఆయనను అరెస్ట్ చేశారు. ఇది వరకే ఆయనను రెండుసార్లు సీబీఐ ఇంటరాగేట్ చేసింది కానీ ఏమీ రాబట్టలేకపోయింది. ఇపుడు చేస్తున్న హడావిడి అంతా పార్లమెంట్ సమావేశాల కోసమేనన్నది సుస్పష్టం. "ఇంకో విషయం ఏంటంటే- ఐఎన్ఎక్స్ విషయంలో చిదంబరాలకు వ్యతిరేకంగా చూపెడుతున్న సాక్ష్యాధారాల్లో పెద్ద పస లేదు. ఇక లంచం మొత్తాన్ని చూస్తే ఇంద్రాణి, పీటర్ ముఖర్జీలు కార్తికి సమర్పించినట్లుగా చెబుతున్నది రూ. 4 కోట్లకు మించి లేదు. ఆయన ఖాతాలోకి వెళ్లిన డబ్బు చూస్తే రూ 10 లక్షలు మాత్రమే. ఈ మాత్రం లంచానికే ఇంత హడావిడా... అని నవ్వుతున్న వారూ ఉన్నారు.' అని ఓ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు. అయితే ఓ బాధ్యత గల పదవిలో ఉన్న వ్యక్తి (చిదంబరం) ఇలా అవినీతికి ఆస్కారమివ్వడమే పెద్ద నేరమని, ఇక్కడ డబ్బు ఎంత.. అన్నది ముఖ్యం కాదని, నైతికతకే ప్రశ్నార్థకమని బీజేపీ వాదిస్తోంది. కానీ- ఈ నాలుగేళ్లలో రాబర్ట్ వాద్రాపై వచ్చిన భూకుంభకోణం ఆరోపణలపై గానీ, నేషనల్ హెరాల్డ్ కేసులో గాంధీ కుటుంబ పాత్రపై గానీ లోతైన విచారణ జరిపించిన దాఖలాలు లేకపోవడం మోదీ సర్కార్‌కు మైనస్ పాయింట్ అని చెబుతున్నారు.



'ఏ థింకింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లాం' గ్రంథం ఉర్దూ అనువాద ప్రతిని జోర్డాన్ రాజుకు బహూకరిస్తున్న ప్రధాని మోదీ

ముస్లిం యువత ఖురాన్, కంప్యూటర్ పట్టాలి

- అప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యం.. భారత్ అన్ని మతాలకూ ఉయ్యాల
- ఉగ్రవాదంపై పోరు ఏ మతానికి వ్యతిరేకం కాదు: ప్రధాని మోదీ
- ఉగ్రవాదంపై పోరాటం ముస్లింలకు వ్యతిరేకం కాదు: జోర్డాన్ రాజు

న్యూఢిల్లీ, మార్చి 1: ఉగ్రవాదం, తీవ్రవాదంపై పోరు, వాటికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడం ఏ మతానికి వ్యతిరేకం కాదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అమాయకులపై అత్యాచారాలకు పాల్పడాలంటూ యువతను తప్పుదోవ పట్టించే తీరుపైనే తమ పోరాటమన్నారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన మతాలకూ భారత్ ఉయ్యాల వంటిదన్నారు. 'ఇస్లామిక్ వారసత్వం: అవగాహన పెంపు, ఆధునికత' అనే అంశంపై గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ముస్లిం యువత ఒక చేత్తో ఖురాన్, మరో చేత్తో కంప్యూటర్ పట్టుకున్న రోజునే సమ్మిళిత అభివృద్ధి, సమగ్ర సంక్షేమం సాధ్యమని చెప్పారు. మతం పేరు చెప్పుకొని మానవత్వం మంటగలిసేలా నేరాలకు పాల్పడుతున్నారని, కానీ, తాము ఆ మతం పేరు ప్రతిష్ఠలనే మసకబారుస్తున్నామని గుర్తించడం లేదని తప్పుబట్టారు. తీవ్రవాద నిరోధానికి జోర్డాన్ రాజు హుస్సేన్ తీసుకున్న చర్యలను ఆయన కొనియాడారు. ఉగ్రవాదులు పెంచి పోషించిన అనాగరికతను అణచి వేయడంలో అవి విజయవంతమయ్యాయని చెప్పారు. తీవ్రవాద నిరోధానికి మీరు చేసిన కృషి విషయంలో భారతదేశం మీతో కలిసి నడవాలని భావిస్తోందని ప్రతిపాదించారు. అన్ని మత విశ్వాసాలూ మానవ విలువలనే బోధిస్తాయని, శతాబ్దాల బహుళత్వాన్ని భారత ప్రజాస్వామ్యం ఆచరణలో పెట్టిందని చెప్పారు. అందుకే, మన యువత ఇస్లాంలోని మానవత్వానికి సంబంధించిన అంశాలను ఆచరిస్తూనే, ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. జోర్డాన్ రాజు సోదరుడు, ఆ దేశ మత, సాంస్కృతిక వ్యవహారాల ముఖ్య సలహాదారు కూడా అయిన ప్రిన్స్ ఘాజీ బిన్ మహమ్మద్ బిన్ తలాల్ రాసిన 'ఏ థింకింగ్ పర్సన్స్ గైడ్ టు ఇస్లాం' గ్రంథం ఉర్దూ అనువాద ప్రతిని జోర్డాన్ రాజుకు ప్రధాని మోదీ బహూకరించారు. ఇస్లాం గురించి తెలుసుకోవాలని భావించే వారికి ఆ పుస్తకం ఎంతో ఉపయుక్తమన్నారు. కాగా, ఈ సదస్సుకు ప్రత్యేక అతిథిగా పాల్గొన్న జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 మాట్లాడుతూ, ఉగ్రవాదంపై ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరు వివిధ మతాల మధ్య పోరాటం కాదని చెప్పారు. ఉగ్రవాదంపై పోరు ముస్లిములకు వ్యతిరేకం కాదన్నారు. హింస, విద్వేషాలను పెంచి పోషించే ఉగ్రవాదులు, అన్ని మత విశ్వాసాలు, సమాజాల్లోని మధ్యేవాదుల మధ్య పోరాటంగా అభివర్ణించారు. మహ్మద్ ప్రవక్త కూడా మానవత్వం, జాలి, దయ ఉండాలని చెప్పారన్నారు. మత విశ్వాసం మానవత్వాన్ని అక్కున చేర్చుకోవాలన్నారు. ఇస్లాం మాత్రమే కాకుండా ఏ మతం గురించైనా తప్పుడు ప్రచారం చేసే గ్రూపులను గుర్తించాలని, దానిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.